

వర్చస్సులు పలురకాలు !

లాక్మే క్యాలమైన్ మాత్రమే మూడు రంగులలో దొరుకుతుంది.
మీ వర్చస్సుకు సరిపోయేలా అందులో ఒకటి.

నేచురల్
గోదుమ ఛాయ
వారికి

లైట్
పసిమి ఛాయ
వారికి

గోల్డు
నలుపు ఛాయ
వారికి



కేవలం లాక్మే క్యాలమైన్ మాత్రమే మూడు అందమైన ఛాయలలో లభిస్తుంది— నేచురల్, లైట్, గోల్డ్. వీటిలో ఒకటి మీ ముఖ సౌందర్యాన్ని ఇనుమడింప చేయడానికే ప్రత్యేకంగా తయారు చేశారేమో అని అన్పిస్తుంది. లాక్మే క్యాలమైన్ మీ మోముపై సులభంగా వేసుకోవచ్చు. దీని మోహక పరిమళం మీ మదిని దోచివేస్తుంది. దీనిలోని గుణకారక తత్వంతో మీ మోము ఒక క్రొత్త శోభతో వెలిగి పోతుంది.

లాక్మే
క్యాలమైన్

ప్రతి వర్చస్సుకు అనువైన రంగులు.

TI

ముఖచిత్రం

నయాగరా జలపాతంలా పరవళ్ళు త్రొక్కుతూ. పరవశించి, నడయాడే నాట్యమయూరి, అపురూప సౌందర్య ఖని, నటనా సౌగంధాలు వెదజల్లే అద్భుత సౌగంధినీ అయిన నటి "జయప్రద" ముఖపత్ర సుందరిగా మా ముందుకు ఆ ప్రణయదేవిని ప్రత్యక్షం చేసినందుకు ధన్యవాదాలు.

– షేక్. కరీమున్నీసా, బిట్రగుంట

కథలు

జయప్రద ముఖచిత్ర సంచిక "పత్రిక" చాలా అందంగా వుంది కీ శే. గురజాడగారి 'కన్యాశుల్కాన్ని బ్రైడ్ ప్రైస్ అనే పేరుతో వ్యవహారిక భాషలోనికి అనువదించిన 'తెంగ్లీష్ నాటకం చదువుతూ •నవ్వాపుకోలేక పోయాము ఈ కథ చదివాక మాకూ 'తెంగ్లీష్" బాష నేర్చుకోవాలనే కోరిక కలిగింది రచయితకు (?) మా ధన్యవాదాలు

– ఐరేని శ్రీనివాస్ గౌడ్, రామాయంపేట

★ ★ ★

అందాలనటి జయప్రద ముఖపత్ర సంచికలో బ్రైడ్ ప్రైస్ (తెంగ్లీష్ నాటకం) ఈ వారం ప్రత్యేక ఆకర్షణ

– సాయిని రాజు, నేలకొండపల్లి

★ ★ ★

జయప్రద ముఖచిత్రంతో వెలువడిన మా పత్రికలో కాకాని కమలగారి 'మనోనేత్రం' కథలో అనురాధ తండ్రి మరణం మాకు చాలా బాధగా వుంది

– బందిగి బాలరాజు, ప్రేమకుమార్, నారాయణపేట

★ ★ ★

శ్రీ పులిచెర్ల సాంబశివరావు గారి కథ మామయ్యా' నన్ను మన్నించు'' నన్నెంతో ముగ్ధుడ్నిగావించింది. కాలక్షేపపు బటాణీల్లా కాకుండా, చాలా కాలం, మనసు నాకట్టుకొనేలా ఉంది' 'నువ్వు నేర్చిన విద్యను నమ్ముకో' అమ్ముకోవద్దు!'' అన్న మాట అక్షరలక్షల విలువైనది' ఒక్క బమ్మెర పోతనగారు తక్క, తక్కిన వారెవరున్నారు? ఉంటే– వారికి నా శతసహస్ర వందనాలు' అవధాన ప్రక్రియను తెలియపరుస్తూ ఉదహరించిన పద్యం– యీ రచనకు ఎంతో నిండుతనాన్ని చేకూర్చింద



ంచయితకు నా మనఃపూర్వక ధన్యవాదాలు

– ఎం ఎ రావు, ఖర్గపూర్

★ ★ ★

జయప్రద ముఖచిత్రంతో వెలువడిన సంచికలో' "మామయ్యా' నన్ను మన్నించు'' అనే కథ మరోసారి చదవాలని పించేటంత మహనీయంగా వుంది వెంకటాచార్యులు తన శతావధానంలో "రాముడు రామునిన్ గెలిచి రాజిల రాముని మెచ్చెరామునిన్' అనే నూరవ సమస్యను పూరించిన తీరు అద్భుతంగా వుంది

కథ చివరలో ఆణిముత్యం వంటి ఆచార్యులవారు అరవై వేల రూపాయలు అందుకోవటం, జిల్లా కలెక్టరు గారిచే సతీసమేతంగా సత్కరింపబడటం కథకు పరిపూర్ణతను కలిగించాయి.

మంచి కథను అందించిన శ్రీ పులిచెర్ల సాంబశివరావుకు అభినందనలు

– వక్కలంక రామారావు, మానేపల్లి

★ ★ ★

జయప్రద ముఖ చిత్రంతో వెలువడిన ఆంధ్రసచిత్ర వారపత్రికలో "మనోనేత్రం', "సేవాధర్మం', 'సృష్టిలో తీయనిది కథలు వెరైటీగా చాలా బాగున్నాయి

– డి సుశీల కుమారి, డి పద్మజ , ఇచ్చాపురము

★ ★ ★

ముఖచిత్రం జయప్రద అందంగా, ఆకర్షణీయంగా ఉంది కథానికలలో నాకు చాలా బాగా నచ్చిన కథ సేవాధర్మం– ఈ కథలో ధర్మమూర్తి అయిన డాక్టరు ధర్మరాజు పాత్ర నాకు నచ్చింది

– ఎస్ రామచంద్రమూర్తి, రామగిరి, నల్గొండ

(74 వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు (1938-1972)

20-26 మార్చి '87

శ్రీ అక్షయ నామ సం ఫాల్గుణ బ పంచమి

సంపుటము 79 : సంచిక 29

ముఖ్య సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

కార్యవాహక (యాక్టింగ్) సంపాదకుడు
మతుకుమల్లి మాధవరావు

విడి ప్రతివెల	రు 2 75
పోస్టులో 6నెలల చందా	రు' 80.60
పోస్టులో 12నెలల చందా	రు. 161.20

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి మాధవి
(ఫొటో ఎం. కె రామమూర్తి)

కథలు :

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు :

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుభాషి

వాణిజ్యవేత్తలకు దూరమవుతున్న ప్రభుత్వం

రాజీవ్ ప్రభుత్వం సాధారణంగా వాణిజ్య వేత్తలతో స్నేహ సంబంధాలు నెరపుతుంది ఈ బృందంలో విశ్వనాథ ప్రతాప్‌సింగ్ ఒక్కరే ఇమడ నట్టుగా కనిపించేవారు, బహుశా అందువల్లనే ఆయనను ఆర్థికశాఖ నుంచి మార్చి ఉంటారు కాని ఈ మధ్య ప్రభుత్వం కూడా వాణిజ్య వర్గాల నుంచి తనను తాను దూరం చేసుకుంటున్నట్టు కనబడుతున్నది ఎఫ్ ఐ స స ఐ, అసోచామ్ వంటి వాణిజ్య వేత్తల సంఘాల సమావేశాలకు అతి తక్కువ మంది మంత్రులు హాజరవుతున్నారు అలా హాజరయిన వారు కూడా ఆ బృందంతో కలిసి ఉండడం తమ కంత సంతోషకరంగా లేనట్టు, తాము వాళ్ళతో గడపక తప్పనిస్థితి వచ్చినట్టు ఏవో రెండు ముక్కలు మాట్లాడేసి వెళ్ళిపోతున్నారు గత వారం ఢిల్లీలో ఇలాంటిదే ఒక అంతర్జాతీయ ఉత్సవం జరిగింది ఇప్పుడప్పుడు ఢిల్లీ ఇలాంటి ఉత్సవాలకు సుప్రసిద్ధమో, దుర్ప్రసిద్ధమో అవుతున్నది కదా! ఈ సమావేశం అంతర్జాతీయ చాంబర్ ఆఫ్ కామర్స్ వారిది దానికి విదేశాల నుంచి దాదాపు వెయ్యిమంది వాణిజ్య వేత్తలు హాజరయ్యారు కాని ఏ కారణం చేతనో, ఈ సమావేశం వారం రోజులు జరిగినప్పటికీ ఒక్క మంత్రిని కూడా ఆకర్షించలేదు మొదటి రోజు ఆ సమావేశంలో ప్రధాని ప్రసంగించారనుకోండి కాని ముందు ఆయన 45 నిమిషాలు మాట్లాడవలసి ఉండగా, దాన్ని 20 నిమిషాలకు కుదించుకుని వచ్చినంత వేగంగా వెళ్ళి పోయారు. ఈ సమావేశానికి ఒక కోటి రూపాయల పైగానే ఖర్చయిందట-ప్రస్తుత ప్రమాణాల ప్రకారం ఇది పెద్ద మొత్తం కాకపోవచ్చు గాని, నిర్వాహకులు దాని నుంచి ఏమయినా పొందగలిగారా అనేది అనుమానమే.

రాజీవ్, ఆయన బృందం, అకస్మాత్తుగా వాణిజ్య వర్గాల పట్ల ఇంత కినుక ఎందుకు వహించారో స్పష్టం కావడం లేదు రాజీవ్ మంత్రివర్గంలోని అనేక మంది మంత్రులు స్వయంగా వ్యాపారులో, వ్యాపారులతో సంబంధం ఉన్న వాళ్ళో కనుక వ్యాపార వర్గాలు రాజీవ్ బృందానికి నిజానికి స్వంత వర్గాలే రాజధానిలో ప్రచారంలో ఉన్న విషయాల్ని బట్టి ప్రతి వాణిజ్య గృహానికి అనుకూలంగా పని చేసే మంత్రో, మంత్రిగారి అల్లుడో, మామగారో ఉన్నారని తెలుస్తున్నది. చాలా కంపెనీల బోర్డుల్లో డైరెక్టర్లుగా గతంలో- ఇప్పుడు కూడా -ఉన్న మంత్రులెందరో ఉన్నారు మంత్రులకు ఆ కంపెనీలలో షేర్లు కూడా ఉన్నాయి ఈ మధ్య ఒక సీనియర్ మంత్రిని కలువవలసి ఉన్న మిత్రుడొకాయన ఆ మంత్రిగారు ఈ మధ్య వార్తల్లో బహుళ ప్రచారం పొందిన కంపెనీ డిబెంచర్లు కొనడంలో నో – అమ్మడంలో నో – తలమునకలుగా ఉన్నందువల్ల కలవలేక పోయారు తమ శిబిరంలో ఇంత మంది రాజకీయ వేత్తలుండడం చూసి వ్యాపారస్తులు చాలా ఆనందంగా ఉన్నారు దీనితో వ్యాపారస్తుల పనులూ సులభంగా జరుగుతాయి. రాజకీయ వేత్తల పనులూ సులభంగానే ఉంటాయి ఐతే కేవలం స్వస్థలంలోని రాజకీయ వేత్తలతో స్నేహంగా ఉండటం మాత్రమే సరిపోదని, విదేశ వ్యాపారస్తుల కనుసన్నల్లో కూడా ఉండాలని భారతీయ వ్యాపార వేత్తలు గుర్తించారు ఇప్పుడు కుదురుతున్న విస్తృత సంఖ్యలోని విదేశీ సహకార ఒప్పందాలు, విదేశీ బహుళజాతి సంస్థలతో సంయుక్త పథకాలనబడేవి ఈ విషయాన్ని వివరిస్తున్నాయి కొన్ని ఏళ్ళుగా భారతదేశంలో సంయుక్త రంగం అనేది ఉంది ఈ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక వ్యాపారస్తులతో సంయుక్తంగా పథకాలు తలపెట్టేవి ఇవన్నీ చిన్న పథకాలు, కొన్ని డజన్ల కోట్లు – అంతకన్న ఎక్కువకాదు- కాని ఈ పథకాలు పరిమాణంలో పెరిగిన కొద్దీ ఖర్చుల్ని తట్టుకోవడానికి విదేశాల నుంచి పెద్ద కంపెనీలు కావలసి వచ్చాయి గత దశాబ్దంలో మనం బయటకు గెంటేసిన పెద్ద చమురు కంపెనీలన్నీ మళ్ళీ ఇప్పుడు పూర్తి శక్తితో, టాటా, బిర్లాల వంటి స్థానిక వాణిజ్య సంస్థలతో చేతులు కలిపి వస్తున్నాయి ఇప్పటి నుంచి పది సంవత్సరాలలో మనదేశంలో అతి శక్తివంతమైన కార్టెల్‌లు (బడా అంతర్జాతీయ పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు) ఏర్పడతాయి వీటి మీద బహుళజాతి సంస్థలకు గుత్తాధిపత్యం ఉంటుంది స్థానిక వాణిజ్య గృహాలు వారికి ఏజెంట్లుగా పని చేస్తాయి ఇప్పటికే ఇటాలియన్లు మన దేశంలోకి పూర్తి శక్తితో ప్రవేశించారు ఎవరితో ప్రత్యక్ష సంబంధం వల్ల వాళ్ళిలా చొచ్చుకు రాగలుగుతున్నారో మీకు తెలుసు ఇక ఇప్పుడు మన మిదిక అమెరికన్లు, జర్మన్లు ఫ్రెంచి వాళ్ళు, సరే బ్రిటిష్ వాళ్ళెలాగూ ఉంటారనుకోండి- రష్యన్లు కూడా మరి అంత దూరంలో ఏమి ఉండరు- తరలి వస్తారు

ఆశ్చర్య కరమైన విషయమేమిటంటే మనకు నిజానికి వీళ్ళెవరూ అవసరం లేదు ఆర్థిక సహాయం అనబడేది ఒక పెద్ద అబద్ధం ఎందుకంటే ఎవరు సహాయం చేస్తారో వాళ్ళే ఎక్కువ లాభం

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ

అయితే ఏవిటిట?! ఏవిటో వచ్చేవారం మళ్ళీ ఇక్కడే చూద్దాం –


న్యూఢిల్లీ లేఖ

పొందుతారు అభివృద్ధి చెందుతున్న దేశాలు అనే దేశాల్లో పెట్టుబడి పెట్టిన ప్రతి ఒక్క అమెరికన్ డాలర్‌కూ, రెండు డాలర్ల వార్షిక ప్రతిఫలం వస్తుంది లాటిన్ అమెరికాలో అయితే ఇది మూడు డాలర్లు కూడా ఉండవచ్చు మొత్తం మీద 15 బహుళ జాతి కంపెనీలు ప్రపంచ సరుకుల వ్యాపారంలో అత్యదిక ఆది పత్యాన్ని కలిగి ఉన్నాయి- గోధుమల్లో 80 నుంచి 90 శాతం, చక్కెరలో 60 శాతం, కాఫీలో 80 నుంచి 90 శాతం, కలపలో 90 శాతం, ముడి పెట్రోలియంలో 80 శాతం, బాక్సైట్ వంటి ఖనిజాలలో 90 శాతం వ్యాపారం ఈ కంపెనీలదే

మనకీ సంగతులన్నీ తెలుసు ఐనా వాళ్ళ వెనుకనే పడతాము గత ముప్ఫై ఏళ్ళుగానో, ఇంకా ఎక్కువగానే కావచ్చు బారతీయ వ్యాపారస్తులు ఇంకెక్కడో తయారయిన వస్తువుల్నే తయారు చేస్తూ వస్తున్నారు వాళ్ళు పాత బొమ్మలని అనుకరించి చిత్రాలు గీస్తూ దానికి ఎంతో కొంత సొమ్ము చెల్లించారు అతి ఘోరమైన అనుకరణలు తయారు చేసి వాటిని విపరీతమైన ధరలకు అమ్మడం మొదలెట్టారు దురదృష్ట వంతుడైన భారతీయ వినియోగదారుడిలాగ ఇంత ఎక్కువ కాలం మోసానికీ, స్వారీకీ గురయిన ఇంకో వినియోగ దారుడు మరెక్కడైనా ఉన్నాడని నేననుకోను పైగా ఈ కాలమంతా మన రాజకీయ వేత్తలు ఆధునికీ కరణ గురించీ, ప్రగతి గురించీ మాట్లాడు తున్నారు మరోవైపు వాణిజ్య వేత్తలు కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుని జూరిచ్, నస్సావ్ లలో రహస్య ఖాతాలలో జమ చేసుకుంటున్నారు

జపాన్ వాళ్ళు కూడా యూరప్ నుంచి , ఇతర చోట్ల నుంచి వస్తువులను అనుకరించారు గాని వాళ్ళు అక్కడే ఆగి పోలేదు. వాళ్ళ తమ స్వంత ఉత్పత్తులకు రూపకల్పన చేశారు అవి ఎంత నాణ్యమైన వంటే, మౌలిక ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్ నుంచి అవి తోసివేయ గలిగాయి మన ఉత్పత్తులు ఎంత హీనమైనవంటే దిగుమతులను స్వేచ్ఛగా అనుమతిస్తే చాల మంది బారతీయులు మన ఉత్పత్తులను ముట్టుకోరు మీరు బారత దేశం దాటి బైటికి వెళ్ళి చూస్తే ఎక్కడా ఒక్క భారతీయ వస్తువు కూఢా మీ కంటబడదు బహుశా తేయాకు, మసాలా దినుసులు మినహాయింపులు కావచ్చు గాని, తేయాకు వాణిజ్యంలో మనం ఒకటవ స్థానం నుంచి దిగజారిపోయి ఎంతో కాలమయింది జపాన్ ఉత్పత్తులనో, చివరికి దక్షిణ కొరియా, తైవాన్ ఉత్పత్తులనో చూసినట్టుగా భారతీయ పారిశ్రామిక ఉత్పత్తిని ఒక దానిని అయినా చూడడం అసాధ్యం అని నా ఉద్దేశ్యం

జనతా ప్రభుత్వం కోకోకోలాను దేశం నుంచి తరిమి వేసింది ఇప్పుడది పెప్సి కోలా అనే మరో పేరుతో, టాటాల వంటి సుప్రసిద్ధ కంపెని తోడ్పాటుతో తిరిగి బారతదేశంలో ప్రవేశిస్తున్నది వంద సంవత్సరాల క్రితం జంషెడ్‌జీ టాటా జంషెడ్‌పూర్‌లో తమ ఉక్కు కర్మాగారం నిర్మించి నప్పుడు ఏ విదేశీ కంపెనీ సహకారాన్నీ కోరలేదు విదేశీ ఇంజనీర్లనూ, సాంకేతిక నిపుణులను మాత్రమే, మనకు అప్పటి కెవరూ లేరు కాబట్టి పిలిపించారు కాని అది ఆయన స్వంత కర్మాగారం కొందరు మిత్రుల తోడ్పాటుతో కూడిన ఆయన స్వంత డబ్బు అది బొంబాయిలో ఫ్లోరా ఫౌంటిన్ దగ్గర వాటాలు కొనుక్కోవడానికి స్త్రీ పురుషులు బారులు తీరిన జాతీయ సంస్థ అది ఆయన నెలకొల్పిన మొదటి బట్టల కర్మాగారం –నాగపూర్ లోని ఎంప్రెస్‌మిల్ – ఇప్పుడు మూసివేతకు దగ్గర పడినా– పూర్తిగా భారతీయ పెట్టుబడి మీదనే ఆదార పడింది- యంత్రాలు మాత్రమే దిగుమతి అయ్యాయి. సంవత్సరాలు గడిచిన కొద్దీ మన వాణిజ్య వేత్తలు బాగా లావెక్కి, అదే సమయంలో సోమరులయి పోయారు చూడగా వారికి డబ్బు సంపాదించడం పై కాక మరిదేనిపైనా ఆసక్తి ఉన్నట్టు లేదు ఆర్థిక విధానం సడలింపు అనేది వాళ్ళను ఇదివరకటి కంటే ఎక్కువ సోమరులను చేసిందని మన దిగుమతుల్లోని పెరుగుదల చూపుతున్నది అందువల్లనే మనకు కష్టాలు వస్తున్నాయి □


వారం! వారం! సుమ చిత్రహారం!!
నుప్రియురాలా ఎన్నో అందాలు చిందించే
నవ చలనచిత్ర వారపత్రిక
సినిమా రంజని
చదవండి!!
ఆబాలగోపాలాన్ని రంజింపజేసే
సరికొత్త వినోదసాధనం!!
ఆంధ్రపత్రిక సంస్థ నుంచి
మరో ఆణిముత్యం!!
silpa

కొత్త సీరియల్ ప్రారంభం!

రాగలత

ఘండికోట బ్రహ్మాజీరావు

ఆమె ఎప్పుడూ ఉత్తరమే వ్రాస్తుంది. ఆ ఉత్తరం బుధవారం సాయంకాలం అందుతుంది.

ఆ ఉత్తరం అందిననాడు రాత్రి ఒంటి గంటవరకు దానితోనే కాలక్షేపమవుతుంది. తరువాత మూడు రోజులూ దాని మత్తులోనే ఉంటాను. ఆ మర్నాటి నుండి మళ్ళా ఉత్తరం కోసం ఎదురు చూస్తాను.

ఆమె వ్రాసే ఉత్తరం అటువంటిది.

అందులో అక్షరాలు ఒకే సైజులో ఏరి కూర్చిన మంచి ముత్యాలకు మల్లె కనిపిస్తాయి. లేత నీలం కాగితం మీద, పంక్తులు తీర్చిదిద్ది వ్రాస్తుందామె.

ఆ ఉత్తరంలో పది పేజీలుంటాయి. ఒక పేజీలో కూడా యోగక్షేమాల గురించి ఉండదు. ఉత్తరం ముగించే ముందు మాత్రం మావాడు చాలా హుషారుగా ఉన్నాడన్న ఒక్క వాక్యం కనిపిస్తుంది. ఈ మధ్య వచ్చిన నాలుగు ఉత్తరాలలోను ఆ వాక్యం కూడా మాయమయింది. నేను చాలా ఆందోళనతో మా వాడి ఆరోగ్యం తెలుపమంటూ వ్రాశాను. దానికామె సరి అయిన సమాధానమీయలేదు. చివరి రెండు ఉత్తరాలలో ఏదో వేదాంతం చాల స్పష్టంగా 'కనిపిస్తున్నది.

ఏమీ విషయాలు లేకుండా ఆమె పది పేజీలు ఏ విధంగా వ్రాసిందని ఆశ్చర్యం కలగవచ్చు. ఈ లోకం గురించో, ప్రకృతి గురించో, మానవ స్వభావం గురించో ఆమె విపులంగా వ్రాస్తుంది. అందుకే ఆమె వ్రాసిన దాని గురించి చాల ఆలోచించవలసి వస్తుంది. ఒకప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది, ఇంత జ్ఞానం ఆమెకెక్కడిదని. అదే ఆమె ప్రత్యేకత.

అటువంటిది నాకు బుధవారంనాడు ఉదయం మబ్బులేని ఆకాశం మీద నుండి పడ్డ పిడుగులా ఆమెనుండి టెలిగ్రాము వచ్చింది అందులో ఏమీలేదు



రాగలత

వెంటనే బయలుదేరి రావలసిందని ఉంది అందులో గోదావరీ నదిలో తెరచాపల మీద సాయంకాలపు రంగులు లేవు కొబ్బరి ఆకులను కదుల్చుతూ సురటివలె వీచే దక్షిణానిలం గురించి లేదు ముత్యాల వంటి ఆమె దస్తూరి లేదు

ఆమెను చూచి రెండేళ్ల ఆరు మాసాలయింది

ఆమె ఎలా ఉంటుంది?

ఆమెలాగే ఉంటుంది ఆమెను పోలినవారిని నేనింతవరకు చూడలేదు

ఆమె గురించి చెప్పే ముందు మా వాడి గురించి చెప్పాలి

మావాడి పేరు నాగభూషణం వాడికి చాల బిరుదులున్నాయి వాడు మామూలు నాగభూషణంకాడు నటరత్న, నటశేఖర, నటసార్వభౌమ మొదలయినవి చాల ఉన్నాయి మావాడు బ్లేజరు కోటు వేసుకొని, దానిమీద ఈ మెడల్స్ అన్నీ ఎన్నులు పెట్టి తగిలించుకొంటాడు డ్రామా పేపర్లలో వాడు ఈ అలంకారాలతో ప్రత్యక్షమవుతాడు పలుచని రంగు కాగితాల మీద చవుకబారు ప్రెస్సులలో వేసిన పేపర్లలో సాధారణంగా వాడి ముఖం కనిపించదు వాడి బిరుదులు, మెరుస్తున్న మెడల్స్ కనిపిస్తాయి వాటి కోసమే వాడు శ్రమించాడు వాటి కోసమే వాడు బ్రతికి ఉన్నాడు


నాగభూషణం, నేనూ ఒకే వూరివాళ్లం మా ఇద్దరి మధ్య వయస్సులో చాల తేడా ఉంది వాడు నాకంటే పదిహేడేళ్లు పెద్దవాడు వాడికప్పుడు నలభై రెండేళ్లు

నాకు చిన్నప్పటినుండి నాటకాలంటె మోజు రంగస్థలం మీద నున్న నటునికంటె గొప్పవాడు మరొకడు లేడనుకొనేవాడిని నేనూ ఒక రోజు అంత గొప్పవాడినవాలని కలలు గంటూండేవాడిని

నాకప్పుడు పదిహేనేళ్లు హైస్కూల్లో చదువుకుంటున్నాను ఆ రోజుల్లో నాటకాలే హెచ్చు వేసేవారు పౌరాణికాలు అధికంగా వేసేవారు వరవిక్రయం, చింతామణి, గయోపాఖ్యానం, హరిశ్చంద్ర మొదలయినవి అన్ని కంపెనీలవాళ్ళు ఆడేవాళ్లు

ఆ రాత్రి హరిశ్చంద్ర నాటకం వేస్తున్నారు

ఊరవతల పొలాలలో పెద్ద టెంటు వేశారు అందులో నేస్టేజి, కూర్చోడానికి ఏర్పాట్లు చేశారు నేల, బెంచీ, కుర్చీ- ఇవి కూర్చోడానికి- నేల కొంచెం వెనక్కుంటుంది చదువుకుంటున్న కుర్రాడినేమో, మా అమ్మ సులువుగా నాటకానికి నన్ను పంపించడానికి ఒప్పుకోలేదు అప్పటికప్పుడే ఆ కంపెనీవాళ్లు అయిదు నాటకాలు వేశారు హరిశ్చంద్ర వాళ్ల నాటకాలలో చాల గొప్పది. అందులో నటరత్న నాగభూషణం నటిస్తున్నాడు ఎట్టకేలకు మా అమ్మను ఒప్పించి నేల టిక్కెట్టు కోసం ఒక రూపాయి సంపాదించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది



నాటకం తొమ్మిదిన్నరకు మొదలని పేపర్లలో వేశారు- సాధారణంగా పదకొండు గంటలకు ముందు మొదలుపెట్టరు అయినా వేగంగా భోజనం ముగించి ఎనిమిది గంటలకే బయలుదేరాను

మా వీధి దాటి సందులోకి తిరిగాను నాకు ముందు ఒక పెద్దమనిషి పెద్ద సంచీ మోసుకుంటూ నడుస్తున్నాడు సంచీ బరువుగా ఉంది కాబోలు మోయడానికి శ్రమపడుతున్నాడు నేనతనిని చూడనట్లే అతనిని దాటి ముందుకు నడిచాను

"ఓయ్ అబ్బాయ్!" అతనే పిలిచింది

ఆగాను

ఎక్కడికెళ్తున్నావ్?

నాటకానికి "

"మరేం! కొంచెం సాయం చేసిపెట్టు'.

'ఏం చెయ్యమన్నారు? అతను దగ్గరికి రాగానే అడిగాను.

అతనితో పాటు సారా వాసన దగ్గిరికి వచ్చింది

'చూడు! ఈ సంచీ కొంచెం పట్టుకో!"

సంచి పట్టుకున్నాను పెద్ద సంచి. బరువుగా ఉంది

అందులో ఏమున్నాయో తెలుసా?'

'తెలీదు-'

'అందులో విగ్గులు- వేసుకొనే బట్టలు- రంగులు-"

'మీరు నాటకంలో వేషం వేస్తున్నారా?"

'మరేం!'

'విశ్వామిత్రుడి వేషమా? నా దృష్టిలో అతనేదో మామూలు వేషం వేసేవాడని అనిపించింది

'నేను చిన్న చిన్న వేషాలు వేయను.' అతను కొంచెం విసుక్కుంటూ అన్నాడు.

అతను మరేం వేషం వేస్తాడు ఏ నక్షత్రకుడో, వీరబాహుడో అయి ఉంటాడు ఏదయితేనేం బరువు నా చేత మోయిస్తున్నాడు

కొంచెం దూరం ఇద్దరం మాట్లాడ కుండా నడిచాము

'నువ్వు ఏ తరగతి టిక్కెట్టుకి వెళ్తున్నావు? అతనే ప్రశ్నించాడు-

"నేలకి!"

మరేం! నీ దగ్గిర టిక్కెట్టు ఖర్చుకి ఒక రూపాయి- సోడాలకి పరో పావలా!

"లేదు, ఒక్క రూపాయే ఉంది

అయితే ఒక బీడీ కట్ట, అగ్గిపెట్టి కొని తీసుకురా!

'నాకు ముచ్చెమటలు పోశాయి ఎంతో బతిమాలి సంపాదించిన రూపాయి ఇతనికింద ఖర్చుపెడితే మరి నాటకం చూసినట్లే

అతను నవ్వాడు

"నీకేం భయంలేదు నిన్ను చాల మంచి చోటుకి తీసుకెళ్తాను ముందు ఓ కట్ట పట్రా.

భగవంతుడి మీద భారం వేసి బీడి కట్ట, అగ్గిపెట్టి కొని తెచ్చాను అతను రెండూ జేబులో పెట్టుకున్నాడు అతను ముందు నడుస్తున్నాడు బరువుమోస్తూ అతని వెనుకే నేను

నాటకం వేసే టెంటు వరకు నడిపించి అతని మానాన్న లోపలికి వెళ్ళిపోతే ఏం చెయ్యాలి?

"మీరేం వేషం వేస్తారు?" నేనే కల్పించుకొని అడిగాను

"నువ్వు చూస్తావు కదా! అన్నాడతను ఏదో ఆలోచిస్తూ

టెంటు వెనుక భాగంలో గ్రీన్ రూమ్ వంటిది ఏర్పాటు చేశారు అందులో అప్పుడే కొంతమంది ఉన్నారు రెండో మూడో పెట్రో మాక్స్ లైట్లున్నాయి

టెంటు తెర తొలగించి అతను లోపలికి నడిచాడు. అతని వెనుకే నేనూ ప్రవేశించాను

ఒక నాలుగడుగులు ముందుకు నడిచి అతను ఆగిపోయాడు మాకు ఎదురుగా ఒకామె చీర కట్టుకుంటోంది పైట ఇంకా వేసుకోలేదు ఆమె వయసు ముప్ఫైయేళ్లకు మించదు మనిషి కొంచెం

స్థూలంగా- బహుశా కాదేమో- ఆమె కొంచెం పొడవైన మనిషి - ఆపాటి ఒళ్ళు లేకపోతే బాగుండదు. ఆమె పృథు వక్షం వేపు అయిదు నిమిషాలు చూసి నాతో వచ్చినాయన అమాంతంగా ఆమెను కౌగలించుకొని ముద్దుపెట్టుకున్నాడు.

ఆమె అతన్ని వెనక్కు తోసేయలేదు. అలా అని తనూ అతనిని కావలించుకోలేదు. అతడు కౌగిలి విడిచిన తరువాత రెండడుగులామె వెనక్కు నడిచి గట్టిగా అంది.

"ఓ నాగభూషణం! స్టేజి మీద నీతో చంద్రమతిగా నటిస్తున్నానని చనువు తీసుకుంటున్నావా? నీతో నటించినందుకు డ్రామా కంపెనీవాళ్ళు డబ్బిస్తారు. నీతో నటించని సమయంలో చొరవ చేస్తే డబ్బివ్వవలసి ఉంటుంది. నేను కళావంతుల ఆడబడుచుని."

అంటే అతను నటరత్న నాగభూషణంగారన్నమాట.

"నాగరత్నం! నేనంటే నీకు మోజు లేదా?" నాగభూషణం అన్నారు.

"నువ్వంటే నాకు మోజులేదు." అందావిడ.

"మరెందుకు నాతో నటిస్తున్నావ్?"

"అదంతా వ్యాపారం. నాకు కంపెనీవాళ్ళు డబ్బిస్తున్నారు. అందుచేత ఎవడు హరిశ్చంద్ర వేషం వేసినా నటించక తప్పదు".

"అయితే నీకు ప్రేమ, అభిమానం, అనురాగం, మమత, ఇటువంటి మంచి అనుభూతులేవీ లేవన్నమాట."

ఆమె నవ్వింది. ఆ నవ్వులో పువ్వులు విరిశాయి.

"చూడు నాగభూషణం! నీతో నాలుగు సంవత్సరాలయి నటిస్తున్నాను. ఒకనాడు కూడా నీమీద మనసు కలగలేదు. నీతో వచ్చిన ఈ అబ్బాయిని చూస్తే నాకెంతో ఆనందంగా ఉంది. నొక్కితే పాలుకారే బుగ్గలు- ఎవరబ్బాయివయ్యా నువ్వు?"

బరువు సంచీ నేలమీదబెట్టి వారిద్దరి సంభాషణ వింటూ నిలబడ్డ నావేపు తిరిగి ఆమె అంది.

ఆమెకు ఏం జవాబు చెప్పాలో నాకు తోచలేదు.

ఆమె నావేపు నడిచి నన్ను తన కౌగిలిలోకి తీసుకొని, నుదుటిమీద ముద్దు పెట్టుకుంది. ఇదంతా నాగభూషణంగారు చూస్తూ ఉండగానే జరిగింది.

ఒక అయిదు నిముషాలు నేను ఏ లోకాల్లో ఉన్నానో తెలీదు. ఆమె కౌగిలింతలో అప్రయత్నంగా నా చేతులు కూడా ఆమె నడుముకు చుట్టుకున్నాయి.ఈ మత్తులోంచి తేరుకొని ప్రపంచంలో పడేసరికి, సంచి పట్టుకొనినాగభూషణంగారు అక్కడ నుండి ఉడాయించారు.

ఇంతలో ఎవరో లోపలికి వచ్చారు.

"లోపల ఎవరైనా పైవాళ్ళుంటే వెళ్ళిపోవాలి. ఎవరూ ఉండడానికి వీల్లేదు." అతను బహుశా మేనేజరు కాబోలు.

"పద్మనాభంగారూ! ఈ కుర్రాడు మావాడు. ఇక్కడే ఉంటాడు".

"నువ్వు వేషం వేసుకుంటుంటే ...?"

"ఇంకేముంది- అంతా అయినట్లే- రంగులు పూసుకోవడం కూడా ..."

"ఏదయినా పైవాళ్ళుండడానికి వీల్లేదు."

"ఆ విషయం ఆలోచిద్దాం- ముందు రెండు కాఫీలు ఇలా పంపించండి". అతను లోపలకు వెళ్ళిపోయాడు.

"బాబూ నీ పేరేమిటి?" నాగరత్నం నన్నడిగింది.

"రాజశేఖరం".

"మీ నాన్నగారేం చేస్తున్నారు?"

"నా చిన్నతనంలో నే పోయారు."

"అన్నలూ; అక్కయ్యలూ ఉన్నారా?"

"లేరు- నేనొక్కడినే".

"చదువుకుంటున్నావా?"

"అవును- ఈ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు రాయాలి."

"ఈ నాగభూషణం ఎక్కడ కలిశాడు?"

"దారిలో!"

ఆమె ఆశ్చర్యపోయింది.

కార్టూనిస్టులకు సూచనలు !

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి.

★ ప్రతీ కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి !

★ వ్యాఖ్య **చిన్నదిగా, క్లుప్తంగా** వుండాలి. అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి ! కార్టూన్ మీదే పేరూ, వూరూ అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామాగల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పి పంపడం జరుగుతుంది. దారిలో పోయేవాటికి మా బాధ్యత లేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నిగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది. పరిశీలనకు ఐదారు వారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరుమీద ఆ ''ప్రత్యేక'' సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం.

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగా వచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

రాగలత

"ఇంతకుపూర్వం తెలీదా?"

"దారిలో అతనే నన్ను పలకరించారు "

ఆవిడ మళ్లా ఆలోచనలో పడ్డది. ఇంతలో కుర్రాడొకడు రెండు కప్పులతో కాఫీ తెచ్చి ఆమెకు, నాకు యిచ్చాడు.

దగ్గిరలో నున్న స్టూలు తీసుకొని ఆవిడ దానిమీద కూచుంది.

"అయితే నీకు నాటకాలంటే ఇష్టమన్నమాట!"

నేనేమి జవాబు చెప్పలేదు

"నీకు నాటకంలో వేషమిప్పిస్తానన్నాడా, నాగభూషణం?"

"లేదు – చూపిస్తానన్నారు'.

"అదా సంగతి"

అప్పటికి తొమ్మిదిన్నర అయినట్టుంది. హాల్లోంచి కేకలు– అరుపులు- మేనేజరు లోపలి నుండి అరుస్తున్నాడు- నటులంతా తొందరగా తయారవాలని.

ఆమె నా వంక అయిదు నిమిషాలు తేరి చూసి అంది-

"రాజశేఖరం! నువ్వు చాల మంచి నటుడివవుతావు!'

అప్రయత్నంగా ఆమె నోటి నుండి ఆ మాటలు వచ్చినట్టయింది

నేను చాల ఆశ్చర్యపోయాను.

"నాకలా అనిపించింది నిన్ను చూడగానే" అంది ఆమె మళ్లా

"మీరు నా మీద అభిమానంకొద్దీ అంటున్నారు ఏదో నాటకాలు చూడాలనే కోరిక ఉన్నంత మాత్రాన నటుడినవాలని ఎక్కడుంది?"

"నాకలా అనిపించింది మరో నిజంకూడా చెప్తున్నాను వింటావా? ఎన్ని బిరుదులు తగిలించుకున్నా, ఎన్ని వన్సుమోర్లు అనిపించుకున్నా ఈ నాగభూషణం మొదటి తరగతి నటుడు కాలేడు

నా చెవులను నేనే నమ్మలేకపోయాను

చాలామంది ప్రేక్షకుల ఆరాధ్య దైవం నాగభూషణంగారు.

నాగరత్నంగారి అభిప్రాయం కూడా గౌరవించదగ్గదే

కొత్త నిజమొకటి వింటున్నట్లయింది

'ఈ నాగభూషణం చాల శ్రమపడతాడు ఎవరికేనా మరో పని ఉంటుందేమో, ఇతనికి మాత్రం బతుకంతా నాటకమే బహుశా ఈ సాధనే అతనిని ఇంతవరకు తెచ్చింది కాని, సహజంగా నటుడిగా రాణించవలసిన మెరుపు ఇతనిలో లేదు

నాకు, నాగరత్నంగారికి పరిచయమయి ఒక గంటకూడా కాలేదు ఆమె నిస్సంకోచంగా ఎంతో ఆత్మీయులకుగాని చెప్పరాని విషయాలు నాతో చెప్తున్నందుకు నాకు చాల ఆశ్చర్యం కలిగింది

పద్మనాభంగారి కేకలు వినవచ్చాయి

"నాగభూషణంగారు! ఇంకా తయారవడంలేదేం- ఏరా మారుతీ! హీరోగార్నొదిలేసి ఎక్కడ తగలడ్డావు? ముందు ఈ పెద్దమనిషిని తయారుచేయ్! ఏవమ్మా! నాగరత్నం! మాటల్లో పడి వేషం వేసకబెట్టావా??'

'మానేజరుగారూ! నేను సిద్ధంగా ఉన్నాను నా గురించి ఆలోచించకండి మొదటి సీను వాళ్లని తయారుచెయ్యమనండి అంది నాగరత్నం

హాలులో (అంటే టెంటులో నన్నమాట) గోల- ఈలలు, చప్పట్లు-గ్రీనురూములో సంరంభం- కాని ఏమీ సంచలనం లేకుండా కూర్చున్నది నాగరత్నం మాత్రమే

"రాజశేఖరం! ఇంకా మరో అరగంట వ్యవధి ఉంది అంతవరకూ రెండు పద్యాలు వినిపిస్తాను–'

నాకు ఒళ్ళు జలదరించింది ఏ తపస్సు చేయకుండా దేవేంద్రుడు దిగివచ్చి వరాలిస్తానని అన్నట్లనిపించింది

" ..జలచమా సుంత మార్పులికిన దోసమా

నాగరత్నం చదువుతోంది పాడటం, చదవటం, ఆలపించటం, గానం చేయటం . ఇంకా ఎలా అనాలో నాకు తెలీదు ఆమె చదివే తీరే వేరు ఆమె గొంతుకలో ఏమి మృదుత్వముందో, ఏమి మాధుర్యముందో– ఆమె

అనంతంగా రాగాలాపన చేయలేను. ఆ సమయంలో కరుణ మూర్తీభవించింది. మాతృహృదయం ఆర్ద్రమయి శ్రోతల కళ్ల వెంబడి నీళ్లు తిప్పుతుంది.

ఆ విధంగా ఆమె రెండు పద్యాలు చదివింది.

ఆకాశం నుండి అమృతం వర్షిస్తున్నట్లు, పుక్కిళ్లుపట్టి కడుపార త్రావినట్లయింది.

ఇంతలో మొదటి గంట వాయించారు.

ప్రార్థనకోసం నాగరత్నం లేచి నిలబడింది.

* * * * *

ఉన్న ఊళ్లోనే ఉద్యోగం, వాసయోగ్యమైన స్వంత యిల్లు, వేళకు వండి పెట్టే కన్నతల్లి - దేనికి నా జీవితంలో లోటు లేదు.

చాలామంది పిల్లనిస్తామని వచ్చారు. కట్నాలు కురిపిస్తామన్నారు. కానుకల్లో ముంచెత్తుతామన్నారు. మా అమ్మకు ఎన్నిసార్లు ఆశాభంగం కలిగించానో నాకు తెలీదు.

"నాయనా! నీ మనసులో ఏముందో నాతో చెప్పు. నీకు పాతిక సంవత్సరాలు వెళ్లిపోయాయి. నాకు శాఖా భేదంలేదు. కులం గురించి కూడా పట్టింపులేదు. చివరకు వచ్చే పిల్ల రూపవంతురాలా, గుణవంతురాలా అన్న ప్రసక్తి కూడా లేదు.. నీ మనసుకు నచ్చితే చాలు. ఆమెకు యిష్టమయితే ఇంట్లో ఉంటాను. లేకపోతే ఏ కాశీలో నో మిగిలిన కాలం వెళ్లబుచ్చుతాను. ఆ మధ్య నాటకాల్లో వేషం వేసేవాడివి. రెండున్నర సంవత్సరాలయి ఆ సరదాలు కూడా విడిచిపెట్టావు. వేళపట్టున తినడం, పుస్తకాలు చదువుకోవడం తప్ప- ఉద్యోగం చెయ్యక తప్పదు కదా- మరే పనులలోను నువ్వు జోరపడడంలేదు. నీ స్నేహితులెవరో నాకు తెలీదు. ఆ ఒక్క నాగభూషణం ఎక్కడున్నాడో? అతనుంటే పనిగట్టుకొని వచ్చేవాడు. మాట్లాడేవాడు. పద్యాలు వినిపించేవాడు. నీ జీవితం అడవిగాచిన వెన్నెలై, నిర్గంధకుసుమమై, మోడైపోతుంటే కన్నతల్లిని చూస్తూ ఊరుకోగలనా?"

మా అమ్మ మాటలకేం జవాబు చెప్పడం?

ఈసారి ఆమె పట్టుబట్టి అడిగినప్పుడు జవాబివ్వక తప్పలేదు.

నవ్వుతూనే జవాబిచ్చాను.

"అమ్మా! నువ్వు చెప్పినవన్నీ నిజమే! నాకు వివాహమంటే విముఖతలేదు. నీ మనసు నాకు తెలియదా! ఏదో ఒక రోజు నీ కోరిక తీరడం నిజం. ఆ రోజెప్పుడో చెప్పలేను. అంతవరకు ఓపిక పట్టడం మంచిది".

ఈ మాటలన్నీ అయి వారం రోజులు కూడా అవలేదు.

ఇంతలోనే టెలిగ్రాము-

నాగభూషణం గురించి ఎంతగా ఆలోచిస్తున్నానో, అంతగా అతనికి దూరమైపోతున్నాను. ఈ టెలిగ్రాము రావడంతో పరిస్థితులు మారిపోయాయి.

ఆ టెలిగ్రాములో ఏమీలేదు.

వెంటనే రమ్మని ఉంది. ఎందుకు? ఏమీ అందులో లేదు.

ఏమి ఊహించినా అన్వయించడంలేదు. ఒక్క విషయం మాత్రం నిజం. నాగభూషణం ఆరోగ్యం బాగులేదు.

సెలవివ్వడానికి ఆఫీసులో తగువులు. ఎప్పుడూ ఏదో ఇనస్పెక్షను ఉండనే ఉంటుంది. నదురు వంది పనిచేసేవాళ్లకు సెలవు దొరకడం కష్టమయిపోతుంది. వాళ్లు లేకపోతే ఆఫీసు మూలస్తంభాలతో కూలిపోతుంది.

మా అమ్మతో కూడా చెప్పాను- "నాగభూషణం ఆరోగ్యం బాగాలేదు. వారం రోజులు సెలవు మీద వెళ్తున్నాను. అవసరాన్ని బట్టి మరో వారం పది రోజులు సెలవు పొడిగించవలసి ఉంటుంది. మరేం కంగారుపడకు".

మెయిలు పదకొండు గంటలకు విజయనగరం విడిచిపెడుతుంది. దారిలోనే తాలూకా ఆఫీసులో సెలవు కాగితం పెట్టివచ్చాను. పెద్ద గుమాస్తాగారితో, టెలిగ్రాము అందిన వెంటనే, అరగంట వారింటి దగ్గర బ్రతిమాలడంచేత, అతను వచ్చేవరకు మరి వేచి కూర్చోలేదు.

వాల్తేరు చేరుకొనేసరికి కూర్చోడానికి కిటికీ దగ్గర చోటు దొరికింది. సాయంకాలం అయిదు గంటలకు రాజమండ్రి చేరడం, బస్సుమీదో రిక్షా మీదో ప్రయాణంచేసి మరో గంటకు కొవ్వూరు చేరుకోడంతో ప్రయాణం ముగుస్తుంది.

ఆ క్షణం నుండి కొత్త కార్యక్రమం ఆరంభమవుతుంది.

దేని గురించీ నేను ఆలోచించదలచుకోలేదు.

ఏదేనా పనిచేస్తుంటే ఆలోచించడం అంతగా ఉండదు.

రైలులో ఏం పనుంటుంది?

పుస్తకం చదవడానికి కూడా మనసవడంలేదు.

అప్పుడు నాగభూషణం జ్ఞాపకానికి వచ్చాడు.

నాగభూషణం నిజంగా అదృష్టవంతుడు. అతనికి జీవితం వడ్డించిన విస్తరి. అతనే ఉద్యోగం చెయ్యలేదు. నాటకాల్లో వేషాలు వేస్తే వద్దని చెప్పేవాళ్లు కూడా అంతగా లేరు. అతను ఏమంత చదువుకోలేదు కూడా. చిన్నతనం నుండి మేనత్తగారింట్లో పెరిగాడు. అతని తల్లిదండ్రులు చిన్నప్పుడే పోయారు. మేనత్త చాల గారాబంగా పెంచింది. చదువుసంధ్యలు అబ్బకపోయినా, ఆ వంశోద్ధారకుడు బతికి బట్టకడితే చాలునని ఆమె తలచింది. అందుచేతే అతను ఆడింది ఆటగా, పాడింది పాటగా వెలిగింది. ఏదో నాటకం కంపెనీవాళ్లు నెల్లాళ్లు నాటకాలాడితే ఆ నెల్లాళ్లు ఇల్లు పట్టకుండా, తిండితిప్పలు సరిగా లేకుండా వాళ్ల వెనకే తిరిగితే ఆమె ఏమి అభ్యంతరం చెప్పలేదు. ఏడో తరగతి చదువుతూ బడి మానేశాడు. ఇంట్లో కర్ర కత్తులు తయారుచేసి వాటికి ముచ్చి రేకులంటించడం, బాణాలు తయారుచేయడం, ఎవరూ చూడకుండా, జేగురు, ముగ్గు, పిండి వంటి రంగులు ముఖానికి పట్టించుకుని, బొగ్గు గుండతో మీసాలు దిద్దుకొని నాటకాలలో హీరోల డైలాగులు చదువుతూ నటించడం చేశాడు. ఈ సంగతులన్నీ అతని మేనత్తే నాకు చెప్పింది. ఆవిడ మేనల్లుడి ప్రతాపం చూసి మురిసిపోయేది.

(ఇంకా ఉంది)



దూరదర్శనం

లత

శుక్రవారం (27–2–87) నాడు ఇంద్రధనుసు –లో నాటిక అత్త కోడల్ని హింసించి వెళ్ళగొట్టటం – కాలం గడిచి ఆ కోడలుకి కోడలొచ్చి నాక మళ్ళీ డబ్బు కోసం వెళ్ళకొట్టటం. మామగారు బుద్ధి చెప్పటం. ఆడవాళ్ళు చాలా కఠినులని చెప్పటం రచయిత ఉద్దేశ్యం కాబోలు.

ఏక్ కహానీ

పితృపక్ష్ – రచన డాక్టర్ అచలానాగర్. దర్శకత్వం దయాల్ నిహలానీ – పితృ పక్షం అంటే తద్దినం. తల్లి తద్దినం పెడుతూ ఒక యువకుడు తల్లి అనుభూతుల్ని జ్ఞాపకం చేసుకుంటాడు. తండ్రిని గురించి అడిగితే వాకిట్లో ఉన్న ఫలవృక్షాన్ని చూపించి నీ తండ్రి ఆ చెట్టే అని చెప్పి మరిపిస్తుంది తల్లి. ఆ తల్లి మరణించగా ఆ చెట్టు కొట్టి వేస్తారు ఇరుగుపొరుగులు. తద్దినం పెడుతూ చిన్నమామిడి పళ్ళని తెచ్చి మా అమ్మకి ఈ పళ్ళు చాలా ఇష్టం. అని బ్రాహ్మణుల ముందు పెడతాడు. ఇదొక అనుభూతికి ప్రాధాన్యత గల కథ. బాగుంది. బహుశా వ్రజభాష లాగా ఉంది. అవధీలో 'మా' అంటారు తల్లిని. వ్రజ భాషలో అమ్మా అంటారు. భాషా శాస్త్రం పూర్తిగా చదివి బుర్ర చెడగొట్టుకున్న నేను పొరపాటు పడితే విజ్ఞులు క్షమించు గాక.

మెషర్ ఫర్ మెజర్

షేక్స్‌పియర్ మహాకవి నాటిక. "మెషర్ ఫర్ మెజర్" ఈ నాటకం నాకు చదివిన గుర్తు లేదు. వచ్చే వారం గాని వివరాలు తెలియవు. చక్కని భజన గీతాల అనంతరం మళ్ళీ టేబిల్ టెన్నిస్ ప్రారంభమయింది.

బడ్జెట్ మీద చర్చ జరుగుతున్నది – రైల్వే బడ్జెట్ ప్రజలకి నచ్చి మాధవరావు సింధియాని మెచ్చుకోటం జరిగింది. జనరల్ బడ్జెట్ పేపర్లలో వస్తుంది. దీని కోసం సినిమా లేకుండా చేసారు. పరమ బోరు. విచారకరమైన బడ్జెట్ మీద చర్చని మన మీద రుద్దుతున్నారు. మాట్లాడే వారు ఎంత మేధావులైనా ప్రభుత్వాన్ని మెచ్చుకోక తప్పదు గనక అదే పని చేస్తున్నారు. ఈ పెద్దల్లో ఎవరూ ఓవర్ కరెన్సీ గురించి మాట్లాడరు. పారలల్ గవర్నమెంట్లు నడుపుతున్న నిల్వదారుల్ని గురించి మాట్లాడరు. బ్లాక్ మనీ గురించి మాట్లాడరు – అది బయటికి వస్తే వెయ్యి కోట్ల రూపాయల పైన ఉంటుందనీ, 70 కోట్ల మందికి పంచితే కోటీశ్వరు లవుతారనీ వారికి తెలియదు బహుశా. ఈ కంటి తుడుపు బడ్జటులూ వాటి మీద చర్చలూ శుద్ధ దండగ.

అనంతరం తెలుగు న్యూస్‌లోనూ బడ్జెట్ గొడవే. టి. వి.ల పిచ్చి పెరిగింది గనక ధర పెంచారు. తరువాత టేబిల్ టెన్నిస్ ప్రారంభమయింది.

ఆదివారం మళ్ళీ గుర్వాణి ప్రారంభమయింది తీర్థ ప్రసాదాలు ఇవ్వటం కూడా స్వర్ణాలయంతో పాటు చూపిస్తున్నారు. రాజీవ్‌గాంధి ఉద్దేశ్యం అవగతం కావడం లేదు. విశ్వనాథ ప్రతాప్‌సింగ్ నించి ఆర్థిక శాఖ తీసుకుని బడ్జెటు తనే తయారించి దాని మీద చర్చ పెట్టి – ఆఖరికి టి. వీ.ల మీద ధర ఎందుకు పెంచినట్లు? ఆయన 21 శతాబ్దపు ఎలక్ట్రానిక్ యుగానికి టి. వి. ధరలు పెంచినందున బ్రేక్ పడ్డది.

రామాయణం

సమర్పణ రామానందసాగర్. ఈ వారం రామచరిత మానస్ కృత్తివాస రామాయణాల ఆధారం అన్నారు. విశ్వామిత్రుడు శివేసాధకే అంటాడు – ఆదిశంకరుల స్తోత్రం తప్పులతో చదివాడు. రామాయణం కాలానికీ ఆదిశంకరులకీ ఉన్న కాల విపర్యయం రామానందసాగర్‌కి తెలియదు అనుకోవాలి. రెండోది అహల్య ఆకాశం లోకి ఎగరటం. శతానందుడికి తల్లి పరిస్థితి చెప్పడం కాబోలు. అది మళ్ళీ చూపించాడు. మూడు సతని చూసిన రాముడికి పూర్వజన్మలో తాము లక్ష్మీ నారాయణులని స్ఫురిస్తుంది. వాల్మీకి ఎంత వరకూ రాముడిని మానవుడి గానే చిత్రించాడు – తరువాత బౌద్ధ జైనులు దాన్ని అనేక అప్రతిష్ఠల పాలు చేశారు – రాజమండ్రి నుంచి రామారావు గారు వ్రాసినట్లు కంబన్‌నీ తులసీదాసునీ కలిపి వాల్మీకిని కాదని ఇష్టమొచ్చినట్లు తీస్తున్న ఫాంటసీ ఇది. వాల్మీకంలో హేతువాదానికి నిలవనిది లేదు – విశ్వామిత్రుని వెంట స్వయం వరానికి బయలుదేరిన రామలక్ష్మణులు యువకులే రామారావుగారూ? బాలురు అన్నది ప్రక్షిప్తం. మీరు చెప్పినట్లు రామలక్ష్మణులే అహల్యకి నమస్కరిస్తారు. టి. వి. లో వస్తున్నది వాల్మీకి విరచిత భారతే తిహాసం కాదు ఫాంటసీ – అయినా రామనామం రామరూపం ప్రజలకి ఇష్టం. గుడ్డి కన్ను కన్నా మెల్ల కన్ను మేలు గదా సార్? డాబర్ ఆమ్లా హెరాయిల్ మోడల్ దీపిక సీత ... ఏం చేద్దాం?

''స్వయంసిద్ధ''లో ప్రియా టెండూల్కర్



జిందగీ జిందగీ

ఈ వారం ఎడబాయిన భార్యాభర్తలు కలుసు కుంటారు. రెండవ భార్య చనిపోగా ఆమె కొడుకు త్రాగుబోతు అవగా – తనకి రోగం రాగా భార్య నీ బిడ్డనీ చూస్తాడు – ఈ వారపు జీవిత కథ ఇది.

అసంభవ్

కథా చిత్రం – ఈ నాలుగిళ్ళ చావిడిలో పేకాట రాయుళ్ళ గదులు దాటిన తరువాత పండిట్ మిశ్రా, అతని భార్యా. డాక్టరు చదువుతూ వి. పి. అని పిలిపించుకుంటున్న వేణీ ప్రసాద్ ఉంటారు – అతని ప్రేమికురాలు ఇంకా ఈ గృహంలోకి రాలేదు – వీధిలో కూరగాయల వాళ్ళూ చిలక ప్రశ్నవాడూ. సామాన్య వాతావరణాన్నీ, జీవితాన్నీ కల్పించారు – అంబికా ప్రసాద్ మిశ్రా – అనగా పండిట్‌జీకి చిలక ఇంకా 16 ఏళ్ళ ఆయుర్దాయం ఉందని చెపుతుంది – కాని మృత్యువు పిలిచినట్లు వస్తుంది. కాని మృత్యువుని ప్రార్థించి తన మిత్రుడు కర్వే ఆత్మ తన శరీరంలో ఉండేట్లు ఏర్పాటు చేసుకుంటాడు. మృత్యువు మళ్ళీ వస్తే ఇంకో సంవత్సరం ఆయుర్దాయం అడుగుతాడు – ఎవరి ఆయుర్దాయం అయినా దొంగతనం చేస్తే అలాగే అంటాడు మృత్యువు. అలాగే దొంగతనం చేసి ఆయుర్దాయం ఇమ్మంటాడు పండిట్‌జీ.

టైము అయిపోతోంది. కోడలు గర్భవతి. ఇల్లంతా ఒకసారి చూస్తాడు – మనవడు పుట్టటం చూస్తాడు కాని ఇంకో హత్య చేస్తే ఆయుర్దాయం పెరుగుతుందనే ఆశతో చాకు తెస్తాడు. అది భార్య తీసుకుంటుంది – కొడుకు మృత్యువులా కనిపిస్తాడు. మృత్యుభయంతో విలవిలలాడతాడు – చివరకు మృత్యువుని చంపుతున్నానని భార్యని చంపి ఆత్మహత్య చేసుకుంటాడు - ఇదీ కథ – అయితే మృత్యుభయం అంటే ఎలా ఉంటుందో జీవించిన వాడికి తెలియదు గనక ఆ నటుడు నటించ లేకపోయినాడు. మొత్తం మీద బాగానే ఉంది. రోహిణీ హట్టంగడి, తాళ్ళూరి రామేశ్వరీ ఉన్నారిందులో. □


చౌకరకంవి కొనడానికీ, మంచి నాణ్యమైనవి కొనడానికీ మధ్య
బోలెడు తేడా ఉంది...అందుకే కొనాలి నాణ్యమైన సర్ఫ్.
"త్రాచి చూస్తే మీకే తెలుస్తుంది—సర్ఫ్ యొక్క పవర్ ప్యాక్డ్ ఫార్ములా మీ డబ్బుకి మించిన విలువ ఇస్తుందని".
డబ్బుకి మించిన విలువా? అసలే సర్ఫ్ ఖరీదైనది కూడా కదా?
"చూడండి. దీనివల్ల ఎంత ఎక్కువ లాభమో గ్రహించారా మీరు. కేవలం సర్ఫ్ మాత్రమే నా బట్టల్ని అతి తెల్లగా ఉతుకుతుంది. పైగా వాటిని సంరక్షిస్తుంది కూడా. అంచేత అవి కొత్తవాటిలా కనిపిస్తూనే వుంటాయి. అంటే ఇంక ఆదాయే అదా. అందుకే డబ్బుకి మించిన విలువ ఇస్తుందని అన్నాను నేను".
సరేగానీ, లలితగారూ, ఆ మాత్రమే చాలంటారా మీరు?
"అబ్బే. ఇంకా ఎంతో వుంది! ఒక కిలో చౌక రకం పౌడర్ ఎంత వుంటుందో అంత ½ కిలో సర్ఫ్ ప్యాక్‌లో ఉంటుంది. అంటే ఒక కిలో చౌక రకం పౌడర్ ఉతికేటన్ని బట్టల్ని అర కిలో సర్ఫ్ ఉతుకుతుందన్నమాట.
అంటే సర్ఫ్ నుంచి మీరు మరింత లాభం పొందుతున్నట్టేగా మరి?"
1 కిలో చౌక రకం పౌడర్
½ కిలో సర్ఫ్
అంటే, కొనేందుకు సర్ఫ్‌ని మించినది లేదన్నమాట!
"అందులో సందేహం ఏముంది? సర్ఫ్ మరెంతో తెల్లగా ఉతుకుతుంది. మరే మామూలు పౌడర్లకన్న రెట్టింపు బట్టల్ని. చౌక రకంవి కొనడానికీ, మంచి నాణ్యమైనవి కొనడానికీ మధ్య బోలెడు తేడా ఉంది. అందుకే సర్ఫ్ కొనడంలో మరింత వివేకం ఉంది".
POWER PACKED
Surf
washes whitest...
keeps clothes like new!

అభిమాన తారలపై అభిప్రాయం

నా అభిమాన నటుడు సూపర్‌స్టార్ కృష్ణగారు. ఆయనంటే నాకు చెప్పలేనంత అభిమానం. ఎందుకంటే ఆయన చిత్రసీమలో సాధించిన ఘన విజయాలు మరియు వ్యక్తిగతంగా సాధించిన విజయాలు నన్ను బాగా ఆకర్షించినాయి. నాటి "అల్లూరి సీతారామరాజు", నేటి "నా పిలుపే



ప్రభంజనం" చిత్రాలు చూసి చాలా సంతోషించాను. రాబోవు సూపర్‌స్టార్ చిత్రాలు "జమదగ్ని", "మకుటం లేని మహారాజు", "సర్దార్ కృష్ణమనాయుడు", "ప్రతాపరుద్రుడు", "సాక్షి", "ముద్దాయి" చిత్రాలలో వైవిధ్యమయిన పాత్రలు పోషించ గలరని ఆశిస్తున్నాను.

—వి. శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్

* * *

ఆరు కోట్ల ఆంధ్ర ప్రేక్షకుల అభిమాన, అందాల నటుడు నటభూషణ శోభన్‌బాబు నా అభిమాన నటుడు. నేను "జీవనజ్యోతి" చిత్రం చూచి ఆయన అభిమాని నయ్యాను. నటభూషణ శోభన్ "శ్రీవారు" "జీవన పోరాటం" వంటి కుటుంబ కథా చిత్రాలలోనే కాక, "డ్రైవర్‌బాబు" "కోడె త్రాచు" వంటి యాక్షన్ చిత్రాలలోను, నవలాధార చిత్రాలలోను విభిన్నమైన పాత్రలను పోషించి, తాను పోషించిన పాత్రలకు ప్రాణం పోసి ప్రేక్షకులకు తన నటనా చాతుర్యాన్ని చూపించి తన అభిమానులకు అంతులేని ఆనందం కలిగించారు. శోభన్‌బాబు సినీ ప్రపంచంలోని "మహారాజు"గా ఉండి, సినీ పరిశ్రమలో కెల్లా "సక్కనోడు"గా ఆదరణ పొందుతూ సినీ నీలా



కాశంలో "పున్నమి చంద్రుడు" వలె వెలుగొందుతూ ఉన్నందులకు నేను తన అభిమానిగా నా యొక్క సంతోషాన్ని తెలియ జేయుచున్నాను.

కుటుంబ కథా చిత్రాలేకాక, యాక్షన్, పౌరాణిక చిత్రాలలో కూడా నటించాలని నా కోరిక.

—అందుకూరి సత్యనారాయణమూర్తి, ఖుర్దారోడ్ (ఒరిస్సా)

నా అభిమాన నటుడు కమల్‌హాసన్. నేను "సాగర సంగమం"తో అతని అభిమానినయ్యాను. కమల్ నిజంగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎందుకంటే జాతీయ, రాష్ట్ర అవార్డులతోపాటు ఎన్నో ఇతర సంస్థలనుండి సన్మానాలు పొందుటలో సరికొత్త రికార్డు సృష్టించారు కాబట్టి. "సాగర సంగమం"లో అతని నాట్యం, "స్వాతిముత్యం"లో అతని నటన, "ఆకలిరాజ్యం"లో అతని నిరుద్యోగి పాత్ర ఇప్పటికీ నాకళ్లముందు మెదులుతూనే ఉన్నాయి. అతను విభిన్న భాషలలో నటిస్తూ విభిన్న భాషా వ్యక్తుల అభిమాని కావటం గర్వించదగ్గ విషయం.

అతను నటించిన "స్వాతిముత్యం" ఆస్కార్ అవార్డు పోటీకి ఎన్నిక కావటం కమల్ కీర్తి కిరీటానికి ఒక కలికితురాయి. "స్వాతిముత్యం" చిత్రం ఈయేటి




మేటి ఉత్తమ చిత్రంగా ఎన్నిక కావటం ఆనంద దాయకం.

—ఎ. వి. ఆర్. ప్రసాద్, చేబ్రోలు (గుంటూరు)

* * *

మా అభిమాన హీరో "యువరత్న" బాలకృష్ణ. మా హీరో 'సాహసమే జీవితం'గా ప్రవేశించి



'మంగమ్మగారి మనవడై' ముద్దు రాజకీయాలపై 'కథానాయకుడై' మనసున్న మంచి అమ్మాయిలతో 'ముద్దుల కృష్ణయ్య' అనిపించుకొని ప్రేక్షకులతో 'పట్టాభిషేకం' జరిపించుకొని రేపు రాబోయే "ప్రెసిడెంటు గారబ్బాయి" అంటె మాకు ఎంతో అభిమానం.

— బి. గోపాల్, శ్రీకాకుళం

* * *

చలనచిత్ర గగనసీమలో వేగుచుక్కలా తళ తళలాడుతూ, కోట్లాది సినీ ప్రేక్షకాభిమానుల హృదయాలలో తనదైన ప్రత్యేక నటనా పటిమతో చెరగని ముద్ర వేసిన శ్రీదేవిగారు నా అభిమాన నటి అని చెప్పుకోవడానికి నేనెంతో గర్వపడుతున్నాను. ఇటు తెలుగు చిత్ర రంగంలో మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవడమే కాకుండా, అటు హిందీ చిత్ర రంగంలో కూడా నంబర్ వన్ హీరోయిన్‌గా వెలుగొందుతూ, సినీ వినీలాకాశ గగన వీధుల్లో తన 'విజయ పతాకాన్ని ఎగురవేసిన శ్రీదేవిగార్కి అందం, ఆకర్షణే కాకుండా ఏ పాత్రనైనా అవలీలగా మెప్పించగల ప్రతిభ కూడా వుంది. ఆమె నటించిన చిత్రాల్లో ఏదో ఒక ప్రత్యేకత, ఆకర్షణా ఉంటాయి. ఆనాటి "పదహారేళ్ల వయస్సు" నుండి ఈనాటి "ఒక




రాధ ఇద్దరు కృష్ణులు" వరకు ఆమె నటించిన ప్రతి చిత్రం వదలకుండా చూశానంటే, ఇందులో అతిశయోక్తి ఎంత మాత్రంలేదు. "వసంత కోకిల", "వజ్రాయుధం", "ఖైదీ రుద్రయ్య", "పచ్చని కాపురం" వంటి చిత్రాలు ఆమె నటనకు చక్కని తార్కాణాలు. నా అభిమాన నటికి నేనిచ్చే సలహా ఏమిటంటే కథాబలం లేని చిత్రాల్లో నటించవద్దని. మంచి వైవిధ్యమున్న పాత్రలను ఎన్నుకొని వాటికి జీవం పోయాలని.

—నంద వాయునందనరావు, మర్రిపాలెం, విశాఖపట్నం

* * *

నా అభిమాన నటుడు "నట సామ్రాట్" అక్కినేని కుమారుడు "యువ సామ్రాట్" నాగార్జున. తన తొలిచిత్రమయిన 'విక్రమ్' ద్వారా ప్రేక్షకుల మనస్సు నాకట్టుకొని అగ్ర నటుల కోవకు చేరి "తండ్రికి తగ్గ తనయుడని"పించుకున్నాడు. తరువాతి చిత్రమయిన 'కెప్టెన్ నాగార్జున' పెద్దగా పేరు రాకపోయినా "అరణ్యకాండ"లో ఫైట్స్ బాగా చేసి ఫైట్స్ మాస్టర్‌గా అభిమానుల నుంచి పేరు గాంచాడు. 'మజ్ను'లో తన నటనాశక్తిని నిరూపించుటకు పాటుపడి మరి నటించాడు. ఇకపై



కూడా తండ్రిలాగే ప్రేమ చిత్రాలలోనే యాక్షన్ చేసి 'తండ్రిని మించిన తనయుడ'నిపించుకోవాలని అభిమానిగా నా కోరిక. తరువాతి చిత్రాలయిన 'సంకీర్తన' 'కలెక్టరుగారి అబ్బాయి' చిత్రాలు విజయం సాధించవలసిందిగా అభిమానుల తరఫున కోరుతున్నాను.

—వి. మణిమాల, గవరపాలెం, అనకాపల్లి



అభినేత్రి భానుప్రియ సమాధానాలు

జి. సురేష్, అనంతపురం

మద్రాసులో మిమ్మల్ని కలిసి మాట్లాడటం మీకిష్టమేనా?

చాలా యిష్టం.

మీపై మాకు గల అభిమానం హద్దు మీరితే, దానిని ఏమని పిలవాలి? ఏమవుతుంది?

అభిమానం హద్దు మీరితే అసహ్యమౌతుంది!

బలిజేపల్లి కృష్ణారెడ్డి, పేర్నమిట్ట

ఇటీవల వచ్చిన నటీమణులకు కళ్ళు ఉండే చోట చెవులు, చెవులుండే చోట కళ్ళు ఉంటున్నాయని ప్రేక్షకులు ఎగతాళి చేస్తున్నారు బి సరోజాదేవి లాంటి వారిని గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. మీ సమాధానం?

నాకు తెలియదు!

బి. సుబ్బలక్ష్మి, పిఠాపురం

ఈ నాటి ఎన్నో చిత్రాల్లో అసలు సహజత్వం బాగా లోపించి, అసహ్య కరంగా ఉంటున్నాయి ఎందుకు భానుప్రియగారూ?

మీరు చూస్తున్నారు కాబట్టి–

కె. రవిబాబు, హైదరాబాద్

సినిమాలలో ఆదర్శాలు వల్లించే నటీనటులు నిజ జీవితంలో కొంత వరకైనా ఆ ఆదర్శాలను పాటిస్తారా?

ఆదర్శాలన్నవి ఆచరించినప్పుడే విలువ సంతరించుకుంటాయి.

ఆర్. లింగమూర్తి, పూరి

మంచిని గ్రహించి, చెడును విసర్జించుట మానవధర్మం నేటి యువతీ యువకులు చిత్రాలలోని చెడును గ్రహించుచున్నారు. మీరేమంటారు?

చెడుని గ్రహించడం తప్పంటాను.

సురేంద్ర, హైద్రాబాద్

అక్కయ్యా! మీరు ఇంతగా పేరు పొందడానికి కారణమేమిటి?

ప్రజలే!

పి. రాము, గుంటూరు–1

మీ సోదరి చిత్రరంగ ప్రవేశంపై మీ కామెంట్?

నో కామెంట్!

ఏ. ఏ. గోపాలం, శ్రీకాకుళం

వరకట్నాన్ని నిషేధించాలంటూ మీరు 'అనాదిగా ఆడది' చిత్రంలో ఓ సందేశాన్ని అందించారు. దీనిద్వారా సమాజంలో ఎంతవరకు మార్పు వచ్చిందని మీరు అనుకుంటున్నారు?

అది మీరే చెప్పాలి.

ఉత్తమ ప్రశ్న

ఎం. ఎల్. పవన్‌కుమార్, నిజామాబాద్–3

వేదికలపై స్త్రీలకు సమానత్వం కావాలని ఉపన్యాసాలు ఇచ్చే స్త్రీలే తమ పేర్ల చివరన భర్తల పేర్లు ఎందుకు తగిలించుకుంటారు?

పురుషులక్కూడా సమానత్వం యివ్వడానికి.

కటికాల కృష్ణమూర్తి, వెంగటగిరి టౌన్

'అన్వేషణ'లోనే 'ఆలాపన' చేస్తూ, 'చాదస్తపు మొగుడ్ని' కట్టుకోనని మారాం చేస్తూ, 'సితార' గా ప్రేక్షకుల హృదయాలలో స్థానం పొందిన భానుప్రియగారూ! మీ పెళ్ళెప్పుడు?

ఇప్పుడప్పుడే కాదు.

ఎం. సదానంద్, హైద్రాబాద్

అక్కా! ఈ సమాజంలో ఆడది అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగే రోజు ఎప్పుడు వస్తుంది?

మగవాళ్ళు తిరగ నిచ్చిన రోజున.

ఆర్. శివశంకరరెడ్డి, సికిందరాబాదు

నాటి స్త్రీ మానం కోసం ప్రాణత్యాగం చేసింది నేటి స్త్రీ ప్రాణం కోసం మానం త్యాగం చేస్తున్నది దీనికి మీరేమంటారు?

ఏమీ అనను.

ఎన్. రాజ్యలక్ష్మి, విశాఖపట్నం

చిత్రసీమలో స్థిరపడిన మీరు జీవితాంతము నటిగానే కొనసాగిస్తారా?

కొనసాగించాలనే కోరిక!

ఎల్. శ్రీనివాసరావు, బిర్‌మిత్రపూర్ (ఒరిస్సా)

ముఖమునకు ఏది లేక పోతే, అందంగా ఉండదు?

ఏది లేకపోయినా అందంగా వుండదు.

కె. మురళీకృష్ణ, తణుకు

క్షమించాలి మీరు ప్రేమించిన ఒక ఉన్నత భావాలు గల వ్యక్తిని వివాహమాడుటకు మీ పెద్దలు అంగీకరించరు అప్పుడు మీరేం చేస్తారు?

ఎందుకు అంగీకరించరు?

షేక్ మహమ్మద్ ఉస్మాన్, మాచెర్ల

"అక్కరకు రాని . ' రీతిన ప్రేక్షకులు ఈ నాటి సినిమాల్ని త్యజిస్తే ఏమవుతుందంటారు?

త్యజించి చూస్తే కదా తెలిసేది.

జె. సుబ్రహ్మణ్యశాస్త్రి, జక్కరసుకుప్పం

అచిరకాలంలోనే విశేష ప్రజాదరణ చూరగొన్న మీరు మీ పాత్రల ద్వారా సామాజిక స్పృహ కలిగించడానికి ఎంత వరకు ప్రయత్నిస్తున్నారు?

నాకు అలాంటి పెద్ద మాటలకు అర్థం తెలియదు. □

కూపన్.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
భానుప్రియ సమాధానాలు

ప్రశ్న : ______________________________

____

____

పంపిన వారి పేరు ______________________________

పూర్తి చిరునామా ______________________________

____

సినిమా విశేషాలు

జి.వి.జి.



"విశ్వనాథ నాయకుడు"లో కృష్ణ



"దయామయుడు"లో విజయచందర్

కల్యాణ చక్రవర్తితో డాక్టర్ భానుమతీ రామకృష్ణ చిత్రం "అత్తగారూ, జిందాబాద్"

భరణీ పిక్చర్స్ వారి చిత్రమంటే ఆబాలగోపాలం ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తుంటారు. నవరసభరితమయిన కథ, మృదు మధురమయిన సంగీతం, పుష్కలంగా హాస్యం ఉంటాయన్న విషయం అందరికీ తెలిసిందే. డాక్టర్ భానుమతి రామకృష్ణ సంగీతం సమకూర్చి, ప్రధాన పాత్ర నిర్వహించే పై కుటుంబ గాథా చిత్రంలో కల్యాణ చక్రవర్తి, కోట శ్రీనివాసరావు, చక్రపాణి, జె. వి. సోమయాజులు, పద్మనాభం, విశేశ్వరం రంగా, ఘంటసాల విజయకుమార్, ఘంటసాల రత్నకుమార్, సాక్షి రంగారావు, మిక్కిలినేని, వినోద్, మోదుకూరి సత్యం, వై. జి. మహేంద్రన్, కీర్తి, దివ్య, కృష్ణవేణి, సత్యవతి, కల్పనారాయ్, వై. విజయ, సరోజ ఆదిగా గలవారు పాల్గొంటున్నారు. ఫిబ్రవరి 23న పూజ జరిగిననాడే ఈ చిత్రానికి కొన్ని ఏరియాలు విక్రయమవడం గమనార్హం. భమిడిపాటి రాధాకృష్ణ మాటలు, సీతారామ శాస్త్రి - జాలాది గీతాలు, జె. సత్యనారాయణ ఛాయాగ్రహణ దర్శకత్వం, జె. ఫణిప్రసాద్ ఛాయ, సుబ్రహ్మణ్యం శిల్పం, ధ్రువకుమార్ ప్రొడక్షన్, బి. హరినారాయణ కూర్పుతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించే పి. చంద్రశేఖరరెడ్డి "అస్తవ్యస్తంగా ఉన్న ఒక కుటుంబాన్ని ఓ అత్త ఎంతో చాకచక్యంతో చక్కదిద్దుతుంది. ప్రతి కుటుంబంలోని ఒడుదుడుకులకు దర్పణం పట్టే యితివృత్తం", అని తెలిపారు. సమర్పణ : డాక్టర్ పి. భరణి.

(60 వ పేజీ చూడండి)



ఎమ్. ఎస్. ఎమ్. అన్నవరం

★ మీరిచ్చే సమాధానాలలో ఎక్కువగా స్త్రీలని వెనకేసుకు వస్తారని అనేకమంది ఉత్తరాలు రాస్తూంటారు కాని ప్రతివారం ప్రశ్నావళి తప్పకుండా చదివే నాకు మాత్రం అలాగనిపించదు. మీ సమాధానాలు వాస్తవికంగా వుంటాయి. కాదంటారా?

● అందరికీ వాస్తవికత నచ్చాలని రూల్‌లేదుకదా? అందుకే- అందర్నీ మెప్పించాలని ప్రయత్నించడం దండగ అని భావిస్తాన్నేను.

ఎమ్. ఎస్. పొందూరు

★ ఆడపిల్లలు బయట తిరగ కూడదంటారు పెద్దవాళ్ళు. నిజమేనా?

● ఈ రోజుల్లో యిలా అడగాలికూడానా? బయట తిరగడం అంటే వీధిలోకి రాకూడదనికాదు రోజులు బాగాలేవని వార్నింగు యివ్వడం.

ఎన్. కె. ఆర్. పర్లాకిమిడి

★ నేటి సాహితీవేత్తలకి మీరిచ్చే అమూల్య సలహా ఏమిటి?

● నాకే వాళ్ళు యివ్వాలి- ఎన్నో సలహాలు. నాకేం తెలుసునని సలహాలివ్వగలను?

ఎస్. టి. డి. ఎమ్. ఒంగోలు

★ పంజాబు అల్లర్లు, ఆంధ్ర ఎన్‌కౌంటర్లు దేశం మొత్తం అల్లకల్లోలం- రామలక్ష్మిగారూ ఈ దేశాన్ని చూస్తే మీకు ఏమనిపిస్తోంది?

● ముసుక్కింద గుద్దులాట పోయి- బహిరంగ యుద్ధం ప్రారంభమైనట్టుగా వుంది నాకు! కాని అల్లర్లు దారుణాలు రచనా వస్తువులై మూడుపువ్వులు ఆరుకాయలుగా విస్తరించడం ఆశ్చర్యం కల్గిస్తోంది అంతకంటే వింత- వీటిలో సెన్సేషలిజమే చోటు చేసుకోవడం- చదువరులను తప్పదారి పట్టించేలా వుండడం- అసలే మర్కటం- అందులో కల్లుతాగిందన్నట్టు ప్రవర్తించే కులాల- మతాల మధ్యకి వీటిని వదలడం బాధ్యతా రాహిత్యం అనాలి మొన్న కర్నాటకలో అంటుకున్నది చూశాకేనా రచయితలు జాగ్రత్తపడతారని ఆశ పడుతున్నాను

జి. ఎమ్. విశాఖపట్నం

★ మీరు తెలివైనవారు లేకుంటే అందరి ప్రశ్నలకి - సమాదానం చెప్తారా అందుకే తెలివైనవారని నేనంటున్నాను

● కనిపెట్టావయ్యా కొలంబస్! సమాదానాలిచ్చినంత మా త్రాన తెలివైన వాళ్ళవరు స్వంతంగా సమాదానాలిస్తున్నాను కాబట్టి - తెలివైనదాన్నే అనుకో నాకు అబ్యంతరం లేదు!

ఎస్. ఎస్. -

★ ఈవివాహ వ్యవస్థ అనే సాలిగూడునుంచి ఎవరూ తప్పించుకోలేరు అది పిరికి తనమే కావచ్చు

● మీ ఉత్తరం చదివాను ఇలాంటి వాటికి నాదగ్గిర సమాదానాలుండవు పిల్లల తల్లులు - పిల్లల తండ్రులని ప్రేమించితే - తప్పులేదు కాని పిల్లలకేం దారి చూపుతారో - అది నాకు భయం మన సమాజం సాలిగూడు వివాహ వ్యవస్థ కాదు పాశ్చాత్య దేశాలలో - ఎంత మంది పిల్లలున్నా ఎన్నేళ్ళ వైవాహిక జీవితమైనా - యిట్టే ఫుల్‌స్టాప్ పెట్టి - కొత్త జీవితం ప్రారంభిస్తున్నారు అక్కడి పిల్లల పెంపకంవేరు 18 ఏళ్ళువస్తే - హాయిగా పిల్లలు వ్యక్తులై స్వంత జీవితాలు సాగిస్తారక్కడ మన సంతతి అలా కాదు తల్లి కొంగున దాగి డాక్టరైనా యింజినీరైనా - కట్నం బేరాలు ఆడిస్తారు! తండ్రి గొప్ప తల్లి తక్కువ అనుకుంటాడు అసలు పిల్లల తల్లులు కాస్త ట్రిమ్‌గా అందంగా తయారైతే భరించలేని - సమాజం మనది నలభైకే ఆడదిక్కడ ముసిల్దిగా చూడబడుతుంది మగాడు ఏభైలో పడినా కొత్త వధువులవేట సాగించడం సహజంగా చూస్తారు అలాంటప్పుడు - మీకు పిల్లలూ భర్తవుండి, మీరు ప్రేమించిన వారికీ భార్యపిల్లలూ ఉంటే - ఏం చేయమని చెప్పాలి? అందుకే - సారీ ఈ చిక్కుముడి కత్తిరించండి ఇది విప్పడం కష్టం అని చెప్పగలనంతే ప్రేమ జీవితం స్త్రీకి వేరు మగాడికి వేరు మూగబాషలు - మౌన భావనలు - నవలకే - పరిమితాలు జీవితాలని కంటకప్రాయం చేస్తాయి చూసి - అడుగేయడం - తెలివి

జి. ఆర్. ఎమ్. సికిందరాబాదు

★ మన నాగరికతకు ప్రారంభం ఎప్పుడు?

● భూమి దున్నడం ప్రారంభమైనప్పుడే మన నాగరికతకు పునాదులు పడ్డాయనిపిస్తుంది నాకు అందుకనే నాగలి చేపట్టిన రైతే మన నాగరికతకు ప్రారంభకుడు! భుక్తితోనే - కళ

డి. జి. కె. సిద్ధిపేట

★ ఆంగ్లేయుల కారణంగా నవల మన సాహిత్య ప్రక్రియగా అవతరించింది అన్నారు మీరెంతవరకు చదువుకున్నారు?

● నవల పుట్టినప్పుడు నేను పుట్టలేదు అంచేత నేను బాధ్యురాలిని కాదు నవలకి ఇక చదువు సంగతా? నేనేం చదువుకోలేదని చెప్పడం - మంచిది ఎందుకంటారా? నేను 'చదువుకునే' రోజుల్లో చదువుకున్నా ఈ 'చదువు'కొనే' రోజుల్లో కాదు!

పి. ఎస్. బి. ఆర్. కోటబొమ్మాళి

★ మీరు రామలక్ష్మిగారి ప్రశ్నావళి కాకుండా యింకేం రాయడంలేదా?

● అందాకా లేదు ఏం రాయాలి అన్న ఆలోచనలో పడి - ఏం రాయలేకుండా వున్నాను!

★ పూర్వపు స్త్రీకి నేటి స్త్రీకి గల తేడా ఏమిటి?

● అప్పటి స్త్రీ ఉట్టి బానిస
ఇప్పటి స్త్రీ సంపాదిస్తూ బానిస!


★ మీరు నవలలలో ఇచ్చిన సందేశం ఏమిటి?

● సందేశం యివ్వను నాకు తోచినది రాస్తాను ఎవరికేనా ఏదైనా సందేశం కన్పిస్తే అది వారి గొప్ప మనసుకు నిదర్శన అనుకుంటా

వి. ఎన్. ఆర్., ఢిల్లీ

★ పిల్లలీ రోజుల్లో కృతజ్ఞులుగా వుండడం లేదెందుకో? ఎవరి లోపం వల్లనో?

● పిల్లలు తల్లి తండ్రులను ప్రేమించడంతో జీవితాలు ప్రారంభిస్తారయ్యా కొంత కాలానికి వారిని అంచనా వేయడం ప్రారంబిస్తారు కాని వాళ్ళని ఎప్పటికీ క్షమించలేరు అంతే సాక్ష్యం కద - తీర్పుకి?! □





పుణ్యతిథి

"వాయసేబ్యా బలినే దదామి!"

ఖంగుమంది పావని శాస్త్రి గారి గొంతు!పితృదేవతలకు పెట్టిన ప్రసాదాన్ని మూడు ఉండలుగా చేసి విస్తరిలో పెట్టి భక్తిగా తీసుకొచ్చి వాకిట్లో పెట్టాడు కర్త

ఆ తర్వాత ఆరాటంగా ఆకాశం వైపు చూశాడు శాస్త్రిగారి తల కూడా అప్రయత్నంగా అటువైపు తిరిగింది ఆయతో బాటు మిగతా అందరి చూపులూనూ!

ఏ క్షణంలోనైనా వర్షించడానికి సిద్ధంగా దట్టంగా మబ్బులు పట్టి ఉంది ఆకాశం రాక్షసుల్లాంటి మేఘాల్ని చూసి భయపడి ఎక్కడెక్కడో చెట్ల చాటున దాగొన్నాయి పక్షులు

మబ్బులు పట్టిన ఆకాశం క్రింద ఒకే ఒక్క నిమిషం ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు నిశ్చలంగా కూర్చొంది నిండు విస్తరి.

ఆ తర్వాత వినిపించిందో కాకి రెక్కల చప్పుడు .

ఆ తర్వాత మరోటి . ఆపై ఇంకోటి ఇంకోటి . ఇంకోటి. పది పదిహేను కాకులు రెక్కలు తపతప లాడిస్తూ . గోల గోలగా అరుస్తూ... ఒకదాన్నొకటి ముక్కుతో పొడుచుకొంటూ

సరిగ్గా మూడు నిమిషాలలో విస్తరి ఖాళీ అయింది.

ఎంత హటాత్తుగా వచ్చాయో అంత హటాత్తుగానూ కాకులన్నీ ఎక్కడో చెట్ల గుబుర్లలో ఉన్న గూళ్లలోకి ఎగిరి పోయాయి

ఆబ్దిక కర్త కళ్ళు సంతృప్తితో మెరిశాయి చూస్తున్న వాళ్ళందరూ నిశ్చింతగా నిట్టూర్చి వెనక్కు తిరిగారు.

శాస్త్రిగారి కంఠం నించి కూడా ఓ దీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది కాని అందులో ఉన్నది మాత్రం దీర్ఘకాల వేదన ..

ఆ నిట్టూర్పుకి కదిలిపోయినట్లు రెప రెపలాడింది కిందనున్న విస్తరి

* * * * *

చిరు చీకట్లు ముసురు కొంటున్నాయి పెచ్చులూడి పోయిన వీదరుగు మీద. ఏ క్షణంలోనైనా విరిగి పోడానికి సిద్ధంగా ఉన్న స్తంభానికి తలాన్ని నిస్రాణగా కూర్చొనున్నారు పావని శాస్త్రిగారు పడమటి ఆకాశంలో శుక్రగ్రహం ధగధగ లాడుతోంది ఆయన కళ్ళు ఆ వేగుచుక్కను చూస్తున్నా మనస్సు మాత్రం మద్యాహ్నపు దృశ్యాన్నే నెమరు వేసుకొంటోంది

తప తప లాడుతున్న కాకుల రెక్కల చప్పుడు నిమిషంలో ఖాళీ అయిన విస్తరి. కర్తముఖంలో ఎనలేని సంతృప్తి .

ఇన్నేళ్ళలో తండ్రి పోయిన ఈ ఇరవై ఏళ్ళలో ఒక్క రోజు కూడా తానలా సంతృప్తిగా నిట్టూర్చలేదు!

ఎందరిళ్ళలో నో తను తరచు చూసే దృశ్యం ఒక్క రోజు కూడా తాను తనింట్లో చూడలేదు!

మనస్సులోని ఆవేదనను అణిచి వేయడానికా అన్నట్లు ముఖాన్ని పట్టిన చెమటను ఉత్తరీయంతో తుడుచుకొన్నారు శాస్త్రి గారు

"చీకటి పడిపోయింది ఫలహారం చేయరూ?" గుమ్మంలో కొచ్చి పిల్చింది అన్నపూర్ణమ్మ వెలిసిన గుంటూరు నేత చీర కొంగు భుజం చుట్టూ కప్పుకొని . రూపాయి కాసంత కుంకం బొట్టు చెమటకు కాస్త చెదిరిపోగా వెండి తీగల్లా నెరిసిన జుత్తుని జారుముడిలో బంధించి కాశీ అన్నపూర్ణేశ్వరికి బీదవేషం వేసినట్లుందావిడ

మౌనంగా పెరట్లోకి నడిచి కాళ్ళు, చేతులు కడుక్కొని వంటింట్లోకి నడిచారు శాస్త్రిగారు ఆ సరికే అక్కడ రెండు పీటలు వేసి పళ్ళేలు పెట్టి, గ్లాసుల నిండుగా నీళ్ళతో అన్నీ సిద్ధంగా ఉన్నాయి

ఓ పళ్ళెం ముందు శాస్త్రిగారి ఇరవై ఏళ్ళ కొడుకు సుబ్రమణ్యం కూర్చొనున్నాడు

ఇవాళ అలా ఉన్నారేం నాన్నా? పీట మీద కూర్చుంటున్న తండ్రి మొహం వైపు పరీక్షగా చూస్తూ అడిగాడు సుబ్రమణ్యం

ఇవాళ సుబ్బరామయ్య గారింట్లో అబ్దికం జరిపించి వస్తున్నారు భర్తకు బదులు సమాధానం ఇచ్చింది అన్నపూర్ణమ్మ అర్థమైందన్నట్లు తల్లివైపు చూశాడు సుబ్రమణ్యం

మధ్యాహ్నం భర్త వస్తూ వస్తూ తనతో తెచ్చిన సంచిని విప్పి ఇద్దరి పళ్ళేలలోనూ- గారెలు, పూరీలు, నువ్వులు ౦డలు వడ్డించింది పర్శ్యించి ఉపక్రమించారిద్దరూ -

' గారె ఒక్క ముక్క కొరగ్గానే సుబ్రమణ్యం కళ్ళు మెరిశాయి

'అరే అమ్మా ఇవి నేతిగారెలు ఎంత రుచిగా ఉన్నాయో! మరింక అన్నం పెట్టకు ఇవున్నాయిగా చాలు ఉత్సాహంగా అన్నాడు సుబ్రమణ్యం

భర్త మొహం వైపు ఓరగా చూసింది అన్నపూర్ణ అప్పటికే అది మ్లానమై పోయిఉంది ఆయన చేతిలో ఉన్న గారెముక్క అప్రయత్నంగా పళ్ళెంలోకి జారిపోయింది

నోట్లో వేసుకొన్న ముక్క ఇనప ముక్కగా మారిపోయినట్లనిపించి అతికష్టం మీద దానిని గబగబ నమిలి మింగేసి గ్లాసెత్తి నీళ్ళన్నీ గటగటా తాగేసి పీట మీంచి లేచిపోయి గబగబా పెరట్లోకి నడిచారు

ప్రశ్నార్థకంగా తల్లి వైపు చూశాడు సుబ్రమణ్యం

మీ తాతగారికి నేతిగారెలంటే ప్రాణం బాబూ! అవి తిన్నప్పుడల్లా అచ్చు ఇలాగే మాట్లాడే వారట! బహుశః అది గుర్తొచ్చి ఉంటుంది ' బాధగా అంది అన్నపూర్ణమ్మ తండ్రి అలా లేచిపోగానే మౌనంగా అన్నాన్ని అటు, ఇటు కెలుకుతూ కూర్చొన్నాడు సుబ్రమణ్యం

'అమ్మా తాతగారి అబ్దికం ఇంక రెండు నెలలే ఉంది కదా! ఇప్పటికి ఎంత డబ్బు కూడిందమ్మా?"



అవధానుల విజయలక్ష్మి

సాయంత్రం డబ్బా తీసి డబ్బు లెక్క పెట్టారుగా! ఏడువందల రూపాయల చిల్లరుంది ఇంకా కనీసం మూడు వందలైనా కావాలట!

అమ్మా నాన్నగారికి నే చెప్తా కాని నువ్వు చెప్పమ్మా బెంగపడొద్దని! ఇప్పుడు మరో రెండు కొత్త ట్యూషన్లు పట్టానుగా వాళ్ళను కూడా ఎడ్వాన్సు అడుగు తాలే! నేను పద్దులు రాసే శెట్టిగారు కూడా నేను ప్రాధేయపడితే కాస్తో కూస్తో సర్దక పోరు

నాన్నారితో అలాగే చెప్తాలే ఏమిటో సాయింత్రం నించి ఒకటే దిగులుగా ఉన్నారు పది నెలలు పైసాపైసా కూడబెడితే ఈ నాటికి ఏడు వందలయ్యింది మిగతా మూడు వందలూ ఈ రెండు నెలల్లో సంపాదించ గలమా - అని

"నే చెప్తున్నాగా వెయ్యిరూపాయలూ పూర్తి చేసే బాధ్యత నాదేనని! ఈసారైనా నాన్నగారు ఎప్పటి నుండో అనుకుంటున్నట్టు గోదానం, భూదాన స్వర్ణ దానాలతో తాతగారి ఆబ్దికాన్ని జరిపించాలి' పట్టు దలగా అన్నాడు సుబ్రమణ్యం

మూడు నిమిషాలు మౌనంగా గడిచాయి

"అమ్మా నేనొక్కటడుగుతాను చెప్తావా? నాన్న ఎప్పుడూ బాధ పడుతూ ఉంటారు నేతి గారెల్తో, నాలుగేసి కూరలు, పచ్చళ్ళు, పిండి వంటల్తో నలుగురు బ్రాహ్మణులకి సంతృప్తిగా భోజనం పెట్టక పోడం వల్లనే తాతగారి ఆత్మ అసంతృప్తి చెందుతోందని అమ్మా ఎప్పుడో పరమాత్మలో ఏకమై పోయిన ఈ జీవాత్మకు ఇంకా ఈ జిహ్వ చాపల్యాలూ, కోరికలూ ఉంటాయమ్మా? అలా అయితే ఈ శరీరం పంచ భూతాల్లో కలిసిపోదం. జీవాత్మ, పరమాత్మలో ఏకమై పోడం, వీటన్నిటికీ అర్థమే లేదు కదమ్మా? అసలు మనిషి వృద్యాప్యంలోకి ప్రవేశిస్తున్నప్పుడే వరసక్రమంలో తన డబ్బు - తన వారు తన శరీరం అన్న మమకారాల్ని వదిలేసుకొంటాడు కదా! ఇక పంచ భూతాల్లో కలిసిపోయిన శరీరానికి ఈ మమకారాలెక్కడి వమ్మా? ఎంతో కుతూహలంగా అడిగాడు సుబ్రమణ్యం

బాబూ మనిషి పరలోకానికి ప్రయాణం చేసిన రోజున ప్రతి సంవత్సరం దర్భల మీదికి పరలోకంలో ఉన్న ఆత్మ దేవతలను ఆహ్వానిస్తారు వారికి సమర్పించిన ప్రసాదాన్ని కాకులు పూర్తిగా అరగిస్తే వారి ఆత్మే ఆ కాకుల శరీరంలోకి ప్రవేశించిందనీ ఆ పూర్తిగా తినేయడమన్నది ఆ ఆత్మ పూర్తిగా సంతృప్తి చెందడాన్ని సూచిస్తుందనీ అనుకొంటారు బాబూ నేను మీ నాన్న గారిలా శాస్త్రాలు చదవలేదు అందుకే దీనిగురించి ఇంతకంటే వివరంగా చెప్పలేను నీలా ఈ కాలపు చదువులూ చదవలేదు అందుకే ఈ విషయం గురించి తార్కికంగానూ ఆలోచించలేదు! ఒక్కటి మాత్రం నిజం బాబూ! కనీసం ఆ రోజైనా పైలోకంలో ఉన్న వారి పేరు మీదుగా ఓ నల్గురు బ్రాహ్మణులు సంతృప్తిగా భోజనం చేస్తే అది మనకు మాత్రం తృప్తి కాదూ? ఆ భోజనం మనవాళ్ళే చేశారనుకొంటే మన అంతః ప్రవృత్తిగా సంతృప్తి కాదూ!"

"అవునమ్మా అందుకే డబ్బు సంపాదించే బాధ్యత నాదే నంటున్నాను పైలోకంలోని తాతగారి ఆత్మసంగతి ఎలా ఉన్నా ఈ లోకంలోని నాన్నగారి మనస్సు తృప్తి చెందడం నాక్కావలసింది!"

కొడుకు వైపు గర్వంగా చూసుకొంది అన్నపూర్ణమ్మ

★ ★ ★ ★ ★

పక్క మీద అసహనంగా కదిలారు పావని శాస్త్రిగారు అర్ధ రాత్రి దాటినా ఆయన్ను నిద్రాదేవి కరుణించలేదు.

అరే నేతిగారెలా! ఇవున్నాయిగా ఇక అన్నం పెట్టకు "కొడుకు గొంతు చెవిలో ప్రతి ధ్వనించింది

నాన్న నాన్న కూడా అచ్చు ఇలాగే అనేవారు నేతిగారెలు ఆయన కెంత ప్రాణమో!

తను బాగా చిన్నవాడుగా ఉన్నప్పుడు కనీసం నెలకోసారైనా ఇల్లంతా నేతి గారెల ఘుమఘుమల్తో నిండి పోయేది ఓ రోజు ముందుగానే హెచ్చరించేవారు నాన్న అమ్మని "ఇదిగో నిన్నే రేపు శనివారప్పలహారానిక గారెలు చేస్తున్నావుగా! చక్కగా పూసకట్టిన నేతితో దోరగా వేయించు ఆ వెధవ నూనెలు వాడకు తెలిసిందా?

ప్రతిసారీ చెప్పాలటండీ చిరుకోపంతో విసుక్కొనేది అమ్మ

ఓ అయిదేళ్ళు గిర్రున తిరిగే సరికి ఎప్పుడో ఏడాది కొక్కమారు తప్ప ఇంట్లో నేతిగారెల గుబాళింపు కనిపించేది కాదు ఆ తర్వాత్తరువాత నాన్నగారు ఎప్పుడైనా నేతిగారెలు చేయమన్నా చేతి మీదికే లేదు ఇక నేతితో గారి లెలా చేస్తానండీ! కావాలంటే మంచి నూనెతో ఓ నాలుగు చేసి పెడతాను' అనేది అమ్మ అయిష్టంగా మొహం పెట్టేవారు నాన్న

మరో అయిదేళ్ళు గిర్రున తిరిగే సరికి ఆ నూనె గారెలూ లేవు! నాన్న ఎప్పుడైనా అడిగినా మినప్పప్పుధర ఎలా మండి పోతోందో తెలుసుకదండీ!

ఆ డబ్బు పెడితే మరో మూడు పూటలు కడుపు నిండా తినొచ్చు ఓ పది రోజులు పిల్లలకి కూరలు చేసిపెట్టొచ్చు" అనేది అమ్మ కాస్త విసుగ్గా

ఆ విసుగుదలలో భర్త కోరిన చిన్న కోరిక కూడా తీర్చలేక పోయాననే అన్న వేదన కూడా మిళితమై ఉండేది అప్పటికి తన కర్మమయింది

ఒకప్పుడు నిత్యం పురాణ కాలక్షేపాలతోనో ఇంటికి వచ్చే చుట్టాలతోనో కళకళ్ళాడే వీధరుగు ఈ నాడు ఎందుకు బోసిపోయిందో

రోజూ ఎవరో ఒకరింటికి పెళ్ళికో, వ్రతానికో బాలసారెకో పిలుపు లొచ్చే నాన్నకు ఇప్పుడు ఏ రెండు నెలలకో ఒకసారి ఏ శ్రాద్ధకర్మలకో తప్ప పిలుపు లెందుకు రావడం లేదో .

అమ్మ మెడలో కాసుల పేరూ, పట్టెడ గొలుసూ చేతులకి ఆరేసి జతల బంగారు గాజుల స్థానాన్నే పసుపు తాడూ, మట్టి గాజులూ ఎందు కొచ్చాయో అన్నీ అర్థమయ్యాయి

మనుష్యులు పెరిగారు మనుష్యుల మధ్య దూరం పెరిగింది జీవితంలో వేగం పెరిగింది మనుష్యుల ఆలోచనలు పెరిగాయి ధరలు పెరిగాయి సంతానం పెరిగింది వీటన్నిటితో బాటు మనుష్యులలో ఆధ్యాత్మిక చింతన తగ్గింది

తను మెట్రిక్ ఫస్ట్ క్లాసులో పాసయిన రోజు నాన్న ఎంత పొంగి పోయారో ఇంకా చదివించుదామని ఎంత ఆశపడ్డారు' కాని చేతిలో డబ్బేది? అందుకే తనే నిష్కర్షగా చెప్పేశాడు ఇకపైకి చదవననీ టీచర్ ట్రయినింగ్ చేస్తాననీ తను ట్రయినింగు పూర్తి చేయడం ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడం జరిగే సరికి అమ్మ మంచం పట్టింది

తన మేనగోడలు ముచ్చటగా తనింట్లో తిరుగుతూ ఉంటే చూడాలన్న అమ్మ కోరికను కాదనలేక ఆర్థికంగా పూర్తిగా స్థిరపడక ముందే అన్నపూర్ణను వివాహం చేసుకొన్నాడు తన ఆఖరి సంతానం పెళ్ళి కూడా కళ్ళార చూసిన అమ్మ సంతృప్తిగా కళ్ళుమూసింది

అక్కలూ, అన్నలూ అందరూ తలో ఊర్లోనూ స్థిరపడ పోగా స్వంత ఊర్లోనే ఉద్యోగం వచ్చిన తను నాన్నను తనతో నే ఉంచేసుకొన్నాడు

పదహారేళ్ళ అన్నపూర్ణ మామగార్ని తండ్రిలాగే చూసుకొనేది' మొదట్లో తనకొచ్చే జీతమూ అడపాదడపా చేసే పౌరోహిత్యమూ వీటితో తమ ముగ్గురికీ బాగానే జరిగి పోయేది

పదేళ్ళు గిర్రున తిరిగేసరికి తను ముగ్గురు ఆడపిల్లల తండ్రయ్యాడు ఎదుగుతున్న పిల్లలు ఖర్చులు వాళ్ళ చదువులు నాన్నకి మందులు వీటన్నిటికీ తోడు ఎప్పుడూ సక్రమంగా అందని జీతం

చాలీ చాలని బ్రతుకైపోయింది

నాల్గోసారి అన్నపూర్ణ కడుపుతో ఉన్నప్పుడు నాన్న ఆమె దగ్గరి కొచ్చి ఓ రెండు నేతిగారెలు చేసిపెట్టు తల్లీ ఎన్నాళ్ళయిందో తిని డాక్టర్లు చెప్పిన తిండి తిని, తిని ఈ మధ్య జిహ్వ చచ్చిపోయిందనుకో' అన్నప్పుడు అరవై ఏళ్ళ

పుణ్య తిథి

మామగారు ఆరేళ్ళ పసివాడిలా అడుగుతుంటే మనస్సు ద్రవించి పోయిన పూర్ణ ఓ పది రోజుల బాటు మజ్జిగ చిలికి చిలికి కాస్త కాస్త వెన్న తీసి జాగ్రత్తగా దాచి దాచి ఇంట్లో పోపులకని కొని ఉంచిన మినపప్పు ఓ పిడికెడు నానబోసి ఓ రోజు తెల్లవారు ఝామునే పిల్లలెవరూ లేవకముందే ఓ నాలుగు గారెలు చేసి మామగారి ముందు పెట్టింది స్నానం చేసి బగవద్గీత చదువుకొంటున్న ఆయనకళ్ళు ఆ పళ్ళేన్ని చూడగానే మెరిశాయి

"ఇంత పొద్దున్నే చేసేశావా తల్లీ! మీ అత్తగారు పోయాక ఇదేనమ్మా ఇలా నేతి ఘుమ ఘుమల్తో దోరగా వేగిన గారెల్ని చూడడం' అంటూ ఓ ముక్క తుంచి నోట్లో వేసుకొన్నారు సరిగ్గా ఆ క్షణంలోనే మృత్యు దేవత ఆయన గది తలుపుల్ని తట్టింది నోట్లో పెట్టుకొన్న గారెముక్క గొంతు దిగకుండానే ఓ దగ్గుతెర ఆయన్నుక్కిరి బిక్కిరి చేసింది అది పోతూ పోతూ తనతో బాటు ఆయన ప్రాణాల్ని కూడా తీసుకు పోయింది

నాన్న పోయేనాటికి చేతిలో చిల్లి గవ్వ లేదు' కర్మకాండలు క్లుప్తంగా జరిపించేశాడు ఆఖరి క్షణంలో నాన్న చేతిలోంచి జారిపోయిన పళ్ళాన్ని చూసి నప్పుడల్లా మనస్సు కలిచి వేసినట్లయ్యేది

ఆ రోజు నిశ్చయించు కొన్నాడు పైసాపైసా కూడబెట్టి అయినా సరే నాన్న సంవత్సరీకాలు ఘనంగా జరిపించాలని

తనూ పూర్ణాకలిసి పావలాకంటే తక్కువున్న చిల్లర నాణేలన్నీ ఓ పాత డాల్డా డబ్బాలో వేసి దాచేవారు ఎన్ని ఖర్చులున్నా ఆ డబ్బాలోని డబ్బులు వాడేవారు కాదు నాన్న సంవత్సరీకాలకి డబ్బు సరిపోతుందని నిశ్చింతగా నిట్టూర్చేంతలో పసివాడు సుబ్రమణ్యానికి తీవ్రమైన జబ్బు చేసింది పచ్చ కామెర్లు పట్నం ఆస్పత్రిలో చేర్చాలన్నారు తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బాలోని డబ్బులు వాడేయవలసి వచ్చింది

ఆ సంవత్సరం శకట శ్రాద్ధంచేసి ఊరుకొన్నాడు

ప్రసాదాన్ని మూడు ఉండలుగాచేసి ఎంతో భక్తి శ్రద్ధలతో పెరటివాకిట్లో పెడితే ఎంత సేపో పిలవగా పిలవగా ఒకకాకి వచ్చి అలా అలా కెలికి ఎగిరిపోయింది

తన మనస్సే కెలినట్లయింది

మళ్ళా డబ్బాలో డబ్బులు వేయడం మొదలెట్టారు ఈసారి పెద్ద కూతురి పెళ్ళి

మూడో సారి రెండో కూతురి పెళ్ళి

నాల్గోసారి మూడో కూతురి పెళ్ళి అయిదోసారి అన్నపూర్ణ జబ్బు సంవత్సరమంతా నాన్న పుణ్య తిథికని దాచిన డబ్బులు ఆఖరి క్షణంలో ఖర్చయి పోతూనే ఉన్నాయి

తను యదావిధిగా చటకంతో సరిపుచ్చుతూనే ఉన్నాడు

విస్తరి ఖాళీ అవకుండానే ఒకటో రెండో కాకులు అల్లం, నిమ్మకాయ, పాలు, బెల్లం వేసిన ఆ అన్నాన్ని అటు ఇటు కెలికి ఎగిరిపోతూనే ఉన్నాయి

ఒకటి కాదు రెండుకాదు ఇరవై సంవత్సరాలనించి జరుగుతోందలా' నాన్న ఆత్మ ఎంత అసంతృప్తి చెందకపోతే కాకులు అన్నాన్ని అలా వదిలేస్తాయి?

అందుకే ఈసారైనా తప్పక నేతి గారెల్తో, నాలుగు కూరలు, పచ్చళ్లు పిండి వంటల్తో నలుగురికి సంతృప్తిగా బోజనం పెట్టాలి' గోదాన, భూదానం, స్వర్ణదానం చెయ్యాలి'

అప్పటిక్కాని నాన్న ఆత్మ సంతృప్తి చెందదు'

అప్పటిక్కాని వాకిట వేసిన విస్తరిని కాకులు ఖాళీ చెయ్యవు

కూతుర్ల పెళ్ళిళ్ళన్నీ చేసేశాడు త్వరలో పురుళ్ళూ, పుణ్యాలు లేవు

ఇకపోతే సుబ్రమణ్యం కూడా నాలుగు రాళ్ళు సంపాదిస్తున్నాడు

వాడికి తనపోలికే వచ్చింది "ఇంటర్ ఫస్ట్ క్లాసులో పాసయ్యావు ఎలాగోలా కష్టపడి చదివిస్తాను కనీసం డిగ్రీ వరకైనా చదవరా అంటే ససేమిరా కాదన్నాడు


'డిగ్రీ కాదుకదా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసినా మనలాంటి వాళ్ళకి ఉద్యోగం వెంటనే ఎలాగూ దొరకదు అంతకంటే చిన్న చిన్న పార్ట్‌టైం పనులు చేసుకొంటూ, టైపూ, షార్టుహేండులు నేర్చుకొంటూ బాంకు పరీక్షలకి కడుతూ ఉంటే త్వరలోనే నా కాళ్ళమీద నేను నిలబడగలను అంటూ తన ప్రతిపాదనని తోసి పుచ్చాడు

అందుకే ఈ కాస్త డబ్బయినా సమకూడింది'

దాచినా దాగని సంతృప్తి పావని శాస్త్రిగారి ముఖంలో తాండ విస్తోంది రేపే తండ్రి పుణ్యతిథి

ఎన్నాళ్ళకి ఎన్నేళ్ళకి తనకోరిక తీరబోతోంది'

ఇరవై ఏళ్ళ తర్వాత ఈనాటికి డబ్బాలో దాచిన డబ్బులు ఖర్చవకుండా మిగిలాయి' పుణ్య తిథికి కాలసిన ఏర్పాట్లన్నీ చేసేశారు ఇక అందరికీ డబ్బు తీయడమే తరువాయి' వీధరుగు మీద కూర్చొని సంతృప్తిగా కళ్ళు మూసుకున్నారు



"గోరం జరిగిపోనాది పంతులు గోరూ గోరం!
ఉలిక్కిపడి కళ్ళు తెరిచారు ఎదురుగా అప్పిగాడు!
మొలచుట్టూ మూరెడు పొడుగున్న గోచీగుడ్డ దానిమీద నిండా చిల్లులతో మాసిన బనీను నూనెలేక పీచులా రేగిన తల ఏడ్చినట్లు ఉబ్బి ఉన్నకళ్ళు
ఏమయిందిరా? అలా ఉన్నావేం ఆందోళనగా అడిగారు శాస్త్రిగారు
తన చిన్నతనంలో తాము బాగా బతికేరోజుల్లా ఈ అప్పిగాడు తనతోటివాడు ఇంట్లోనూ తమకుండే కాస్తంత పొలంలోనూ చిన్న చిన్న పనులు చేసే వాడు కడుపునిండా తిండీ ఒంటినిండా బట్టా ఇస్తే చాలు ఒక్కపైసా అడిగేవాడు కాదు కుర్రాడని నాన్నే అడపా దడపా డబ్బు లిచ్చేవారు వీలు చిక్కినప్పుడల్లా రెండు అక్షరం ముక్కలు తను చెప్పేవాడు కాలక్రమాన భూములన్నీ పోయాయి ఇక పొలం పనులేముంటాయి? ఇంట్లో కావలసినంత పని కాని తినే మనిషి మరొక్కరు ఎక్కువైనా భారమయ్యే పరిస్థితి అప్పటికి అప్పిగాడూ పెద్ద వాడయ్యాడు ఓ రిక్షా తొక్కుతూ పొట్టపోసుకోడం మొదలెట్టాడు
తమింట్లో పని మానేసినా అడపా దడపా వచ్చి పలకరించడం చిన్నా చితకా పనులుచేసి పెట్టడం మానలేదు ఇప్పుడు అప్పిగాడూ ముసలివాడైపోయాడు తండ్రి రిక్షా కొడుకు


కన్నీటిపై కసి

"చీటికీ మాటికీ కన్నీరు పెట్టుకుంటూ
సానుభూతిని మనస్సుకి కట్టుకుంటూ
మాటలాడటం నాకు చేతకాదు"
చేత నవడానికేముంది?
సాధన చేస్తే అదే వస్తుంది!
కానీ నటించడం నాకిష్టంలేదు!"
'అసలు నేను కన్నీటికే వ్యతిరేకం
కష్టం పంజావిప్పి మీద పడుతున్నపుడు
బాధ బాంబై పగిలి నిప్పులుముసుర్తున్నప్పుడు
ఎవరైతే ఏడుస్తాడో వాడి ఏడుపుని ద్వేషిస్తాను!
వాడి కన్నీటిని ద్వేషిస్తాను!

–డాక్టర్ మిరియాల రామకృష్ణ

తీసుకొన్నాడు కొడుకు తెచ్చే కాస్తిని డబ్బులతో ఓ పూట తినీ ఓ పూట తినకా వాళ్ల కుటుంబం అలా గడిచిపోతోంది
కనీసం రెండ్రోజుల కోసారైనా తన దగ్గరికొచ్చి కష్టం సుఖం చెప్పుకొంటాడు ఇప్పటికీ! సరిగ్గా రెండ్రోజుల క్రితమే వచ్చి వాళ్ల ఆర్థిక ఇబ్బందుల గురించి ఏమిటేమిటో చెప్పాడు ఇంతలో ఏమైంది?
శాస్త్రిగారి ప్రశ్నతో అప్పిగాడినుండి రెండు నీటిబొట్లు జారిపడ్డాయి ఏం సెప్పను పంతులుగోరూ! నిన్న మాపటేల మావోడు ఆ డొన్లో రిచ్చా తొక్కుకొత్తుంటే ఓ నారీ గుద్దేసింది రిచ్చాతోబాటు ఈడుకూడా అంతదూరం ఎగిరి పడ్డాడు తలకి బాగా దెబ్బతగిలింది బోలెడంత రగతం పోయింది రాత్రేళనించి ఒంటి మీద స్పృహ కూడా లేదు పంతులుగోరూ! మూడు సీసాల రగతం ఎక్కించాలట! ఏయో సిన్న సిన్న ఆప్రేసన్లు సెయ్యాలట! వెయ్యి రుపాలైనా అగతాదన్నారు. ఆస్పత్రోళ్ళు ఏ పూటకాపూట తిండికి డబ్బు లెతుక్కొనే వోళ్లం వెయ్యి రూపాలెక్కడ్నించి తేను పంతులుగోరూ మూడు నాలుగ్గంటల్లో ఆ రగతం ఎక్కించి ఆప్రేసన్లు చేయకపోతే నాబిడ్డ నాకు దక్కడంట పంతులుగోరూ!'' చెపుతూనే బావురుమన్నాడు శాస్త్రిగారి గుండె దడదడలాడింది చేయి అప్రయత్నంగా మొలలో దోపుకున్న తాళం చెవుల గుత్తిమీదికి వెళ్ళింది
సరిగ్గా గంటక్రితమే మరోసారి డబ్బంతా లెక్కపెట్టుకొని డాల్డాడబ్బాని పెట్లో పెట్టి తాళం వేశారు శాస్త్రిగారు
నాన్న పుణ్య తిధికి ముందురోజు దాకా చేతిలో డబ్బులుండడం ఇదే మొదటిసారి! ఆఖరిక్షణంలో చేతిలోని అవకాశం జారిపోబోతోందా?
ఈ వెయ్యి రూపాయలతో ఎక్కడో పైలోకాల్లో ఉన్న ఆత్మకు సంతృప్తి కలుగుతుంది ఈవెయ్యి రూపాయలతో నేడ ఓ జీవితం నిలబడుతుంది!
మొదటిది నమ్మకం రెండవది వాస్తవం

ఇ·వేమన·పద్యాలు



యవ్వన మనగా నేమియొ
యవ్వగ కౌమార మనగ నదియును నెట్లో
దవ్వగు వార్ధక్యములో
చివ్వగనీ మదిని జింత చేయుర వేమా.

కాని కాని అన్ని ఏర్పాట్లూ చేసుకొని ఆఖరి క్షణంలో మానేస్తే అసలే ఇన్నాళ్లూ అసంతృప్తితో అల్లాడుతున్న ఆత్మ మరింత అసంతృప్తి చెందిపోదూ? ఈ వెయ్యి రూపాయలూ ఇప్పుడిచ్చేస్తే గోదానం, స్వర్ణ దానం మాటటుంచి కనీసం నేతిగారెల్తో భోజనం కూడా పెట్టలేదు!

తాను ఎన్నిసార్లో భగవద్గీతలో చదివిన శ్లోకం గుర్తొచ్చింది శాస్త్రిగారికి

పుణ్య తిథి

'వాసాంసి జీర్ణాని యధా విహాయ
నవాని గృహ్ణాతి నర అప్రాణి'
తథా శరీరాణి విహాయ జీర్ణాని
అన్యాని సమ్యతి నవాని దేహీ''

జీర్ణమైన దుస్తులను విడిచి మనిషి కొత్త దుస్తులు వేసుకొన్నట్లే జీర్ణమయిన శరీరాన్ని విడిచి ఆత్మ కొత్త శరీరాన్ని ధరిస్తుందట!

ఎప్పుడో ఇరవై ఏళ్లక్రితం పైలోకానికి ప్రయాణించిన ఆత్మ ఇంకా కొత్త శరీరాన్ని వరించకుండా ఉంటుందా?

ఈ ఇరవై ఏళ్లలో ఎంతో జీవితాన్ని అనుభవించకుండా ఉండి ఉంటుందా? అలాకాక ఏ శరీరాన్నీ ధరించకుండానే అశాంతిగా పైలోకంలో తిరుగుతోందా?

పైలోకంలో ఉన్న తండ్రిని సంతోషపెట్టడమా?

ఈ లోకంలో ఉన్న అప్పగాడి కొడుకుని బతికించడమా?

ఒకే ఒక్క నిమిషం కళ్లు మూసుకొని అలా కూర్చుండి పోయారు శాస్త్రిగారు ఆ తర్వాత చటుక్కున లేచి గబగబా లోపలికి నడిచి పెట్టెమూత తీసి అందులోంచి డబ్బాని ఎయటకు తీసి వీధిలో కొచ్చి అక్కడ దీనంగా నిల్చున్న అప్పగాడి చేతిలో ఆ డబ్బాను పెట్టారు

అప్పగా చూడు ఇందులో వెయ్యి రూపాయలున్నాయి అంతా చిల్లరే ఇంకా నోట్లుగా మార్చలేదు నువ్వు ముందు త్వరగా ఆస్పత్రికి పద నీ వెనకే నేనొస్తాను ఊ పదమరి ఆలస్యం చేస్తే అవతల ప్రాణానికే ముప్పు

* * * * * *

మర్నాడు

అంతా మళ్లా మామూలే ఇరవై సంవత్సరాలుగా జరుగుతున్న తంతే! నలుగురు బ్రాహ్మలు తీరు గోదానాలు, భూదానాలు లేవు నాలుగు రకాల కూరలు పచ్చళ్లు పిండివంటలు అసలు లేవు

ఎంతో మనస్సుపడి చేయించుకొని ఆఖరి క్షణంలో చేతిలోంచి జారిపోయిన నేతిగారెలూ లేవు.

యధావిధిగా అన్నంలో నిమ్మకాయ, పాలు, పంచదార, అల్లం అన్నీ వేసి... ప్రసాదాన్ని మూడు ఉండలుగా చేసి విస్తరిని వాకిట్లో ఉంచారు శాస్త్రిగారు

ఎప్పుడూ వచ్చే ఒక కాకి కూడా రాదు కాబోలు! నీరసంగా అనుకొన్నారు శాస్త్రిగారు

ఆయన ఊహను అబద్ధం చేస్తూ దూరంగా ఉన్న చెట్టు మీదనించి తప తప రెక్కలు చప్పుడు చేస్తూ ఒక కాకి వచ్చి వాలింది ఆ తర్వాత ఇంకోటి ఆపై మరోటి మరోటి గోలగోలగా అరుస్తూ రెక్కలు తప తప లాడిస్తూ ఒకదాన్నొకటి ముక్కుతో పొడుచుకొంటూ.

తనకు చిరపరిచితమైన దృశ్యం!


కాని తనింట్లో మొదటిసారి చూస్తున్న దృశ్యం!

కళ్లు విప్పార్చుకు చూస్తుండిపోయారు శాస్త్రిగారు

సరిగ్గా మూడు నిమిషాలకు విస్తరి ఖాళీ అయిపోయింది ఒక్క మెతుకైనా మిగలకుండా

సుబ్రహ్మణ్యం తల్లివైపు చూశాడు.. అన్నపూర్ణమ్మ శాస్త్రిగారి వైపు చూసింది

"ఇవాళ నిజంగా పుణ్య తిథే!" అన్నారు శాస్త్రిగారు సంతృప్తిగా తల్లీ కొడుకుల పెదవులమీద చిరునవ్వు లాసన్నం చేసింది □



లో(టు) బడ్జెట్
రవీంద్ర
టీ.వీ. రేట్లు పెరుగుతాతే మాకేం- ఇటు పక్క వాటాలో బ్లాకండ్ వైట్ టీ.వీ., అటు పక్క వాటాలో కలర్ టీ.వీ. వుంది....
సోడా గూడ తెప్పుంటారా సార్!!
సోడా రేటు పెరిగిన దగ్గర్నుంచీ "రా" కొట్టేస్తున్నానోయ్ –
BAR
VAT 69
అదియాష్ట్రే- మావారి మధ్యన సిగరెట్లకు గుడ్ బై చెప్పారు.... దాంతో ఫ్లవర్‌వాజ్ చేశా....
కొంపమునిగింది సార్!! మీ కొత్త అల్లుడిగారికి మనిల్లు నచ్చలేదట..... ఫైవ్‌స్టార్ హోటల్లో రూం బుక్ చేసుకుంటున్నారు!!

పాఠకుల శీర్షిక

చిన్నారి బాలల దీనగాథలు

ఏ దేశమయినా ప్రగతి సాధించాలన్నా, అభివృద్ధి పథంలో నడవాలన్నా అందుకు బాలలు ఎంతో అవసరం. నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చి దిద్దబడాలంటే, శీఘ్రతర ఆర్థికాభివృద్ధి సాధించాలంటే ముందు బాలలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. కాని దురదృష్ట వశాత్తు మనదేశంలోనే కాక యావత్ ప్రపంచంలో కూడ 50% బాలలు పౌష్టికాహార లోపం వలన రోగాల విషవలయంలో, కుటుంబ ఆర్థిక అసమానతల వలన దోపిడీకి గురవుతున్నారు.

అంతర్జాతీయ కార్మిక సంస్థ సర్వే ప్రకారం ప్రపంచ దేశాలలో 14 సం. లోపు పిల్లలు పౌష్టికాహారం లభించక అనారోగ్యానికి లోనై ఆకలి మంటలు, పేదరికపు విషవలయంలో కొట్టుమిట్టాడు తున్నారు. పేద దేశాలలో ప్రతీ 5 గురు పిల్లలలో ముగ్గురు ఒక్క ఆహార లోపం వల్లనే సతమతమవుతున్నారు. ఈ కారణంగా 30 కోట్ల మంది వికలాంగులుగా మారుతున్నారని, ఒక అంచనా. ఈ విధంగా ఒక్క మనదేశంలోనే 50% మంది పిల్లలు వికలాంగులుగా మారుతున్నారు. ఇదే కాక పోలియో , క్షయ వంటి రోగాలు వలన 50 లక్షల మంది మరణిస్తున్నారు. (ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం). అంతే కాకఅఖిల భారత సర్వే ప్రకారం మనదేశంలో 5 నుండి 15 సంవత్సరాల లోపు వయస్సు గల బాల కార్మికులు ప్రతి మూడు గృహాలలో ఒక్కరు ఉండ శ్రామిక దోపిడీకి గురవుతున్నారు. మన దేశ కార్మిక శక్తిలో 43 మిలియన్లు బాల కార్మికులు ఉన్నారు. ఇలానే కాక బూట్ పాలిషింగ్, భిక్షాటన, పశువులు కాయడం, పేప అమ్మకం... ఇలాఎన్నో .... ఎన్నెన్నో రకాలుగా రోజుకు 14

'చిన్నారుల మోములో చిరునవ్వులు చిందించండి'

గంటలు శ్రమిస్తూ, రోజుకు 4 రూ. మాత్రమే సంపాదిస్తున్నారు. ఇటువంటి వారే కాక 8.1 శాతం బాలలు ప్రమాదకరమైన గనుల త్రవ్వకంలో కూలీలుగా , రిక్షాలాగే శ్రామికులుగా "కూటికోసం – కూలీ" చేస్తున్నారు.


ఇంతటి దయనీయ స్థితిలో ఉన్న చిన్నారులని రక్షించే వారు లేరా? ఎందుకు లేరు! ప్రభుత్వం అందుకు తగ్గ చట్టాలను చేస్తున్నది. కాని వాటిని రాజకీయ వత్తిడుల వలన అమలు పరచ లేక పోతున్నది. ప్రభుత్వం అసలు ఎటువంటి చర్యలు తీసుకోవాలి–?

భారత రాజ్యాంగం 47వ ఆర్టికల్ ప్రకారం పోషకాహార లోపానికి గురౌతున్న) బాలల సంక్షేమానికి సత్వరమే చర్యలు తీసుకోవాలి. బాల కార్మికులను నివారించేందుకు అవసరమయిన చట్టాలు చేయాలి. అత్యవసర పరిస్థితులలో బాలలు శ్రామికులుగా మారితే, అటువంటి వారు రోజుకు 3 గం. మాత్రమే పనిచేయాలని ఒక చట్టం చెయ్యాలి. వెనుకబడిన ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో "సమగ్ర బాలల సంక్షేమ పథకం"ను ప్రవేశపెట్టాలి. బాలల సంక్షేమానికి అవసరమయిన నిధిని ఏర్పాటు చెయ్యాలి. బాలలకు నిర్బంధ ప్రాథమిక విద్యను బోధించే విధంగా నూతన విద్యా విధానంలో మౌలికమయిన మార్పులు చెయ్యాలి. దీర్ఘరోగాలకు సరయిన చికిత్స నిమిత్తం డాక్టర్లను ప్రత్యేకంగా నియమించి ఉచిత చికిత్సా శిబిరాలను ప్రభుత్వ – స్వచ్ఛంద సంస్థలు నిర్వహించాలి. ఐక్యరాజ్యసమితి యునెస్కో వారు ఇచ్చిన ఆదేశాలను సభ్యదేశాల ప్రభుత్వాలు అంగీకరించి ఆచరించాలి. ఇవే కాక, బాలల సంక్షేమానికి అవసరమయిన చర్యలను తీసుకొనేందుకు ప్రజల యొక్క అభిప్రాయాలను (ముఖ్యంగా తల్లి తండ్రుల నుండి) సేకరించి పరిశీలించాలి. ఆ విధంగా అయితే కొంతలో కొంతయినా పరిస్థితి మెరుగు పడవచ్చు.

చివరగా ఒక్క మాట–


ప్రభుత్వం బాలల సంక్షేమానికి ఎన్ని చట్టాలు రూపొందించినప్పటికి వాటిని అమలు పరిచే బాధ్యత మాత్రం ప్రజలు మీద, స్వచ్ఛంద సంస్థల మీద ఎంతయినా ఉంది. కనుక ప్రభుత్వమునకు ప్రజలు తమ వంతు సహాయాన్ని అందించి తరిగిపోయే బాలల వనరులను రక్షించుకోవాలి. ఆ చిన్నారుల మోములో చిరునవ్వులు చిందించాలి. ఆ బాధ్యత మనందరి మీదా ఉంది.

–భమిడిపాటి గౌరిశంకరరావు,
నరసన్నపేట



పెద్దల నిరాదరణే కారణం

ఈనాడు మన సమాజంలో చిన్నారి బాలల దీన గాథలు వింటుంటే హృదయ విదారకంగా ఉంటున్నాయి. స్వచ్ఛమైన మన భారతీయ సంస్కృతిలో వచ్చిన ఈ వికృతి మాయని మచ్చవంటిది. పసి పిల్లలు కల్మష మెరుగని నిర్మల హృదయులు. ఎలాంటి మాయలూ తెలియని అమాయకులు. కోపతాపాలు చూపలేని ప్రేమ స్వరూపులు. అందుకే వారి మనసుల్లో దైవత్వం కొలువుంటుందంటారు. అలాంటి చిన్నారి బాలల పరిస్థితి నేడు ఎంతో దీనంగా, హీనంగా తయారవుతోంది. అందుకు మొదటి కారణం కన్నవారయితే రెండవ కారణం




సమాజానిదే అని చెప్పాలి. "నేటి బాలలే రేపటిపౌరులు" కనుక వారిని ఆదర్శవంతంగా తీర్చి దిద్దవలసింది ముఖ్యంగా తల్లిదండ్రులే. కానీ వాళ్లే పిల్లల కన్నీళ్లకు, కష్టాలకూ కారకులు కావటం విచారకరం. ఒకనాడు మాతృత్వం స్త్రీకి వరమని భావించేవారు. నేడు ఆ వరం వరించటం చాలా మంది స్త్రీలు భారంగా తలచటం బాధాకరం. పిల్లలకు పాలు ఇవ్వటం, ప్రేమ పంచటం, క్రమశిక్షణగా పెంచటం తల్లులకు కష్టమవుతోంది. పిల్లల ఆలన, పాలన చూడటం, బాగోగులు గమనించటం, విద్యాబుద్ధులు చెప్పటం తండ్రులు బాధ్యతగా భావించటం లేదు. అలాంటప్పుడు పిల్లలు అందరూ వున్నా ఎవరూ లేని వారుగా, ఎవరికీ కాని వారుగా మారిపోతారు. మొగ్గల్లాంటి పిల్లలకు ఉగ్గుపాలతో మన జాతికి, సంస్కృతికి వన్నె తెచ్చిన గొప్పవారి గురించి

చెప్పాలి. తల్లులు జిజియాబాయిలైతే శివాజీలు తయారవుతారు. తండ్రులు గణపతిదేవులైతే రాణీరుద్రమలు తీర్చి దిద్దబడుతారు. ఈనాడు చాలామంది తల్లిదండ్రులు పిల్లల్ని కనటం కష్టాల్ని కొనటంగానూ, వారిని పోషించటం బాధల్ని మోయటంగానూ అనుకుంటు న్నారు కానీ పిల్లలు తమ అనురాగానికి రూపాలనీ, తమ ఆశయాలకు దీపాలనీ భావించటంలేదు. అందువల్లే పెద్దల నిరాదరణకు గురైన చిన్నారుల మనసులు ఛిన్నాభిన్నమవుతున్నాయి. ధన సంపాదనా దాహంలో తండ్రులు బాలలను నిర్లక్ష్యం చేస్తుంటే, నవనాగరికతా వ్యామోహంలో తల్లులు పిల్లలను అలక్ష్యం చేస్తున్నారు. కనుకనే వాళ్ళు దురలవాట్లకు గురై రకరకాలుగా చెడిపోతున్నారు.

ఇకపోతే బాలల విషయంలో






సమాజంలోని పెద్దలు కూడా బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నారు. పెద్దలు స్వార్థంతో తమ అవసరాలకూ, విలాసాలకూ పిల్లలను వాడుకోవటం, వారిని వక్రమార్గాలలో నడపటం శోచనీయం. బాలికల మానభంగాలు, బాలుర వెట్టి చాకిరి, బాలబాలికలను అంధులుగా, వికలాంగులుగా మార్చి, భిక్షాటన చేయించి వారి సంపాదన స్వాహా చేయటం క్షమించరాని నేరం. అలా ఎందరో దౌర్భాగ్యులుగా దుర్భర జీవితాన్ని గడపటం మన జాతికే అవమానం. కాబట్టి ఈ విషయం గురించి మానవత్వమున్న ప్రతిమనిషీ తీవ్రంగా ఆలోచించాలి. ఇకనైనా మల్లెలవంటి పిల్లల మనసులు ముళ్ళులుగా మారకుండా తల్లి దండ్రులు ఆత్మీయతా బంధంతో పిల్లలను పువ్వుల్లాగా చూసుకుంటూ, వారిలో మమతాను బంధాల మకరందాన్ని నింపాలి. వారిని భరతమాత ముద్దుబిడ్డలుగా ఈ గడ్డకు పేరు తెచ్చేలా తీర్చిదిద్దాలి. అలాగే సమాజంలోని పెద్దలు కూడా బాలలపట్ల ఆదరణతో ప్రవర్తిస్తూ వారి భవిష్యత్తుకు భంగం వాటిల్ల కుండా హాని సంభవించకుండా బాధ్యతతో, సానుభూతితో మెలగాలి. జాతి నిర్మాణంలో బాలల పాత్ర ప్రముఖమైందని గుర్తించాలి. అప్పుడే బాలల దీనగాథలు అంతరిస్తాయి. రేపటి పౌరుల కాంతి రేఖలు ఉదయిస్తాయి. భరతమాత మోములో చిరునవ్వులు విరుస్తాయి.

బొగ్గరపు రాధాకృష్ణమూర్తి,
పామూరు (ప్రకాశం)


★ ★ ★

బడికెళ్ళాల్సిన వయస్సులో బాధ్యతలా?



నేటి బాలలే రేపటి పౌరులు అనేది సూక్తి. మనకి బస్టాండుల్లోనూ, పార్కుల్లోనూ, సోడాలు, ఐస్‌క్రీమ్‌లు, ఇంకా తినుబండారాలు అమ్ముతూ కన్పించే పిల్లల్ని చూస్తుంటే వీరేనా రేపటి పౌరులు అని అన్పించక మానదు. ఆట పాటలతో హాయిగా చదువుకుంటూ హాపీగా గడపాల్సిన ఈ వయస్సులో ఎండనక, వాననక రేయింబవళ్ళు శ్రమిస్తూ సంపాదిస్తున్నారు. ఎందుకు వీళ్ళిలా సంపాదిస్తున్నారని ప్రశ్నిస్తే, కొందరు తమ పొట్టకోసమైతే ఇంకా కొందరు తమకోసం మరియు తమమీద ఆధారపడ్డవారి కోసం అని, మరి కొందరు ఇంట్లో సభ్యుల సంఖ్య ఎక్కువై తండ్రి సంపాదన చాలకపోవడంవలన లేదా తండ్రి సంపాదనంతా అతని త్రాగుడు, పేకాట, బ్రాకెట్ లాంటి వ్యసనాలకే కరిగిపోగా యిల్లుగడవడం కోసమో... యిలా రక రకాల కారణాలు వాళ్ళ సమాధానాలవుతున్నాయి.

తల్లి దండ్రుల అనాదరణకు గురై వారి ప్రేమ, ఆదరణ ఆప్యాయతలకు నోచుకోని పిల్లలే అధికశాతం



నేరస్థులుగా మారిన సందర్భాలు వున్నాయి. ఆ పసి మనస్సుల్లో ఏమీ చెయ్యలేని నిస్సహాయత అంతులేని కసిగా మారి వారు అనేక దుశ్చర్యలకు పాల్పడటానికి ప్రేరణ అవుతుంది.

విజ్ఞాన సౌరభాలతో వికసించాల్సిన ఈ పసిమొగ్గలు బడికెళ్ళాల్సిన వయస్సులో బాధ్యతలు నెత్తినేసుకుని కష్టాలు కన్నీళ్ళతో వసివాడి పోవడానికి కారణం ఏమిటి?మన వ్యవస్థ, ఆర్థిక అసమానతలు, జనాభా పెరుగుదల. అత్యధికంగా పెరిగిపోతున్న ఈ జనాభావల్ల కటుంబం పెరిగి తద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితి కుంటుపడి ఎవరి పొట్టను వాళ్ళే పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంతేకాక సామాన్యుడి ఆర్థిక స్థితి దిగజారడానికి మానవుల బలహీనతల్ని క్యాష్ చేసుకోవడానికి వెలసిన వ్యసనాలు కూడా దోహద మవుతున్నాయి. పిల్లల బంగారు భవిష్యత్తుకి బాటలు వేయాల్సిన తల్లిదండ్రులే వంశాంకురం కోసమని, ఆపరేషన్ భయం వల్లనో లేదా దాన్ని తప్పుగా భావిస్తూ అధిక సంతానానికి తోడ్పడటం వల్లనే ఆ పిల్లల బ్రతుకులు బస్టాండుల పాలవుతున్నాయి.

అందువలన తల్లిదండ్రులు తమ మూర్ఖత్వాన్ని, మూఢత్వాన్ని వీడి ఎంత మంది పిల్లల్ని తాము పోషించగలం అని ప్రశ్నించుకుని పరిమిత సంతానంతో సరిపెట్టుకొని వారి భవిష్యత్తుని ఉన్నతంగా తీర్చిదిద్దాలి. అలాగే ప్రభుత్వం కూడా తనకొచ్చే లాభాలను దృష్టిలో పెట్టుకోకుండా సామాన్య మానవులను దృష్టిలో పెట్టుకుని మానవుడి ఆర్థిక స్థితి దిగజార్చే వ్యసనాలను నిషేధించాలి. ఉచిత నిర్బంధ విద్య, బాలకార్మిక నిషేధ చట్టాలను పటిష్టంగా అమలు పరచాలి. అనాథశరణాలయాలు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. సాంఘికంగా వెనుకబడిన వారికే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు కూడా తగిన సదుపాయాలు ప్రభుత్వం కల్పించాలి. అప్పుడే భావిభారత పౌరులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోగలరు.

–నారదాసు పద్మ, న్యూ
పాల్వంచ □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు :..
పూర్తి చిరునామా :..
....
....
పిన్‌కోడ్ :

ఫాల్గుణి డైరీ

మైకం దిగిన సబ్ ఇన్‌స్పెక్టరు!

మధుర బస్టాండుకు బాగా తప్పతాగి వో పోలీసు సబ్‌ఇనస్పెక్టరు ఆడవాళ్ళు క్యూలో నిలబడిన పక్కకు వెళ్ళి అధికోత్సాహంతో కమలహాసన్‌లా చిన్న నృత్యం చేశాడట. దానికి ఆడవారు బెదిరి పారిపోతే వో 40 ఏళ్ళ ఆమె మాత్రం అలానే నిలబడి వుంటే "భామా! కామ కలాపానికి వస్తావా" అని అరవంలో. అడిగాడట. దానికామె భద్రకాళిలా మారి, ఆ సబినస్పెక్టరు చొక్కా పుచ్చుకుని "ఏరా! ఈ బట్టలేసుకుని ఏ పనయినా చెయ్యొచ్చని నీ ఉద్దేశ్యమా" అని నిలదీసేసరి కాతనికి మైకం సర్రున దిగి, పట్టీకున ఆమె కాళ్ళు పుచ్చుకుని క్షమాపణ వేడుకున్నాడట.

కొత్త రకం లాగు!

మగతనంలేని పురుషోత్తములకు మగతనాన్ని యిచ్చి, తాము కలసిన స్త్రీని గర్భిణిగా చేయగలిగే వో కొత్తరకం లాగు (అండర్‌వేర్) అమెరికాలో వో సంస్థ తయారు చేసిందట. ఈ అండర్‌వేర్‌లను కొన్ని రసాయన మూలికల ద్రవాలతో తయారు చేశామనీ, అది తొడుక్కుంటే మగసిరి తాచుపాములా బుసలు కొడుతుందని ఆ సంస్థ ప్రకటనలతో పురుష పుంగవులు బిరబిర పరుగులిడుతున్నారట. ఈ లోపల్లాగు వెల మన లెక్కలో తొమ్మిదిన్నర వేలట!

చెట్లపై సంసారాలు!

కేరళకు చెందిన పుల్లైపుళ్ళి అనే గ్రామం చుట్టూ అడవులున్నాయట. తత్ఫలితంగా ఏనుగులు వచ్చి



యిళ్ళను భీభత్సం చేస్తుండడంవల్ల ఆ గ్రామవాసుల్లో చాలామంది తమ యిళ్ళను చెట్ల మీద కట్టుకుని అక్కడే కాపురాలు చేస్తున్నారట.

పాము ఆత్మాహుతి!

మార్చేరులో తమనంపూడి సత్యం అనే ఆయన మేడకు సమీపంలోని వో రాతికి తన తల కొట్టుకుని రెండు మీటర్ల పొడవుగల త్రాచుపాము ఆత్మాహుతి చేసుకున్నదట. ఈ పాము చనిపోయిన చోట సుబ్రహ్మణ్యస్వామి ఆలయం నిర్మించాలని పురప్రముఖులు అనుకుంటున్నారట. ఆ పామును వూరేగించి, ఆనక దహన సంస్కారాలు చేశారటా వూరివారు.

"ది టైమ్స్" అస్సలు పేరు!

"ది టైమ్స్" అనే దినపత్రిక స్థాపించి యిప్పటికి 200 సంవత్సరాలు దాటిందట. 1785 జనవరిలో యీ పత్రిక 'యూనివర్సల్ డెయిలీ రిజిస్టర్' అనే పేరుతో ఆరంభింపబడిందట. ఇపుడీ పత్రిక 4,64,000 ప్రతులు అమ్ముడు పోతున్నాయట.

వేషం మార్చి వివాహం!

పరూర్ (కేరళ)లో అబ్దుల్లా అనే అతను తన స్నేహితుడు లావన్ అనే అతనికి ఆడవేషంవేసి అతన్ని వో స్త్రీ అని చెప్పి రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేసుకున్నాడట. వీరిద్దరూ హనీమూన్ గడుపుతుండగా లావన్ తల్లి యిచ్చిన రిపోర్టుతో పోలీసులు సుహారాగా నటిస్తున్న స్త్రీ వేషధారుడు లావన్‌ని పట్టుకున్నారట.

ప్రపంచంలో కెల్లా గజదొంగ!

ప్రజల సొమ్ము, పరాయి సొమ్ము, వూరు సొమ్ము, దేశం సొమ్ము అత్యధికంగా కొల్లగొట్టిన మహనీయునిగా ఫిలిప్పైన్స్ మాజీ అధిపతి మార్కోస్ పేరు ప్రపంచ అద్భుత చరిత్రలు రాసే గిన్నెస్‌బుక్ ప్రకటించిందట. ప్రపంచంలో కల్లా అతి పెద్ద గజదొంగ అని ఈయన్ని ఆ పుస్తకం పొగిడిందట– ఏనకేన ఉపాయేన... ప్రసిద్ధః పురుషోభవేత్ అన్నారు కదా!

మామ తన్నులకు కోడలి ఆత్మహత్య!

మద్రాసు తిరువళ్ళూరుకు చెందిన నటరాజన్ అనే అతనికీ అతని భార్య కల్యాణి (19 ఏళ్ళు) అస్తమానూ ఏవో తగువొచ్చేదట. ఒకనాటి పోట్లాటలో మోతాదు మించి నటరాజన్ ఆమెను చితక బాదాడట. ఈ సంఘటనతో ఆమె వెర్రెత్తినట్లు అతన్ని తిట్టిందట. ఈ తిట్లు విన్న నటరాజన్ తండ్రి జంబులింగం ఛటాల్న వెళ్ళి కోడలి ఒళ్ళు జుట్టు పుచ్చుకుని క్రింద పడేసి తానూ ఆమెను చావగొట్టాడట. ఈ అవమానాన్ని భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుందట- కాదా మరి?!

స్కూలు బిల్డింగ్ కూలి 14 మంది దుర్మరణం!

పంజాబుకు చెందిన నవాన్‌షాహర్‌లోని ఠాకూర్‌మోడల్ స్కూలు బిల్డింగు (మూడో అంతస్థు) కూలి 12 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు అక్కడికక్కడే చనిపోయారట. మరో 35 మందికి విపరీతమైన గాయాలయ్యాయట.

వాన పడని ఏరు!


సౌత్ అమెరికాకు చెందిన డిజర్ట్ ఆటకామ అనే చోట ఏటిలో ఏ ఒక్కరోజూ వాన కురవనే కురవదట. అస్సలు వానముఖం చూడని ప్రదేశం ప్రపంచంలో యిది ఒక్కటేనట.

వయొలిన్ కచ్చేరీలో ప్రపంచ రికార్డు!

విజయవాడకు చెందిన కొమండూరి శేషాద్రి అనే వయొలిన్ విద్వాంసుడు విజయవాడ శివరామకృష్ణ క్షేత్ర కల్యాణ మండపంలో ఏకబిగిన 24 గంటలు కచ్చేరి చేసి రికార్డు సృష్టించారట. ఆ 24 గంటలలో ఆయన 140 రాగాలలో 198 కృతులు వాయించారట.

ఆడ దొంగ!

మద్రాసులో ఒక సుందరి తిరుగుతూ ఆడవాళ్ళు యింట్లో లేకుండా మగాళ్ళే వున్న యిళ్ళను చూసి, ఆ తలుపు తట్టి– కాసిన్ని మంచినీళ్ళు కావాలనో,



చీర సరిగా కట్టుకోవాలనో, బాత్‌రూమ్‌కు వెళ్ళాలనో ఆ యింట్లో ప్రవేశించి, తప్పనిసరియైన పరిస్థితి వస్తే తన శీలాన్ని కూడా వుపయోగించి, ఆ వ్యక్తిని ఏమార్చి ఆ యింట్లోని ఖరీదయిన వస్తువులను, నగలూ, వాచీలు, నగదు వంటివి తస్కరిస్తోందట. ఈ మహా తల్లి ఒక్కర్తేనా, ఇదే పద్ధతిలో చాలామంది వున్నారా అని పోలీసులు బుర్ర పగలేసుకుంటున్నారట. □

రు. 1000 బహుమతులు

ఆంధ్రపత్రిక దినపత్రిక

ఫొటోగ్రఫీ పోటీ !

ఆంధ్రపత్రిక దిన పత్రిక మొదటి పేజీలో వేసేందుకు ఫొటోగ్రఫీ పోటీ ఒకటి నిర్వహిస్తున్నాము. ఛాయా చిత్రకారులు ఉత్సాహంతో ఈ పోటీలో పాల్గొని ఆంధ్రపత్రిక తెలుగు వారి నిత్య జీవితాన్ని ప్రతిబింబించటానికి చేసే ప్రయత్నాలని మరింత విజయవంతం చేయగలరని ఆశిస్తున్నాము.

మొదటి బహుమతి రు. 250

రెండవ బహుమతి రు. 200

మూడవ బహుమతి రు. 150

నాలుగవ బహుమతి రు. 100

ఇవే కాకుండా రు. 50 చొప్పున 6 ప్రత్యేక బహుమతులు!

గడువు తేదీ : 15–4–1987

నిబంధనలు

1. పోటీకి నలుపు– తెలుపు చిత్రాలనే పంపాలి. రంగుల చిత్రాలు పంపరాదు.
2. ఛాయా చిత్రాలు తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబింప చేసేవిగా ఉండాలి. ఏ ప్రాంతం వారైనా ఛాయా చిత్రాలు పంపవచ్చు. ఆంధ్రపత్రిక సంస్థలోని ఉద్యోగులు, వారి బంధువులు మాత్రం ఈ పోటీలో పాల్గొనరాదు.
3. ఛాయా చిత్రాలు దిన పత్రికలో అడ్డంగా వేయడానికి వీలుగా ఉండే సైజులో పంపితే మంచిది. పోటీకి ఒక్కొక్కరు 3 చిత్రాలకన్నా ఎక్కువ పంపరాదు.
4. బహుమతి పొందిన ఛాయా చిత్రాలనే కాక యోగ్యమైన వాటిని మరి కొన్నింటిని కూడా వీలునిబట్టి ప్రచురించగలము.
5. ప్రచురణార్హం కాని ఛాయా చిత్రాలను తిప్పి పంపగోరేవారు తగిన తిరుగు టపా జత చేయవలసి ఉంటుంది. ఈ ఛాయా చిత్రాలను తిప్పి పంపే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది కాని పోస్టులో ఒక వేళ అవి తప్పి పోయినా లేక దెబ్బ తిన్నా మా బాధ్యతలేదు.
6. పోటీకి పంపే ఛాయా చిత్రాలు మా కార్యాలయానికి ఏప్రిల్, 15 నాటికి అందాలి. ఆ తరువాత వచ్చే వాటిని స్వీకరించడం జరగదు.
7. పోటీకి పంపే ఛాయా చిత్రాలను సంపాదకుడు, ఆంధ్రపత్రిక దినపత్రిక, గాంధీనగరం, విజయవాద – 520 003 అన్న చిరునామాకి పంపాలి. వ్యక్తుల పేర పంపరాదు. కవరు పై భాగంలో "ఆంధ్రపత్రిక దినపత్రిక ఫొటోగ్రఫీ పోటీకి" అని స్పష్టంగా రాయాలి.
8. పోటీకి పంపే ఛాయా చిత్రాల వెనుక వైపు అది తాము స్వయంగా తీసినదే అని హామీ రాస్తూ దానికి సంబంధించిన సాంకేతిక వివరాలని కూడా పేర్కొనడం అవసరం.
9. పోటీ విషయంలో తుది నిర్ణయం సంపాదకునిదే. పోటీలో పాల్గొనే వారందరూ దీనికి బద్ధులై ఉండాలి. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకి తావు లేదు.

–సంపాదకుడు

సీరియల్

ప్రతిస్పందన

అన్నపూర్ణ



(గత సంచిక తరువాయి)

వాళ్ళ తల్లి దండ్రులకు శేషాద్రి, వెంకటాద్రి ఇద్దరే పిల్లలు పెద్దల తదనంతరం ఆస్తి పంపకాలు చేసుకొంటే అన్నదమ్ములిద్దరికీ చెరి అయిదు ఎకరాలు వచ్చింది ఇళ్ళ స్థలాలు కూడా పంచుకున్నారు శేషాద్రి కొంచెం అవుదార్యం చూపించి కట్టిన యిల్లున్న వాటాని తమ్ముడికి యిచ్చాడు తన స్థలంలో అధునాతన సౌకర్యాలతో ఒక డాబా నిర్మించుకున్నాడు.

వెంకటాద్రికి చదువు అంతగా అబ్బలేదు అందుకని మొదట్నుంచి అతడు వ్యవసాయ రంగంలోనే వున్నాడు కొత్తగా భూముల్ని కొన లేక పోయినా వున్నదాన్ని పోనీయకుండా జాగ్రత్త పడుతూ ఆ పల్లెపట్టునే వుంటున్నాడు

శేషాద్రిగారు బాగా చదువుకున్నాడు ప్రభుత్వ సర్వీసులో చేరిన కొద్ది సంవత్సరాలలోనే ఆఫీసర్ హోదాకు ఎదిగి పోయాడు భార్య పుట్టింటి వారు వాళ్ళ వూళ్ళో అరణంగా యిచ్చిన భూమిని అమ్ముకొని వచ్చి – మొత్తానికి ఎలాగైతేనేం తన అయిదెకరాల పొలం ప్రక్కనే మరో ఇరవై ఎకరాలు భూమి కొన్నాడు తమ వూళ్ళో పట్నంలో కూడా మంచి యిల్లు కట్టించాడు

మంచి లోకానుభవం వున్న వ్యక్తి శేషాద్రి అందుకే తమ్ముణ్ణి ఎంతో యిదిగా చూసు కొంటూ వస్తున్నాడు తన పాతిక ఎకరాల మీద పెద్దరికం యిచ్చాడు అందుకు గాను సంవత్సరానికి రెండు పుట్ల గింజలు ముట్ట జెబుతున్నాడు వెంకటాద్రి కూడా అన్న మీద చాలా విశ్వాసంగా వుంటాడు హంగు లేక స్వంత వ్యవసాయం పెట్ట లేదు. తన భరోసా మీద కవులు దారును పెట్టి ఆజమాయిషీ వహిస్తున్నాడు . అతడి స్వంత భూమిని మాత్రం తానే దున్నుకుంటున్నాడు వెంకటాద్రి

నిరుడు చేసిన కవులుదారు పేచీలకోరు వాడనీ, అతణ్ణి మార్చి కొత్తగా మరెవరికైనా ఇప్పించాలనీ వెంకటాద్రి పట్టుదల అందుకు శేషాద్రి కూడా మద్దతు తెలిపాడు 'నాకు కాకుండా మరెవరికైనా భూమిని కవులుకు యిస్తే నేను వప్పుకోను మొన్నటి పంట సీజనులో నేను నష్టపడి వున్నాను' అని అడ్డు పడుతున్నాడు పాత కవులుదారు

మా అన్నగారు వచ్చారు మాట్లాడటానికి రమ్మని కబురు చేశాడు వెంకటాద్రి పాత కవులు దారు రాజయ్యకు కానీ, అతడు రాలేదు

దాంతో శేషాద్రికి కోపం వచ్చింది. గ్రామ పెద్దలను సంప్రదించి సాయంత్రం పంచాయితీ పెట్టించాడు కట్టు బాటును అనుసరించి వచ్చాడు రాజయ్య పోయిన పంట సీజనులో నాకు నష్టం వచ్చింది అయినా అనుకున్న ప్రకారం ధాన్యం ముట్ట జెప్పాను నష్ట పోయివున్న నన్ను కాదని మరొకరికి భూమి యివ్వటం చాలా అన్యాయం అందుకు నేను ఒప్పుకోను' అంటూ అక్కడ కూడా వాదించాడు అతడు

'పొలం మా స్వంతం నీ మిరాశీ కాదు. ఎవరికి కవులు ఇవ్వటం అన్నది మాయిష్టం అయినా నీకు ఇన్ని సంవత్సరాలకు కవులుకు యిస్తున్నట్లు మేం నీకు కాగితం రాసి యివ్వలేదు కద?' అన్నాడు శేషాద్రి

"అదే నేను చేసిన పొరబాటు మంచి వారు కద అని నోటిమాట మీద 'సరే' అని మీ పొలం చేశాను . ఇప్పుడు మీరు అడ్డం తిరుగుతున్నారు. ఏమైనా 'చెప్పండి శేషాద్రిగారూ పొలం మీ స్వంతం అంటున్నారు కాబట్టి చేసుకుంటే స్వంతంగా వ్యవసాయం చేసుకోండి అంతేగాని నన్ను నష్ట పరిచి మరొకళ్ళకి భూమి యిస్తే – ఏం జరగవలసిందీ తర్వాత జరుగుతుంది – అంటూ బెదిరించాడు రాజయ్య

మొన్నటి సీజనులో నష్ట పోయానంటున్నాడు రాజయ్య నష్ట పోయిన అతణ్ణి తొలగించి మరొకరికి కవులుకు ఇవ్వటం భావ్యంగా వుండదేమో శేషాద్రి గారూ" – అంటూ కొంత మంది రాజయ్యకు సపోర్టుగా మాట్లాడారు

రాజయ్య కావాలని శేషాద్రి గారి భూమి కవులుకు తీసుకున్నాడు అతడికి లాభం వచ్చిందో నష్టం వచ్చిందో – చెప్పుకోవటం అనవసరం అసలుకు లాభం వచ్చినా నష్టం వచ్చినా భరించగలిగే స్థోమత వుంటేనే ఇతరుల భూములను కవులుకు తీసుకోవాలి . అదీకాకుండా ఇప్పుడు రాజయ్య వాదన ప్రకారం శేషాద్రి గారు ఈ సంవత్సరం కూడా అతడికే కవులుకు ఇస్తారు మరి వచ్చే పంట సీజనుకూ నష్టమే వస్తే? – అప్పటి మాటేమిటి? మళ్ళీ రాజయ్యకే కవులుకు ఇచ్చితీరాలా? అది పద్ధతి అవుతుందా? ఏదైనా పొలం శేషాద్రి గారిది తన భూమిని తానే స్వంతంగా దున్నుకుంటాడో, ఇతరులు మరొకరికి కవులుకు యిస్తారో – అది ఆయన ఇష్టాయిష్టాలను బట్టి వుంటుంది అంతే గాని శేషాద్రిగారిని బెదిరించి, భయపెట్టి పొలం కవులుకు పొందాలను కోవటం

జరిగిన కథ –2 : సౌందర్య సాకేతలతో పాటు సినిమాకు వెళ్ళిన సౌందర్య అన్నయ్య రవికిరణ్ సాకేతతో సాన్నిహిత్యం పొందాలని ప్రయత్నిస్తుంటాడు రచయిత సమాజ సత్యం అభిమానిగా సౌందర్య ఆయనకు రాసిన ఉత్తరానికి జవాబొస్తుంది రవికిరణ్ వేధింపు ఎక్కువై సాకేత సౌందర్యతో విషయం చెప్పేస్తుంది సాకేత తన అభిప్రాయం స్వయంగా చెప్పాలనే ఉద్దేశ్యంతో వారిద్దరికీ ఏకాంతం కల్పిస్తుంది సౌందర్య సాకేత మేనత్త, మేనబావ రాబోతున్నారని కబురొస్తుంది

అవివేకం" కొందరు రాజయ్య చర్యను ఖండించి శేషాద్రి గారిని వెనకేసుకు వచ్చారు

తన భూమి విషయంలో రాజకీయాలు ప్రవేశించాయని అర్థమై పోయింది శేషాద్రికి

సాధ్యమైనంత వరకు రాజకీయాలకు దూరంగా వుండాలన్నది ఆయన మరో సిద్ధాంతం కాబట్టి–

తన భూమిని తానే దున్నుకోవాలన్న నిర్ణయానికి అక్కడే వచ్చేశాడు శేషాద్రి

ఇంటికి వచ్చాక "నీ అయిదెకరాలతో పాటు నా పాతికెకరాలు నువ్వే దున్ను తమ్ముడూ . డబ్బు కావాలంటే డబ్బులు, గింజలు కావాలంటే గింజలు యిద్దాం ఓ మంచి కుర్రాణ్ణి పాలేరుగా పెట్టుకో . ట్రాక్టర్ మాట్లాడి పొలందున్నించు... డబ్బుకోసం చూడకు ఎరువులు అవీ నేను కొనిపంపిస్తాను అంటూ ఆర్థిక సంబంధమైన భరోసా యిచ్చి తన పొలం వ్యవసాయ భారం వెంకటాద్రి మీద వేసి మర్నాడు వుదయం భార్య, కూతురుతో అక్కణ్ణుంచీ బయలు దేరి పట్నం వచ్చేశాడు శేషాద్రి

* * * * * * * * *

ఆ పగలంతా తమ యింటికి సాకేత వస్తుందేమో నని ఎదురు చూసింది సౌందర్య కానీ ఆమె రాలేదు

నిన్న అన్నయ్య సాకేతను ఏదో అని వుంటాడు లేక పోతే మొరటుగా ప్రవర్తించి వుంటాడు దాంతో ఆమెకు కోపం వచ్చి వుంటుంది ముఖ్యంగా తనపైనే

'సాకేతను ఏమైనా అన్నావా?' అని అన్నయ్యను అడిగి తెలుసుకుందామని అనిపించింది సౌందర్యకు ఒక సందర్భంలో అడిగినా అతడు నైతిక బాధ్యత నెత్తిన వేసుకుని నిజం చెప్పడు అనిపించింది అంతలోనే అదీగాకుండా రవికిరణ్ ఏదో అర్జంట్ పని వున్నట్టు ప్రొద్దున్నే ఎటో వెళ్ళాడు మధ్యాహ్నం భోజనానికి కూడా రాలేదు

'తనే సాకేత వాళ్ళ యింటికి వెళ్ళి 'సారీ' చెప్పాలి అని నిన్న తాము పల్లె నుంచ తెచ్చిన మామిడి పండ్లలో ఒక డజన్ తీసి బ్యాస్కెట్‌లో పెట్టుకొని తల్లికి చెప్పి బయలుదేరింది సౌందర్య

వెళ్ళేటప్పుడు తమ అన్నయ్య వాళ్ళు తీసుకు వెళ్తారని మామిడి పండ్లు, కొబ్బరి బోండాలు అన్నీ ముందే సిద్ధం చేసి వుంచాడు వెంకటాద్రి వాట్ని కారు డిక్కీలో వేసుకు వచ్చారు తిరుగు ప్రయాణంలో

అప్పుడు సాయంత్రం దాదాపు అయిదు గంటలు కావస్తోంది ఎండ వేడిమి తీవ్రత కొంత తగ్గినా వడగాలి వీస్తూనే వుంది

ముందు గదిలో వాలు కుర్చీలో చేరగిలబడి సాలోచనగా కళ్ళు మూసుకొని



ప్రతిస్పందన

కూర్చున్న సాకేత కనిపించింది సౌందర్యకు

'ఏమిటి, వేళగాని వేళ నిద్ర?

సౌందర్య కంఠం విని వులిక్కి పడింది సాకేత

"నిద్రలేదు. ఏం లేదు అవునూ నువ్వు వూరు నుంచి వచ్చేశావా? రాక? అక్కడే వుండి పోతాననుకున్నావా?"

"అలా అనికాదు వెళ్ళక వెళ్ళక పల్లెకు వెళ్ళావ్ మీ బాబాయి, పిన్ని – వాళ్ళ పిల్లలు నిన్ను నాలుగు రోజుల పాటు అక్కడే వుంచేస్తారనుకున్నాను"

చేతనున్న బ్యాస్కెట్ క్రింద పెట్టి సాకేత ప్రక్కకు మరో కుర్చీ లాక్కొని స్వతంత్రంగా కూర్చుంది సౌందర్య

'నీ అంచనా డామ్ కరెక్ట్! . మా పిన్ని, బాబాయి ఎంతో బలవంతం చేశారు మా మమ్మీని, డాడీని కూడా ఒప్పించారు వాళ్ళు కాకపోతే నేనే మొండి కేశాను ఈ సారి వచ్చినప్పుడు తప్పకుండా వుంటానని తీయగా అబద్ధం చెప్పి వచ్చేశాను'

"నీవు వచ్చి వుండవ్ అనుకొనే మీ యింటి వైపు రాలేదు నేను'

'అలాగా' అయితే నేను పల్లెకు వెళ్ళి వచ్చిన శుభ సందర్భంలో నీ నోరు తీయ జేద్దామని తీయ తీయని మామిడి పండ్లు తెచ్చాను తీసుకు వెళ్ళి మీ అమ్మగారికి ఇవ్వు బుట్ట అన్నట్లు మీ తమ్ముళ్ళు, చెల్లాయి ఏరి?

"వాళ్ళ కాలక్షేపం కోసం వాళ్ళు వెళ్ళారు అని లేచి బుట్ట తీసుకు వెళ్ళి లోపల ఇచ్చి వచ్చింది

ఆ వెనకే సాకేత తల్లి రేణుకమ్మ ఖాళీబుట్ట తీసుకుని ఇవతలికి వచ్చింది ఆవిడ కాసేపు అక్కడే నిలబడి సౌందర్యను యోగక్షేమాలడిగి తన పనులు చేసుకోవటానికి లోపలికి వెళ్ళింది తిరిగి


'అన్నయ్య నిన్నేమైనా అన్నాడా?" – అసలు విషయంలోకి వచ్చింది సౌందర్య, రేణుకమ్మ అటు వెళ్ళగానే

ఏమీ అనలేదు కానీ, నా సంగతి చూస్తానని బెదిరించాడు చెప్పింది సాకేత

బెదిరింపులకు భయపడ వలసిన పనిలేదులే నిజం తెలిసిన మరుక్షణం అన్నయ్య మతిచెదరి అక్కడికక్కడే నిన్నేమైనా చేసేస్తాడేమోనని హడలి చచ్చి పోయానంటే నమ్ము. పల్లెకు వెళ్ళానన్న మాటే గాని అక్కడ క్షణం కూడా ప్రశాంతంగా వుండలేక పోయాను"

"నువ్వు అలా వూరు వెళుతున్నట్లు ముందుగా నాకు ఒక్క ముక్క చెబితే ఏం పోయింది?"

"అసలే మొగమాటస్తురాలివి నువ్వు నేను వూరు వెళుతున్నట్లు తెలిస్తే పొరబాటున కూడా మాయింటి గడప తొక్కవ్. . నువ్వు, మా అన్నయ్య ముఖాముఖి మాట్లాడుకొనే అవకాశం మళ్ళీ దొరకదు ఆలస్యం చేస్తే మా అన్నయ్య ప్రేమ పిచ్చి ముదిరి – అది ఎంత వరకు వెళుతుందో మరి? అందుకే నీకు చెప్పలేదు అయినా, నావల్ల పొరబాటు జరిగింది అనుకొంటే నన్ను క్షమించు" అంటూ సాకేత చేతులు పట్టుకొంది సౌందర్య



మనలో మనకు క్షమాపణ లేమిలేవే ఏదైతేనేం, మొత్తానికి నీ ఆలోచన ప్రకారమే జరిగింది కద? మరి ఏవో భ్రమల్లో పడి కొట్టుకులాడుతున్న మీ అన్నయ్య ముందు ముందు ఎలా రియాక్ట్ అవుతాడో?

"అలాంటి అనవసర సందేహాలు నీకు అనవసరం సాకేతా మా అన్నయ్య తత్వం నాకు బాగా తెలుసు అతడి రియాక్షన్ ఏదైనా వుంటే అది ఆన్‌ది స్పాట్‌లోనే జరిగి పోయి వుండేది నిన్ను ఏమైనా చెయ్య దలుచుకుంటే నీ అభిప్రాయం తెలిసిన మరుక్షణం అక్కడి కక్కడే చేసే వాడు అన్నయ్యను గురించిన సంశయాలు మనసులో పెట్టుకోకు నీ విషయంలో అతడికి నేను కూడా నచ్చ చెబుతాను"

సౌందర్య పూర్తిగా భరోసా యిచ్చింది దాంతో సాకేత మనసు కుదుట పడ్డట్లైంది

ఇద్దరూ కాసేపు ఆ కబుర్లు ఈ కబుర్లు చెప్పుకున్నారు

తర్వాత సాకేత తమ యింటికి అతిథిగా రాబోతున్న అనిరుద్ధ్‌ను గురించి చెప్పింది

'అంటే! నీవుడ్ బీ వచ్చేస్తున్నాడన్న మాట' అని నవ్వింది సౌందర్య

అనిరుద్ధ్‌ను 'నావుడ్‌బి'గా నేను భావించుకోవటం లేదు – కొంచెం సీరియస్‌గా ముఖం పెట్టి చెప్పింది సాకేత

"అవునులే మామూలు వుద్యోగస్థుడైన మీ బావను నువ్వెందుకు ఒప్పుతావ్? నీ వూహా సుందరుడు – అతడికి వుండ వలసిన లక్షణాలే వేరుమరి – నవ్వుతూనే ఎత్తి పొడిచింది సౌందర్య

సాకేత ఆ విషయమై మరి మాట్లాడ లేదు

నాకిక శలవు యిప్పిస్తావా?' అడిగింది సౌందర్య

"అప్పుడే ఇంటికి వెళ్ళి ఏం చేస్తావ్?"

'కాలక్షేపానికి పుస్తకాలు, కాదనుకొంటే టీ వి ప్రోగ్రామ్‌లు నువ్వూ రాకూడదూ మా యింటికి?" లేచింది సౌందర్య

"రేపు వస్తాలే సాకేత కూడా లేచింది సౌందర్యకు సెండాఫ్ చెప్పటానికి

అదే సమయంలో నిరంజనరావు, అతడి వెనుక మరో యువకుడు కలిసి లోపలికి వచ్చారు ఆ వెనక రిక్షావాడు పెద్ద లగేజీ తీసుకు వచ్చి అక్కడ పెట్టి ఆ యువకుడి దగ్గిర కిరాయి డబ్బులు తీసుకొని వెళ్ళాడు

నిరంజనరావు ఎంతో హుషారుగా కనిపిస్తూ ఏమేవ్, ఇలారా అంటూ భార్యను కేకేశాడు అక్కణ్నుంచే తర్వాత అమ్మా సాకేతా, బావకు కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు తెచ్చివ్వు' అని కూతురికి పని పురమాయించాడు

"ఏమిటండీ' తన మామూలు ధోరణితో ఇవతలికి వచ్చి అనిరుద్ధ్‌ను చూసి, "ఏం బాబూ బావున్నావా?" అని పలకరించింది రేణుకమ్మ ముఖాన్ని చాటంత చేసుకొని

"బాగానే వున్నానత్తయ్యా' అని చెప్పి, సాకేత యిచ్చిన నీళ్ళ చెంబు తీసుకొని కాళ్ళు కడుక్కోవటానికి బయటికి వెళ్ళాడు అనిరుద్ధ్

'ఏమ్మా సౌందర్యా నువ్వు వూరు వెళ్ళావని చెప్పింది మా సాకేత! ఎప్పుడు వచ్చావ్?" – అని సౌందర్యను పలకరించాడు నిరంజనరావు

"రాత్రే వచ్చేశామండీ " అని నిరంజనరావుకు చెప్పి, "సాకేతా, మరి నేను వెళ్ళిరానా?" అంది సాకేతతో

"కాసేపు కూర్చుని వెళ్ళమ్మా. ..." – మాట వరసకు అన్నాడు నిరంజనరావు

"మరోసారి వస్తానండీ" అని చెప్పి బ్యాస్కెట్ తీసుకొని వెళ్ళి పోయింది సౌందర్య, బంధువులు – వాళ్ళు వాళ్ళు మాట్లాడుకొనేటప్పుడు బయటి మనిషి తాను వుండకూడదని

రేణుకమ్మ అందించిన టవల్‌తో కాళ్ళు చేతులు తుడుచుకొంటూ వచ్చి ఓ కుర్చీలో కూర్చున్నాడు అనిరుద్ధ్

"ఏం సాకేతా, ఆ అమ్మాయి నన్ను చూసి అలా వెళ్ళి పోయిందేమిటి? చొరవ తీసుకొని సాకేతను అడిగాడు అనిరుద్ధ్

'నువ్వు పూర్తిగా అపరిచితుడివి కదా? . . బిడియపడి వెళ్ళి పోయింది"–

చెప్పింది సాకేత చాలా మామూలుగా

అప్పుడు అక్కడ వాళ్ళిద్దరే వున్నారు కాఫీ సిద్ధం చేయటానికి లోపలికి వెళ్ళింది రేణుకమ్మ ఆ రాత్రికి చేయ వలసిన శాక పాకాలను గురించి భార్యకు వివరించటానికి ఆమె వెనుకే వెళ్ళాడు నిరంజనరావు

* * * * * * * * * *

ఆరోజు వుదయం నిద్ర లేచింది మొదలు శేషాద్రి గారి మనసంతా ఆదోలా వుంది

నిర్వచించి చెప్పలేని ఏమిటో బాధ కొడుకు రవికిరణ్‌ను తలుచుకొంటే అది మరింత ఎక్కువవుతోంది

ఒక్కడే కొడుకు, ఒక్కర్తే కూతురు అని వాళ్ళిద్దర్ని తాను ఎంతో అపురూపంగా చూసుకుంటున్నాడు కానీ, ఆడపిల్ల పాటి తెలివి తేటలు, వివేకం మగవాడిగా పుట్టిన రవికిరణ్‌కు లేకుండా పోయాయి చదువు అబ్బకపోతే అబ్బక పోయింది చెప్పిన మాటవిని కుదురుగా వుంటాడా అంటే అదీ కనిపించటం లేదు

నిన్న వుదయం నిద్రపక్క మీంచి లేచి బయటికి వెళ్ళినవాడు రాత్రి పది గంటలకు గాని ఇంటికి రాలేదు పెద్దలని గౌరవం కూడాలేదు త్రాగి మరీ వచ్చాడు అబ్బవలసిన అన్ని దురలవాట్లూ అబ్బినట్లున్నయ్ ఇంకేం దారికి వస్తాడు? తన పరువు ఎలా నిలుపుతాడు? – ఇదే శేషాద్రిగారి వ్యధ

ఉదయం తొమ్మిది గంటలు దాటింది అప్పుడు నిద్రలేచి గదిలోంచీ బయటికి వచ్చాడురవికిరణ్

కొడుకు ఆ చెంప ఈ చెంప గట్టిగా వాయించేయాలని పించింది శేషాద్రి గారికి కానీ, 'వాడేమైనా పసి వాడా కొడితే పడటానికి? తను చెయ్యి చేసుకుంటే ఆవేశంలో వాడూ చెయ్యి చేసుకోవచ్చు పరువు తక్కువ పని' అని కోపాన్ని తాత్కాలికంగా అణుచుకున్నాడు ఆయన

తండ్రిని గురించి పట్టించుకోకుండానే బాత్ రూమ్ వైపు వెళ్ళాడు రవికిరణ్

సాత్విక ధోరణిలో నైనా కొడుకును తన దారిలోకి తెచ్చుకోవాలని దృఢంగా నిశ్చయించు కున్నాడు శేషాద్రి

ఆఫీసుకు ఫోన్ చేసి 'ఈ రోజు నేను ఆఫీసుకు రావటం లేదు ఏవైనా అర్జంట్ ఫైల్సు వుంటే ఇంటికి తీసుకురండి సంతకాలు పెడతాను" అని హెడ్ క్లర్క్‌కు చెప్పే డు

ఓ గంట తర్వాత డ్రస్ చేసుకొని ఇవతలికి వచ్చాడు రవి కిరణ్ వాలకం చూస్తే ఎటో వెళ్ళటానికి సిద్ధంగా వున్నట్టు కనిపించింది

బాబీ, ఇలారా" – పిలిచాడు శేషాద్రి

సౌందర్యను 'బేబీ' అని, రవికిరణ్‌ను 'బాబీ' అని పిలవడం ఆ యింట్లో వాళ్ళకు అలవాటు

వచ్చి తండ్రికి ఎదురుగా కూర్చుని 'ఏమిటో చెప్పండి' అన్నట్లు చూశాడు

ఈ లోగా సౌందర్య కూడా లోపల్నించి వచ్చి తండ్రి ప్రక్కగా కూర్చుంది

"నా మీద నీకు కోపమా?

శేషాద్రి గారి ప్రశ్న బాణంలా వచ్చి తగిలింది రవికిరణ్‌కు

"మీ మీద. ! నాకు కోపం ఏమిటి డాడీ?"

మరి నిన్న నువ్వు చేసి వచ్చిన పనేమిటి?

"అదా? అది మనసు బావుండక "

మనసు బాగుండక పోవట మేమిటి? అయినా నీకు ఎందులో లోటని?

'పొరబాటై పోయింది డాడీ... ఏదో స్నేహితులు బలవంతం చేస్తే . తప్పలేదు ఇక ముందు మరెప్పుడూ అలాచేయను '

–తాత్కాలికంగా తండ్రి నుంచి తప్పించు కోవటానికి అన్న మాటలు అవి

నిజానికి సాకేత తనను నిర్మొహ మాటంగా తిరస్కరించటాన్ని ఘోర పరాజయంగా భావించు కుంటున్నాడు రవికిరణ్ అందును గురించిన ప్రతీకార వాంచతో అతడి మనసు రగిలి పోతోంది

సాకేతను గురించి ఆలోచిస్తూనే నిన్న రోజంతా పిచ్చి వాడిలా వూరు వెంట తిరిగాడు చివరికి మనసు పట్టలేక తనకు తానుగా బారుకు వెళ్ళి త్రాగివచ్చాడు

తాను త్రాగిరావటం తల్లిదండ్రుల దృష్టిలో తప్పే కావచ్చు కానీ, తన మదిలోని ఆవేదన – వాళ్ళకు ఎలా తెలుస్తుంది? ఒక వేళ తెలియ జెప్పినా వాళ్ళు ఎలా అర్థం చేసుకుంటారో? 'ఆ అమ్మాయి ఇష్టం లేదని తెగేసి చెబుతున్నప్పుడు ఇంకా నువ్వెందుకు తాపత్రయ పడటం?' అంటూ తనకే సలహా ఇవ్వవచ్చు కానీ, సాకేత కథ సుఖాంతం కాకూడదు

చేసిన దానికి అంతకు అంత ఫలితం అనుభవించ వలసిందేఅది చివరికి 'జరిగిపోయిందానికి నన్ను మన్నించు రవి కిరణ్' అంటూ సాకేత కాళ్ళ బేరానికి వచ్చిననాడే తనకు మనశ్శాంతి అది ఆస్థితికి వచ్చేందుకు తను ఏదో ఒకటి చేయాలి కానీ, ఏం చేయాలి?– ఇదే అతడి ప్రస్తుత నిరంతర ఆలోచన

"సరే ఈ విషయంలో నిన్ను విశ్వసిస్తున్నాను మరి ఫ్యూచర్‌ను గురించి ఏం ఆలోచిస్తున్నావ్?" – అడిగాడు శేషాద్రి


'రిజల్ట్స్ రానీయండి అన్నాడు రవికిరణ్

రిజల్ట్స్? అవి తెలిస్తే? డిగ్రీ ప్యాసైతే ఏదైనా వుద్యోగంలో చేరతావా?

అది కాదు డాడీ '

'ఏదికాదు? నీ భవిష్యత్తును గురించి నువ్వు ఆలోచించుకో లేక పోవచ్చు కానీ, నిన్ను కన్నందుకు – కన్న వాడిగా నిన్ను గురించి ఆలోచించక నాకు మాత్రం తప్పదు"

అయితే మీరు లోగడ అన్నారుగా? ఆ ప్రకారమే ఏదైనా బిజినెస్ పెట్టించండి చేస్తాను



లోగడ అలా అన్నా ప్రస్తుతం నీతో బిజినెస్ పెట్టించే వుద్దేశ్యం నాకు లేదు అయినా అనుభవం లేని ఏ బిజినెస్‌లోనో దిగి డబ్బు పాడు చేసుకొనేకంటే ఇప్పుడు మనకు వున్నదాన్ని జాగ్రత్త చేసుకొంటే చాలు పల్లెలో మన పొలాన్ని కౌలుదారు నుండి తీసేసుకున్నాను మీ బాబాయి ఆజమాయిషీలో స్వంతంగా వ్యవసాయం ప్రారంభించాను కాబట్టి నువ్వు పల్లెకు పోయి బాబాయికి తోడుగావుండు " అంటూ తన మాట చెప్పాడు శేషాద్రి.

క్షమించుడాడీ నేను పల్లెలో వుండలేను అక్కడి వాతావరణం నాకు నచ్చదు' – టక్కున సమాధానం చెప్పి చరచర వెళ్ళి పోయాడు రవికిరణ్ బయటికి

కొడుకు వెళ్ళిన దిక్కే చూస్తూండి పోయారు శేషాద్రి కొద్దిసేపు తర్వాత –

చూశావా, బేబీ వీణ్ణి దారిలో పెడదామన్నా కాడిక్రిందకు వచ్చేట్లు లేడు' – ప్రక్కనే వున్న కూతురుతో బేలగా చెప్పుకున్నాడు

'అన్నయ్య ఇలా దారికి రాడు డాడీ మంచి సంబంధం చూసి పెళ్ళి చెయ్యండి' వచ్చే ఆవిడకు తెలివి తేటలుంటే అప్పుడే దారిలోకి వస్తాడు అతగాడు అని సలహా యిచ్చింది సౌందర్య.

సౌందర్య అంటే ఎంతో యిష్టపడతారు శేషాద్రి . దాన్ని ఆసరా చేసుకునే తండ్రికి అలా సలహా యిచ్చింది ఆ సలహా వెనుక ఆమె అసలు వుద్దేశ్యం – అన్నయ్యకు పెళ్ళైపోతే అతడు సాకేతను గురించి ఆలోచించటం పూర్తిగా మానేయ గలుగుతాడు అనే

ప్రతిస్పందన

'నాకూ అదే ఆలోచన కలుగుతోందమ్మా ఆ మూడు ముళ్ళూ పడితే గాని వీడు దారికి వచ్చేట్టు లేడు - అంటూ తన అభిప్రాయమూ వెలిబుచ్చాడు శేషాద్రి

అంతలోనే ఇంటి ముందుకు ఏదో కారు వచ్చి ఆగిన చప్పుడైంది ఆ వెంట 'గుడ్ మార్నింగ్ సార్!' అంటూ హెడ్ క్లర్క్ జగన్నాథం, అతడి వెనక ఒక యువకుడు లోపలికి వచ్చారు కారుడ్రైవర్ ఒక సారి లోపలికి తొంగి చూసి సలాం కొట్టి వెళ్ళిపోయాడు

'నమస్తే సర్!' అన్నాడు ఆ యువకుడు వినయంగా నిలబడి

ఎవరు అన్నట్టు తల ఎత్తి చూశారు శేషాద్రి

"ఇతడి పేరు అనిరుద్ అండీ రంగనాదం ప్లేస్‌లో వచ్చాడు పరిచయం చేశారు జగన్నాథం

"ఓహో, ఇతడేనా? నాకు పేరు గుర్తు లేదులే

"అవున్సార్! ఈరోజే జాయినింగ్ రిపోర్టు యిచ్చాడు మిమ్మల్ని కలుసుకుంటానంటే తీసుకు వచ్చాను '

"ఏమయ్యా అనిరుద్! చేసేది జూనియర్ క్లర్క్ వుద్యోగం కాబట్టి జాగ్రత్తగా చేసుకో. అనవసరమైన రాజకీయాల జోలికిపోకు. ఏం?

"అలాగే, సర్!"

–తలఎత్తి తమ ఆఫీసర్ వైపు చూసినప్పుడు ఆయన ప్రక్కన సౌందర్య కనిపించింది ఈమె నిన్న తమ మామయ్య వాళ్ల యింటి దగ్గర కనిపించింది కదూ? సాకేతకు మంచి ఫ్రెండ్..

"నన్ను గుర్తుపట్టేశారన్నమాట!"– సౌందర్య చొరవ తీసుకొని అంది

"గుర్తుపట్టాను... మీరు మా సాకేతకు ఫ్రెండ్ .'

అనిరుద్ మాటలు విని నవ్వింది సౌందర్య

"ఈయన నా ఫ్రెండ్ సాకేతకు బావ అవుతాడు డాడీ" అంటూ తండ్రికి కూడా చెప్పింది

"ఏమిటీ! ఇతడు సాకేత వాళ్ళ బంధువేనా!" – కూతురు సంతోషంలో కొంత తానూ పాలు పంచుకున్నట్టు మాట్లాడారు శేషాద్రిగారు

"బంధువేకాదు ఇంకాకావలసినవాడు అంది సౌందర్య.

"అలాగా!" ఏమిటో అర్థమైపోయినట్టు ఆశ్చర్యం ప్రకటించాడు శేషాద్రి

ఆయన బాస్ నోరు తెరిచి ఏం మాట్లాడితే ఏం తంటా వస్తుందో నన్నట్టు సన్నగా నవ్వివూరుకున్నాడు అనిరుద్.

'జాయినింగ్ రోజునే అయ్యగార్ని పట్టేశావ్ ఇక నీకు ఢోకా లేదయ్యా అనిరుద్' అన్నట్టు చూశాడు జగన్నాథం

. "నిలబడే వున్నారు కూర్చోండయ్యా" అన్నాడు శేషాద్రి.

చేతిలో వున్న ఫైళ్లను శేషాద్రిగారి ముందున్న బల్లమీదపెట్టి అయనకు ఎదురుగా కూర్చున్నాడు జగన్నాథం ఆ ప్రక్కనే అనిరుద్ కూర్చున్నాడు.

ఏదో గుర్తు వచ్చినట్టు లోపలికి వెళ్లి కొద్దిసేపటిలోనే ట్రేలో కాఫీ కప్పులతో తిరిగి వచ్చింది సౌందర్య

"ఇప్పుడెందుకు పాపా" అంటూనే కాఫీ కప్పు అందుకున్నాడు జగన్నాథం.. తప్పదన్నట్టే తీసుకున్నాడు అనిరుద్.. బయటవున్న డ్రైవర్‌ను కూడా పిలిచి కాఫీ యిచ్చింది సౌందర్య

కాఫీ సిప్ చేస్తూనే ఫైళ్ళు తిరగవేస్తూ పెట్టవలసిన కాగితాలమీద సంతకాలు పెడుతున్నారు శేషాద్రి.

* * * * *

"కొత్తగా వచ్చిన అనిరుద్ అప్పుడే మన బాస్‌కు ఫర్ అయిపోయాడు" – శేషాద్రిగారి యింటినుంచీ వచ్చాక హెడ్ క్లర్క్ జగన్నాథం ఆఫీసులో చాలా మందికి చాటింపు వేసేశాడు అప్పుడే.

అక్కణ్ణుంచీ అక్కడ ఒకటే వేధింపుకు గురయ్యాడు అనిరుద్ ఆ రోజల్లా

'శేషాద్రిగారుమీకు బంధువా? . '

"ఆయన మీకు ఎలా తెలుసు?"

–అలా ప్రశ్నల వర్షం కురిపించారు చివరికి విసిగిపోయాడు అనిరుద్.

'ఆయన మీకెంతో నాకూ అంతే ఇంతకుముందు ఆయనకు నాకు ఎలాంటి పరిచయంలేదు' అని తెగేసి చెప్పాడు

అయితే మన హెచ్ సి గారు అబద్ధం చెప్పారంటారా?.. ఇతర విషయాల్లో ఆయన నాలుక తిరగబడవచ్చుగాని ఇలాంటి విషయాల్లో మాత్రం బొంకరు మాకు ఆ నమ్మకం వుంది" అంటూ మిగతా అందరూ మొండికేశారు.

'మా మామయ్య కూతురు సాకేతకు, ఆఫీసర్‌గారి అమ్మాయి సౌందర్యకు స్నేహం అదే పరిచయం' అంటూ వున్న విషయం చెప్పేద్దామనిపించింది మొదట కానీ అంతలోనే 'సౌందర్య సాకేతల స్నేహం, తన బంధుత్వం' అన్ని విషయాలు చెప్పేస్తే కొలీగ్స్‌నుండీ ఇంకా ఏం వ్యాఖ్యానాలు వినవలసి వస్తుందో నన్న సందేహం కలిగింది

అందుకే, ' మా మామయ్యకు ఆఫీసర్‌గారు తెలుసు' అని అబద్ధమాడాడు తాత్కాలికంగా తప్పించుకోవటానికి ఈ రోజు కాకపోయినా రేపైనా తాను సాకేతకు బావననీ, సాకేతకు సౌందర్యకు స్నేహమనీ – నిజమేమిటో అందరికీ చెప్పేస్తాడు జగన్నాథం అని అనిరుద్‌కూ తెలుసు.

ఆ సమాధానానికే సంతృప్తి చెందినట్టు "అలాగా.. మొత్తానికి అదృష్టవంతులండీ మీరు' అన్నభావం ధ్వనించేలా అందరూ తలోరీతిగా అభినందించి ఎవరిసీట్లలో వాళ్ళు కూర్చున్నారు.

కొలీగ్స్ బాధ వదిలాక కొంత ప్రశాంతత అనిపించింది అనిరుద్‌కు.

ఆ రోజుకు హెడ్ క్లర్క్‌పని పురమాయించలేదు.

ఖాళీగా కూర్చున్న అనిరుద్‌కు అనేకమైన ఆలోచనలు.

సౌందర్యను గురించి తలుచుకుంటే అతడికి నవ్వువస్తోంది.

ఆమె ఎవరో తాను తెలుసుకోగలిగాడు.. కానీ తాను ఎవరో మాత్రం సౌందర్యకు తెలియదు

పూర్ గర్ల్!

తనను కేవలం సాకేతకు బావగానే గుర్తించింది.


మరి తాను? సాకేతకు స్నేహితురాలిగానేకాదు. ఓ రచయితకు చిలిపిగా కవ్వింపు ధోరణిలో వుత్తరం వ్రాసిన పాఠకురాలిగా కూడా సౌందర్యను తెలుసుకున్నాడు

'సమాజ సత్యం' తానే అని తెలిస్తే? సౌందర్య ఎలా అనుభూతి చెందుతుంది?

అసలు నమ్ముతుందా?

నిజానికి తానొక రచయిత అని బంధువర్గంలోని చాలా మందికి తెలియదు. అప్పుడప్పుడు వచ్చే వుత్తరాలు, కాంప్లిమెంటరీలు, మనియార్డర్లు – వీట్ని బట్టి మొన్నటివరకు పనిచేసి వచ్చిన ఆఫీసులో వాళ్ళు వాళ్లంతట వాళ్లే పసిగట్టారు తర్వాత తనచేత నిజం వప్పించారు

అయినా, అనవసర ప్రచారం తన తత్వానికి విరుద్ధం. రచయితనని ఫోజులు కొట్టకుండా మామూలి మనిషిగా, సామాన్యమైన వుద్యోగిగా బ్రతకటం అంటేనే తాను యిష్టపడతాడు. ఆ ఆఫీసులో పనిచేసినన్ని రోజులూ అలాగే ప్రవర్తించాడు కూడా.. ఈ రోజు కాకపోయినా రేపైనా – ఇక్కడా తెలిసిపోతుంది నిజం అలా అని ముందే స్వంత డబ్బా వాయించుకోవటం శుద్ధ తప్పు – ఇది అప్పటి అతడి అభిప్రాయం. (ఇంకా వుంది)




మంగళ సౌభాగ్య చిహ్నం
ఐటెక్స్
మాట్ ఫినిష్ తిలకం
ఐటెక్స్
48 సంవత్సరములుంగ మీ
నమ్మకానికి పాత్రమైన
ఉన్నతమైన చిహ్నం
DELUXE KUMKUM
EYETEX
SHAKE WELL
EYETEX
అరవింద్ లాబరేటరీస్ మద్రాసు 600033
Imageads 2371 TEL

కాలంతో పాటు జనం..... జనంతో పాటు వాహనాలు... వాహనాలతో పాటు, కాలుష్యం క్రమ క్రమంగా పెరిగి క్రమబద్ధం లేని ట్రాఫిక్‌తో కొన్ని వేల ప్రాణాలు ప్రమాదాల్లో అంత మవుతున్నాయి.

విజయవాడ నాలుగు సంవత్సరాల క్రితానికీ ఇప్పటికీ ట్రాఫిక్ విషయంలో అంచనాల వారీగా అభివృద్ధి చెందడం, 'అర్బన్' జిల్లాగా మారిం తరువాతే అని చెప్పవచ్చు.

ట్రాఫిక్‌సెన్స్

నాన్‌సెన్స్- న్యూసెన్స్‌తో పాటు- ట్రాఫిక్ సెన్స్ ప్రజల్లో రావడానికి విజయవాడ పోలీసులు రాత్రనక పగలనక కష్టపడ్డారు కొంత కాలం. ప్రతి సెంటర్లోనూ మైకులు ఏర్పాటు చేసి నడుస్తున్న వాహనాలని, జనాన్ని క్రమ పద్ధతిలో నడిచేట్లు చెయ్యడానికి గొంతులు పగిలేట్లు "బాబూ తెల్లగీతలమీదే రోడ్డు దాటండి. ప్లాట్‌ఫారం మీదే నడవాలి. వాహనాలు ఎడమ వైపు మాత్రమే ఆగాలి." అంటూ అరిచారు. కొంత ప్రయోజనం కనిపించినా, నడిరోడ్డు మీద సగర్వంగా నిలబడి పాత జ్ఞాపకాలు నెమరువేసుకునే ఆంబోతులను (ఊరిమీద పడ్డ ఆవులను) మాత్రం చాలా కాలం వరకూ ఏం చెయ్యలేక పోయారు. అయినా నాన్‌సెన్స్ వాటి కెందుకు ట్రాఫిక్‌సెన్స్, నోరులేని జీవాల మీదెందుకు గ్రీవెన్స్ అనుకుని ఊరుకున్నారు. వాటికి విసుగెత్తి, వాటంతటవే తప్పుకున్నాయి!

సిగ్నల్ లైట్స్

శ్రీ కె. ఎస్. వ్యాస్ పోలీస్ సూపరింటెండెంట్‌గా ఉన్నప్పుడు ముఖ్యమైన కూడలిలలో సిగ్నల్‌లైట్స్ ఏర్పాటు చేయించారు. ఆయన బదిలీ తరువాత ఎస్. పి.గా వచ్చిన డాక్టర్ డి. టి. నాయక్ ట్రాఫిక్‌ను మరింతగా క్రమబద్ధం చేసి ప్రజల మన్నన లందుకోవడానికి మరింతగా కృషి చేసి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల సహకారంతో ఒక ట్రాఫిక్ ఎడ్వైజరీ బోర్డును ఏర్పాటు చేసి అందులో విజయవాడ పురప్రముఖులను నియమించి వారి సలహాలతో చల్లపల్లి బంగళా సెంటర్లో, ఆంధ్రపత్రిక సెంటర్లో, న్యూఇండియా హోటల్ సెంటర్లో, కాళేశ్వరరావు మార్కెట్టు దగ్గరున్న గద్దబొమ్మ సెంటర్లో లక్షలకు లక్షలు వ్యయంతో సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయించారు. మరికొన్ని చోట్ల బ్లింకర్స్, మాన్యువల్ ఆపరేటెడ్ సిగ్నల్స్ కూడా ఏర్పాటు చేశారు. వాహనాలకు మాటి మాటికీ బ్రేకులైతే పడ్డాయిగానీ ప్రమాదాలను ఆపడం పోలీసుల తరమా....! ఈ సిగ్నల్ లైట్స్ విషయం మీద శ్రీ కె. ధనరాజ్, ఇండియన్ బ్యాంక్ ఇలా వ్యాఖ్యానించారు.

"సిగ్నల్స్ ఉండటం మంచిదే కానీండి మరీ వంద గజాల దూరంలో సిగ్నల్స్ ఉండటం వలన, చేతితో ఆపరేట్ చేసే సిగ్నల్‌ను ఆటోమాటిక్ సిగ్నల్‌కు అనుగుణంగా ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆపరేట్ చెయ్యక పోవడం వల్ల విపరీతమైన ఇంధన నష్టం అవుతోంది. ట్రాఫిక్ సెన్స్ ప్రజలకు మాత్రమే కాదు. ట్రాఫిక్ పోలీసులకు కూడా ఉండాలి!"

దీనికి సమాధానంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు శ్రీ శేషగిరిరావు- "సాధ్యమైనంత వరకూ ముందు మా వాళ్ళకు నియమ నిబంధనలు చెప్తుండా ఉంటము. నాలుగు రోడ్ల కూడళ్ళలో, ఆరు రోడ్ల కూడళ్ళలో కానిస్టేబుల్ ఆపరేట్ చేసే సిగ్నల్లు అక్కడి ట్రాఫిక్‌ను బట్టి ఉంటుంది. ట్రాఫిక్ సాఫీగా ఉండటానికి మేమెన్నో చర్యలు తీసుకుంటున్నాము." అన్నారు.

రోడ్ మార్కింగ్స్

బందర్ రోడ్డు, ఏలూరు రోడ్డు, రాజగోపాలాచారి వీధి. బి. ఆర్. పి. రోడ్డు, ఆంధ్రపత్రిక సెంటర్, మొదలైన ఎక్కువ ట్రాఫిక్ నడిచే రోడ్ల మీద జీబ్రా గుర్తులు, స్టాప్ గుర్తులూ వేయించారు. వాటిని పాటించడం ప్రజలవంతు మరి.

రెయిలింగ్స్

వాహనాలు రోడ్డు మీద నడవాలి, పాదచారులు పేవుమెంటు మీద నడవాలి. అలా జరగకపోతే అనేక అనర్థాలు జరిగిపోతాయి. మొన్నటి వరకూ పాదచారులు పేవుమెంటు మీద నడవటానికి కుదిరేదికాదు. కారణం పేవుమెంట్లు అతిచిన్నవి కావడం, వ్యాపారస్థులు ఆక్రమించుకోవడం. మెల్లగా ఆక్రమణలు తొలగించి, కార్పొరేషన్ వారి సహకారంతో కొన్ని పబ్లిసిటీ సంస్థల సహకారంతో రెయిలింగ్స్ వేయించారు. బందర్‌రోడ్డు ఏలూరురోడ్డు. గాంధీనగరం ముఖ్యమైన రోడ్లలో కాళేశ్వరరావు మార్కెట్టు దగ్గర ఈ రెయిలింగ్స్ వెలిశాయి. వాటిని నిర్మించడానికి అయిన ఖర్చుని రాబట్టుకోడానికి ఆయా పబ్లిసిటీ సంస్థలు రెయిలింగ్స్ మీద వ్యాపార ప్రకటనలను కూడా ప్రారంభించారు.

ప్రజలు కూడా ఈ పద్ధతిని మెచ్చుకున్నారు కానీ పేవుమెంటు మీద నడవడానికి ఇంకా అలవాటు పడలేదు.

ట్రాఫిక్ ప్రమాదాలు

1984 నుండి 1986 వరకూ విజయవాడలో ట్రాఫిక్ ప్రమాదాలు చాలావరకూ తగ్గుతూ వచ్చాయి. 1984లో ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 81 అయితే 1985లో 56, 1986లో సుమారు 53. ఎక్కువగా జరిగే ప్రమాదాలు మోపెడ్స్, స్కూటర్లవల్లనే అంటున్నారు.

హెల్మెట్లు - ఇక్కట్లు!


ఈ ప్రమాదాలను అరికట్టడానికి పోలీసులు తీవ్ర ప్రయత్నం చేస్తుంటే, ప్రభుత్వం. విధిగా శిరస్త్రాణం (హెల్‌మెట్లు) ధరించాలని అంక

నానాటికీ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య



ఏకాలం రోడ్డుల్లో అటూ ఇటూ తిరుగుతూ సతమతమవుతున్న వాహనాలు

కొన్ని రోడ్లలో భారీ వాహనాల రద్దీ



అలంకార్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు.

పోలీసు లెందుకు ధరించరు......!?

మోటార్ వెహికల్స్ యాక్టు ప్రకారం ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్‌మెట్ ధరించాలని ఉంది. బొంబాయి, హైదరాబాదు, మద్రాసు వంటి మహానగరాలలో ట్రాఫిక్ పోలీసులు, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ హెల్‌మెట్ ధరించి నడుపుతున్నారు. కానీ విజయవాడలో పోలీసులకు మాత్రం ఇది వర్తించలేదు.

"మోటారు సైకిళ్ళ మీద తిరిగే సార్జంట్లూ, సబ్ ఇన్‌స్పెక్టర్లూ జీపులతో తిరుగుతూ ప్రజలమీద పడి జరిమానాలు విధిస్తున్నారు. వారి కొక నీతి, సామాన్యుల కొకనీతా...? ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకొచ్చినా విన్నకున్నారు." అంటూ వాపోయాడు. హరిచంద్రరావు అనే 'లా' తెలిసిన మనిషి! అలో చిస్తే నిజమే అనిపిస్తుంది.

దాదాపుగా నలభై వేల వాహనాలున్న విజయవాడ పట్టణంలో టెరిఫిక్ ట్రాఫిక్ నడుస్తున్నప్పుడు విధించింది. ఇక్కడ నుండి మొదలైనాయి ప్రజల ఇక్కట్లు. బొంబాయి, మద్రాసు, హైదరాబాదు వంటి మహానగరాలలో తలచిప్పలు తగిలించుకో మనడం భావ్యంగానీ, వేదేస్తే తొమ్మిది కిలో మీటర్లున్న విజయవాడలోనూ ధరించమనడం, దీనిని ఆసరాగా తీసుకుని పోలీసులు విజృంభించడం తలనొప్పిగా తయారయిందంటున్నారు తలచిప్పల బాధితులు.



తలచిప్పలు (హెల్మెట్లు) పెట్టుకొని వారి తిప్పలు. తలా పాతిక రూపాయల జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్.

విజయవాడ ట్రాఫిక్ పోలీసులు ఎంత నిఖార్సో చెప్పడానికి నిదర్శనం, నెల రోజుల్లో హెల్మెట్లు ధరించని వారిపై కేసులురాసి జరిమానాలు విధించి అరవైవేల రూపాయలు వసూలు చెయ్యడమే!

హెల్మెట్లు బాధితుల సంఘం ఏర్పడిందికానీ, ఇంతవరకూ నివారణోపాయాన్ని సరిగ్గా ఆలోచించడంలేదు. రేపు వేసవికాలం ప్రారంభమైం తరువాత గానీ హెల్‌మెట్ల బాధ ఎలా ఉంటుందో తెలిసిరాదు.

సిటీ బస్సులు సక్రమంగా స్టాప్‌లలో ఆగుతున్నదీ లేనిదీ పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీ శేషగిరిరావు.



ఎన్నో జాగ్రత్తలు తీసుకుని నిరంతరం కృషి చేస్తున్న ట్రాఫిక్ పోలీసులను అభినందిస్తూ... కాస్త చెయివాటు తనాన్ని, దురుసుతనాన్ని తగ్గించుకోమని సలహాఇస్తూ సిటీ బస్సుల ఓవర్ లోడింగ్‌ను, అతివేగాన్ని తగ్గించి, వాహనాలు నిలుపుకోడానికి కొంచెం కొంచెం దూరంలో కాక అనువైన పార్కింగ్ ప్లేసులు మరిన్ని చూపించి, పని చేసీ, చెయ్యనట్లుండే అనవసరమైన సిగ్నల్స్ (న్యూ ఇండియా హోటల్ సెంటర్, చల్లపల్లి బంగళా సెంటర్) తొలగించి, అత్యావసర మనిపించే బెంజ సర్కిల్ (రింగు రోడ్డు)లో సిగ్నల్స్ నిర్మించి, మరింతగా ప్రజల మన్ననలు పొందాలని, ట్రాఫిక్ పోలీసులతో పాటు ఎనిమిది గంటలు రోడ్డుమీద నిలబడే హోంగార్డులకు కూడా మరింత ప్రాధాన్యతను కల్పించి వారికి ట్రాఫిక్ రెగ్యులేషన్స్ నేర్పటం జరగాలని ఆకాంక్షిద్దాము!

వ్యాసం : కృష్ణాజీ

ఫొటోలు : రమేష్



మురితలకు
మోదం,
ప్రమదలకు
ప్రమోదం
ఆప్కోవస్త్రాలు
పొందు
అందరి
ఆమోదం!


DECORATING BOOK

నాకు నీ నవ్వే కావాలి..

మంత్రవాది మహేశ్వర్

పవిత్రే కదూ–

ఆ ముందు వరుసలో, రోజ్ కలర్ శారీలో అవును

ఎంత మారి పోయింది

మళ్ళీ ముఖంలో ఆ ఆనందం అదీ కనిపిస్తుందా అని కుమిలిపోయాను అసలు బ్రతుకు మీదే విరక్తి భావం కలిగినట్లుండే పవిత్రేనా అన్న అనుమానం కలుగుతోంది

పదేళ్ళయిందేమో పవిత్రను చూసి

గతంలోకి పరుగు తీసింది మనసు

★ ★ ★ ★ ★

నేను క్రొత్తగా ఆ ఆఫీసులో చేరాను చేరిన ఓ నాలుగు మాసాలకి పరిచయమైంది పవిత్ర

పవిత్ర చాలా చక్కగా మాట్లాడుతుంది మనస్ఫూర్తిగా నవ్వుతుంది

ఆమెతో మాట్లాడుతుంటే సమయం ఎంతైందో తెలియదు

పవిత్ర అంటే ఎందుకో విపరీతమైన అభిమానం 'ఆమెను చూడకపోతే –' అన్న ఆలోచనే అతి భయంకరంగా అనిపించేది

నేను మద్రాసు నుంచి హైదరాబాదు వెళ్ళాలన్న రోజున మహా చిరాకనిపించింది ఆ వాతావరణం ఎలా వుంటుందో, మనుషులు ఎలాంటి వాళ్ళో – కానీ, పవిత్ర పరిచయం అన్నింటినీ మరపించింది పవిత్ర వాళ్ళ వాళ్ళుండేది విజయవాడలో ఉద్యోగనిమిత్తం తనొక్కర్తే చిక్కడపల్లిలో వుంటోంది

నేనుండేది ఆదర్శనగర్‌లో

ఆఫీసులో కలిసి పనిచేసే సమయం చాలదన్నట్లు సాయంకాలాలు కూడా కలిసి తిరిగే వాళ్ళం

ఒకరోజు బిర్లామందిర్

మరో రోజు ఇందిరాపార్క్

ఎప్పుడైనా ఎవరికైనా మాలో ఊరికెళ్ళాల్సి వస్తే మహానరకంగా అనిపించేది ఇద్దరికీ ప్రయాణం అయిష్టమే

కొన్ని తప్పనిసరి పరిస్థితు లేర్పడేవి అటువంటి సమయాల్లో ఒకటి రెండు రోజులు మా యిద్దరి మధ్యా మౌనం రాజ్యమేలేది

ఆ రోజు ఇంకాగుర్తుంది

బిర్లామందిర్ ప్రక్కనే చిన్న పూదోట

కర్చీఫ్ తీస్తుంటే పర్స్ క్రింద పడింది పవిత్ర తీసేసుకుంది

ఇందులో ఎంత డబ్బుందో అదంతా నాదే

ఒకే తీసేసుకో ఈ ముక్కే ముందు తెలిస్తే బ్యాంకులో వున్న అయిదొందలూ ఇందులోనే పెట్టేవాడినే

'గొప్పే ఏమిటిది' అందులో మద్రాస్ కోరమండల్‌కి బుక్ చేసిన రిజర్వేషన్ టిక్కెట్టు చూసేసింది

నేను కాస్త ఖంగు తిన్నాను

ఎల్లుండి ప్రయాణ మన్న మాట' మూతి ముడిచింది

పవిత్రా ప్లీజ్ నన్ను క్షమించవూ ఇంటికెళ్ళి సంవత్సరం దాటింది అమ్మకు కూడా ఒంట్లో బావుండలేదట

రిజర్వేషన్ చేయించుకునే ముందు చెబితే ఏం వెళ్ళద్దంటానా"

నువ్వు అంటావని కాదు పవిత్రా ఈ ఫేసు అప్పట్నుంచీ చూసే ధైర్యం లేక"

అంటే నాముందు దాపరికం అన్నమాట"

కాదు పవిత్రా– – నిన్ను బాధ పెట్టడం నాకిష్టం లేక

'మళ్ళీ వెంటనే వచ్చేస్తారు కదూ

పిచ్చి దానా నాకు మాత్రం అక్కడ తోస్తుందా'

కాసేపు పవిత్ర మౌనంగా వుండి పోయింది

ఏం మాట్లాడవు

ఏం తీసుకు రమ్మంటావు అక్కడ్నుంచి'

'మీరు తొందరగా వస్తే చాలు " – కళ్ళ నుంచి నీటిబొట్లు రాలిపడ్డాయి

ఛీ ఏమిటది ఆ కన్నీళ్ళేమిటి ఇంకా రెండు రోజులు ఇక్కడే వుంటాను"

మీరు మద్రాసు వెళ్ళాక నన్ను మర్చిపోతారు మీ మగాళ్ళంతా'

ఛ ఏమిటది పవిత్రా–

ఆ మరుసటి రోజు పవిత్ర మాట్లాడనే లేదు ఆఫీసుపని కూడా సీరియస్‌గా తలవంచుకుని చేసుకుంది నేను వుండని వారం రోజులు అడ్జస్ట్ కావడానికి అది ప్రయత్నమంది – తరువాత

ఏమిటో పవిత్రది చాలా సున్నితమైన మనసు

పవిత్రను చూడలేక పోతే వుండలేను' – అన్న భావం ఎప్పుడైతే కలిగిందో–' ఆమెను శాశ్వతంగా నా దానిగా చేసుకుంటే అన్న ఆలోచన కూడా అప్పుడే వచ్చింది

ఆ రోజున అదే మాట అనేసరికి తనేం చెప్పలేక పోయింది

మీ ఇష్టం అంది

పవిత్ర మనసు నాకు బాగా తెలుసు – అయితే ఇంట్లో వాళ్ళను ఒప్పిస్తాను ఎలాగో వెడుతున్నాను కదా–

మద్రాసు వెళ్ళడం – ఇంట్లో పరిస్థితిని వివరించడం జరిగిపోయింది.

ఇంట్లో వాళ్ళు ఒప్పుకోలేదు–

ఒప్పుకుంటారన్న నమ్మకంతో పవిత్రతో ఆ మాటన్నాను

నేను కొంచెం ఎదిరించినట్లు మాట్లాడాను

ఇంట్లో ఆ క్షణం వరకూ నేనెంత మంచి వాడినో అనుకూలంగా మాట్లాడేంత వరకే అభిమానాలు అనిపించింది

అయినప్పటికీ పవిత్ర గురించి చెప్పాను

కులం వేరన్నారు ... పెళ్ళి కెదిగిన చెల్లాయి గురించి ఆలోచించావా అనడిగారు

పవిత్ర లేకపోతే నేను బ్రతకలేను అన్నాను

పిచ్చి వేషాలు వేయద్దన్నారు

నేను మరికాస్త పట్టుదల చూపించాను

అమ్మ ఏడ్చింది భోజనం మానేసింది

ఆ రోజు తిరిగి తిరిగి నేను ఇల్లు చేరేసరికి తెలిసింది

అమ్మ కిరసనాయిలు పోసుకుని ఏదో అఘాయిత్యం చేయబోయిందని

నాన్నకి బి పి పెరిగి పోయింది పెరాలసిస్‌లో పెట్టే ప్రమాదముందని డాక్టర్ గారు చెప్పారు

నాకు దిక్కు తోచలేదు

ఇంట్లో ఎదిరించలేని పరిస్థితి

పవిత్రకు ముఖమెలా చూపించను? తను నా గురించి ఏమనుకుంటుంది ఆ విషయం తరువాత అసలు తను లేని నేను ఊహకందడం లేదు ఏ తప్పూ చేయక పోయినా మానసికంగా ఒకటయ్యాం

రాత్రంతా కుళ్ళి కుళ్ళి ఏడ్చాను

ప్రయాణం రోజు–

అమ్మ పదేపదే అదే మాట – నువ్వు తొందరపడి నిర్ణయం తీసుకుంటే చాలా దారుణమైన పరిణామాలను ఎదుర్కోవలసి వుంటుందని–'

★ ★ ★ ★ ★

రాగానే పవిత్ర ఆనందంతో పలకరించింది

మావాళ్ళ బాగోగులు అడిగింది

తను అడుగుతోందన్న మాటే గానీ నా కళ్ళ నుంచి బొట బొటా నీళ్ళు

చి చి ఏమిటిది శ్రావణ్ మగ పిల్లలెక్కడన్నా ఏడుస్తారా'

నాకు మాట రావటం లేదు–

తనే అర్థం చేసుకుంది కొంత వరకూ – ఆ తరువాత నేను చెప్పాను

నా ముందు తను తట్టుకున్నట్టు నటించిందని తెలుసు నా కోసమే ఆ నిగ్రహం ప్రదర్శిస్తోందనీ తెలుసు

కానీ –

ఇంటి దగ్గర ఎంత విలవిలలాడిందో మర్నాడు ఉదయం ఆఫీసుకు రాగానే చూసిన నిద్ర కరువైన ముఖం, ఎర్రబడ్డ కళ్ళు చాలు తెలిసి పోయింది

మాట్లాడటం కూడా తగ్గించేసింది

ఓ పది రోజులు–

నాకు రోజులు మహాభయంకరంగా గడుస్తున్నట్లు అనిపిస్తోంది

ఆ తరువాత మళ్ళీ మామూలుగానే మాట్లాడేది-

ఎప్పుడైనా, ఎవరైనా పెళ్ళి విషయంగానీ ఎత్తితే పవిత్రలో ఏదో మార్పు

పవిత్రకు వాళ్ళ వాళ్ళు ఏవో సంబంధాలు చూశారు కానీ - అన్నింటికీ తను అయిష్టతను వ్యక్తం చేసింది

పవిత్రా- నచ్చితే చేసుకోవచ్చుగా' అని చెప్పే ధైర్యం లేదు నాకు

కానీ -

నేను సాహసించి పవిత్రను చేసుకున్నా తనని సుఖపెట్టలేను అమ్మా నాన్నలను దూరం చేసుకో-లేను నా తో బుట్టువులను బాధ పెట్టలేను మన



నా కొక్కటే కోరిక

పవిత్ర నవ్వుతూ కనిపించాలి

నిజమే - పవిత్ర వచ్చిన సంబంధాలన్నింటినీ తిరగ్గొడితే రేపు పెళ్ళి కావడం కష్టమే

సమాజంలో ఆడపిల్లలకి ఆ సమస్య ఎప్పుడూ వుంది అదీగాక వేలెత్తి చూపించేది స్త్రీనే

ఈ మూర్ఖ సమాజం మారదు కథలల్లుతుంది అందుకే పవిత్ర జీవితంలో స్థిరపడాలి

అటువంటి సమయాల్లో ఇండైరెక్ట్‌గా నన్ను చాలా మాటలంది 'మగాళ్ళంతా మోసగాళ్ళని'- 'మాటలతో గొంతులు కోస్తారని', 'ఆడవాళ్ళ మనసును అర్థం చేసుకోలేరని'

కానీ -

అన్నింటికీ మౌనంగా వుండి పోయాను

నచ్చిన పవిత్రను మర్చి పోలేను ఏ విషయం ఆలోచించినా మనసు పిండేస్తున్నట్లే వుంది

నేను ఈ హైదరాబాదులో వున్నంత కాలం పరిస్థితుల్లో మార్పు రాదు పవిత్ర పెళ్ళి చేసుకోదు నాతో మొదట్లో బాగా మాట్లాడనూ లేదు

కలసిన హృదయాల మధ్య 'మౌనం' ఎంత భయంకరంగా వుంటుందో అనుభవించాను





సమృద్ధ పరిమళము
సరియైన ధరతో

ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.

"గులాబి మరియు ఆకుపచ్చ రంగులలో లభించును"

జయలక్ష్మి
గుంటూరు వారి
తయారీ

Imageads-2106 Tel

నాకు నీ నవ్వే కావాలి

మొట్ట మొదటి సారిగా "ప్రేమించిన వ్యక్తిని పెళ్ళాడటం స్త్రీ పురుషులలో ఎవరికి సాధ్యం కాదు" అన్న ఓ మహానుభావుడి మాటలు గుర్తొచ్చాయి.

అందుకే–

కష్టమైనా, గుండెకోతైనా చెప్పాపెట్టకుండా బెంగళూరులో ఖాళీ వుందని తెలిసి ట్రాన్స్‌ఫర్‌కి అప్లై చేశాను

నెల రోజుల్లో ఆర్డర్స్ వచ్చాయి

విడిపోయిన రోజున ఇద్దరం వెక్కి వెక్కి ఏడ్చాం

'ఒకటే కండిషను' అంది

"ఏమిటి' అడిగాను

"నువ్వు నాకు ఉత్తరాలు వ్రాయద్దు. అసలు నీ గురించే నాకు తెలియకూడదు నువ్వు పెళ్ళి చేసుకున్నా దయచేసి నాకు శుభలేఖ కూడా పంపద్దు . నీ ప్రక్కన మరో స్త్రీని ఊహించలేని పిచ్చి మనసు నాది కనీసం ఇదైనా చేయగలవను కుంటాను

"కనీసం ఇదైనా చెయ్యగల వనుకుంటాను" – మరో సారి మనసులో అనుకున్నాను.

ప్రారంభించటం డిలే అయింది.

స్పీకర్ లోంచి బాలమురళి గారి తత్వాలు వినిపిస్తున్నాయి సన్నగా.

పవిత్ర నన్ను చూసింది –

నేను నాలు గడుగులు వేసేశాను ఆమె వైపు అప్రయత్నంగా.

'బావున్నావా' పొడిగా అడిగింది.

"నువ్వు బావున్నావా"

'ఆఁ కులాసాయే'

"చాలా మారిపోయావు"

"నువ్వు మాత్రం అలాగే వున్నావు. ఏమిటా గడ్డం అదీను ... మొక్కా" నవ్వింది. ఆ నవ్వులో మళ్ళీ అవే సరిగమలు

"నువ్వు ఇక్కడుంటున్నట్టు సీతారామ్ గారు చెప్పారు'.

"సీతారామ్ గారు ఇంకా ఏం చెప్పారు"

'ఎక్కడా మాట్లాడటానికి ఖాళీ – ఒక్కటే ఇక్కడే వుంటే ఇలా వచ్చాం ఎలాగైనా మరో మాసంలో ఇక్కడికే కదా ట్రాన్స్‌ఫర్ మీద రావల్సింది".. అంది

కాసేపటికి–

"ఇంతకీ మీ ఆవిడను చూపించలేదు ... పిల్లలెందరు"

'ఇంకాలేదు.. మొన్ననే పుట్టింటికెడితా"

కల్చరల్ ప్రోగ్రాం అవుతుండగానే లేచి నిలబడింది వాచీ చూసుకుని– 'సరే వస్తామింక. చివరిదాకా వుండే టైమ్ లేదు" అంది పవిత్ర – నలుగురితో బాటు నా తోనూ

నవ్వుతూ నడిచింది–

ఆమెతో బాటు అతనూ

పవిత్రను అలా చూడగలుగుతానని ఊహించ లేదు ఆమె పెదవులపై మెరిసే ఆ నవ్వు చాలు ఇంక తృప్తిగా కన్ను మూసేసినా ఫరవాలేదు నేను–

పెళ్ళి కాలేదనే నిజం చెబితే ఎక్కడ గతంలోకి వెడుతుందో, బాధ పడుతుందో అని చిన్న అబద్ధం.

'నా ప్రక్కన మరో స్త్రీని ఊహించలేను' – తనో





పవిత్రను మానసికంగా అపవిత్రం చేసినందుకే నేమో ఆమెకు కక్ష.

అనుక్షణం కుమిలి కుమిలి ఏడ్చాను.

నాలాంటి పిరికి వాళ్ళకు ప్రేమ పనికి రాదని పించింది.

రైల్వే స్టేషనుకు కూడా పవిత్ర రాలేదు.

* * * * *

అయిదారేళ్ళు గడిచి పోయాయి

నాకు ఓ రెండు చోట్లకు ట్రాన్స్‌ఫర్లయ్యాయి. ఒక ప్రమోషన్ కూడా వచ్చింది. పవిత్రకు ఆ విషయం తెలియజేద్దామనుకుని కాగితం తీసి, వ్రాసి పోస్ట్ చేయకుండా నా డైరీలో వుంచేసుకున్నాను. డైరీలో పవిత్ర ప్రక్కన అలాంటి ఉత్తరాలెన్నో.. ..

ఒక రోజున ఆఫీసులో ఎవరిద్వారానో తెలిసింది – పవిత్రకు బ్రాంచ్ మేనేజర్ నరసింహారావుతో పెళ్ళయిందని ఆమె త్వరలో భర్తతో కలకత్తా రాబోతోందని.

* * * * *

చీఫ్ గెస్ట్ ఇంకా రాలేదని ప్రోగ్రామ్ హడావిడి. ఎక్కడా రెండు నిముషాలు నిలబడనివ్వటం లేదాయన ఓ అన్నట్టు పరిచయం చేయలేదు కదూ..... ' అంటూ వెనకాల ఎవరితోనో మాట్లాడుతున్న వాళ్ళాయన్ని పరిచయం చేసింది

'ఒక్కరే పాప..... వాళ్ళ నాయనమ్మ దగ్గరొదిలే సొచ్చాను" అంది నవ్వుతూ.

ఆ నవ్వే నేను కోరుకున్నది నా జీవితం గురించి నేనేం బాధపడలేదు. నా కారణంగా తను నష్టపోకూడదు. నేను చేసిన నిలబెట్టుకోలేని ప్రమాణం మూలంగా తన జీవితం మోడు కాకూడదని ఆశించాను .

'అవును వుంటున్నది ఆఫీసుకు దగ్గరేనా'

"దగ్గరే"

'ఏమిటి ఇంటికి పిలిచి భోజనాల ఏర్పాట్లు ఏం లేవా"

"రావచ్చు ... వస్తే నా చేతి వంట తినాల్సి వస్తుంది మరి. . ఆవిడ పుట్టింటి కెళ్ళింది".

"వద్దులే శ్రావణ్ మళ్ళీ నైట్ ట్రైన్ కే బయలుదేరి పోతున్నాం నిన్న బావగారమ్మాయి మారేజ్ ఒకటి సారి అన్న మాట గుర్తొచ్చింది.

–ఆ పరిస్థితుల్లో ఆమె ఒంటరిది ఇప్పుడు తనకి ఒక సర్కిల్ ఏర్పడింది నాగురించి ఆలోచించే తీరిక కూడా లేక పోయి వుండచ్చు

గతం మధురమైనదైతే త్రవ్వినా ఫరవాలేదు. చేదైతే గుర్తుకు రాకపోవడమే మంచిది చేదు అనుభవాలను మరచి పోవడానికే ఆ దేవుడు మరపు అనేది ఇచ్చారు. కానీ కొందరు నాలాంటి దురదృష్ట వంతులకి అది కూడా వుండదు

* * * * *

ఆ రోజే మా డైరక్టర్ గారిని కలిశాను.

నేనంటే ఆయనకెంతో గౌరవం. . నా సిన్సియారిటీ ఆయనకు బాగా తెలుసు

నన్ను వైజాగ్‌లో ప్రారంభించే క్రొత్త బ్రాంచ్‌లో వేయమని రిప్రజెంటేషన్ ఇచ్చాను. రికమండ్ చేయమన్నాను.

పవిత్ర మరో వారంలో వస్తుందన. - వైజాగ్ లో రిపోర్ట్ చేయమని టైపయిన ఆర్డర్స్ నా చేతికందాయి □

సీరియల్

ఆరోహణ

శైలకుమార్



(గతసంచిక తరువాయి)

సాయంత్రంవరకూ దాదాపు పదిమంది అమ్మాయిల్ని చూశారు. ఎవ్వరూ పాత్రకు సరిపోయేలా లేరు మరుసటి రోజు చూద్దామని లేచారు అందరూ.

"మరీ ఇంత సిగ్గులేకుండా ప్రవర్తిస్తున్నారేమిటి రవీ ఈ అమ్మాయిలు" అడిగాడు చక్రవర్తి కారు కదిలిం తరువాత.

"హీరోయిన్ వేషం కదా ఏదో ఒక విధంగా అందరూ అమాంతం కీర్తన స్థాయికి ఎదిగిపోవాలనుకొంటారు' నవ్వుతూ చెప్పాడు రవి

"వేషం ఖాయం అని చెప్పాలేగాని పదిమందిలోనూ పబ్లిక్‌గా బట్టలన్నీ విప్పేయగలరు' వ్యంగ్యంగా అన్నాడు మళ్ళీ రవి.

"నన్ను హోటల్‌లో దింపెయ్యి రవీ"

ఏం వర్కుందా

'డైలాగులు మళ్ళీ చూద్దామని"

హోటలు రూముకు వచ్చి తీరిగ్గా స్నానంచేసి భోజనం తెప్పించుకున్నాడు చక్రవర్తి సిగరెట్ వెలిగించి ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"సార్ మీకోసం ఎవరో అమ్మాయి వచ్చింది' చెప్పాడు కిరీటి

'ఎవరా' అనుకున్నాడు చక్రవర్తి. మానస ఏమో అనుకున్నాడు.

'రమ్మను'

వయ్యారంగా నమస్కరిస్తూ లోపలికి వచ్చింది ఓ అమ్మాయి ఆమెను ఎక్కడా చూడలేదు చక్రవర్తి. బొడ్డుకు బాగా క్రిందికి కట్టిన చీర, సగం వక్షోజాలు కనిపించే జాకెట్టు ముఖానికి పూసుకున్న రోజ్ కలర్ పౌడరు, లిప్‌స్టిక్స్ పూసిన పెదాలు గుప్పున కొడుతున్న ఇంటిమేట్ పరిమళం. అందంకన్నా సెక్సీగా వుంది

నా పేరు పవిత్ర"

"చెప్పండి" అడిగాడు ఆమెను పరిశీలిస్తూ

'మాది రాజమండ్రి చిన్నప్పటినుంచి సినిమాల్లో నటించాలని కోరిక ఈ మధ్యే మద్రాసు వచ్చాను' తాను చెప్పబోయే దానికి ఉపోద్ఘాతంలా అంది పవిత్ర

ఊఁ అన్నాడు

'మీరెలాగైనా నాకు వేషం ఇప్పించాలి'

నేనేమీ సినిమా తియ్యటంలేదే

భలే జోక్ చేస్తారే కిలకిలా నవ్వుతూ అంది. ఆమె ఎందుకు నవ్విందో అర్థంకాలేదు చక్రవర్తికి

"పార్థసారథిగారికి చెప్పండి గోముగా అంది

"ఆర్టిస్టు సెలెక్షన్ అంతా వాళ్ళే చూసుకుంటున్నారు మీరు చెబితే తప్పకుండా నన్ను తీసుకుంటారు" ఓరగా చూస్తూ అంది

ఎందుకలా అనుకుంటున్నారు"

"మీ కోసం కీర్తననే కాదనుకున్నారు అలాంటివారు మీ మాట వినరా"

చాలా విషయాలు తెలుసుకుంది ఈ అమ్మాయి అనుకున్నాడు చక్రవర్తి.

"మిమ్మల్ని రెకమెండ్ చేస్తే నాకేమిటి లాభం" చూద్దాం ఏమంటుందో అని అడిగాడు చక్రవర్తి

క్రింది పెదవిని పైపంటితో నొక్కి ఓరగా చూస్తూ అడిగింది

'ఏం కావాలి మీకు" మత్తుగా కవ్వించేలా

"నువ్వే" అన్నాడు సూటిగా

లేచింది పవిత్ర కావాలనే పైటజార్చి చక్రవర్తి ప్రక్కన వచ్చి కూర్చుంది అతన్ని రాసుకుంటూ

'మరివేషం" గోముగా అడిగింది అతనిమీద చేయి వేస్తూ

"ఏదీ ఈ ఒక్క రాత్రి కోసమా" మరింత కవ్విస్తూ అడిగాడు లోలోపల కలుగుతున్న అసహ్యం అదిమిపట్టి

"అబ్బ షూటింగ్ జరిగినన్నాళ్ళూ మీతో పాటే ఉంటానుగదా మీరెప్పుడు కావాలనుకుంటే అప్పుడు" అతనిమీద వాలుతూ అంది

"గెటౌట్"

రూము దద్దరిల్లింది చక్రవర్తి అరుపుకు వింతగా అతని వైపు చూసి చరచరా వెళ్ళిపోయింది పవిత్ర

"మీరు మరీ ముక్కుసూటిగా పోతారు సార్ అదే మరొకరైతే ఆమెకు వేషం ఇచ్చినా, ఇవ్వకపోయినా ఉదయం వరకు పంపేవాళ్ళు కాదు' నవ్వుతూ అన్నాడు కిరీటి

'ఇలాంటివి నాకిష్టం ఉండవు కిరీటీ'

అప్పుడే చక్రవర్తికి ఆలోచన వచ్చింది మానస గురించి పార్థసారథికి చెప్పాలని వెంటనే మానస దగ్గరికి వెళ్ళాలనిపించింది బలవంతంగా ఆపుకున్నాడు కోరికను

మరుసటి రోజు మానస గురించి చెప్పాడు చక్రవర్తి వెంటనే తీసుకురమ్మని ప్రొడక్షన్ మేనేజర్‌ను పంపాడు పార్థసారథి

'సినిమా నీళ్ళు బాగా వంటపడుతున్నాయి చక్రవర్తీ

అదేమిటి సార్

అప్పుడే ఓ అమ్మాయిని రెకమెండ్ చేస్తున్నావు అంటే" ఆగి నవ్వాడు పార్థసారథి

"మొన్న షూటింగ్‌లో చూసాను బావుందనిపించి' నసిగాడు చక్రవర్తి

సరిగ్గా మానస వచ్చే సమయానికి లేచి వరండాలోకి వచ్చాడు చక్రవర్తి. మానస వచ్చినప్పుడు తను వుండటం మంచిదికాదనుకున్నాడు వరండాలోనే ఎదురుపడి నవ్వింది పలకరింపుగా మానస

అన్ని రకాలుగాను మానసను పరీక్షించి ఆకారం సరిపోతుందన్నారు అందరూ.

ఒక డైలాగ్ ఇచ్చి చెప్పమన్నాడు త్రిమూర్తి

"ఎలా చెప్పమంటారు అడిగింది మానస

జరిగిన కథ–15 : నీలిమ ఎడబాటు తర్వాత నిరాశతో మద్రాసు చేరిన చక్రవర్తి అక్కడ సినీరంగంలో కూడ కొంత కాలం పాటు నిరాశనూ మోసాన్నీ, అవమానాన్నీ ఎదుర్కొంటాడు రవి సాయంతో, పార్థసారథి తోడ్పాటుతో చక్రవర్తి సినిమా రచయిత అవుతాడు కొత్త రచయిత ఉంటే తాను నటించనని అన్న కీర్తనను వదులుకోడానికే సిద్ధ పడతాడు నిర్మాత పార్థసారథి చక్రవర్తికి మానస దగ్గర ఓదార్పు దొరుకుతుంది. కొత్త హీరోయిన్ కోసం వేట మొదలవుతుంది

"ఎలా చెప్పగలరు" అడిగాడు పార్థసారథి.

"ఒక డైలాగును చాలా రకాలుగా చెప్పచ్చు" అంది.

ఆమె సమాధానం నచ్చింది పార్థసారథికి.

"అన్ని రకాలుగాను చెప్పండి" అన్నాడు.

నటించి చూపిస్తూ దాదాపు అయిదు రకాలుగా చెప్పింది ఆ డైలాగును మానస. ఆమె నటన, డైలాగు చెప్పే పద్ధతి నచ్చింది అందరికీ.

"ఎన్ని సినిమాల్లో నటించావు ఇంతవరకూ" అడిగాడు త్రిమూర్తి.

"నలభై యాభై వుండొచ్చు"

"కరెక్టుగా చెప్పలేవా" పార్థసారథి అడిగాడు.

"చెప్పలేనండీ. ఎందుకంటే చెప్పుకోదగ్గ పాత్ర ఎందులోనూ లేదు".

"చిన్నచిన్న వేషాలు వేసే నువ్వు ఇంత హెవీ క్యారక్టర్ చెయ్యగలవా?"

"దేరీజ్ ఎ బిగినింగ్ ఫార్ ఎవ్విరిథింగ్ అన్నారు సార్. చెయ్యగలననే నమ్మకం నాకుంది. కాని మీకు కలగాలికదా" అంది నవ్వుతూ.

"ఏం చదువుకున్నావు!"

"చాలా తక్కువ" చెప్పటం ఇష్టంలేక అంది.

ఆమె పట్ల కుతూహలం కలిగింది పార్థసారథికి. ఇంకా వివరాలు అడగాలనుకున్నాడు కాని సభ్యతకాదని అడగలేక పోయాడు.

"ఈ వేషం నీ కివ్వకపోతే ఏమనుకుంటావు?"

"ఇస్తే ఆనందిస్తానేమోకాని. ఇవ్వకపోతే ఏమీ అనుకోను."

"ఎందుకని!"

"ఎందరో ఈవిధంగా ఆశపెట్టారు. ఎదురుచూసీ చూసీ అలవాటైంది".

"చక్రవర్తి నీ కెలా తెలుసు" అడిగాడు పార్థసారథి.

తనగురించి చక్రవర్తి చెప్పివుంటాడన్న విషయాన్ని ఆ ప్రశ్నతో గ్రహించింది మానస.

"ఆయన కవి. నేను అభిమాని" అంది.

నవ్వాడు పార్థసారథి. కబురుపెడతామని చెప్పిపంపేశారు మానసని. ఆమె తరువాత మళ్లీ ఓ పదిమంది అమ్మాయిలను చూశారు. అందరికన్నా మానసే నచ్చింది వాళ్ళకు. ఆమెనే తీసుకోవాలని నిర్ణయించారు.

ఆ సాయంత్రమే మానసను పిలిచి అగ్రిమెంటు వ్రాసుకుని అడ్వాన్సు ఇచ్చాడు పార్థసారథి. వెంటనే షూటింగ్ ప్రారంభించాలని నిర్ణయించారు.

"కవీ" అంటూ సుడిగాలిలా గదిలోకి దూసుకు వచ్చింది మానస. కిరీటి చూస్తున్నాడన్న విషయాన్నికూడా గమనించకుండా అతన్ని పెనవేసుకుని ముఖం నిండా ముద్దులు కురిపించసాగింది. నవ్వుకుంటూ బయటికి



గడుసులోకం —బాపు



ఆరోహణ

వెళ్ళిపోయాడు కిరీటి

'ఏమిటి మానసా నవ్వుతూ అడిగాడు చక్రవర్తి

నీ చేతుల్లో ఆకృతి దాల్చుకోవాలనేమో ఇన్నాళ్ళూ ఇలా వుండిపోయాను' ఆమె హృదయంలోంచి వచ్చాయి ఆ మాటలు

' నేనేం చేశాను'

"నాకు తెలుసు కవీ నీ అక్షరాలకు నేనే ఆకారాన్ని'

నేను చేసిందేముంది మానసా ఆలస్యమైనా ప్రతిభ తప్పకుండా గుర్తింపబడుతుంది" ఆమె మాటలు ఆమెకు అప్పజెప్పాడు

"ఆఁ!" చిలిపిగా అంటూ అతన్ని పెనవేసుకుంది ఆర్తిగా, అనురాగంగా

ఆ రాత్రి బయటే పడుకోవాల్సి వచ్చింది కిరీటికి

మళ్ళీ షూటింగు ప్రారంభమైంది మొదటి రోజే మానస బాగా నటిస్తోందన్న ,అభిప్రాయం అందరిలోనూ కలిగింది

నిర్విరామంగా ఏ అడ్డంకులూ లేకుండా సాగిపోతోంది షూటింగ్ మిగిలిపోయిన పాటలను కూడా రికార్డు చేశారు సినిమా చాలా భాగం అయిపోవటంతో డబ్బింగ్ థియేటరు, రీరికార్డింగ్ థియేటరు బుక్ చేసుకున్నారు

షూటింగ్ పూర్తయిన భాగాల రషెస్ చూసుకుని మానస నటన పట్ల పూర్తి సంతృప్తి చెందారు అందరూ పార్థసారథి పరిచయం చేస్తూ వుండటంవల్ల, వారికోసం కీర్తనను తీసివేయటం వల్ల పత్రికలు చక్రవర్తికీ, మానసకూ విపరీతమయిన పబ్లిసిటీ ఇచ్చాయి

చక్రవర్తికి హెచ్చించి పబ్లిసిటీ రావటంవల్ల రాంబాబు తాను తీయబోతున్న మరో చిత్రానికి పిలిచి పాటలు రాయించుకున్నాడు. రాంబాబు చేసిన అవమానం, పెట్టిన బాధ గుర్తున్నా అనవసరంగా విరోధం ఎందుకని అతని చిత్రానికి రాశాడు చక్రవర్తి

"మంచుతెరలు చిత్రం దాదాపు పూర్తికావచ్చింది

* * * * * * *

లైబ్రరీలో కూర్చుని టేప్‌రికార్డర్‌లో వస్తున్న చక్రవర్తి పాటను వింటోంది నీలిమ కొద్ది రోజుల క్రితమే 'మంచు తెరలు' పాటల రికార్డ్సు విడుదల అయ్యాయి ఆమే స్వయంగా వెళ్ళి పాటలు రికార్డ్ చేయించుకు వచ్చింది ఆ పాటల్ని వింటూ ఒంటరితనాన్ని మరచిపోవటానికి ప్రయత్నం చేస్తోంది నీలిమ

ఎన్నో స్మృతులు, ఎన్నో జ్ఞాపకాలను కదిలిస్తున్నాయి ఆ పాటలు

చక్రవర్తి తిరుపతి వదలి వెళ్ళిపోయాడన్న సంగతి చాలాకాలం వరకు నీలిమకు తెలీదు పుస్తకాల షాపులకు వెళ్ళినపుడల్లా ఎంతో ఎదురు చూసేది ఎక్కడయినా కనిపిస్తాడేమోనని ఎన్నో సాయంత్రాలు వరండాలో కుర్చీ వేసుకుని ఎదురుచూస్తూ కూర్చునేది ఆ దారి వెంట చక్రవర్తి కపిలతీర్థానికి వెళతాడేమోనని

ఎన్నో రోజులు ఎదురు చూసి చూసి మనసు ఆపుకోలేక ఒక రోజు చక్రవర్తి ఆఫీసుకు ఫోన్ చేసింది నీలిమ అప్పుడు తెలిసింది ఆమెకు చక్రవర్తి చాలా రోజుల క్రితమే రాజీనామా చేసి వెళ్ళిపోయాడని ఆమె ఊహించని పరిణామం అది ఆ రాత్రంతా నిద్రపట్టలేదు నీలిమకు వెక్కి వెక్కి ఏడ్చింది చక్రవర్తి ఎక్కడికి వెళ్ళిందీ చెప్పలేదు ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి

ఎక్కడికి వెళ్ళి ఉంటాడో, ఏం చేస్తుంటాడో అన్న ఆమె ప్రశ్నలకు ఒక రోజు అనుకోకుండా సమాధానం దొరికింది ఒక పుస్తకాల షాపులో అడవిబాపిరాజు నవల 'హిమబిందు' కొన్నది నీలిమ ఒక సినిమా కాగితంలో ఆ పుస్తకాన్ని ప్యాక్‌చేసి ఇచ్చాడు షాపతను

ఇంటికి వచ్చి ప్యాకెట్ విప్పబోతూ యధాలాపంగా మీద వున్న కాగితంకేసి చూసింది నీలిమ చక్రవర్తి ఫోటో కనిపించింది ఆ కాగితంమీద ఆశ్చర్యంగాను, ఆనందంగాను ఆ కాగితం జాగ్రత్తగా విప్పి చదివింది 'మంచుతెరలు' సినిమా రికార్డింగ్ వివరాలు వున్నాయి అందులో అప్పుడు తెలిసింది ఆమెకు చక్రవర్తి మద్రాసు వెళ్ళినట్లు సినిమారంగంలో వున్నట్లు

అప్పటినుంచి సినిమా పత్రికలను కొనటం అలవాటు చేసుకుంది నీలిమ. చక్రవర్తి వార్తలకోసం విపులంగా చదివేది ఆ పత్రికలు

క్యాసెట్ ఆగిపోవటంతో నీలిమ ఆలోచనలు చెదిరిపోయాయి. ఆర్ద్రమైన కన్నులను తుడుచుకుంది నీలిమ తల పైకెత్తింది ఎదురుగా 'చీకటి గదులు' పుస్తకం. చక్రవర్తి జ్ఞాపకంగామిగిలిపోయి వుంది అది ఆ గదిలో. చేతిలోకి తీసుకుంది ఆ పుస్తకాన్ని. ఆమె ఒంటరితనం మరింత ఎక్కువయింది. మనసు కోసేస్తున్న బాధ పుస్తకాల మధ్య పుస్తకంగా మిగిలిపోయింది నీలిమ

మనిషికూడ ఒక పుస్తకమే చదవగలిగితే ఎన్ని అనుభవాలు, ఎన్ని అనుభూతులు, ఎన్ని కలలు, ఎన్ని కన్నీళ్ళు మూసేసిన పుస్తకాలు కొందరు అందం కోసం అమర్చుకున్న పుస్తకాలు కొందరు. ఎవరు చదువుతారు హృదయాలను, ఎవరు వింటారు మనసు మౌనంగా పలికే రాగాలను

నిట్టూర్చింది నీలిమ చాలా భయంకరమయినది మరొకరితో పంచుకోలేని బాధ కదిలింది మెల్లగా ఆ గది నుంచి (ఇంకా ఉంది)


శ్రీరస్తు - శ్రీ త్రిపురసుందరీ వరశివాభ్యాంనమః

ఆంధ్రపత్రిక

పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణతో
త్వరలో వెలువడుతుంది

శ్రీప్రభవనామ సంవత్సర పూర్ణశాస్త్రీయ పంచాంగము

పూర్తి ఆఫ్‌సెట్ ముద్రణతో
త్వరలో వెలువడుతుంది







'దైవజ్ఞచిన్తామణి' శ్రీ పిడపర్తి చినకృష్ణమూర్తిశాస్త్రి,

'భాషాప్రవీణ' శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి సిద్ధాన్తి సోదరులచే గుణించబడినది.

ఆంధ్రపత్రికా కార్యాలయము

ప్రతి 1-కి రూ. 5-00

గాంధీనగరం - విజయవాడ - 3. — బషీర్‌బాగ్ - హైదరాబాద్ - 29.

కోరిక తీరినవేళ

మందరపు ఉమాలక్ష్మి

అప్పటికే రాత్రి పది గంటలవడంతో, మధు గాబరాగా ఇంటికి వచ్చాడు వీధి తలుపు గడియ పెట్టి ఉండడంతో కాలింగ్ బెల్ మ్రోగించాడు

అంతవరకు భర్త రాక కోసం, ఎదురు చూసిన రజని, అప్పుడే ఒక కునుకు తీసింది

మధు మరి రెండు సార్లు, బజర్ మ్రోగించే సరికి, ఉలిక్కిపడి లేచి, తలుపు తీసింది

'ఇంట్లో అందరూ మొద్దు నిద్రపోయారా! అవతల గంట నుండి బజర్ మ్రోగిస్తుంటే వినబడలేదా!" అన్నాడు షర్టు విప్పి స్టేండు కొక్కానికి తగిలిస్తూ!

'ఇప్పుడే నిద్ర పట్టేసింది ముందు మీరు కాళ్ళు కడుక్కొని రండి భోజనం వడ్డిస్తాను" అంది శాంతంగా.

"అమ్మేది, స్వప్నేది? ఇద్దరూ ఎక్కడికి వెళ్ళారు?"

'ఆవిడ చెడ్డదే కాకుండా, స్వప్నని కూడా చెడగొడుతుంది ఈ వయసులో కృష్ణా రామా అంటూ, ఒక దగ్గర పడుండకుండా, ఆ తిరుగుళ్ళేమిటి?' విసుగ్గా అంది రజని

"ఎక్కడికి వెళ్ళిందో చెప్పకుండా అలా చిరాకు పడతావేం?"

"శంకరమఠంలో ఎవరిదో వీణ కచేరీ ఉందట! సాయంత్రం ఆరు గంటలకి వెళ్ళిపోయారు -ఇంతవరకు అయిపులేరు ఇద్దరూ!

"అమ్మ మళ్ళీ కచేరీకి ఎళ్ళిందా! అసలే ఆవిడ ఆరోగ్యం బాగుండదు ఇప్పుడా కచేరీకి ఎందుకు వెళ్ళనిచ్చావు?"

మీరన్న మాట మరీ బాగుంది నేను వెళ్ళమంటే వెళుతుందా! వద్దంటే మానేస్తుందా! మూతి మూడు వంకర్లు తిప్పుతూ అంది రజని

అప్పుడే గుమ్మంలోకి అడుగు పెడుతున్న సావిత్రమ్మ వాళ్ళ మాటలు విని, దీర్ఘంగా నిటూర్చి, లోపలకి నడవబోయింది

'అమ్మా! ఆకలేస్తుందే! అన్నం పెట్టు' అంది తల్లి కొంగు పట్టుకు లాగుతూ స్వప్న.

"అమ్మా! మళ్ళీ నువ్వు కచేరీకి వెళ్ళావా? నీకెన్ని సార్లు చెప్పాలి. అసలే అనారోగ్యం మనిషివి ఇప్పుడా సంగీతం వినకపోతే వచ్చిన నష్టమేమిటి? నువ్వి లాగే సంగీత కచేరీలకి, గుళ్ళకి గోపురాలకి తిరుగుతుండు నేను నీ ఆరోగ్యం కోసం డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తాను మందలించినట్లు అన్నాడు మధు

"అదికాదురా! ఈ వేళ శంకర మఠంలో ఎంత మంచి కచేరీ జరిగిందనుకున్నావు అతని వీణా వాదనలో సర్వం మరచిపోయానంటే నమ్ము ఈ జన్మకి సంగీతం నేర్చుకునే అదృష్టం ఎలాగూ లేదు కనీసం మంచి సంగీతాన్ని వినే యోగమైనా నాకు లేదా! అంది బాధగా

ఎంత సేపూ నీకు సంగీతం పిచ్చే గానీ, మనుష్యుల కష్టసుఖాలు అర్థం చేసుకోవేం? ఇప్పుడా సంగీతం సంగతెందుకు గాని, ముందు కాస్త అన్నం తిను ' అన్నాడు

నాకు ఆకలిగా లేదురా!" అని తన మంచం వైపు నడిచింది

ఇక ఆమెతో వాదన పెంచుకుంటే, తల్లి మనసు గాయపడుతుందన్ని, అక్కడితో సంభాషణ ఆపి, లోపలకి నడిచాడు మధు

సావిత్రమ్మ నెమ్మదిగా మంచం మీద మేను వాల్చింది ఆమె మనసు నిండా అంతులేని ఆవేదన రజని అన్న మాటలకు ఆమె హృదయం, తూట్లు తూట్లు పడింది. రజని ఎంత మాట అంది? తను స్వప్నని చెడగొడుతుందా! సంగీత కచేరీకి వెళ్ళినంత మాత్రాన తను బలాదూర్ లాగ తిరుగుతుందా! కనీసం తన కన్నా పెద్దదాన్నన్న గౌరవమైనా లేకుండా ఎలా మాట్లాడుతుంది?

రజని మాటలకి తాళం వేస్తూ, తాటికాయ లాగ బుర్ర ఊపుతున్నాడు మధు ఎంత సేపూ తన ఆరోగ్యం బాగులేదని అంటాడే గాని, ఏ నాడైనా తన మనసు పొరల్లోకి తొంగి చూశాడా! తను దేని కోసం తపించిపోతుందో ఒక్క నాడైనా తెలుసుకున్నాడా!

హుం వాడెందుకు తెలుసుకుంటాడు? లోకం ఏమంటుందో నన్న భయంతో, తనని ఇంటికి కాపలాగ పడి ఉండమంటున్నాడు ఏం? భార్యా భర్తలిద్దరూ, వారానికి ఒక సినిమాకి వెళ్ళరూ! ఈలోగా ఎప్పుడన్నా ఖాళీ ఉంటే, అలా బీచ్‌కి, బజారుకి వెళ్ళరూ! తను ఎక్కడికి వెళ్ళాలి? ఏ నాడన్నా తను సినిమా చూస్తానందా! ఎప్పుడో చిన్నప్పుడు పెళ్ళైన కొత్తలో నాలుగైదు సినిమాలు చూసిందంతే! తర్వాత తనకి సినిమాలు చూసే తీరికా లేదు భర్త తనను తీసుకు వెళ్ళిందీ లేదు.

తను వాళ్ళ లాగ సినిమాలకి, షికార్లకి వెళుతుందా! తనకి సంగీత మంటే ఎంతో ఇష్టం చిన్నప్పటి నుండి ఎక్కడ సంగీత్ సభ జరిగితే, అక్కడ రెక్కలు కట్టుకొని వాలిపోయేది

ఈ వేళ తను ఒక మహావిద్వాంసుడి వీణా వాదన విన్నాది ఆ కచేరీ మూడు గంటలు విన్నా, ఇంకా వినాలనే ఉంది. అసలు సంగీతంలో మాధుర్యం వీళ్ళకెలా తెలుస్తుంది? తను సంగీతం గురించి చెప్పినా వీళ్ళకి అర్థం అయి చావదు. తను చిన్నప్పుడు దొంగతనంగా, వాళ్ళ కాళ్ళు, వీళ్ళ కాళ్ళు పట్టుకొని, వర్ణాల వరకు నేర్చుకుంది ఆ తర్వాత తను ఎంత ప్రయత్నించినా సంగీతం నేర్చుకోవడం అవలేదు.

ఆమె మనసు గతంలోకి పరుగులు తీసింది

అప్పుడు తనకి ఆరేళ్ళ వయసు

ఆ రోజు ఇంట్లో అంతా సందడిగా వుంది అప్పటికే చుట్టాలందరూ వచ్చేసారు కొత్త పెళ్ళి కొడుకులా ముస్తాబయ్యాడు నాన్న ఆ రోజు అమ్మమ్మ తనని పట్టుకొని ఏడ్చేసింది

'అమ్మమ్మా! ఎందుకేడుస్తున్నావు? నాన్న ఎంచక్కా పెళ్ళి చేసుకుంటున్నాడట! నాకు కొత్త అమ్మ వస్తుంది ' అంది తను సంతోషంగా

"అదేనే నీ ఖర్మ! నీ తర్వాత ఒక్క మగ నలుసు పుట్టినా, మీ నాన్నని ఈ పని చెయ్యనిచ్చేదాన్ని కాదు రేపటి నుండి నువ్వు ఆ సవతి తల్లి పెంపకంలో ఎన్ని బాధలు పడాలో తలచుకుంటేనే గుండె తరుక్కుపోతుంది ' అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ!

"అమ్మమ్మా! ఈ క్రొత్తమ్మ నన్ను కొడుతుందా! బేలగా అడిగింది

"ఎందుకు కొడుతుంది? మీ నాన్న లేడనా! అయినా నిన్ను నాతో బాటు తీసుకు పోతానంటే, మీ నాన్న ఒప్పుకోవడం లేదు ఇక ఏం చేసినా ఆ దేవుడిదే భారం అని నిట్టూర్చింది

ఇంతలో అమ్మమ్మని ఎవరో పిలవడంతో అటు వెళ్ళిపోయింది

* * * *

తనకి పదేళ్ళు వచ్చాయి

మొదట్లో కొత్తమ్మ తనని బాగానే చూసేది తనకి తమ్ముడు చెల్లి పుట్టేక తన మీద ఎందుకో పిన్నికి కోపం పెరిగిపోయింది చీటికి, మాటికి తనని కొట్టడం, తిట్టడం మొదలు పెట్టింది

పిన్ని ఆరళ్ళల్లో తను ఎలాగో ఐదో క్లాసు వరకు చదువుకుంది ఇంట్లో సరియైన భోజనం లేకపోవడం వల్ల, వయసుకి మించిన పనులు చేస్తుండడం వల్ల, తనకి చదువు మీద శ్రద్ధ తగ్గిపోసాగింది ఒక్కోసారి ఈ బాధలు పడే కన్నా, తనూ చచ్చిపోయి అమ్మ దగ్గరకి వెళ్ళిపోతే బాగుండుననిపించేది కానీ ఆ వయసులో తనకి ఆత్మహత్య చేసుకునేందుకు ధైర్యం చాలేదికాదు అందుకే తనకీ జీవితం నుండి విముక్తి ప్రసాదించమని ప్రతి రోజూ ఆ భగవంతుడిని వేడుకునేది.

ఆ దేవుడికి దయలేదు తనకి చావు రాలేదు కానీ తనకి యవ్వనం వచ్చేసింది తన చదువు ఐదో క్లాసుతోనే ఆగిపోయింది. ఇంతలో నాన్న పోవడంతో, తన బ్రతుకు మరీ దుర్భరం అయిపోయింది

ఎంత సేపూ, ఇంటి పని, వంట పని,

బట్టలుతకడం, ఏటి నుండి నీళ్ళు తేవడంతో నే తనకి రోజు గడిచిపోయేది

రోజులు నిర్లిప్తంగా దొర్లిపోతున్నాయి

అప్పుడే తమ ప్రక్కింట్లో ఒక డాక్టరు గారు అద్దెకి దిగారు వాళ్ళ అమ్మాయికి సంగీతం చెప్పిస్తుంటే తను చాటుగా వినేది. క్రమక్రమంగా ఆ అమ్మాయితో స్నేహం పెంచుకుంది ఆ సంగీతం వింటుంటే తనకి ఒళ్ళు పులకరించి నట్లయి పోయేది

సంగీతం మాష్టారు వచ్చే సమయానికి తనూ వాళ్ళింటికి వెళ్ళి కూర్చునేది తను కూడా ఆ అమ్మాయితో గొంతు కలిపి పాడేది ఆ అమ్మాయి వీణ వాయిస్తుంటే, అబ్బురంగా చూసేది

ఇంట్లో పనంతా చకచకా చేసుకొని, సంగీతం మాష్టారు వచ్చేసరికి వాళ్ళింటికి వెళ్ళిపోయేది

పిన్నికి ఈ సంగతి ఎలా తెలిసిందో, తనని ఆ ఇంటి గడప త్రొక్కవద్దని శాసించింది "నీ బ్రతుక్కి ఇంక సంగీతం ఒక్కటే తక్కువ వెళ్ళి ఇంట్లో పని చూడు " అని కసురుకునేది.

తమ్ముడు, చెల్లి కూడా తనని చూసి ఎగతాళి చేసేవారు వాళ్ళ దృష్టిలో తను జీతం, బత్తెం లేని పనిమనిషి తనకు సంగీతం నేర్చుకోలేకపోయి నందుకు ఏడుపు వచ్చేది

తల్లి, తండ్రి లేని తనకి ఎవరు సంగీతం చెప్పిస్తారు తను జీవితాంతం, ఈ ఇంటికి ఊడిగం చేసుకునే బ్రతకాలి కాబోలు అన్న ఊహ వచ్చినప్పుడు, తన మేను భయంతో సన్నగా కంపించేది

ఆ తర్వాత కొంత కాలానికి, తనకి అనుకోకుండా సంబంధం కుదరడంతో, పిన్నికి ఇష్టం లేకపోయినా, పెళ్ళి చెయ్యక తప్పలేదు

ఇక జీవితంలో పెళ్ళే కాదేమోనన్న తనకి, పెళ్ళి జరగడం చాలా ఆనందాన్ని కలిగించింది తనలో అణగారిపోయిన కోర్కెలు పడగవిప్పి నాట్యం చేసాయి. కోటి కోర్కెలతో, భవిష్యత్తు మీద కొండంత ఆశతో తను ఆ ఇంట్లోకి అడుగు పెట్టింది

కానీ తనది రెండో వివాహమని, తన భర్త ముగ్గురు పిల్లల తండ్రి అని తెలుసుకున్నప్పుడు, తన గుండె భయంతో స్పందించింది ఒక సవతి తల్లి బారి నుండి విముక్తి పొందిన తను, మళ్ళీ మరొక తల్లి బిడ్డలకి సవతి తల్లి కాబోతుందా! ఆ బిడ్డలు తనని తల్లిగా గౌరవిస్తారా! తను వాళ్ళనేమీ ఆరళ్ళు పెట్టదు కానీ కానీ సవతి తల్లి అని నలుగురూ అంటుంటే, తన మనసు ముక్కలై పోదూ!

తన మనసు పరిపరి విధాల పోయేది కానీ తను భయపడిన విధంగా జరగలేదు పిల్లలకి తనంటే ప్రాణం భర్తకి తనంటే అమితమైన ప్రేమ. భర్త, పిల్లల ఆలన, పాలనలో తను సర్వం మరచి పోయేది

పెళ్ళి అయ్యాక అన్నా సంగీతం నేర్చుకోవాలన్న తన ఆశ అడియాసే అయ్యింది పిల్లల సంరక్షణలో తనకి క్షణం తీరిక ఉండేది కాదు ఈ లోగా రెండు సార్లు తనకి నెల తప్పడం, రెండు కాన్పులు పోవడంతో, తన మనసు బాధతో నలిగిపోయింది.

తను సవతి తల్లే గాని, ఏ నాడూ పిల్లల్ని నిర్లక్ష్యంగా చూడలేదు. ఏ స్త్రీకయినా, తను తల్లి కావాలనే కోరిక ఉంటుంది. కానీ తనకి జన్మలో ఆ అదృష్టం లేదని కుమిలి పోయేది



కోరిక తీరిన వేళ

భర్త తనని ఓదార్చేవాడు ఈ బిడ్డల్లోనే తన బిడ్డని చూసుకోమని నచ్చజెప్పే వాడు కానీ తనకే ఎందుకో తల్లి కాలేకపోయాననే బెంగ

తన అదృష్టం పండిందేమో అన్నట్లు, తనకి మళ్ళీ నెల తప్పింది ఈ సారైనా తనకి బిడ్డ దక్కేటట్లు చెయ్యమని, వెయ్యి దేముళ్ళకి మ్రొక్కుకుంది

ఆ దేవుడు తన మొర ఆలకించాడో, లేక తన అదృష్టమో గాని, అతికష్టం మీద పండంటి మగబిడ్డ పుట్టాడు కానీ ఆ తర్వాత తనకి పిల్లలు పుట్టకూడదని, పిల్లలు పుడితే, ప్రాణాలకే నష్టం అని డాక్టర్లు చెప్పడంతో, తనకి ఆపరేషన్ చేయించేసారు

మధు పుట్టాక, తన మనసు కాస్త కుదుటపడింది

కాలగమనంలో పిల్లలు కొంచెం పెద్ద వాళ్ళయ్యారు

పిల్లలందరూ స్కూలుకి వెళ్ళిపోవడంతో తనకి ఇంట్లో ఏమీ తోచేది కాదు అందుకే అప్పుడు తన మనసులో కోరిక బయటపెట్టింది

'మళ్ళీ' నేను వీణ నేర్చుకుంటాను అని నోరు విడిచి అడిగింది

ఆ మాట వినడంతోనే అతడి మనసు భయంతో కంపించి పోయింది 'వద్దు సావిత్రీ' నువ్వు సంగీతం నేర్చుకోవద్దు ఈ సంగీతం పిచ్చిలో పడే, నన్ను పిల్లల్ని అలక్ష్యం చేసింది అనసూయ తను ఒక గొప్ప కళాకారిణి కావాలని అహర్నిశలు, సంగీత సాధన చేసింది తనకి అనారోగ్యంగా ఉన్నా పట్టించుకొనేది కాదు సంగీత సాధనే తన లక్ష్యం అనేది చివరికి . ఎవరికి ఎవరికీ అందనంత దూరం వెళ్ళిపోయింది అతడి కంఠం రుద్ధమైంది

వింటున్న తన కళ్ళల్లో అప్రయత్నంగా నీళ్ళూరాయి

'సావిత్రీ' నువ్వు వచ్చాక ఈ ఇంట్లో ఆనందం తాండవిస్తుంది అనసూయ పోయిందన్న దిగులు నుండి పూర్తిగా కోలుకున్నాను. అనసూయ కన్నా, వేయి రెట్లు అధికంగా నన్ను నా బిడ్డల్ని కళ్ళల్లో పెట్టి చూసుకున్నావు. ఇప్పుడు సంగీతం ధ్యాసలో పడిపోయావంటే, నువ్వు అనసూయ లాగే మారిపోతావు నేను బ్రతికి ఉన్నంత వరకు ఆ ప్రసక్తి తీసుకురాకు అన్నారు శాసిస్తున్నట్లు

భర్త అనురాగం ముందు, పిల్లల ముద్దు ముచ్చట్ల ముందు తనకి సంగీతం రాలేదన్న బాధ తాత్కాలికంగా మరచిపోగలిగింది

కానీ ఎక్కడ సంగీత సభలు జరిగినా, తనని తీసుకు వెళ్ళేవారు ఈ జన్మకి అదృష్టం చాలని తృప్తి పడేది తను ఆయన ఇష్టంలేని విద్య, పిల్లల కెవ్వరికి నేర్పడానికి ఆయన ఒప్పుకోలేదు ఇక తన ఆశని తనలోనే సమాధి చేసుకోక తప్పింది కాదు

పిల్లలు పెరిగి పెద్ద వాళ్ళయ్యారు

ముగ్గురాడ పిల్లలకి పెళ్ళిళ్ళు చేసి అత్తవారింటికి పంపేసారు మధు ఉద్యోగస్తుడయ్యాడని, మధుకి కూడా పెళ్ళి జరిపించేసారు కర్తవ్యాలని నిర్వర్తించి, ఆయన కన్ను మూసారు

భర్త పోయిన తర్వాత తనకి లోకమంతా చీకటిగా అనిపించింది మధుకి ఆ ఊరు నుండి ట్రాన్స్ఫర్ అవడంతో, తనని తీసుకొని, వెళ్ళిపోయాడు ఆయన జ్ఞాపకాలని, ఆ ఊరిని వదలి దూరంగా వెళ్ళిపోయాను మధుతో

కోడలు రజని-తనని బాగానే చూసుకుంటుంది కానీ కొంచెం కోపం జాస్తి అందుకే ఇప్పటికీ, వంటపని, తనే చూసుకుంటుంది కొడుకు, కోడలు, ఇద్దరూ ఉద్యోగం చెయ్యడానికి ప్రొద్దున్న పది గంటలకి వెళ్ళిపోతే, సాయంత్రానికి గాని, తిరిగి వచ్చేవారు కాదు మధు అయితే రాత్రి ఎనిమిది అయితే గాని ఇంటికి రాడు

ఇంటి దగ్గర స్వప్నని, కిరణ్‌ని తను చూసుకునేది వాళ్ళిద్దరూ నాన్నమ్మ అని తన చుట్టూ తిరుగుతుంటే తనకి తెలియని ఆనందంగా ఉండేది.

స్వప్నకైనా వీణ నేర్పించాలని, ఆ చిన్నారి చేతుల్లతో వీణ వాయిస్తుంటే చూడాలని, తను ఎంతగానో ఉబలాటపడేది. సమయం చూసి ఈ విషయం మధుతో చెప్పాలని, రజనిని స్వప్నకి సంగీతం నేర్పించమని అడగాలని అనుకుంది

కానీ.. రజని మనసులో సంగీతం అంటే ఎంత ద్వేషముందో ఈ వేళే తెలుసుకుంది ఇక స్వప్నకి సంగీతం నేర్పిస్తుందన్న ఆశ తనకే మాత్రం లేదు.

తనకి తీరిక దొరికినప్పుడు, స్వప్నని కూర్చోబెట్టి, సరిగమ పదనిసలు పాడించేది స్వప్నకి పదేళ్ళే అయినా ఎంతో చక్కగా గ్రహించేది అందుకే దాన్ని తన వెంట సంగీత కచేరిలకి తీసుకు వెళ్ళేది? సంగీతం వింటుంటే స్వప్నకి ఇంకా బాగా జ్ఞానం వస్తుందని, అది ఒక గొప్ప సంగీత విద్వాంసురాలు కావాలని కలలు కనేది

కానీ జరిగిందేమిటి? రజని తనని దూషిస్తుంది తన కూతురిని చెడగొడుతున్నానని, దెప్పి పొడుస్తుంది తనకి ఎలాగూ సంగీతం నేర్చుకునే అదృష్టం లేదు కనీసం స్వప్నకైనా చెప్పించాలని తాపత్రయ పడింది కానీ తన ఆశ మొదట్లోనే అడుగంటి పోయింది

ఇక ఈ జన్మకింతే' తమ వంశంలో సంగీతం వినిపించదు ఇక నుండి తనని సంగీత సభలకి కూడా వెళ్ళనివ్వరేమో' ఏది ఎలా జరిగినా తనేం చెయ్యగలదు? తనలోని కళాతృష్ణని, వ్రేళ్ళతో పెకిలించి పారవెయ్యలేదే ఇక తనకి ఆ భగవంతుడి దగ్గర నుండి పిలుపు వస్తే, ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోవడం తప్ప తనేం చెయ్యగలదు?

ఆలోచిస్తున్న సావిత్రమ్మ కళ్ళల్లోంచి, రెండు కన్నీటి బొట్లు జలజలా రాలాయి. కలతబారిన మనసుతో, ఎప్పటికీ నిద్రపోయింది సావిత్రమ్మ.

తెల్లవారుతుంది అన్నట్లు, వేకువ జామున నాలుగు గంటలకే కోడి కూత వినబడడంతో, మంచం మీద నుండి లేచింది సావిత్రమ్మ

* * * * * * *

ఇంతలో పెరట్లో నుండి స్వప్న సంగీతం పాడుతున్నట్లు వినిపిస్తే ఆశ్చర్యపోయి అటు నడిచింది. సప్త స్వరాలు వీనుల విందుగా వినిపిస్తుంటే, తన చెవులని తానే నమ్మలేక పెరట్లోకి పరుగు లాంటి నడకతో వెళ్ళింది.


అక్కడ చలిలో, నూతి గట్టు దగ్గర కూర్చుని, స్వప్న సరిగమలు పాడుతోంది.

ఆ దృశ్యాన్ని చూసిన సావిత్రమ్మ గుండె సంతోషంతో పొంగి పోయింది. వడివడిగా స్వప్న దగ్గరకి నడిచి "స్వప్నా నా బంగారు తల్లీ! ఈ చలిలో సంగీతం పాడుతున్నావామ్మా!" అంది ఆనందంగా.


"ఔను నాన్నమ్మ! చలిలో పాడితే సంగీతం బాగా వస్తుందని నువ్వే చెప్పావుగా! ఎప్పటికైనా నేను మంచి విద్వాంసురాలినౌతాను." అంది స్వప్న అమాయకంగా

"స్వప్నా! నా తల్లీ ఎంత మంచి మాటన్నావు. కానీ... కానీ... ఈ సంగతి మీ అమ్మకి, నాన్నకి తెలిస్తే ఊరుకుంటారా!" అంది సందేహంగా

"నాకు సంగీతం నేర్పించకపోతే, నేను అన్నం



ధర్మసందేహం



సుప్రభాతాన్ని గురించి

మనం సాధారణంగా ఉదయం రేడియోలో "సుప్రభాతం" వింటూ ఉంటాము. వీటిలో శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమే ప్రధానమైనదీ, ప్రాచీనమైనదినీ. ఇది ఎంతో ప్రచారాన్ని పొందింది. చాలా మందికి ఇది కంఠస్థమై కూడా ఉంటున్నది. దీనిని అనుసరించే మల్లికార్జున సుప్రభాతం, సింహాచలంలోని నృసింహదేవ సుప్రభాతం మొదలైన సుప్రభాతాలు రచింపబడి, ప్రచారాన్ని పొందుతున్నాయి.

గౌరవనీయులు, పెద్దలు వచ్చినప్పుడు వారిని గౌరవ మర్యాదలతో ఆహ్వానించేటప్పుడు 'స్వాగతం' చెప్పడం పరిపాటి. ఆ రీతిగానే రాత్రి నిద్రిస్తున్న మహనీయులకు ప్రభాత సమయంలో మేలుకొలుపు పలకడం సుప్రభాతం! ఈ ప్రభాతం శుభకరమై ఉండుగాక! అని కోరడమే సుప్రభాతపు ఆశయంగా తోస్తున్నది.

"భగవంతుని గూర్చి మనం సుప్రభాతం చెప్తున్నాం. సర్వ కాల, సర్వావస్థల్లోనూ జాగరూకుడై ఉండి, సర్వ లోకాలనూ రక్షిస్తూ ఉన్న భగవంతునికి నిద్ర యెక్కడిది? అతనికి మనం మేలుకొలుపు పాడడం సముచితమేనా? నిద్రాణులమై వుండే మనకే మేలుకొలుపు కావలసి ఉన్నది. మనం భగవంతుణ్ణి మేలు కొలపడం మన అవివేకాన్నే సూచిస్తుంది" అని కొందరి అభిప్రాయం, ఇదీ కొంత ఆలోచింపదగినదే!

బాగా ఆలోచించి చూస్తే దీనికి సమాధానం దొరకకపోదు.

భగవంతునికి గుణాలనూ, నామ రూపాలనూ కల్పించి వేర్వేరు దేవతా మూర్తులుగా భావించి ఆరాధించేటప్పుడు షోడశోపచారాలతోనూ పూజలు చేస్తున్నాము. కల్యాణాలు జరుపుతున్నాము. వైభవోపేతంగా ఊరేగింపులు నిర్వహిస్తూ ఉన్నాము. ఆయా గుణాలను కీర్తిస్తూ పాటలు పాడుతున్నాము. రాత్రి పవ్వళింపులు పాటలతో కూడా జరుపుతున్నాము. దేవుణ్ణి మన మధ్య వున్న విశిష్ట వ్యక్తిగా భావించి అధికంగా అవయవాలను కల్పిస్తున్నాము. ఇట్టి స్థితిలో మేలుకొలుపులు పాడడం కూడా ఉచితంగానే ఉంటుంది.

నిర్గుణ స్వరూపుడైన పరమాత్మను తమ హృదయంలోనే నిలిపి ధ్యానించే యోగి పుంగవులకు ఇట్టి ఆరాధనలతో పని ఉండదు. కాని దేవాలయాల్లో ప్రతిష్ఠించి, సమస్తోపచారాలతో పూజిస్తున్న ఇతరులకు 'సుప్రభాతం' కూడా ఒక పూజాంగంగానే తోచక మానదు.

-బులుసు వేంకటరమణయ్య

తినను. బడి కెళ్ళను." మొండిగా అంది స్వప్న.

"నా తల్లే! నీకింత శ్రద్ధ ఉందని ఇప్పుడె తెలుసుకున్నాను. ఇక మీ నాన్నతో పోట్లాడి అయినా నీకు సంగీతం నేర్పిస్తాను." అని ఆయాసంతో మాట రాక ఉన్న చోటనే కూలబడిపోయింది.

స్వప్న గాబరాగా వెళ్ళి, తల్లిని, తండ్రిని నిద్ర లేపింది.

ఏం జరిగిందోనని గాబరాగా వచ్చిన మధు, అక్కడ తల్లి అచేతనంగా పడి ఉండే సరికి, రెండు చేతులతో లేవనెత్తి, అక్కడ నుండి తీసుకు వెళ్ళాడు.

సావిత్రమ్మ ఆయాసంతో మూలుగుతోంది.

మధు, తల్లిని మంచం మీద పడుకోబెట్టాడు. రజని ముఖంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.

"మధు ... నాది... నాదొక కోరిక .. తీరుస్తావా!" అంది సావిత్రమ్మ అతిప్రయత్నం మీద.

"ఏమిటమ్మా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"మన స్వప్నకి... ,సంగీతం నేర్పించరా!" అంది వగరుస్తూ.

"ఆ సంగతి ఇప్పుడెందుకమ్మా! నువ్వు ఎక్కువగా మాట్లాడకు ఆయాసం వస్తుంది." అన్నాడు మధు.

"మధూ! ఈ జీవితంలో నేను నిన్ను ఇంకేమీ కోరనురా! స్వప్నకి సంగీతం నేర్పిస్తానని నాకు మాట ఇవ్వరా!" బ్రతిమాలుతున్నట్లు అడిగింది.

"అది నేర్చుకోవాలే గాని, దానికి సంగీతం చెప్పించనని నే నెప్పుడన్నా అన్నానా! తప్పకుండా చెప్పిస్తానమ్మా!" అన్నాడు ఆమె చేతిలో చెయ్యి వేస్తూ!

"నాన్నమ్మా! నేను సంగీతం నేర్చుకుంటాను." స్వప్న ఏడుపు గొంతుతో అంది.

స్వప్న బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకొని, "నువ్వు పెద్ద విద్వాంసురాలవ్వాలి. అప్పుడే నా ఆత్మకు శాంతి." అని మెడ క్రిందకి వాల్చేసింది.

"నాన్నమ్మా!" అని ఆమె మీద పడి ఏడుస్తోంది స్వప్న.

మధు మనసు దుఃఖంతో మొద్దు బారిపోయింది. అతడి కళ్ళల్లోంచి అశ్రు బిందువులు రాలి, సావిత్రమ్మ పాదాల మీద పడ్డాయి.

తిరిగి రాని తల్లి కోసం, హృదయ విదారకంగా ఏడుస్తున్నాడు మధు. రజని కళ్ళల్లో కూడా కన్నీళ్ళు తిరిగాయి. □

పాఠకుల శీర్షిక

గర్భస్థ శిశువు చెప్పిన కథలు

ఎలర్జీకి మందు

లతకు రెండు రోజుల నుండి నీరసంగా ఉంటోంది. పరీక్ష చేయించు కొందామని డాక్టర్ దగ్గరకెళ్ళింది. డాక్టర్ గర్భం అని ఎస్. డి. టి. పరీక్ష చేసి "నీకు మగబిడ్డ పుడతాడ"ని చెప్పింది.

అంతలోనే లత ముఖం వివర్ణ మయింది. "నో! అలా జరగడానికి వీల్లేదు, మరో మగవాడికి నేను జన్మనివ్వకూడదు! ఇవ్వను" అనుకొంది మనసులో.

"డాక్టర్ నాకు ఎబార్షన్ చేయాలి" అంది లత.



"ఏమ్మా! నీకేమైనా మతిపోయిందా! మగ బిడ్డను వద్దంటావు" అంది డాక్టర్.

"మగవాళ్లంటే నాకు ఎలర్జీ".

"ఏం ... ఎందుకని?"

"ఇరవై సంవత్సరాలు పెంచి పోషించిన తల్లిదండ్రులను కాదని మోహన్‌ని పెండ్లి చేసుకున్నాను. సంవత్సరం గడవక ముందే అతని నిజస్వరూపం బయటపడింది. అతను ప్రేమిస్తున్నది నన్ను కాదు! నేను సంపాదిస్తున్న డబ్బును. ఇంట్లోనే వ్యభిచారం మొదలుపెట్టాడు. నిలదీసి అడిగాను. నోరు మూసుకోమన్నాడు. ఆ నరకంలో ఉండలేక బయటపడ్డాను. చూస్తూ, చూస్తూ మరొక మగవాడికి జన్మనివ్వలేను డాక్టర్" అంది లత కంట నీరు రాలుతుండగా.

"అమాయకురాలా! మగవాళ్లంతా చెడ్డవారు కాదు. ఇరవై ఐదు సంవత్సరాల క్రితం నా కథా ఇంతే. కాని ఈ పట్టణంలో ప్రజాహిత కార్యక్రమాలన్నింటిలో ముందుండే దేవరను కున్నావ్? నా కొడుకు కిరణ్. నేను కూడా నీలాగే చేసుంటే నాకీ రోజు మనశ్శాంతి లభించేది కాదు. అందరి చేత గౌరవింప బడేదాన్ని కాదు. ఏమంటావ్ నీ ఎలర్జీకి మందు లభించినట్లేనా" అంది డాక్టర్.

లత ఇక మాట్లాడలేదు. ఆనందంగా ఇంటికి వెళ్ళింది.

- పాటిబండ్ల శ్రీమన్నారాయణ,
కాకానిపాలెం, అద్దంకి


* * *

ఆర్థిక సాంఘిక సమస్యలు

పూర్వకాలం ఆడపిల్ల పుట్టిందంటే ఇంటిలో లక్ష్మీదేవి పుట్టింది అని అనుకొనేవారు. మన పురాణాలలో స్త్రీకి ఎంతో ఉన్నత స్థానం కల్పించేవారు. మనుచక్రవర్తి తన 'మనుధర్మ శాస్త్రం'లో స్త్రీని "కరుణేషు మంత్రి ..." అంటూ మగవాడి ప్రతి కదలికలోను స్త్రీ యొక్క అవసరం గూర్చి చెప్పాడు. తల్లిగా, దాసిగా, మంత్రిగా మొదలగు బాధ్యతలు స్త్రీ చేయునని చెప్పినాడు.


కాని ఈనాడు ఆడపిల్ల పుట్టిందంటే ఏదో అరిష్టం వచ్చినట్లే భావిస్తున్నారు. అసలు పుట్టడం వరకు ఎక్కడ గర్భంలో పెరుగుతున్నది ఆడశిశువు అని తెలియగానే ఆ శిశువును గర్భంలోనే హత్య చేస్తున్నారు.

ఈ విధంగా ఆడపిల్లల పట్ల అయిష్టత ఏర్పడుటకు సాంఘిక ఆర్థిక పరిస్థితులు కారణభూతాలగుచున్నవి. ఆడపిల్ల పుట్టిందంటే పెద్ద పెద్ద కట్నాలు ఇచ్చి పెళ్ళి చేయాలి. ఆ వచ్చే



భర్త, అత్త, మామలు ఎటువంటివారు వస్తారో. ఏ కిరసనాయిలు డబ్బాకు అర్పణం చేయాల్సి వస్తుందో మొదలగు భావనలు ఉండి అసలు ఆడపిల్లను ప్రసవించటానికే భయపడిపోతున్నారు. ఒకవేళ ఆర్థిక పరిస్థితుల వలన పెళ్ళి చేయటం ఆలస్యం అయిందంటే చుట్టూ వున్న సమాజం ఎత్తిపొడిచే మాటలనే ఈటెలను భరించడం కష్టతరమయి పోతుంది.

ఒక్కొక్క మగవాడు ఉంటాడు. ఆడ శిశువును ప్రసవిస్తే తన భార్య ఏదో పెద్ద



నేరం చేసినట్టు భావించి ఆమెను బాధపెడతాడు. అసలు ఆడ శిశువా! మగశిశువా అనేదాన్కి కారణం, సైన్స్ ప్రకారం మగవాడేనన్నది చాలామంది పురుష పుంగవులకు తెలియదు.

ఈ విధమైన అనేక కారణాలవల్ల స్త్రీలు తమ గర్భంలో పెరుగుచున్న శిశువును నిర్లక్ష్యంగాతామే హత్య చేస్తున్నారు.

సమాజంలో మార్పు రావాలి. ప్రతి వ్యక్తి విశాల హృదయంతో ఆలోచించాలి. విశ్వ కల్యాణానికి తోడ్పడవలసిన సైన్స్‌ను ఇలాంటి వినాశనకర పనులకు ఉపయోగించరాదు.

- ఎం. వి. రమణ, నగరంపాలెం,
గుంటూరు.

* * *

సమానంగా చూడాలి

అర్ధ రాత్రి కావస్తుంది. అంతా నిశ్శబ్దంగా వుంది. ప్రజలంతా నిద్రాదేవి వడిలో గాఢంగా -ప్రశాంతంగా నిద్ర పోతున్నారు- కష్టాలను మరచిపోయి ... యింట్లో టక్ ... టక్ ... మనే గోడ గడియారం శబ్దం తప్ప మరేమి వినిపించటంలేదు. అలాంటి సమయంలో ఆడ నా...

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక


గర్భస్థ శిశువు చెప్పిన కథలు

కథ వ్యాసం రాసిన వారి పేరు : ____________________

____

పూర్తి చిరునామా ____________________

పిన్ కోడ్ : ____________________



లాంటి ఓ కేక ... అదే ... అమ్మా! ... అమ్మా! అని

గాఢ నిద్రలో ఉన్న నాకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. ప్రక్కకు చూసాను.బాబు గాఢంగా నిద్రపోతున్నాడు .... "ఎవరబ్బా యింత రాత్రివేళ?" అని ప్రశ్నించుకుని కలేమో అని సర్దుకుని మళ్లీ కళ్ళు మూసుకున్నాను. మళ్లీ "అమ్మా! నేనే ... లే అమ్మా!" అదే పిలుపు వినపడింది. కళ్ళు తెరిచాను. యింతలో గోడ గడియారం 12 గంటలు కొట్టింది. అప్పుడు నాకు జ్ఞానోదయం అయింది. అయిదవ నెలలో ఉన్న పొట్టపై చేయి వేసి చూసుకున్నాను.

"అవునమ్మా! నేనే ... నీ పుట్టబోయే బిడ్డను ... నా మాట కొంచెం వింటావా, నాదో చిన్న విజ్ఞాపన" అంది నెమ్మదిగా

"చెప్పమ్మా. ఏంటి? నీ కోరిక తప్పకుండా వింటాను చెప్పమ్మా" అన్నాను.అనుకోకుండా పైకే అనేశాను.

"అమ్మా! నీ కోరిక ప్రకారమే యీ యింట్లో ఆడపిల్లగానే పుడ్తాను. కాని ఒక్క షరతు ... నన్ను కూడా అన్నయ్యతో సమానంగా పెంచాలి. అన్నయ్యతో సమానంగా చదివించాలి ... అయితే మరో విషయం ... అన్నయ్యలాగే నాకూ ఉద్యోగ ప్రయత్నం చేసి ఉద్యోగం యిప్పించాలి నా పెళ్లి గురించి మీరు ఏ విధంగానూ నిర్ణయం తీసుకోకూడదు

నా యిష్టం వచ్చిన వాడిని కట్టుకుంటాను నా తాహతుకు తగినవాడినే నేను ఎన్నుకుంటాను

నా కష్టసుఖాలలో పాలుపంచుకొనే వారినే నేను ప్రేమించి పెళ్లి చేసుకుంటాను మీరు అనవసరంగామీ కులమతాల పట్టింపులతో, పెద్దవారమనే అహంతో ప్రవర్తించకూడదు ... ప్రేమించుకున్న వారిని ఏ క్షణంలోనూ విడదీయటానికి ప్రయత్నించరాదు ... యిక అన్నింటి కన్నా ముఖ్య విషయమేమిటంటే మగాడితో అంటే అన్నయ్యతో సమానంగా నాకూ ఆస్తిలో సగం యివ్వాలి. ఆస్తి హక్కు కల్పించాలి ... అయితే నేను కూడా మిమ్మల్ని నేను బ్రతికున్నంత కాలం పోషిస్తాను ...మీ కష్టసుఖాలు పంచుకుంటాను ... మీ బరువు బాధ్యతలు వహిస్తాను ... వీటన్నింటికీ యిష్టమయితేనే నాకు జన్మను ప్రసాదించమ్మా. లేకపోతే అబార్షన్ చేయించుకో" ముగించింది.

"అలాగేనమ్మా! నీ కోరికలన్నీ ఆమోదిస్తాను ...నువ్వే మాకు కావాలి" ... అని కళ్ళు మూసుకున్నాను.

-శరగడం వరలక్ష్మి,
గవరకం పరపాలెం,
విశాఖపట్నం

★ ★ ★

బాధ్యత గుర్తించాలి

ఏదో తెలియని ఆవేదనతో కూర్చొని వున్న గాయత్రిని, 'ఏమండీ! శ్రీమతి గారు' అంటూ భుజం పట్టి కుదిపాడు కిరణ్ ఉలికిపాటుగా కిరణ్ వైపు చూసింది గాయత్రి

ఆమె కళ్ళల్లోని ఆవేదనను గ్రహించిన కిరణ్ ఏయ్' ఏంటి అలా వున్నావ్ ఏమైంది? అంటూ కంగారుగా అడిగాడు


ఏమండీ నేను ఇవాళ హాస్పిటల్‌కు వెళ్లాను నాకు పాప పుడుతుందని డాక్టరు చెప్పారు నాకేమో పాప వద్దనిపిస్తుంది. అందుకనీ మాట మధ్యలోనే ఆపేసింది గాయత్రి బెదురు చూపులతో ...

"హు .. అందుకని ఏంటీ" అడిగాడు కిరణ్ .

"నేను ... నేను ... అబార్షన్ చేసుకుంటానండి" అంది తడబడుతూ గాయత్రి.


"గాయత్రీ ... వాట్ డూ యూమీన్ ఏంటి నువ్వంటున్నది. అసలు నువ్వేనా ఈ మాటంటున్నది". కిరణ్ కను బొమ్మలు ముడిపడ్డాయి ఆ క్షణంలో ...

"ఔనండి మీరే బాగా ఆలోచించండి. నేటి సంఘ సమాజంలో ఆడదాని బ్రతుకు దినదిన గండంగా నడుస్తుంది. ఎన్ని మార్పులు జరిగినా ఎంతమంది సంఘ సంస్కర్తలు గొంతెత్తి అరిచి బోధించినా ఈ మానవ సంఘ సమాజం మారదు. స్త్రీని పవిత్రంగా ఆరాధించి గౌరవించే దేశం మనదే. దానికి ఎన్నో పురాణాలు తార్కాణాలుగా వున్నాయి. కాదనను. కానీ ఆనాటి సిద్ధాంతాలన్నీ ఇప్పటి



సమాజంలో పనికిరావండి. ఎటు చూసినా, పరిశీలించినా స్త్రీకి రక్షణ లేదండి. అందుకే నేను ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నానండి" అంటూ కిరణ్‌ను అల్లుకుపోయి గొల్లుమంది గాయత్రి.

పిచ్చి గాయత్రీ చదువుకున్న నీలాంటి వాళ్లే లేనిపోని వూహలతో భయపడి ఆత్మవంచన చేసుకుంటున్నారు అందుకే అంటారు అనుమానం మొదట పుట్టి ఆ తరువాత ఆడది పుట్టిందని రానున్న కాలాన్ని ధైర్యంతో పోరాడి జీవితాన్ని హాయిగా గడుపుతూ మన బిడ్డలకు మనం తల్లిదండ్రులుగా ఒక 'బాధ్యత'తో మన కర్తవ్యాన్ని నిర్వర్తించిననాడే మన జన్మ సార్థకత చెందుతుంది మంచి, చెడు మాదిరిగానే ఆడ మగ జననం ఉంటుంది వీటిలో



ఏది లోపించినా రెండవదానికి అర్థం ఉండదు. మనకు ఏ బిడ్డ పుట్టినా పెంపకంలో, మనం 'బాధ్యతల్ని' మరచిపోకుండా తగిన శిక్షణతో పెంచామంటే మన సంసారం పూల నావగా సాగిపోతుంది. గాయత్రి, నీవనుకున్నట్లు ఈ సంఘ సమాజం ఇలాగే వుండదు. రానున్న కాలానికి ఎలా మారుతుందో ఎవరూ చెప్పలేం. నీలాంటి పిరికి గుండె వున్న ఆడవాళ్లను మంచి మాటలతో మార్చగలిగే శక్తి, మెడలో మూడు ముళ్ళు వేసిన భర్తకు కాదు సుమా! భార్య మనసుకి అనురాగపు ముడిని వేసిన భర్తదే సుమా!" అంటూ గాయత్రి నుదుటిపై చుంబించాడు కిరణ్.

కిరణ్ అన్న మాటలకు గాయత్రికి జ్ఞానోదయమై ... "ఔనండి నేను ఒక తల్లిగా నా 'బాధ్యత'ను మరచానండి నన్ను క్షమించండి ఆడ, మగ, ఏ బిడ్డకైనా తల్లి లాలన, తండ్రి పాలన ఒకటేనన్న సత్యాన్ని గ్రహించలేక పోయాను నేను ఎబార్షన్ చేసుకోనండి ఆడపిల్లనే కంటానండి ఒక తల్లిగా, ఒక ఇల్లాలిగా నా బాధ్యతను నిర్వర్తిస్తానండి అంటూ ఆనంద బాష్పాలు చెక్కిళ్ళపై జాలువారగా కిరణ్‌ను అనురాగంతో అల్లుకు పోయింది గాయత్రి

- ఏ. యస్. చంద్రశేఖర్,
పుత్తూరు (చిత్తూరు) ☐

సీరియల్

ఆశయం



యం. యస్. ఆర్. చౌదరి

(గత సంచిక తరువాయి)

చిదానందం స్థావరం లోనికి ప్రవేశించాడు ఆనంద్ ఎవ్వరూ లేరు అంతా నిశ్శబ్దంగా ఉంది.

ఆనంద్ ఆలోచిస్తూ చిదానందం పర్సనల్ రూమ్ ముందు ఆగాడు

ఎందుకైనా మంచిదని అనుకొంటూ డోర్ కీ హోల్ ద్వారా లోపలికి చూశాడు ఆనంద్

లోపల ..

చిదానందం ఏవో ఫోటోలు, నెగటివ్ టేబిల్ పైనుండే ఫ్లవర్‌వాజ్‌లో ఫ్లవర్స్ క్రింద పెట్టడం గమనించాడు

ఉలిక్కి పడ్డాడు ఆనంద్

నెగటివ్ చిదానందం దగ్గరికి ఎలా వచ్చింది

అసలు సలీం, జావేద్‌లు ముసుగు మనిషికిచ్చిన ఫోటోలు చిదానందం దగ్గరి కెలా వచ్చాయి అంటే చిదానందం, ముసుగు మనిషి ఇద్దరూ స్నేహితులా .

లేక ముసుగు మనిషి, చిదానందం ఇద్దరూ ఒకరేనా .

ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతూ ఉంది.

చిదానందం తలుపు వేపు అడుగులు వేయటం గమనించాడు ఆనంద్

తలుపుకు దూరంగా, మెయిన్ ద్వారం దగ్గరికి వెళ్ళి అప్పుడే లోపలికి వస్తున్నట్లు

"చిదానందం చిదానందం అంటూ పిలిచాడు ఆనంద్

పర్సనల్ రూమ్‌లో నుంచి వచ్చాడు బయటకు చిదానందం

"ఓ ఆనంద్ నువ్వా? కమాన్ ఎక్కడికెళ్ళావు, రెండు రోజుల్నించి కనిపించలేదు?' అడిగాడు చిదానందం, అక్కడే ఉన్న కుర్చీలో కూర్చుంటూ

ఆనంద్ కూడా ప్రక్కనే ఉన్న మరో కుర్చీలో కూర్చున్నాడు

చప్పట్లు కొట్టాడు చిదానందం

నలుగురు వ్యక్తులు అక్కడికొచ్చారు వారి చేతిలో త్రాళ్ళున్నాయి

జరిగిన కథ –9 : తమ దుర్మార్గాలకు సబినస్పెక్టర్ విజయ్ అడ్డు పడుతున్నాడని చిదానందం, ముసుగు మనిషి బృందాలు విజయ్ మీద కత్తి కడతాయి విజయ్‌ను హత్య కేసులో ఇరికించి ఉరిశిక్ష విధింప జేస్తారు నర్మదతో పెళ్ళి జరిగి ఉండవలసిన రోజున విజయ్ ఉరికంబం ఎక్కబోతాడు విజయ్‌ని ఉరినుంచి తప్పించాలని మిత్రుడు ఆనంద్ తగిన సాక్ష్యాధారాలు సేకరిస్తుంటాడు హత్యలు ఎవరు చేశారో తేలిపోతుంది విజయ్‌ని ఉరికంబం ఎక్కించాక ఆయన ముఖానికి ప్లాస్టిక్ తొడుగు ఉందని గుర్తిస్తారు

"ఊఁ కట్టిపారెయ్యండి వాడిని అంటూ ఆనంద్ వైపు చేయి చూపించాడు చిదానందం

ఒక్కసారిగా ఆనంద్ పైబడి చేతులు, కాళ్ళు కదలకుండా కట్టేశారు

"ఊఁ తీసుకెళ్ళండి ఆ స్తంభానికి కట్టెయ్యండి "

అలాగే చేశారు అతని అనుచరులు

' చిదానందం ఏమిటిదంతా? అడిగాడు ఆనంద్

"ఆనంద్ నువ్వు మోసగాడి వయితే నేను మోసగాళ్ళకు మోసగాడిని నాదగ్గరా నీ ఎత్తులు చెప్పు ఎవర్నువ్?"

ఉలిక్కిపడ్డాడు ఆనంద్

"ఏం నీ కేమైనా పిచ్చిపట్టిందా? నేను ఆనంద్‌ని

"అవును ఇప్పటిదాకా పిచ్చేపట్టింది. ఇప్పుడే వదిలింది చెప్పు ఎవర్నువ్?"

"ఎన్నిసార్లు చెప్పాలి నీకు నేను ఆనంద్‌ను "

"ఆనంద్ ఇంకా అయోమయంగా, అమాయకంగా నటించకు నా కంతా తెల్సు చెప్పు ఎవర్నువ్?"

"ఏమిటి నీకు తెలిసింది?

"ఏమిటా? చెబుతాను విను నువ్వు సలీమ్, జావేద్‌లను అనుసరించావు వారు ఫోటోలను వారి బాస్ ముసుగుమనిషి కిస్తుంటే చూశావు సలీంను నెగటివ్ ఇమ్మని బెదిరించావు వాడు అది రూమ్‌లో ఉందని చెప్పాడు ఈ విషయాలన్ని నీ కెందుకు చెప్పు? ఎవర్నువ్?"

చాలా విషయాలే తెలుసుకొన్నావే నా గురించి అయితే ఇంకా నేనెవరో అర్థం కాలేదా చిదానందం ఉరఫ్ ముసుగు మనిషీ" అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ ఆనంద్

గతుక్కుమన్నాడు చిదానందం

ఆ విషయం కూడా తెలుసుకొన్నావన్న మాట అయితే నా గురించి అంతా 'తెలిసిందన్నమాట అయినా లాభం లేదు. నీ ఫ్రెండ్ విజయ్‌ను నువ్వు రక్షించుకోలేవు ఎందుకంటే పూర్ఫెలో సలీం నీకు నెగటివ్ రూమ్‌లో ఉందని చెప్పాడు కానీ అక్కడ నేను హియరింగ్ బగ్స్ అమర్చినట్లు, అక్కడి మాటలు ఎప్పటికప్పుడు నాకు వినిపిస్తాయని తెలుసుకోలేక పోయాడు ఆ మాటలు విని నేను రూమ్‌లోని నెగటివ్ సంపాదించాను అన్నాడు చిదానందం నవ్వుతూ

'నువ్వు ఇదంతా విజయ్‌కోసమే చేస్తున్నావంటే నేను నమ్మేటంత ఫూల్‌ని కాదు నువ్వెవరో, ఎందుకిదంతా చేశావో నిజం చెప్పాలి?"

'నేను సి బి ఐ ఏజెంట్ ఆనంద్‌ను ముసుగు మనిషిలా నువ్వు చేస్తున్న నేరాల గురించి పరిశోధించమని ప్రభుత్వం నన్ను పంపించింది

ఉలిక్కిపడ్డాడు చిదానందం

★ ★ ★ ★ ★

"చెప్పు ఎవర్నువ్? ఏమిటిదంతా కొద్దిలో ప్రమాదం తప్పిపోయింది గాని లేకుంటే ఎంత ఘోరం జరిగిపోయి ఉండేదో తెలుసా?" ప్రశ్నించాడు ఎస్ పి నందనరావు

ఆ యువకుడు ఏమీ మాట్లాడ లేదు

'ఎందుకిలా చేశావు ఉరికి ముందు ఎప్పటి నుంచో వస్తున్న ఆచారంగా నీకు వేడినీళ్ళతో స్నానం చేయించ బట్టి నువ్వు వేసుకొన్న మాస్క్ లేచి వచ్చి 'అసలు విషయం బయట పడింది లేకుంటే ఈ రోజు జరిగిన మార్పుకి మా డిపార్ట్‌మెంట్ అంతా బాధపడాల్సి వచ్చేది వంద మంది దోషులు తప్పించుకొన్నా ఫర్వాలేదు కాని ఒక నిర్దోషి శిక్షించబడకూడదనే మన భారతీయ శిక్షాస్మృతి నీ గురించి అపఖ్యాతి పాలయ్యేది చెప్పు ఎవర్నువ్? ఎందుకిలా చేశావు?

నా పేరు ఆనంద్. నేను విజయ్ ఫ్రెండ్‌ను ' అన్నాడు ఆ యువకుడు.

"అర్థమయ్యేటట్లు చెప్పు '

"ఆ రోజు మోసగించి తప్పించుకొని పారిపోతూ విజయ్ నా దగ్గర కొచ్చాడు జరిగిన విషయమంతా చెప్పాడు తను నిరపరాధినని చెప్పాడు. విజయ్‌ను కాపాడటానికని నేను విజయ్‌లా మీకు లొంగి పోయాను విజయ్ నాలాగా వేషం మార్చుకొని అసలు హంతకులను పట్టుకొంటానని వెళ్ళాడు."

'నీ ఉరి అమలు జరిగి ఉంటే ఏమయ్యేది?"

"ఏముంది అయ్యేందుకు. నా వలన ఒక నిజాయితీ పరుడైన ఆఫీసర్ బ్రతికేవాడు. విలువలేని నా ప్రాణాలకు విలువ చేకూరేది. అదీగాక నాకు రాఖీ కట్టిన నా చెల్లెలు సుఖంగా ఉండేది."

"ఎవరు నీ చెల్లెలు?"

"పరిస్థితులన్నీ సరిగ్గా ఉంటే రేపు విజయ్‌కి సహధర్మచారిణి కానున్న మీ కుమార్తె నర్మద."

"వ్వాట్!?"

"యస్. నర్మద భవిష్యత్ కోసమే నేనిదంతా చేశాను."

"చూడు ఆనంద్. స్నేహితుడిపై నీకున్న ప్రేమకు, ఎవరో ముక్కు మొహం తెలియకుండా ఉండి, నీకు రాఖీ కట్టి చెల్లెలైన నర్మద మీద నీకున్న అనురాగానికి, వాటికి నీ ప్రాణాలే అర్పింపజూపిన త్యాగానికి అభినందనలు తెలుపు తున్నాను. అయితే విజయ్ ఇప్పుడెక్కడున్నాడు. ఆపదలో ఉన్నాడేమోనని నా అనుమానం." అన్నాడు ఎస్. పి. నందనరావు.

"బహుశా చిదానందం దగ్గర ఉండొచ్చు" అంటూ వివరాలు చెప్పాడు ఆనంద్.

* * * * * * * *

"నువ్వు సి. బి. ఐ. ఏజెంటువా? ఏం తెలుసుకొన్నావు నా గురించి" అడిగాడు చిదానందం.

మౌనంగా ఉన్నాడు ఆనంద్.

"ఇప్పటి వరకు నాగురించి పరిశోధించేందుకు ఎంతో మంది ఏజెంట్లు వచ్చారు. నా చేతిలో చచ్చారు. వారిలో నువ్వు ఒకడివి. అంతే!"

"అంత తక్కువగా అంచనా వేయకు సి. బి. ఐ.ఏజెంట్లను."

"లేక భయపడమంటావా? సి. బి. ఐ ఏజెంట్ గణేశ్‌ను చంపాను. అప్పుడెవరు ఏం చేశారు? సంతోష్‌కుమార్‌ను హత్య చేయించాను. మారుతీ బ్యాంక్ దోపిడీ చేయించాను. రాజేష్‌ను నా కొడుకు రంగా పట్టపగలు కాలేజి దగ్గర చంపితే ఎవ్వరు అడ్డు వచ్చారు. నిన్న విజయ్‌ను హత్య కేసులో ఇరికించాను. ఎవ్వరు కనుక్కొన్నారు ఆ విషయాన్ని. అంతేకదా....నువ్వు....నీ పోలీసులు...."

"గొప్పలు చెప్పుకోవటం నీకు సరదా అయితేమాత్రం మరీ పచ్చిగా చెప్పకు. శవాల మీద విజయ్ వ్రేలిముద్రలు కూడా ఉంటే, నువ్వే చేశానంటే నేను ఎలా నమ్ముతా నను కొన్నావు."

"నమ్మకుంటే నీ ఇష్టం. ఈ రోజుల్లో వేలి ముద్రలు సృష్టించటం పెద్ద కష్టం కాదు. చర్మంతో ఎవరి వ్రేలి ముద్రలు కావాలంటే వారివి సృష్టించుకోవచ్చు. వాటిని గ్లోవ్స్‌గా తొడుగుకుంటే ఏం చేసినా వాటి ముద్రలే పడతాయి. విజయ్ వ్రేలిముద్రలతో తయారుచేసిన గ్లోవ్స్ తొడుగుకొని రంగాయే అంటే నా కొడుకు ఆ యువతిని రేప్‌చేసి చంపాడు. అడ్డు వచ్చిన ఆమె భర్తను చంపాడు.

ఇవన్నీ నీ కెందుకు చెప్పానో తెల్సా. ఇంకొద్ది క్షణాల్లో చావబోతున్నావు. నీకు నిజం తెల్సినా ఫరవాలేదు" అన్నాడు చిదానందం రివాల్వర్ గురిపెడుతూ.

అంతలో ......

"డాడీ....డాడీ" అంటూ రంగా అక్కడికి వచ్చాడు ఆందోళనగా.

"ఏమిటి?" అంటూ ఎదురు వెళ్ళాడు చిదానందం.

చిదానందం చెవిలో ఏదో చెప్పాడు రంగా.

"నిజమా?" అంటూ ఆశ్చర్యంగా ఆనంద్ వైపు చూశాడు చిదానందం.


"అవును."

ఆ మాటలు విని ఆనంద్‌కు దగ్గరగా వెళ్ళి నెత్తిమీద విగ్గు లాగాడు చిదానందం.

విగ్గుతో పాటు ముఖానికి పెట్టుకొన్న మాస్క్ కూడా ఊడి వచ్చింది.

అతను ఆనంద్ కాదు.

విజయ్!!



ఆశయం

ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్!"

"విజయ్ నువ్వా!"

"అవును నేనే"

"ఎవరయితే నేంలే ఉరికంబం ఎక్కాల్సిన నువ్వు నా చేతిలో చస్తున్నావు మూడుఅనేలోపల చస్తావు ప్రార్థించుకో నీ యిష్ట దైవాన్ని' అంటూ రివాల్వర్ గురిపెట్టాడు చిదానందం

ఆఖరి క్షణంలో వారికా రహస్యం ఎలా తెల్సిందో అర్థం కాలేదు విజయ్‌కు

ఇంతకూ..

ఆనంద్ తప్పించుకున్నాడా? లేక ఉరికంబం ఎక్కాడా?

తనిక్కడ....ఆనంద్ అక్కడ

రివాల్వర్ గురిపెట్టి ట్రిగ్గర్‌పై వేలు బిగించాడు చిదానందం

ఒకటి ....

....

రెండు..... ..

....

మూ ....

అంతలో . . . .

"ఢాం" అని రివాల్వర్ పేలిన చప్పుడు విన్పించింది

చిదానందం చేతిలో ని రివాల్వర్ జారిక్రింద పడింది

రివాల్వర్ పట్టుకొన్న చిదానందం అరచేయి ఎర్రగా రక్తసిక్తమయింది

ఉలిక్కిపడి రివాల్వర్ శబ్దం వినిపించిన వైపు తిరిగాడు చిదానందం

విజయ్‌తో సహా అందరూ అటువైపు తిరిగారు

అక్కడ-

ఎస్. పి. నందనరావుగారు రివాల్వర్‌తో నిలబడి ఉన్నారు అతని వెనుక కానిస్టేబుల్స్ చాలామంది నిలబడివున్నారు

"హాండ్సప్ అందరూ చేతులెత్తండి"

అందరూ చేతులు పైకెత్తి నిలబడ్డారు


నందనరావు కనుసైగతో ఒక కానిస్టేబుల్ వచ్చి విజయ్ కట్లు విప్పాడు

విజయ్ అందర్నీ తప్పుకొని చిదానందం పర్సనల్ రూమ్‌లోకి వెళ్లాడు

ష్టవర్‌వాజ్‌లో చిదానందం పెట్టివున్న ఫోటోలను తీసుకొన్నాడు

వాటిలో .....

రంగా హత్య చేస్తున్నట్టు చాలా క్లియర్‌గా వుంది ఈ సాక్ష్యం చాలు తాను



నిర్దోషిగా ఋజువు అవటానికి, రంగాకి ఉరిశిక్ష పడటానికి అనుకొన్నాడు విజయ్

వాట్ని తీసుకొని నందనరావు దగ్గరికి వచ్చి, వాటిని ఇచ్చాడు విజయ్.

సార్ ముసుగుమనిషి ఉరఫ్ ఈ చిదానందం చేసిన నేరాలన్నీ తనే స్వయంగా చెపుతుంటగా టేప్ చేశాను అంటూ పాకెట్‌లోంచి టేప్‌రికార్డర్ తీసి, అందులోంచి కాసెట్ తీసచ్చాడు విజయ్. ఎస్ పి నందనరావు చేతికి

కంగ్రాచ్యులేషన్స్ విజయ్ ఇవిచాలు చిదానందాన్ని అరెస్ట్ చేయడానికి అన్నాడు నందనరావు

చిదానందాన్ని, రంగాని, మిగతా అందర్ని అరెస్ట్ చేశాడు నందనరావు.

'చిదానందం భగవద్గీతలో శ్రీకృష్ణ భగవాను డేమన్నాడో తెలుసా?

పరిత్రాణాయ సాధూనాం,

వినాశాయ చదుష్కృతాం,

ధర్మ సంస్థాపనార్థాయ

సంభవామి యుగే యుగే

ప్రతి యుగంలో నీలాంటి దుష్టులు అవతరించినప్పుడు ఒక్కొక్క అవతారమెత్తుతునుమాడేవాడు ఈ కలియుగంలో నీ లాంటి దుష్టుల అంతం చూసేటందుకు నాలాంటి పోలీస్ ఆఫీసర్ అవతారం ఎత్తాడు అన్నాడు విజయ్

* * * * * * * * * * *

నర్మద బెడ్‌పై పడుకొని ఉంది

చిక్కి శల్యమై సగమైంది నర్మద

మగతగా కళ్ళు మూసుకొని ఉంది

నర్మదా '

పరిచయమైన గొంతులా ఉండటంతో కళ్ళు విప్పింది నర్మద

ఎదురుగా

విజయ్, ఆనంద్‌లు చిరునవ్వు నవ్వుతూ నిలబడి వున్నారు

విజయ్ అంటూ ఒక్క దూకున విజయ్ అక్కున చేరింది నర్మద

ఆ పరుగులో అర్థమవుతుంది ఎంతగా ఆమె విజయ్‌ని ప్రేమించిందీ

విజయ్ ఇది నిజమా కలా?

నిజమే నర్మదా నిజమే

విజయ్

నర్మదా! తిరిగి మనం ఇలా కలుసుకోవడానికి కారణం మీ అన్నయ్య చేసిన త్యాగం, చూపిన సాహసమే కారణం అన్నాడు విజయ్

అప్పటికిగాని ప్రక్కన ఆనంద్ వున్నది గుర్తుకు వచ్చింది నర్మదకు.

అన్నయ్యా

విజయ్ జరిగిందంతా చెప్పాడు

అన్నయ్యా అంటూ ఆనంద్ కాళ్ల మీద పడింది నర్మద

చాల్లేమ్మా ఇదేం పని అంటూ లేవదీశాడు ఆనంద్

ఇంతలో విజయ్ వచ్చాడని తెల్సి సుమతి పరుగెత్తుకుంటూ వచ్చింది

అన్నయ్యా' అంటూ విజయ్‌ను చుట్టుకుపోయింది సుమతి

ఆనంద్ నాదొక కోరికరా?

ఏమిటో చెప్పు

ఇప్పటివరకంటే నీకెవ్వరూ లేరు కాబట్టి నీ ఇష్టం వచ్చినట్లు తిరిగావు ఇక నీకు మేమందరము ఉన్నాము నా మాట మన్నించి

ఆ మన్నించి '

నా చెల్లెలు సుమతిని పెండ్లాడి మా దగ్గరే ఉండిపో ఇక అందరం కలిసే ఉందాం

విజయ్ "

ఇక నువ్వేమీ చెప్పొద్దురా నా మాట విను

ఆలోచనలో పడ్డాడు ఆనంద్

నా కభ్యంతరంలేదు మీ చెల్లెలికిష్టమయితే నాకూ యిష్టమే "

సుమతీ ఏమంటావు?

'నీ యిష్టమే నా ఇష్టమన్నయ్యా' సిగ్గుతో తలవంచుకొంది సుమతి

ముందు నిర్ణయించుకున్న ముహూర్తానికే విజయ్-నర్మద, ఆనంద్-సుమతిల వివాహాలు జరిగాయి

(అయిపోయింది)



ఓ! విష్ణు సిమెంట్
నిజంగా గట్టిదే!
ఉక్కుతో దీటైన
శక్తినిచ్చే...
విష్ణు సిమెంట్
ప్రత్యేకమైన హైగ్రేడ్ లైమ్‌స్టోన్‌తో
తయారై మరేయితర సిమెంటుకన్నా
అత్యధిక దృఢమైనది
ORDINARY
PORTLAND CEMENT
NETT WT 50 KG
WEEK NO | YEAR
NON-LEVY
VISHNU CEMENT
SRI VISHNU CEMENT LTD.
SITAPURAM-508246
శ్రీ విష్ణు సిమెంట్ లిమిటెడ్
గుల్‌మొహర్ ఎవెన్యూ, రాజ్‌భవన్ రోడ్, హైదరాబాద్ - 500 482.

—వ్యక్తిగతం—



43 సంవత్సరాలలో ఐదు లక్షల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేసిన అద్భుతాన్ని సాధించి డాక్టర్ ఎం. సి. మోదీ గిన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లోకి ఎక్కబోతున్నారు. ప్రస్తుతం ఆయన వయసు 70 సంవత్సరాలు. ఒక్కరోజులో ఎక్కువ శస్త్ర చికిత్సలు చేసిన రికార్డును కూడా ఆయనే 1968 లో తిరుపతిలో 833 శస్త్ర చికిత్సలుచేసి స్థాపించారు. బొంబాయి రాష్ట్రంలోని ఒక కుగ్రామంలో 1943 లో నేత్ర చికిత్సా శిబిరం ప్రారంభించిన నాటినుంచి ఈ రికార్డును స్థాపించేవరకూ ఆయన విసుగూ విరామం లేకుండా శస్త్ర చికిత్సలు చేస్తూనే వస్తున్నారు. ప్రతి సంవత్సరం కనీసం 300 రోజులు ఆయన చికిత్సా శిబిరాలు ఏర్పాటుచేస్తూ పర్యటనలోనే ఉంటారు. ఈ శిబిరాలను గ్రామాలలోనూ, పట్నాలలోనూ ఏర్పాటుచేసి, రోగులను పరిశీలించి, శస్త్ర చికిత్స చేయించుకునే వారికి స్థానిక స్వచ్ఛంద సంస్థల సహాయంతో ఆహారం, వసతి, కళ్లజోడు సమకూరుస్తుంటారు. ఆయనకు చాలమంది సహాయకులు ఉన్నప్పటికీ చివరి రోగికి శస్త్ర చికిత్స చేసేవరకూ ఆయన శిబిరం విడిచి వెళ్లరు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య చైతన్యాన్ని కలిగించడంలో తన వంతు కర్తవ్యాన్ని పరిపూర్తి చేస్తున్నానని ఆత్మ విశ్వాసంతో ప్రకటించే డాక్టర్ మోదీ నేత్ర చికిత్సా కార్యక్రమాలు ఈ ఏడాదికే కాకుండా వచ్చే సంవత్సరంలో కూడా చాలా భాగం ముందే నిర్ణయమైపోయాయి... □



టి. వి. చూస్తే వాళ్లందరూ ప్రతి రోజూ బేక్‌మన్ బిస్కట్ల శ్రేష్ఠత గురించి, పార్లే చాకొలెట్ల మాధుర్యం గురించి, రస్నా, రుచి ఉత్పత్తుల నాణ్యత గురించి ప్రకటించే ముద్దులొలికే గొంతుని వింటుంటారు. ఆ గొంతు అమృతా భిండే అనే పదేళ్ల పాపది. ఈ పాప రాక్ సంగీతవేత్త నందూ భిండే కుమార్తె. అలా తండ్రితోపాటు చిన్ననాటినుంచి రికార్డింగ్ స్టుడియోలలో పాడిన అమృతకు ఆకర్షణీయంగా మాట్లాడడం ఉగ్గుపాలతో నేర్చిన విద్యే అయింది. ఐతే ఆమె పొందుతున్న ప్రాచుర్యంలో తండ్రి జోక్యం ఏమీలేదు. ఆ పాపే స్వయంగా ఒక రికార్డింగ్ స్టుడియోలో ఒక సంగీతవేత్త దగ్గరికి వెళ్లి తాను పాడుతానని అన్నది. ఆయన ఏమనుకున్నాడో వెంటనే అంగీకరించాడు. అలా లక్షలాది మందికి గొంతు వినిపించడం ప్రారంభించిన అమృత దీపావళి పాటల కాసెట్ ఒక దానిని కూడా ఇచ్చింది... □

వారఫలం

20-3-1987 శుక్రవారం మొదలు 26-3-1987 గురువారం వరకు

★ **మేషం :** అనుకొన్న దానికన్న ఎక్కువ ఆదాయం చేకూరుతుంది. పత్రికా రంగమయినా గ్రంథ ప్రకటన సంబంధమయినా రాణిస్తుంది. ఆదాయమున్నది. సాహిత్ రంగాన మేలున్నది. స్త్రీలకు : సుఖశాంతులు, ఆదాయమందు వృద్ధి.

★ **వృషభం :** వృత్తి రీత్యా మేలైన కాలం. వృత్తి యందు చెప్పదగిన మేలున్నది. విలువైన వస్తువులు సేకరించుకోగలుగుతారు. రాజకీయములందు మేలు కనిపించుట, ఆదాయం వృద్ధి చెందునను అభిప్రాయమేర్పడుటకు అవకాశమున్నది. విద్యా వేత్తలపరిచయంతో కొందరు మేలు పొందుతారు. స్త్రీలకు: వృత్తియందు వికాసం.

★ **మిధునం :** ఆటల్లో, పోటీలలో, సంగీత పోటీలలో మీకు అనుకూలం మీ మాటకు విలువ పెరుగుతుంది. పది మందిలో కీర్తి ప్రతిష్ఠలు రానున్నవి. బిడ్డలకు అయిన వారి సంబంధం నిశ్చయం కానున్నది. స్త్రీలకు: సర్వానుకూలం, వృత్తియందు పెంపు, నూత్న రీతిని ఆదాయం.

★ **కర్కాటకం :** నూతన వ్యాపారం సానుకూల మయ్యే దినాలు. సర్వ రంగాలలో అనుకూలత చెప్పదగిన సమయం. సభా గౌరవం చేకూరగల సమయం. అప్రయత్న ధన లబ్ధి కొందరి విషయంలో చెప్పదగిన ముఖ్యాంశం. స్త్రీలకు: ఉద్యోగమందు స్వల్పంగాపెంపు.

★ **సింహం :** దూర భారాల నుండి బంధువులు రాగలరు. విద్యా విషయంగా కొందరకు పెంపు చేకూరుట నిశ్చయం.వృత్తి యందు ఏవో మార్పులు రానున్నవి. రాజకీయాలంద పెంపు కనిపించుట గమనింపదగిన అంశం. స్త్రీలకు: ఉద్యోగ యత్నాలు ఫలించగలవను శుభ వార్తా శ్రవణం.

★ **కన్య :** ఆదాయమున్నది. 'శని' భగవానుని అనుకూల్యత యున్నది. ముఖ్య బంధు వర్గీయుల ఆచరణ యున్నది. పోటీలందు గెలుపు చెప్పనైన సమయం. వివాదాలతో గెలుస్తారు. సుఖ శాంతులున్నాయి. కుటుంబానందమున్నది. వ్యాపార లాభమున్నది. స్త్రీలకు: కళా రంగాన మేలు. గాయనీమణులకు సదవకాశాలు. విద్యా విషయంగా పెంపు.

★ **తుల :** రాజకీయంగా ఒక మెట్టు ఎక్కనున్నారు. ఏ కార్యక్రమమైనను, ఒక వేళ వ్యాపార సంబంధమైనదయినను అనుకూలత ఏర్పడుతుంది. స్త్రీలకు : కళా రంగాన మేలు, వృత్తి యందు ప్రగతి, నూతన మైత్రి ఏర్పడుతుంది.

★ **వృశ్చికం :** నూతన వృత్తి యందు వికాసం కనిపించదు. లేనిపోని ఆలోచనలతో సతమతమవుతారు. పోయిన వస్తువులను సేకరించుకోగలుగుతారు. విద్యావేత్త సహాయం లభ్యం కాగలదు. స్త్రీలకు : లలిత కళా విషయంలో ప్రావీణ్యం, ఆభరణాదులేర్పడుటకు అవకాశంగల వారం.

★ **ధనుస్సు :** ఇంట శుభం జరుగుటకు అవకాశమున్నది. నూతన మిత్రులు చేరుతారేమో గమనింపదగిన సమయం. ఉద్యోగమందు చెప్పదగిన మార్పు చేకూరుతుంది. ఇంట బంధు సమాగం, రాజకీయములందు గెలుపు తథ్యం. స్త్రీలకు: ఆదాయం, సంఘ కార్యాచరణ, వృత్తి యందు పెంపు.

★ **మకరం :** ఉద్యోగ రీత్యా మీకు అనుకూలత చెప్పదగిన సమయం. వ్యవహార రీత్యా అనుకూల సమయం.సంఘ సేవా పరాయణత్వం వికాసవంత మవుతుంది. సాధు సజ్జన సాంగత్యం అమరుతుంది. స్మృతి యందు పెంపు చేకూరుతుంది. స్త్రీలకు: ధనలబ్ధి, వృత్తి యందభివృద్ధి, పుణ్య కార్యాచరణం.

★ **కుంభం :** వివరంగా ప్రతి పనియందు నిఘాతో పని చేయాలి. అధికారుల వత్తిడి చేకూరుట నిశ్చయం. రాజకీయాలందు మీ మాటకు అధికాచరణ చేకూరుతుంది. విద్యా విషయంగా పెంపు చెప్పదగిన సమయం. స్త్రీలకు: నగల సేకరణ, నూతన వస్త్ర సేకరణ.

★ **మీనం :** అనుకూల వాతావరణం అన్ని రంగాలలో ఏర్పడనున్నది. మీ మాట నలుగురిలో చెలామణి అయ్యే దినాలు. రాజకీయంగా బాగా పుంజుకుంటారు, యత్నించండి, ఏమైతేనేం? చెప్పరాని వ్యయమున్నది. స్త్రీలకు : సుఖశాంతులు, ధనాదాయం, రాజకీయంగా మేలు చేకూరుట నిశ్చయం. గమనించండి.

—విద్వాన్ కోట సత్యారంగయ్యా శాస్త్రి

రిఫ్రిజిరేటర్-
మీ జీవిత భాగస్వామి

ఆల్విన్ రిఫ్రిజిరేటర్ మీకు సరియైన తోడు. సాంకేతికంగానూ, విశిష్టతలోనూ పనితనంలోనూ ఎదురులేనిది. వాడుకలో ప్రతి ఆల్విన్ రిఫ్రిజిరేటర్ ఒక మణిపూస.

ఆల్విన్ ఎన్నుకోండి. మీరు చిరకాలం హాయిగా కలసి ఉంటారు.

ప్రత్యేక లక్షణములు:-

- హిటాచీ కంపెనీ వారిచే నిర్మించబడిన కంప్రెసర్.
- త్వరితగతిని చల్లబరిచే సమర్థనీయమైన ''రోల్ బాండ్‌ఫ్రీజర్
- స్టెబిలైజర్ అవసరము లేకుండా 170 నుండి 250 వోల్టుల వరకు పని చేయు శక్తిగలది.
- కేవలము మీట నొక్కితే చాలు. దానంతటదే మంచు కరిగిపోవును.
- వీటన్నిటితో బాటు ఏడు సంవత్సరముల గ్యారంటీ.
- ఇంకా దేశవ్యాప్తంగా సాంకేతిక సర్వీసు సౌకర్యం.


మీకు పసందైన రంగులలో 165 మరియు 300 లీటర్లలో సింగిల్‌డోర డబుల్ డోర్‌లలో లభ్యమవుతుంది ఆల్విన్ రిఫ్రిజిరేటర్.



7 సంవత్సరాలు గ్యారంటి

IS : 1476 ISI

ఆల్విన్



అన్ని వేళలందు ఆల్విన్



స్వర్గ్ సే సుందర్ రజతోత్సవ వేడుకలో ముఖ్య అతిథి ఐవామతి ప్రదాత శ్రీ టి సుబ్బరామిరెడ్డితో శ్రీదేవి జయప్రద నిర్మాత కృష్ణమూర్తి

కమల్, సింగీతం శ్రీనివాసరావుల "పుష్పక విమానం"

పుష్పక అనేది ఒకఫైవ్ స్టార్ హోటల్ అందులో ఉండే హీరో దానితో సహా రెక్కలు కట్టుకొని ఎగరాలనుకోవడంవల్ల పుష్పక విమానం అని పేరుపెట్టాం మన నిజ జీవితంలో మనం చూస్తున్న ఎన్నో సంఘర్షణలను తెరపై చూపేందుకు అసలు డైలాగ్ అవసరంలేదు ఈ చిత్రంలో అలా మాట్లాడే అవకాశం ఎవరికీ ఉండదు ఆ విధంగా ఏడేళ్ళుగా నామదిలో మెదులుతున్న ఒక ఊహ ఇంత కాలానికి నాతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న

సినిమా

(18 వ పేజీ తరువాయి)

శృంగార్ నాగరాజ్ మూలంగా కార్యరూపం దాల్చింది. డైలాగులు ఉండవన్నమాటేగాని మామూలు ధ్వనులు రీరికార్డింగ్ అన్నీ ఉంటాయి ఎక్కడా బోర్ కల్గించకపోగా మరింత ఉత్కంఠను పెంచుతుంది. ఇది పూర్తిగా వినోదం శృంగారం సస్పెన్స్ మిళితమైన చిత్రం దీనికి స్క్రీన్‌ప్లే తయారు చేయడం ఎంతో కష్టం అలాగే పాత్రదారులకు కూడా ఒక పరీక్షవంటిది బెంగుళూరులోని ఒకఫైవ్‌స్టార్ హోటల్లో డిసెంబర్లో పదిరోజులు.

జనవరిలో పదిరోజులు షూటింగ్ జరిపాక రషెస్‌వేసి చూసుకుంటే మాకే అమితానందం కల్గింది మనదేశంలో ఇలాంటి చిత్రం తయారవడం ఇదే మొదటిసారి చివరి షెడ్యూల్స్ మార్చ్ ఏప్రిల్ నెలల్లో అన్నారు సింగీతం శ్రీనివాసరావు ఇందులో అమల గుమ్మడి టినూ ఆనంద్ పి ఎల్ నారాయణ సమీర్ తక్కర్ ఇతర పాత్రదారులు

"రామరాజ్యం వచ్చింది"లో ఓ దృశ్యం



దాసరి చిత్రం "ఆత్మబంధువులు లో ఎ ఎన్. ఆర్. జయసుధ

జీవితంలో ఒకే విధమైన కుటుంబ సమస్యలతో బాధపడే రెండు అలసిపోయిన జీవితాల మధ్య జరిగే నవరసభరితమైన కథ అన్నారు కళా ప్రపూర్ణ దాసరి నారాయణరావు ఈయన కథ స్క్రీన్‌ప్లే మాటలు దర్శకత్వం నిర్మాణంలో దాసరి పద్మ



మన సినిమాలో ముద్దుసీనులు తప్పని సరిగా వుండాలని పట్టుబడుతున్నారు గాబట్టి ఓపని చేద్దాం సినిమాను ఇంగ్లీషు బాషలో విదేశాల్లో తీద్దాం!

సమర్పించే తారకప్రభు పిలిమ్స్ వారిపై చిత్రంలో ఎ ఎన్ ఆర్ జయసుధ సుధాకర్ – అనూరాధ హరిప్రసాద్ – కుట్టి పద్మిని వీరభద్రరావు – శ్రీలక్ష్మి వేలు – రమాప్రభ ప్రసాద్‌బాబు – రాజ్యలక్ష్మి మరికొన్ని కీలకమైన పాత్రలలో మురళీమోహన్ రాధిక ప్రభ జంటగా మరో ప్రముఖ నటుడు నటి లాయర్‌గా ఒక విశిష్టమైన పాత్రలో దాసరి నటిస్తున్నారు ఫ్రిబవరి 20 నుంచి నెలాఖరువరకు తొలి షెడ్యూల్ జరిగింది మలిషెడ్యూల్ మార్చి 8 నుంచి నెలాఖరువరకు రమేష్‌నాయుడు సంగీతం శరత్ ఛాయ కె ఎల్ దర్ శిల్పం సూరపనేని రాధాకృష్ణ – పి శ్రీనివాస్ – దిమిత్రావ్ సంయుక్త దర్శకత్వం కృష్ణంరాజు కూర్పుతో అట్లూరి సోమశేఖరరావు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ దాసరి పుట్టినరోజు మే 4 న విడుదలవుతుంది



"దొరికితే దొంగలు"లో రాధ, శోభన్‌బాబు



"కిలాడి దొంగలు"లో రంచి, భానుచందర్

తాయారమ్మ-తాండవ కృష్ణ"

తాయారమ్మ అమ్మమ్మ తాండవ కృష్ణ మనమడు ప్రాణప్రదంగా తాను అబిమానించే అమ్మమ్మ ప్రాణంకోసం వివాహం చేసుకోవలసిన నాస్తికుడైన మనమడు హఠాత్తుగా ఆస్తికుడైన బ్రహ్మచారిగా హనుమంతుని భక్తుడుగా మారడంతో ఎన్నో చిక్కులు తటస్థిస్తాయి అవి ఎలా తొలగిపోతాయో ఆద్యంతం కడుపుబ్బ నవ్వించే రీతిలో రూపొందించాం మా కెమెరామన్ కబీర్‌లాల్ స్వల్ప వ్యయంతోనే నయనానందకరమైన ట్రిక్స్ తీశారు అన్నారు కొమ్మినేని ఈయన దర్శకత్వంలో పోలా రామయ్యశెట్టి సమర్పించే లోకేశ్వరి ఆర్ట్ క్రియేషన్స్ వారిపై చిత్రంలో అయిదు ఇంపైన పాటలున్నాయి వాటిని తెరకెక్కించిన తీరు కూడా నేత్రపర్వంగా ఉంది అర్జున్ పాత్రకారు జానకి రజని గొల్లపూడి మారుతీరావు జె వి సోమయాజులు రాళ్ళపల్లి వై విజయ పద్మనాభం బేబీ సీత త్యాగరాజు వేలు వీరబద్రరావు జయవిజయ నళినీకాంత్ వంకాయల నటించారు కె రవీంద్రబాబు కథ కాశీ విశ్వనాథ్ మాటలు చక్రవర్తి సంగీతం శివశంకర్ నృత్యాలు జూడో రత్నం సాహసాలు వి రవీంద్రబాబు కూర్పుతో పోలా శ్రీనివాసులు నిర్మాత



"అజాత శత్రువు"లో అనూరాధ

రేలంగి దర్శకత్వంలో మిద్దే రామారావు 13వ చిత్రం

ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని ఒక సోదరుడు పెద్దలు నిశ్చయించిన అమ్మాయిని పెళ్ళి చేసుకొని ప్రేమించాలని మరో సోదరుడు వీరిద్దరి మధ్యసాగ తమాషా కథను భమిడిపాటి రాధాకృష్ణ రూపొందించారు ఫిబ్రవరి 18 నుంచి 28 వరకు తొలి షెడ్యూల్ జరిగింది మార్చి 16 నుంచి 31 వరకు మలిషెడ్యూల్ అన్నారు శ్రీ రాజలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ మిద్దే రామారావు ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్ – రజని శుభలేఖ సుధాకర్ - పూర్ణిమ వేలు వీరభద్రరావు కోట శ్రీనివాసరావు శ్రీలక్ష్మి లక్ష్మీచిత్ర డబ్బింగ్ జానకి వగైరా నటవర్గం సత్యానంద్ చక్రవర్తి బి కోటేశ్వరరావు సాయికుమార్ సతీష్ ఎన్ వెంకటేశ్వరరావు ఉదయ్, డి వెంకటరత్నం ప్రభృత సాంకేతిక వర్గంతో రేలంగి నరసింహారావు దర్శకుడు

ప్రెసిడెంట్ గారి అబ్బాయి లో బాలకృష్ణ, సుహాసిని



"లాయర్ భారతీదేవి"లో శారద, కల్యాణ చక్రవర్తి





"అక్షింతలు"లో పూర్ణిమ

చక్రవర్తి దర్శకత్వంలో 'మా పల్లెలో మగాడు


అమాయక ప్రజలను కూలీలను బానిసలుగా ఒక గ్రామంలో భూస్వాములు పరిగణిస్తుంటారు వారంతా ఏకమై భూస్వాములను ప్రతిఘటిస్తారు. ప్రజలకోసం ప్రజా చైతన్యంకోసం క్వారీలో పనిచేసే పీడిత ప్రజలలోంచి మెరుపులా దూసుకువచ్చిన ఓ వీర విప్లవ జ్వాలా కెరటం మా పల్లెలో మగాడు షూటింగ్ పూర్తయింది అన్నారు ఎన్ బి చక్రవర్తి ఈయన స్క్రీన్‌ప్లే దర్శకత్వంలో సూరపనేని బాపనారాయణ నిర్మించిన వెట్టిచాకిరీకి సంబంధించిన ఫై చిత్రంలో అర్జున్, అర్చన, రమ్యకృష్ణ సుధాకర్ కోట శ్రీనివాసరావు నూతన్‌ప్రసాద్ ఈశ్వరరావు వీరభద్రరావు జీవా జయభాస్కర్ కిరణ్‌బాబు కాంచన నిర్మల నటించారు బీశెట్టి కథ మధు మాటలు వేటూరి పాటలు చక్రవర్తి సంగీతం పి ఎస్ ఆర్ స్వామి ఛాయ కె గోపాలరావు కూర్పు శివశంకర్ నృత్యాలు సత్తిబాబు సంయుక్త దర్శకత్వంతో గొగినేని ప్రసాద్ సమర్పణ

'చిన్నారి దేవత"లో రజని, అర్జున్





"కేడి"లో రాధ, కమలహాసన్



"కార్తీక పౌర్ణమి"లో శోభన్‌బాబు, భానుప్రియ

అవి – ఇవి

• "నిర్మా" సోప్ ప్రకటనంలోను, "శ్రీకాంత్" టి. వి. సీరియల్‌లోను నటించిన సుజాతా మెహతా తొలిసారిగా "పురుషార్థం" అనే మలయాళ చిత్రంలో నాయికగా నటిస్తోంది.

• భాగ్యరాజ్ ఇటీవల ఓ విషయం చెప్పారు. సినిమా రంగంలో ప్రవేశించడానికి ముందు ఈయన క్రైస్తవ ప్రచార సమితి కోసం పావుగంట రేడియో నాటికలను పాతికకు పైగా రాశారట.

• దర్శకుడు, నిర్మాత, రచయిత, నటుడు, సంగీత దర్శకుడు, ఛాయాగ్రాహకుడు, ఎడిటరు అయిన టి. రాజేందర్ తాను పరిచయం చేసిన కొత్త తారలను మళ్ళీ బుక్ చేయడట. ఎందుకని అడిగితే, "నా చిత్రంతో వాళ్ళు పేరు సంపాదించుకుని ఎన్నో చిత్రాలలో బుక్ అయి ఇట్టే బిజీ అయిపోతున్నారు. నాకే కాల్‌షీట్లు సర్దుబాటు చేయలేక పోవచ్చు. ఈ బాధలన్నీ పడే వారెవరు? వాళ్ళ చుట్టూ తిరగడం కన్నా కొత్త వాళ్ళను పరిచయం చేస్తే పోలా?" అంటారు.

• ఇటీవల అస్వస్థతకు లోనైన శివాజీ గణేశన్ బెంగళూరులోని ప్రకృతి చికిత్సా కేంద్రంలో వారం రోజులు ఉండి వచ్చాక బాగా సన్నబడి, మరింత చురుకుగా కనిపిస్తున్నారు. "మీకో విషయం చెప్పనా? దాదాపు 30 ఏళ్ళ క్రితం 'మనోహర' చిత్రంలో ఒంటినిండా సంకెళ్ళతో బంధింపబడి, ఆవేశంతో డైలాగులు చెప్పాను. ఇటీవల 'విశ్వనాథ నాయకుడు' చిత్రంలో నాగమ నాయకుడుగా సంకెళ్ళతో బంధింపబడి, అంతకన్నా ఆవేశంగా నా చేత డైలాగ్‌లు చెప్పించారు దాసరి నారాయణరావుగారు", అన్నారు.

• ఎస్. ఎస్. చంద్రన్ అనే తమిళ హాస్య నటుడు – రచయిత కూడా. కథ చర్చల్లో పాల్గొంటే కొంత పారితోషికం, హాస్య సన్నివేశాలు రాస్తే మరికొంత పారితోషికం, నటిస్తే మరి కొంత పారితోషికం చొప్పున తీసుకుంటూంటాడు.

• ఎం. ఆర్. రాధా పుత్రుడు రాధారవి న్యాయశాస్త్రంలో పట్టభద్రుడు. ఇప్పుడెన్నో తమిళ చిత్రాలలో నటిస్తున్నాడు. తనకొచ్చే సంపాదనను మూడు భాగాలుగా చేసి, ఒక వంతు తల్లికి, మరో వంతు ఇంటి ఖర్చులకు, మిగతా మొత్తాన్ని కష్టాలలో ఉన్న కళాకారుల సహాయార్థం వినియోగిస్తుంటాడు.

• రాధ అక్క అంబిక మద్రాసులో నాలుగంతస్తుల ఆస్పత్రి ఒకటి నిర్మిస్తోంది.

• 1985లో తమిళంలో 166 చిత్రాలు విడుదలవగా, 1986లో డబ్బింగ్ చిత్రాలతో సహా 150 చిత్రాలు విడుదలయ్యాయి.

(జి. వి. జి.)



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

ఆర్. టి. బి. – పిప్పర

నాకు గత 4 సంవత్సరములుగా మూత్రంలో షుగర్ వుంది. మాత్రలు వాడగా షుగర్ పర్సంటేజ్ తగ్గింది. చాలా నీరసం వస్తున్నది. పంచదార నీళ్ళు త్రాగినా తగ్గట్లేదు. ఆకలి హెచ్చుగా వుంటుంది. మామూలు బియ్యపు అన్నం మాత్రం తింటున్నాను. ఇంకా ఏదైనా ఆహారం మార్చ వలసి ఉంటుందా?

★ డయాబెటిస్ వున్న వారికి నీరసం, షుగర్ మొదలైనవి రెండు విధాలుగా రావటానికి అవకాశం ఉన్నది. రక్తంలో గ్లూకోజ్ ప్రమాణం ఎక్కువైనా, తక్కువైనా ఇలా జరిగే అవకాశం ఉంటుంది. ఇటు వంటి లక్షణం ఉన్నవారు తరచూ బ్లడ్ షుగర్ పరీక్ష చేయించుకోవటం అవసరం. అలాగే మీ అంతట మీరే మూత్ర పరీక్ష చేయటం నేర్చుకొని షుగర్ ఎక్కువ, తక్కువలను బట్టి మాత్రల ప్రమాణాన్ని వైద్యుల సలహా ననుసరించి నిర్ణయించుకో వలసి ఉంటుంది. ఆహారం కొద్దిగా తగ్గించి, కూరలు ఎక్కువగా తీసుకుంటే మంచిదని ప్రస్తుత అంచనా.

ఎన్. ఎన్. ఆర్. – యాదికి


నా భార్యకి 10 సంవత్సరముల క్రితం మైట్రల్ స్టినోసిస్‌కి వాల్వాటమి చేసారు. వారానికి రెండు రోజులు ఎసిడ్రెక్స్ మాత్రలు వేయమన్నారు ఉప్పు వేసుకో కూడదన్నారు. 10 సంవత్సరములుగా అలాగే చేస్తున్నది. ప్రస్తుతం అదుర్దా చెందినా, కోపంగా మాట్లాడినా ఆయాసం వచ్చి, గుండె వేగంగా కొట్టుకుంటుంది ఈ మందులు వదలకుండా వాడ వచ్చా? రెండు మూడు సార్లు కె. జి. హెచ్ కి వెళ్ళి అడిగితే అవే వాడమన్నారు. తర్వాత వెళ్ళటం మానివేశాము

★ అక్కడే మరలా టెస్టు చేయించు కోవటం అవసరం. ఎసిడ్రెక్స్ మాత్రలను నిరంతరంగా వాడవలసిన అవసరం లేదు. బ్లడ్ ప్రెషర్ ఉన్నదేమో పరీక్షింపచేసి, తగిన మందులు వాడటం అవసరం. మల్వాటమీ తర్వాత మైట్రల్ రీగర్జిటేషన్ ఎక్కువగా ఉందేమో పరీక్షింప జేయండి.

ఎమ్. ఆర్. – అనకాపల్లి

నా వయస్సు 20 సంవత్సరములు. నాకు రెండు సంవత్సరముల నుండి మలములో తెల్లగా చిన్న చిన్న తుమ్మి పురుగులు పడుచున్నవి.

★ ఈ పురుగుల పేరు ఆక్సీయూరిస్ వర్మికులారిస్, వీటిని తొలగించటానికి పై పరజీన్ సిట్రేట్ లేక అడిపేట్ వాడటం మంచిది. ఈ మాత్రలను రోజుకి మూడు వంతున ఒక వారం పాటు వరుసగా వాడాలి. కుటుంబంలోని సభ్యులందరూ ఒకే సారిగా ఈ మందు వాడటం మంచిదని కొందరి అభిప్రాయం. గోళ్ళు కత్తిరించు కోవటం, మల విసర్జన సమయంలో పాదరక్షలు ధరించటం, మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవటం ఈ క్రిములు మరలా రాకుండా తీసుకో తగిన జాగ్రత్తలు. □


వేపుడుకో పాన్
నిండు నూనెలో వేయించటానికో బాణలీ
మగ్గ పెట్టటానికో పాత్ర
ప్రెషర్ కుక్ చేయటానికి మరో నాల్గవ పాత్ర
ఉపయోగించే ప్రతి గృహిణికి
ముచ్చటైన మూడు ముక్కల సలహా....
ప్రెస్టీజ్
ప్రెషర్ పాన్
ఎంత చేయగల్గుతుందో
ఎంత త్వరితంగా
చేయగల్గుతుందో కనిపెట్టండి
ఇది వేపుతుంది.
ఇది నిండు నూనెలో వేపుతుంది
ఇది మగ్గ పెడుతుంది.
జిఆర్ఎస్
100%
సురక్షణకి
ఇంతే కాకుండా మాములుగా
ప్రెషర్‌కుక్ చేస్తుంది
Prestige
PRESSURE
PAN
©
ttk తయారి
సాధారణమైన మరియు ఎత్తైన మూతలలో లభ్యమవుతుంది.
మీవద్ద ప్రెస్టీజ్ ప్రెషర్‌కుక్కర్ ఉంటె మూత
అక్కరలేకుండా మీరు ప్రెషర్‌పాన మాత్రమే కొనుక్కోవచ్చు
MAA(S) PP 2B TEL87

ఇది కథ కాకూడదు

ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్

ఉదయం తొమ్మిది గంటలయింది రోజూ ఉదయం ఎనిమిది గంటలకే నర్సింగ్ హోంకి బయలుదేరడం అలవాటు నాకు ఎనిమిదింపావుకల్లా నేను కారు దిగకపోతే నర్సింగ్ హోం దగ్గర వేచి ఉండే పేషంట్స్, నా అసిస్టెంట్స్ కూడా ఇక ఆ పూటకో లేదా ఆ రోజుకో రానని నిర్ణయించుకుంటారు ఎందుకంటే గత పది, పదిహేను సంవత్సరాలలో నేను ఆలస్యంగా వెళ్ళిన సందర్భాలు వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు

ఆ రోజు గంట ఆలస్యంగా కారు దిగుతున్న నన్ను చూసి నా అసిస్టెంట్ డాక్టర్ స్వరూప్ ఆశ్చర్యంగా "ఏమిటి డాక్టర్ ఇంత ఆలస్యం అయింది!"? ఇక ఈ రోజు ఏ కారణం చేతనైనా మీరు రారేమోనని విశ్వం వచ్చే వరకూ ఉండి పోదామనుకున్నాను' అన్నాడు

"రాత్రి సరిగ్గా నిద్ర పట్ట లేదు స్వరూప్ అందుచేత ఆలస్యం అయ్యింది రింగ్ చేద్దామంటే ఫోన్ పని చేయడం లేదు' అన్నాను నేను కన్సల్టింగ్ రూములోకి దారి తీస్తూ

'మీ ఇంటికి ఫోన్ ట్రై చేసా డాక్టర్ బహుశా మీ ఫోన్ పని చేయనందు వల్లనేమో కంటిన్యూస్‌గా ఎంగేజ్‌డ్ సౌండ్ వచ్చింది" అన్నాడు స్వరూప్ నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ

'ఎనీ థింగ్ స్పెషల్?" అని అడిగాను కళ్ళు చిట్లిస్తూ

"అంతా ఓ! కె! డాక్టర్ కానీ పదవ నెంబరు గదిలో నిన్న అడ్మిట్ అయిన కుర్రాడు మాత్రం రాత్రంతా చాలా రెస్ట్‌లెస్‌గా ఉన్నాడు

"ఆఁహఁ! నేను సరిగ్గా నిద్ర పోలేక పోవడానికి కారణం కూడా కొంత వరకూ ఆ కుర్రాడే."

డాక్టర్!! మీరు అతనిని వెంటనే చూస్తే మంచిదేమో" అన్నాడు స్వరూప్ ఒక్కసారిగా

"కండీషన్ అంత బాడ్‌గా ఉందా!!?"

"బాడ్ అని అనను గాని ..

"రైట్ అయితే వెంటనే చూద్దాం పదండి" అంటూ పదవ నెంబరు గదిలోకి నడిచాను స్వరూప్, సిస్టర్ నివేదిత నన్ను అనుసరించారు

'నమస్కారం డాక్టర్‌గారూ" కుర్రాడి తల్లి చేతులు జోడించింది నిద్రలేమి, అలసట, బెంగ వలన ఆమె ముఖం నీరసంగా ఉంది.

"నమస్కారం ఏమిటీ!!? బాబు ఎలా ఉన్నాడు?" అని ప్రశ్నించాను

రాత్రంతా చాలా బాధ పడ్డాడండీ. ' ఆమె కంఠం పూడుకుపోయింది కళ్ళమ్మట నీళ్ళు ధారగా కారుతున్నాయి

"పరవాలేదమ్మా. మీరేమీ కంగారు పడకండి అతను త్వరలోనే కోలుకుంటాడు మందులు మాత్రం చెప్పినట్లు వేయండి" అన్నాను నేను కుర్రాడిని పరీక్షించిన తరువాత అతని పరిస్థితి ఏ మాత్రం మెరుగు అవలేదనే విషయం తేటతెల్లమయింది అయితే నాకు అతని ప్రస్తుత పరిస్థితి నిరాశ, ఆశ్చర్యం మాత్రం కలిగించలేదు

"స్వరూప్ అవసరమయితే ఐ వి ఫ్లూయిడ్స్ ఇవ్వండి బైదివే నేను పని మీద బయటకు వెడుతున్నాను. మీరు ఇంటికి వెళ్ళి ఈ రోజుకు మాత్రం వెంటనే వచ్చేయ్యండి అవసరమైతే నైట్ డ్యూటీ నేను చేస్తాను సారీ ఫర్ ది ట్రబుల్'

"పరవాలేదు డాక్టర్ ఎటూ డాక్టర్ విశ్వం, డాక్టర్ రజని వస్తారు కదా వాళ్ళు చూస్తూంటారు ఏదైనా ప్రొబ్లెమ్ ఉంటే నేను అటెండవుతాను నేను ఒక గంటలో వచ్చేస్తాను. నైట్ డ్యూటీ వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరు చేస్తారులెండి" అన్నాడు స్వరూప్

"థాంక్యూ థాంక్యూ వెరీ మచ్ "

"ఇందులో థాంక్సు చెప్పాల్సిన అవసరం ఏముంది డాక్టర్!??"

'ఐ యామ్ రియల్లీ ప్రౌడ్ ఆఫ్ యు మన టీమ్ ఇలా ఉండబట్టే మన నర్సింగ్ హోంకి అంత మంచి పేరుంది" అన్నాను నేను నవ్వుతూ.

ఆ రోజుకి పేషెంట్స్‌ని చూడటం పూర్తయ్యింది స్వరూప్ త్వరగానే వస్తానని ఇంటికి వెళ్ళాడు. నేను కన్సల్టింగ్ రూమ్‌లో పరధ్యాన్యంగా మెడికల్ బుక్స్ తిరగేస్తున్నాను ఆ రోజు పోస్ట్ వచ్చింది మెడికల్ జర్నల్సు వచ్చాయి వాటిని తిరగేస్తూ కూచున్నాను నా దృష్టి హఠాత్తుగా ఒక చోట కేంద్రీకృతమైంది నాభికుటి ముడి పడింది గుండె వేగం హెచ్చింది చదివిందే మళ్ళీ, మళ్ళీ చదివాను నా మనస్సంతా ఏదో ఉద్వేగంతో, ఉత్సాహంతో ఊగిసలాడింది. వెంటనే ఫోన్ తీసి ఒక నెంబరు డయల్ చేసాను

"హలో మిష్టర్ రావ్!! డాక్టర్ ప్రసాద్‌ని మాట్లాడుతున్నాను ఆ స్థలాల విషయమై మాట్లాడడానికి ఈ రోజు వస్తానన్నాను కదా సారీ రావడం కుదరదు. అనుకోకుండా వేరే పని తగిలింది ఇంకో రోజు వస్తాను. వచ్చే ముందు ఫోన్ చేస్తాను" అంటూ అవతలి వ్యక్తికి మాట్లేడేందుకు అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేసాను తరువాత ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌పర్‌మెంటల్ మెడిసిన్‌కి ఫోన్ చేసి ప్రొఫెసర్ నవనీత్‌తో ఇంటర్వ్యూ తీసుకున్నాను ఒక గంట తరువాత రమ్మని చెప్పాడాయన

ఒక గంట సేపు ఎలా గడిచిందో నాకే తెలియదు స్వరూప్ వచ్చాడు

స్వరూప్ నేను అర్జంట్ పని మీద వెడుతున్నాను వచ్చేసరికి ఏ వేళ అవుతుందో తెలియదు బహుశా ఈ వాళ అందరం నైట్ డ్యూటీ చేయాల్సి ఉంటుందేమో' అన్నాను సాలోచనగా

'డాక్టర్ మీరు చెపుతున్నదేమిటో అర్థం కావడం లేదు' అన్నాడు స్వరూప్.

'ఇప్పుడు చెప్పే వ్యవధి కానీ, కుతూహలం కానీ లేవు నే వస్తాను' అంటూ గబగబా వీధి గుమ్మం వైపు నడిచాను స్వరూప్ నా వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు.

* * * *

గుడ్ మార్నింగ్ ప్రొఫెసర్' అంటూ చిరునవ్వు నవ్వాను నేను ప్రొఫెసర్ నవనీత్ రూములో ప్రవేశిస్తూ

గుడ్ మార్నింగ్ డాక్టర్ ప్లీజ్ బీ సీటిడ్" అన్నాడు ప్రొఫెసర్ నవనీత్

'ఏమై డిస్టర్బింగ్ యూ బైఎనీ ఛాన్స్!!??'

"నో నో డాక్టర్. నాటెటాల్. అయినా డాక్టర్ ప్రసాద్ నా కోసం వచ్చారంటే ఏదో ముఖ్యమైన పని ఉండే ఉంటుంది. అంత బిజీ అయిన మీరు ఊరికే రారు కదా" అన్నాడు నవనీత్ నవ్వుతూ.

'మీ ఊహ కొంత వరకూ నిజమే . మీ ఆర్టికల్స్ మెడికల్ మేగజైన్స్‌లో చదువుతూ ఉంటాను లేటెస్ట్ మెడికల్ జర్నల్‌లో ఒక చైల్డ్ డిసీజ్ గురించి చాలా బాగా రాసారు. అది చాలా ఎనలటికల్‌గా ఉంది. నిజంగా మీలాంటి వ్యక్తి ఒక భారతీయుడు కావడం . మాకందరికీ గర్వకారణం.'

"ఏదో మీరలా అంటారు గాని ... న్యూటన్ మహాశయుడు చెప్పినట్టు నేను విజ్ఞాన సాగరపు ఒడ్డున గులక రాళ్ళు ఏరుకునేవాడిని అయినా మెడికల్ ఫీల్డులో మిమ్మల్ని మించిన వారు ఈ దేశంలో ఎంత మంది ఉన్నారు చెప్పండి !?"

'మనది మ్యూట్యువల్ ఎడ్మైరేషన్ సొసైటీ అయిపోతోంది. . నాకు మీ సహాయం కావాలి సార్' అన్నాను ఒక్కసారి సీరియస్‌గా

"నా సహాయమా "!? ఓ' యస్ నేను చెయ్యగలిగిన దేమన్నా ఉంటే తప్పకుండా చేస్తాను."

"సార్! ఈ రోజు మెడికల్ జర్నల్‌లో మీ ఆర్టికల్ చదివిన తరువాత ఎందుకో నాలో పెద్ద తుఫాను రేగింది నేను చదివిన విషయం నన్ను విపరీతంగా ప్రభావితం చేసింది" అన్నాను నేను గంభీరంగా

"నాచురల్ డాక్టర్ అది ఒక భయంకరమైన పిల్లల వ్యాధి గురించి నేను చేసిన రీసెర్చి గురించి రాసినది. మీరు చైల్డ్ స్పెషలిస్ట్ గనుక అది మిమ్మల్ని ప్రభావితం చేయడంలో విశేషమేమీలేదే!!?"

"సార్! నాకు ఇంకాకొన్ని వివరాలు కావాలి."

"అంటే!!??.. "

"ఆ వ్యాధికి ప్రస్తుతం మందు లేదనీ, ఆ వ్యాధి సోకిన పిల్లల మరణం తథ్యమనీ, అది కూడా బాధాకరమైన మృత్యువు అనీ మీకూ తెలుసు."

'అవును!!

'ఆ వ్యాధికి మందు కనిపెట్టడానికి మీరు తీవ్రంగా కృషి చేస్తున్నారు '

"నిజమే అయితే ప్రస్తుతం అది కేవలం జంతువుల మీద ప్రయోగిస్తున్నాం వాటిపై కూడా పరిశోధన ఇంకా ప్రాథమిక దశలో ఉంది ఎలా పని 'చేస్తుంది'? సైడ్ ఎఫెక్ట్సు ఏమిటి'? టాక్సిక్ ఎఫెక్ట్సు ఏమిటి'? అనే విషయాలు ఇంకా ఏమీ తెలలేదు "

"సార్' ఒక వ్యక్తిని మనం చంపవచ్చా''? ఆహ!' ఊరికేనే అడుగుతున్నాను '

'వ్హాట్'' డాక్టర్ ప్రసాద్ ఈ రోజ మీకేమయ్యింది''? మీరు డాక్టరుగా కేవలం రోగులని రక్షించాలి గాని అటువంటి ఆలోచనైనా రానివ్వకూడదు

"అది కాదు సార్' కొన్ని, కొన్ని వ్యాధులకు మందులేదు కదా అటువంటి వారిని శాంతియుతంగా చావనిస్తే మంచిదేమో ఈ విషయమై కొన్ని దేశాలలో ఉద్యమాలు కూడా మొదలు పెడుతున్నారు చనిపోయే హక్కు మనిషి కుండాలని, ఏ విధంగానూ నయం కాని వ్యాధులతో బాధపడే వారు చనిపోయే స్వేచ్ఛను కలిగి ఉండాలని బంధువుల అనుమతిపై డాక్టర్లు మృత్యువుని అటువంటి వ్యక్తులకు త్వరగా వచ్చే ఏర్పాట్లు చేసే విదంగా చట్టాలు మార్చాలని అన్నాను నేను

కాని ఏ నాగరిక దేశం, చట్టం అటువంటి పనులకు ఒప్పుకోవు, ఒప్పుకోకూడదు అన్నాడు నవనీత్ చాలా ధృడంగా.

కానీ ఒకమ్మాయి విషయంలో కోర్టు కూడా ఒప్పుకుంది సార్ . బహుశా ఇంగ్లండులో అనుకుంటా అనేక సంవత్సరాలుగా జీవచ్ఛవంలా పడి ఉన్న పసిపాపకు ఆక్సిజన్ వగైరా సరఫరా ఆపు చేయమని తల్లిదండ్రులు పెట్టుకున్న అర్జీ కోర్టు ఒప్పుకుంది ఆ పాప శాంతియుతంగా మరణించింది కూడా రోజూ ఆ పాపని చూడడం బాధ పడడం కన్నా ఆ తల్లిదండ్రులకు అదే నయమనిపించింది''

'అయ్యుండొచ్చు కాని అటువంటి చట్టం వస్తే అనేక లీగల్ కాంప్లికేషన్స్ ఎదురు అవుతాయి స్వార్థపరులు తమకి అడ్డుగా ఉన్న వ్యక్తులని, ఇష్టంలేని వ్యక్తులని వదులించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది '

"అవచ్చు సార్ కానీ మనం మనిషిని బ్రతికించలేక, చంపలేక అతనికి చనిపోయేందుకు స్వేచ్ఛను ఇవ్వలేక!'' ఎందుకో ఆవేశాన్ని ఆపుకోలేక పోతున్నాననిపించింది నాకు

మళ్ళీ నేనే 'సార్' ఒకవేళ తప్పని పరిస్థితులలో నేనే ఒక వ్యక్తికి నిశ్చితమైన మరణాన్ని త్వరిత పరిస్తే''?' అన్నాను

"డాక్టర్''?? వాటార్ యు టాకింగ్''? అటువంటి పనిని కలలోనైనా తలపెట్టకండి అటువంటిదే జరిగితే మీరు చట్టం దృష్టిలోనే కాక సమాజం దృష్టిలో కూడా నేరస్థులవుతారు''

పోనీ అలా చెయ్యక పోయినా మీరు జంతువులపై ప్రయోగించే మందు నాకివ్వగలరా'?

డాక్టర్''?? వాట్ హాపెండ్ టుయూ'? ఈ రోజ ఎందుకలా ప్రవర్తిస్తున్నారు''? ఎందుకలా మాట్లాడుతున్నారు''?? మీరు ఆ మందుతో ఏం చెయ్యదలుచుకున్నారు''? అన్నాడు నవనీత్ ఆశ్చర్యం, భయం మిళితమైన స్వరంతో


నేనొక వ్యక్తిపై ప్రయోగిస్తాను ' సాధ్యమైనంత నెమ్మదిగా అన్నాను నేను 'అవును సార్' మీరు ఏ వ్యాధిపై రీసెర్చి చేస్తున్నారో, ఆ వ్యాది కల ఒక పేషంట్ ప్రస్తుతం నా నర్సింగ్ హోంలో ఉన్నాడు

"ఏమిటి''??? మీరు ఆ మందుని ఒక వ్యక్తిపై ప్రయోగిస్తారా'?

నో'' నో'' ఇటీజ్ ఇంపాసిబుల్ ఇంకా జంతువులపై ప్రయోగాలే ప్రాథమిక దశలో ఉన్న ఒక మందుని మనుషులపై ప్రయోగించడం ప్రమాదకరం, అమానుషం, నేరం నే నొప్పుకోను అయామ్ సారీ" అంటూ తల దించుకున్నాడు నవనీత్

"మన కళ్ళ ముందే మనిషి భయంకరమైన బాధతో చనిపోతూ ఉంటే చూస్తూ ఊరుకోవడం అమానుషం కాదంటారా!'? అది నేరం కాదా'? సార్ మిమ్మల్ని అర్థిస్తున్నాను ప్లీజ్'' ప్లీజ్''' అన్నాను నేను ఆవేశంగా

కానీ కానీ డాక్టర్ అది నేరం తీవ్రమైన



పరిణామాలను ఎదుర్కోవలిసి వస్తుంది "

'నాకేమైనా పరవాలెదు సార్ నన్ను జైల్లో పెట్టినా, ఉరి తీసినా, ఏం చేసినా పరవాలేదు . . నాకా మందు ఇవ్వండి సార్. ప్లీజ్ మీ బాధ్యత ఏమీ లేదనీ అంతా నాదేనని ఉత్తరం రాస్తాను. పోలీసులకు చెపుతాను!!" ఉద్వేగంతో నా కంఠం అదోలా ధ్వనించింది

"ప్లీజ్ డాక్టర్ కామ్ డౌన్. అసలు ఇంత ఎక్స్ట్రీమ్ స్టెప్ ఎందుకు తీసుకోవాలనుకుంటున్నారు!?"

"సార్!! నిన్న ఉదయం ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. అది నన్ను విపరీతంగా కదిలించి వేసింది. నేను రోజూ లాగానే నర్సింగ్ హోమ్‌లో అడుగు పెట్టాను. 'నా బిడ్డని చంపెయ్యండి డాక్టర్!! నా బిడ్డని చంపెయ్యండి!!' అంటూ ఒక మధ్య వయస్కురాలు నా కాళ్ళ మీద పడింది. ఒక్క నిమిషం నాకేమీ అర్థం కాలేదు. నే విన్నది పొరపాటేమోనని అనుకున్నాను పలానా వారిని బతికించమని కాళ్ళావేళ్ళా పడ్డం చూసాను గాని అలా జరగడం నా జీవితంలో నే మొదటిసారి. తరువాత విచారిస్తే ఆమెకు ఒక కొడుకు ఉన్నాడనీ, అతను ప్రస్తుతం మనం నయం చేయలేని ఒక భయంకర వ్యాధితో బాధపడుతున్నాడనీ, ఆ బాధను చూడలేక ఆమె అలా దీనంగా అర్థించిందనీ తెలిసింది వెంటనే నాకు ఇందాక మీకు చెప్పిన సంఘటన గుర్తుకు వచ్చింది ఆ పాపకీ నిన్న వచ్చిన కుర్రాడికి చాలా పోలికలు కనిపించాయి

. . . . కానీ ప్చ్!! ఆ క్షణంలో మీరు చెప్పిన చట్టం, సంఘం నన్ను నిర్వీర్యుణ్ని చేసాయి అదీ ఒకందుకు మంచిదే అయిందనుకోండి నిన్న రాత్రంతా నాకు నిద్దర పట్టలేదు కానీ ఈ రోజు మీరు రాసినది చదివాక ఒక కొత్త వెలుగు' కనిపించింది ఒక ఆశ జనించింది ఒక నిర్ణయానికి వచ్చాను సార్ డాక్టర్‌గా ఇన్నాళ్ళ అనుభవం ఉన్నా నిన్నటి సంఘటన నన్ను విపరీతంగా కదిలించి వేసింది

ఇంక మాట్లాడలేక ఆగిపోయాను

ఇది కథ కాకూడదు

"ఓ! రియల్లీ ఇంటరెస్టింగ్' అన్నాడు నవనీత్

'అవును సార్ నాకు ఎందుకో ఛాలెంజ్ తీసుకోవాలనిపిస్తోంది అయినా ఏమవుతుంది? ఆ కుర్రాడు చనిపోతాడు అంతే కదా ఎటూ 3, 4 నెలల్లో జరిగేది అదే కదా! .. నేనీ రిస్క్ తీసుకుని మందు వాడితే, సమ్‌మిరకల్ జరిగి కుర్రవాడు కోలుకుంటే జీవితంలో నాకు అంత కంటే సంతోషం ఉండదు ప్లీజ్ ప్రొఫెసర్ . ప్లీజ్' అంటూ అర్థించాను

"వెల్ దో మిరకిల్స్ ఆర్ నాట్ కామన్ దేయూ అక్కర్ సమ్ టైమ్స్"

"నేను మీకు ఏమీ కాకుండా ఎలా రాసి వ్వమంటే అలా రాసిస్తాను ఏం చేయమంటే అది చేస్తాను" అన్నాను నేను 5 నిమిషాలు ఆ గదిలో నిశ్శబ్దం రాజ్యం చేసింది

'మీరేమీ చెయ్యక్కర్లేదు. లెటజ్ టేక్ ది చాలెంజ్ టు గెదర్ ఈ విషయంలో ఏమైనా బాధ్యత వహించడానికి నేను సిద్ధమే" అన్నాడు నవనీత్ కుర్చీలోంచి లేస్తూ. నా కళ్ళమ్మట కృతజ్ఞతా పూర్వక ఆనందబాష్పాలు రాలడం ప్రారంభించాయి

* * * *

"చూడండి స్వరూప్, విశ్వం, రజనీ ఈ రోజు పదవ' నెంబరు గదిలో కుర్రాడికి అత్యంత ప్రమాదకరమైన మందు అంటే ఇంకా జంతువుల మీద కూడా ప్రయోగాలు పూర్తి కాని మందు ప్రయోగించాము మనం అతనిని కంటికి రెప్పలా కాపాడాలి ఇంక ఇరువయి నాలుగు గంటల వరకూ అనుక్షణమూ మనలో ఒకరం అతని దగ్గర ఉండాలి అఫ్‌కోర్స్ నేను ఇక్కడే ఉంటాను మీలో ఒక్కొక్కరూ ఇంటికి వెళ్ళి రెస్ట్ తీసుకురావచ్చు అన్నాను నేను

అలాగే డాక్టర్ అన్నాడు స్వరూప్. మిగతా ఇద్దరూ తలలూపారు వాళ్ళందరి మొహాల్లోనూ ఆందోళనా, సంభ్రమాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి ప్రళయం రాక ముందే గ్రహించిన వ్యక్తుల్లా ఉన్నారు వాళ్ళు ముగ్గురూ

ఆ తరువాత ఇరువయి నాలుగు గంటలూ ఇరువయి నాలుగు రోజులలా గడిచాయి చిన్న, చిన్న సమస్యలు వచ్చినా జాగర్తగా మానేజ్ చేయగలిగాం


రెండవ రోజు ప్రొఫెసర్ నవనీత్‌క ఫోన్ చేసి విషయం చెప్పాను ఆయన ఒక్క ఉదుటున మా నర్సింగ్ హోమ్‌కి వచ్చి నన్ను కౌగలించుకుని అబినందించాడు. పది రోజులు గడిచాయి కుర్రాడి పరిస్థితిలో మంచి మార్పు కనిపించింది నా ఆనందం వర్ణనాతీతం ప్రొపెసర్ నవనీత్ రోజూ వచ్చి కుర్రాడిని చూసి, నాతో కొన్ని విషయాలు చర్చించి వెడుతున్నాడు.

ఆ రోజు ఆ కుర్రాడి తల్లి కన్సల్టింగ్ రూములోకి వచ్చింది గబుక్కున నా కాళ్ళు చుట్టేసి "నా బిడ్డని బ్రతికించండి డాక్టర్!! నా బిడ్డని బ్రతికించండి" అంటూ కళ్ళ నీళ్ళ పెట్టుకుంది నా హృదయం ఆనందంతో నాట్యం చెయ్యసాగింది అప్పుడే లోపలికి అడుగు పెడుతున్న ప్రొఫెసర్ నవనీత్ కళ్ళల్లో ఆనందం స్పష్టంగా కనపడసాగింది నాకు. □

"వృక్ష నీతి"

ఆకు –
ఔషధాన్నిస్తుంది!
పూవు –
తేనె నిస్తుంది!
కాయ –
ఆహారమౌతుంది!
వేరు మొదటి నుండి
కొమ్మ చివరి వరకూ
వంట చెరుకు కూ
రకరకాల
పరికరాలకూ
ఉపయోగపడుతుంది!
చివరకు
కాలిపోయిన
'బూడి ద'కూడా
మనిషి మనుగడకు
సహకరిస్తుంది!!
అంతటి మహోన్నతమైన
త్యాగానికి
సాక్షిగా నిల్చిన
"వృక్ష" నీతిని
మానవుడు
ఆదర్శంగా తీసుకుంటే–
భువి
దివిగా మారిపోదూ!!!!

-రాపోలు పరమేశ్వరరావు



హైదరాబాదు నోట్‌బుక్

ప్రొఫెసర్ డి. వి. సుబ్బారెడ్డి స్మృతి:

కొందరు పెద్ద మనుష్యుల జీవితాలను చూస్తుంటే వారు ఒక నిర్దిష్టమైన పనికోసమే జన్మించారేమోనని అనిపిస్తుంది. చాల మంది పెద్ద పెద్ద పదవులు నిర్వహిస్తారు; పదవుల సంపాదనకు, వాటిని నిలుపుకోడానికి అనివార్యంగా కొన్ని పనులు చేస్తారు. అవి మొక్కుబడుల వంటివి. తమ వృత్తి వేరైనా ప్రవృత్తితో ఆసక్తితో చేసే పనులకే జనంలో విలువ వుంటుంది. ఆ పనులు చిన్నవీ కావచ్చు, పెద్దవీ కావచ్చు; ఆ వ్యక్తి లేకపోతే ఆ పని జరుగదేమో ననిపిస్తుంది. ఆ పనితో ఆ వ్యక్తి ఒక సంప్రదాయానికి, ఒక పద్ధతికి ఒరవడి, నాయకుడు అవుతాడు. అలాటి వారు డాక్టర్ డి. వి. సుబ్బారెడ్డి గారు. యూరపులోను, అమెరికాలోను వైద్య చరిత్రకు ప్రత్యేక సంస్థలు, విశ్వవిద్యాలయాలలో ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. భారత దేశంలో ప్రొఫెసర్ డాక్టర్ డి. వి. సుబ్బారెడ్డి వైద్య చరిత్రలో మొట్టమొదటి పరిశోధకులు. ఆయన చదివింది పాశ్చాత్య వైద్యం. కాని దేశీయ వైద్య శాస్త్రాభిమానంతో భారతీయ వైద్య చరిత్రలో పరిశోధనకు పూనుకొన్నారు. ఫిబ్రవరి 18వ తేదీన మరణించడం వల్ల భారత దేశ వైద్య పరిశోధనాధ్యయన రంగానికి గొప్ప నష్టం వాటిల్లింది. ప్రొఫెసర్ సుబ్బారెడ్డి 1899లో నెల్లూరులో జన్మించారు. 1920లో మద్రాసు మెడికల్ కాలేజిలో చేరి 1925లో పట్టభద్రు లయ్యారు. పిదప లండన్, ఎడిన్‌బరోలలో చర్మ రోగాలలోను, సుఖ రోగాలలోను ప్రత్యేక అధ్యయన పరిశోధనలు జరిపారు. పిదప మద్రాసు ప్రభుత్వ వైద్యశాఖలో వివిధ పదవులలో ఉండి, అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని పెక్కు కళాశాలలలో ఫిజియాలజీ ప్రొఫెసర్‌గా ఉన్నారు. 1953లో ఆయన ఫిజియాలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా కు అధ్యక్షుడుగా ఎన్నికయారు. హైదరాబాద్‌లో గాంధీ మెడికల్ కాలేజీ నెలకొన్నప్పుడు దానికి ప్రిన్సిపాలుగా నియమితు లయ్యారు. 1956 నుంచి 1966 వరకు హైదరాబాద్‌లో వైద్య చరిత్ర శాఖ డైరెక్టరుగా ఉన్నారు. ఆయన భారత దేశంలో తొలి వైద్య చరిత్ర పరిశోధనాధ్యయన కేంద్రానికి తొలి డైరెక్ట రయ్యారు. ఈ సంస్థను ఆయన ఆగ్నేయాసియాలోనే అసదృశంగా రూపొందించారు. దానికి మంచి మ్యూజియాన్ని, గొప్ప గ్రంథాలయాన్ని సమకూర్చారు. 1963లో ఆయన వైద్య చరిత్ర విభాగం బులెటిన్ అనే పేర ఒక పత్రిక ప్రారంభించారు. తర్వాత అది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసన్ బులెటిన్ అయింది. ఆయన ఈ బులెటిన్‌కు గౌరవ సంపాదక సలహాదారుగాను, ఉస్మానియా మెడికల్ కాలేజిలో సమ్మాన్య వైద్య చరిత్రాచార్యులుగా ఉన్నారు ప్రొఫెసర్ సుబ్బారెడ్డి భారతీయ వైద్య చరిత్రను గురించి, ముఖ్యంగా ప్రాచీనయుగ, మధ్యమ యుగాల చరిత్రను గురించి, భారత దేశంలో ఆధునిక వైద్య చరిత్రను గురించి, వైద్య చరిత్ర పరిశోధనను గురించి 500కు పైగా పరిశోధన పత్రాలు, 20 చిన్న గ్రంథాలు ప్రచురించారు. వివిధ వైద్య కళాశాలలలోను, ఇతర సంస్థలలోను పెక్కు ఉపన్యాసా లిచ్చారు. 1956లో ఆయన మద్రాసులో భారతీయ వైద్య చరిత్ర సంఘం (ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసన్) నెలకొల్పారు. తర్వాత ఆయన హైదరాబాద్‌లోను అలాటి సంఘమే నెలకొల్పారు. ఆయన పెక్కు జాతీయాంతర్జాతీయ మహాసభలలోను, సదస్సులలోను పరిశోధన పత్రాలు చదివారు. ఆయన అంతర్జాతీయ వైద్య చరిత్ర కాంగ్రెస మహాసభలలోను, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లలోను పరిశోధన



ప్రొఫెసర్ డి. వి. సుబ్బారెడ్డి

వ్యాసాలు చదివారు. 1973లో పారిస్‌లో జరిగిన ఇంటర్ నేషనల్ ఓరియంటల్ కాన్ఫరెన్స్‌కు అధికారరీత్యా ఆహూతులై భారతీయ వైద్య శాస్త్రం గురించి ప్రసంగించారు. కెనడా దేశంలోని క్యుబెక్ పట్టణంలో 1976లో జరిగిన ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసన్ మహాసభ నిర్వాహక వర్గం ప్రత్యేకాహ్వానంపై ఆయన ఆసియా ప్రతినిధిగా పాల్గొని సన్మానితు లయ్యారు.

పిదప ఆయన స్విట్జర్లాండ్‌లోని బాస్లేలో జరిగిన వైద్య చరిత్ర సంస్థ మహాసభలో పాల్గొన్నారు. జర్మన్ ఎకెడెమిక్ ఎక్స్‌ఛేంజ్ ఆధ్వర్యం క్రింద బాన్ విశ్వ విద్యాలయ వైద్య చరిత్రాచార్యుడు ప్రొఫెసర్ స్కూ్యడెల్ ప్రత్యేకాహ్వానంపై పశ్చిమ జర్మనీకి వెళ్లి, అక్కడి పెక్కు విశ్వవిద్యాలయాలను, వైద్య సంస్థలను దర్శించి, వర్స్‌బర్గ్‌లో జరిగిన జర్మన్ కాంగ్రెస్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసన్ సభలో పాల్గొన్నారు. 1964లో లండన్‌లో జరిగిన ఐదవ బ్రిటిష్ కాంగ్రెస్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసన్ అండ్ ఫార్మసీ మహాసభలో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు ఆయన ఇంటర్నేషనల్ అకాడెమీ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసన్ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1966లో ఢిల్లీలో జరిగిన ప్రపంచ వైద్య విద్యా మహాసభ (వరల్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్) పక్షాన ఢిల్లీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆహ్వానంపై వైద్య విద్యా చరిత్రపై ప్రదర్శనం ఏర్పాటు చేశారు ప్రశంసలు పొందారు. ఆయన తిరుపతిలో వైద్య చరిత్రపై సదస్సును, కార్య గోష్ఠిని, హైదరాబాద్‌లో అరబ్బీ వైద్య పుంగవుడు, తత్త్వవేత్త అయిన అవిసెన్నాపై సదస్సును, కార్యగోష్ఠిని నిర్వహించారు. వివిధ మహాసభలకు అధ్యక్షత వహించారు. నేషనల్ కమిషన్ ఫర్ హిస్టరీ ఆఫ్ ఇండియా సభ్యులుగాను, పెక్కు సంవత్సరాలు తెలుగు భాషా సమితి కార్యదర్శిగాను, ఉన్నారు. రెడ్డి జనసంఘం మున్నగు సంఘాలలో ప్రముఖులుగా ఉన్నారు. పదవీ విరమణ తర్వాత ఆయన వృద్ధపరామర్శ సంఘాన్ని నెలకొల్పి, శ్రద్ధతో అభివృద్ధి పరచారు. ఆర్థిక స్తోమత గల వృద్ధులు ప్రశాంతంగా జీవితం గడపడానికి ఒక వృద్ధ సదనం నెలకొల్పడానికి ప్రయత్నించారు. ఆయన ఏ సంస్థలో పని చేసినా, విశాల దృష్టితోను, దూరదృష్టితోను ఆ సంస్థను అభివృద్ధి పరచడానికి ప్రయత్నించారు. ఇంతటి సేవారతులైన ప్రొఫెసర్ రెడ్డి జీవితంతో ఉత్తేజితులైన పశ్చిమ జర్మనీలోని కొలోన్ విశ్వవిద్యాలయం వైద్య చరిత్రాచార్య డాక్టర్ శ్రీమతి పుట్స్‌చర్ శ్రీ జె. బెకర్ అనే తన విద్యార్థిని భారత దేశానికి పంపి ప్రొఫెసర్ రెడ్డి జీవితం పైన, హైదరాబాద్‌లోని వైద్య చరిత్ర సంస్థ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిస్టరీ ఆఫ్ మెడిసన్) పైన డాక్టరేట్ చేయించి, కొలోన్ విశ్వవిద్యాలయం పక్షాన ఆ పరిశోధన గ్రంథాన్ని జర్మన్ భాషలో ప్రచురించారు. భారతదేశ వైద్య చరిత్ర పరిశోధకులకు ఆద్యులై, తక్కిన వారికి ప్రేరకులుగా ఉన్న ప్రొఫెసర్ సుబ్బారెడ్డి మరణం వైద్య రంగానికి ఎంతో నష్టం కలిగించింది– ఒక ఆయుర్వేద చరిత్రకే కాదు, యునానీ, సిద్ధ, హోమియోపతీ, ఆధునిక చరిత్ర రంగాని కంతటికీ నష్టం కలిగింది ప్రొఫెసర్ సుబ్బారెడ్డికి ఒక కుమారుడున్నాడు ఆయన పేరు డాక్టర్ డి. సత్యనారాయణ. ఆయన ఎండోక్రినాలజిస్ట (కండరాలకు హార్మోన్లకు సంబంధించిన శాస్త్రం) · ప్రొఫెసర్ సుబ్బారెడ్డి వయస్సు 87 సంవత్సరాలు.

ఉపశ్రుతి:–

తాతా, తాతా, మనస్సు అంటే ఏమిటి?– అని అడిగాడు ఏడేళ్ల మనమడు ఉదయనుడు. కన్ను, చేయి, కాలులాగ అది కూడా ఒక అవయవం– అని చెప్పబోయాను పక్కన వున్న ఒక పెద్ద మనిషి అందుకుని, బాబూ నీబోటి పిల్లలకు ఉండేది, పెద్దలయిన రాజకీయ నాయకులకు లేనిది– అన్నారు ఉదయనుడు అర్థంకాక నా ముఖం చూస్తూ నిలబడ్డాడు

– తిరుమల రామచంద్ర

వెలవెలబోయిన ఆదర్శం

కె.వి.వి. సత్యనారాయణరాజు

నాలుగంకెల జీతమూ, బాదర బందీలు లేని జీవితమూ, తగిన వయసూ ఉన్న మగాడి కోసం చాలా మంది ఆడపిల్లల తల్లిదండ్రులు వెదుకుతూ ఉంటారు

కిషోర్ జీతం ఇంకా నాలుగంకెలకు చేరుకోక పోయినా, అతడికి పెళ్ళి కావల్సిన చెల్లెలూ, చదువుకొని పైకి రావలసిన తమ్ముడూ ఉన్నా, వీటన్నిటి కంటే ఎక్కువగా – అతడి భార్య ఆరు నెలల పసిగుడ్డు నొదిలేసి పైలోకాలకు వెళ్ళిపోయినా కూడా, పెళ్ళిళ్ళ మార్కెట్లో అతడి డిమాండ్ తగ్గలేదు.

అతణ్ణి కన్న తల్లిదండ్రులతో పాటు, అతడి భార్య పోయిందని ఆనోటా ఈ నోటా విన్నవాళ్ళూ – అతడికి విశ్రాంతి లేకుండా చేసి, తమ అమ్మాయి కోసం కాకపోయినా, కళ్ళయినా తెరవని పసికందు కోసమైనా, అతడు వీలైనంత త్వరగా పెళ్ళి చేసుకొని తీరాలని పోరి అతణ్ణి పునర్వివాహానికి ఒప్పించ గలిగారు

చనిపోయిన భార్య మీద అతడికున్న ప్రేమకూ, అతడు పునర్వివాహానికి సుముఖుడు కావడానికీ సంబంధం లేదు బిడ్డ నొదిలేసి పైలోకాలకు వెళ్ళి పోయిన భార్యను వీలైనంత త్వరలో మరచి పోయి మరో అప్సరస మెళ్ళో తాళిగట్టి ఆమెతో స్వర్గ సుఖాలనుభవించాలనే ఉద్దేశమూ అతడికి లేదు.

భార్య తనకు మిగిల్చిపోయిన బిడ్డను పెంచి పెద్ద జేసే బాధ్యత తీసుకో గల వాళ్ళెవరూ లేక పోవడం, ఎక్కువగా ఎవరితోనూ కలియని స్వభావం గల తన లాంటి వాడి ఒంటరితనాన్ని పోగొట్టేందుకు ఓ తోడు తప్పని సరిగా కావాలని అనిపించడానికి తోడు– మగాడి జీవితంలో సహధర్మ చారిణి ఆవశ్యకతను నొక్కి వివరించే వాళ్ళ ధాటి రోజు రోజుకూ ఎక్కువ కావడం – అతణ్ణి పునర్వివాహానికి సుముఖుణ్ణి చేశాయి

పునర్వివాహానికి సిద్ధపడే చాలామంది మగవాళ్ళు ఇవన్నీ ఆలోచించక పోవచ్చు. కానీ వాళ్ళంతా అందుకు సుముఖులు కావడానికి కారణాలు – చాలా వరకూ అంతర్గతంగా అవే. అయితే, మిగిలిన వాళ్ళకు భిన్నంగా అతడో నిర్ణయం తీసుకున్నాడు.

క్యూలో నిలబడ్డ కన్నెపిల్లల్లో ఒకరిని కాకుండా, భర్త చనిపోయిన స్త్రీని వివాహం చేసుకుంటానని అతడన్నపు అతడి తల్లిదండ్రులు– వెఱ్ఱివాణ్ణి చూసినట్టు చూశారతణ్ణి. ఏదో విధంగా తమ గుండెల మీది కుంపట్లను దింపుకుందామనుకొన్న ఆడపిల్లల తల్లి దండ్రులు హతాశులయ్యారు.

ఎంతో మంది ఎన్నో విధాలుగా చెప్పి చూశారు

వారందరికీ అతడొకే సమాధానం చెప్పాడు– 'మీ అమ్మాయిని ఓ రెండో పెళ్ళి వాడికిచ్చేందుకు మీకు అభ్యంతరం లేకపోవచ్చు మీ ఆర్థిక పరిస్థితి తెలిసిన మీ అమ్మాయి కూడా నాలాంటి వాణ్ణి చేసు కునేందుకు సుముఖురాలై ఉండవచ్చు.

కానీ ఒకసారి పెళ్ళయిన వ్యక్తిగా నా అర్హతేమిటో నాకు తెలుసు అందుకే ఈ విషయంలో దయచేసి నన్నిబ్బంది పెట్టకండి మీరు నాకు తగిన వాళ్ళు కాదని నేనీ సంబంధం తిరస్కరిస్తున్నానని గాక నేనే మీకు తగననే ఉద్దేశంతో మీరు ఆలోచించండి. మీకూ పెద్దగా బాధ ఉండదు."

అతడి నిర్ణయం విన్న వెనుకటి తరం వాళ్ళు– వెనుకగా వాఖ్యానాలు చేశారు– 'విదపకాలం బుద్ధులు కాకపోతే మొగుడు చచ్చిన దాన్ని చేసుకుని ఉద్ధరిస్తానంటాడేవిటి?' – అని

ఎంత మంది ఎన్ని విధాలుగా చెప్పి చూసినా తన నిర్ణయాన్ని మాత్రం మార్చుకోదలచు కోలేదతడు.

విధవా వివాహాలడపాదడపా అక్కడక్కడా జరుగుతున్నాయంటే అందుకు కారణం – మగవాళ్ళలోని విశాల హృదయం కాక, ఆ విధవల వెనుక ఉన్నడబ్బూ, ఇతర పరిస్థితులూ అందుకు దోహదం చేస్తున్నాయనే విషయం అతడికి ఆ తర్వాత తెలిసింది.

అర్థాంతరంగా అల్లుళ్ళను కోల్పోయిన కొందరి దృష్టి కతడి విషయం వెళ్ళినా, కన్నె పిల్లల్ని కాదని విధవనే చేసుకుంటానని అతడు పట్టు బట్టడానికి గల కారణాలన్వేషించి – అతడికి స్క్రూ లూజ్ కావడమే అందుకు కారణమై ఉంటుందనే అవగాహనకొచ్చి – అతడి ఆదర్శం వాళ్ళకు తల తిక్కగా అనిపించడంతో, ఇటువంటి తలతిక్క వాడికి తల చెడిన తమ కూతుళ్ళనిస్తే తరువాత తమ తల చెడుతుందేమో ననే అనుమానంతో వాళ్ళూ ముందుకు రాలేదు

విధవలను వివాహం చేసుకునేందుకెవరూ ముందుకు రారని గోలగా అరిచే సమాజం – తనలాంటి వాడొకడందుకు సిద్ధంగా ఉన్నా ఉపయోగించు కొనక పోవడాన్నేవిధంగా అర్థం చేసుకోవాలో తెలియక, మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనను తాత్కాలికంగా పక్కకు నెట్టి రోజులు వెళ్ళదీయడం ప్రారంభించాడు కిషోర్.

అదే సమయంలో అతడు పనిచేస్తున్న ఆఫీసుకు ట్రాన్స్‌ఫరై వచ్చింది లావణ్య.

సగటు మగవాడిష్టపడే లక్షణాలామెలో పుష్కలంగా ఉన్నా, మొదటి చూపులో అతడి నాకర్షించింది– బొట్టు లేని ఆమె మొహం.

ఆరాతీస్తే – ఆమె భర్త రెండేళ్ళ క్రితం యాక్సిడెంట్‌లో పోయాడని, ఆమెకుద్యోగం చేయాల్సిన అవసరం లేక పోయినా, కాలక్షేపం కోసం, చేస్తున్న ఉద్యోగాన్ని కంటిన్యూ చేస్తోందని తెలిసింది. ఈ వివరాలు తెలిశాక ఏ మాత్రమూ ఆలస్యం చేయకుండా ఆమె దగ్గరకు వెళ్ళి అన్నాడు కిషోర్, "మీకభ్యంతరం లేక పోతే నా కోసం ఓ గంట స్పేర్ చేయగలరా?"

తలెత్తి చూసి సన్నగా నవ్విందామె

'ఆ మొహాన్న బొట్టుంటే ఆ నవ్వు ఇంకెంత మనోహరంగా ఉండేదో కదా?' అనుకున్నాడాక్షణాన. అదే మాట తను అన్నపుడు ఆమె మొహంలో వెలిగే కాంతుల్ని చూసేక్షణం కోసం ఎదురు చూస్తూ సాయంత్రం వరకూ గడిపేశాడు

అయిదయ్యాక లావణ్య అతడి టేబిల్ దగ్గరకొచ్చి అంది, "వెడదామా?"

తలెత్తి చూశాడు కిషోర్ ఉదయం అతడు చూసిన చిరునవ్వింకా ఆమె మొహంలోంచి చెరిగి పోలేదు లేచి నిలబడి ఆమెతో కలిసి నడిచాడు

ఆఫీస బయటి కొచ్చాకా అడిగిందామె– "ఎటు?"

కుడిచేతి వైపు వెళితే మెయిన్ బజారు లోకీ, ఎడమవైపు వెళితే బీచ్‌కూ దారితీస్తుందారోడ్డు.

"పదండి" అన్నాడు బీచ్‌వైపునడుస్తూ.

సముద్రం మీది నుంచి విసురుగా వీస్తున్న గాలికి ఎగిరిన ఆమె పవిట రెండు మూడు సార్లతడి మొహాన్ని కప్పేసింది. 'సారీ' అంటూ అందంగా నవ్వి పవిట సరిజేసుకుందామె.

కాస్సేపట్లో జనసమ్మర్దం లేని చోట ఎదు రెదురుగా కూర్చున్నారిద్దరూ. రెండు చేతులతోనూ మోకాళ్ళను చుట్టి ముందుకూ, వెనక్కూ ఊగుతూ అంది లావణ్య– "చెప్పండి, ఏం మాట్లాడాలను కుంటున్నారు నాతో?"

ఆమె చొరవ అతడికి ముచ్చట కలిగించింది

'మీ భర్త సిగరెట్లు కాల్చేవారా. ..?" అంటూ జేబులోంచి సిగరెట్ పాకెట్ బయటకు తీయ బోయి నాలిక్కరుచుకొని, "అయామ్ సారీ . అనవసరంగా ఆయన్ను మీకు గుర్తు చేశానేమో?..." అని ఆగిపోయాడు కిషోర్.

ఒక్కక్షణం ఆమె తడబడింది. అంతలోనే మామూలుగా అవుతూ అంది లావణ్య, "ఫర్వాలేదు. మీరాయన్ని గుర్తు చేసినందుకు నేనేమీ బాధ పడటం లేదు..... మీరు సిగరెట్ కాల్చుకోవడానికి నాకేమీ అభ్యంతరం లేదు."

"థ్యాంక్యూ," అంటూ సిగరెట్ వెలిగించి గాలిలోకి పొగవదులుతూ అన్నాడు,"నా భార్య నన్నొదిలి మీ భర్త వెళ్ళిన చోటికే వెళ్ళింది. మీలాగే నేనూ ఒంటరిని. మీ కభ్యంతరం లేని పక్షంలో మీ భర్త స్థానాన్ని నేను తీసుకోవాలను కుంటున్నాను".

ఈసారామె ముఖకవళికలు మారిపోయాయి.

"యూమీన్.... అంటే, మీరు.... నన్ను పెళ్ళి చేసుకుంటానంటారా?" అంది లావణ్య నెమ్మదిగా.

తనాశించిన మెరుపు ఆమె కళ్ళలో కనబడక పోవడంతో కిషోర్ నిరుత్సాహం చెందినా, "అవును అందుకు మీరిష్ట పడిన పక్షంలో నే" అన్నాడు

'నా కంత అదృష్టమా? అంటుందనుకొన్న లావణ్య ఏమీ మాట్లాడకుండా తల దించుకొని ఆలోచనలో పడడాన్ని అర్థం చేసుకునేందుకు- ఆడవాళ్ళ మీద అతడి కున్న అవగాహన చాలలేదు

అందుకే ఏం మాట్లాడాలో తెలియక, చెప్పండి- మీ కిష్టం లేదా?' అన్నాడు

తలెత్తి అతడి వైపు చూసిందామె ఆమె కళ్ళలో వ్యక్తమైన భావాన్నెంత అర్థం చేసుకుందా మన్నా అతడికి సాధ్యం కాలేదు

"మీ మీద జాలితో నేనీ పెళ్ళికి ఒప్పుకోవడం లేదు నాలాగే మీకూ ఇంకా చాలా వయసుంది గతించిన మన సహచరుల మీద మనకెంత ప్రేమ ఉన్నా – మన భవిష్యత్తు సుఖంగా గడిచేందుకది అడ్డురాకూడదని నా అభిప్రాయం" ఆమె ముఖకవళికలను గమనిస్తూ తిరిగి అన్నాడు కిషోర్

లావణ్య చిరునవ్వు నవ్వి అంది- "మీ అభిప్రాయాన్ని కాదనలేను నిజానికి మీ మగవాళ్ళకు ఎన్నిసార్లైనా కన్నె పిల్లలతో పెళ్ళిళ్ళయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి మన ప్రస్తుత సమాజంలో

మీరు 'ఊ' అంటే నిమిషాల మీద తమ కుమార్తెల నిచ్చి పెళ్ళి చేసేందుకు సిద్ధంగా ఎంతో మంది ఉంటారు. అయినా మీరు, నాలాంటి స్త్రీని వివాహం చేసుకోవాలని నిర్ణయించు కోవడం, అంతకంటే ఎక్కువగా ఆ విషయమై నన్ను ఒప్పించ జూడడం – ఎంతైనా అభినందనీయం' అందుకు మిమ్మల్ని మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నాను

కానీ నా ఆశయం ... నిజానికది ఆశయం కాదేమో సమాజం దృష్టిలో? బహుశః చాలా మంది దృష్టిలో మూర్ఖత్వం క్రిందికి వస్తుందేమో? అయినా నా నిర్ణయం నేను మార్చుకోదలచుకోలేదు "

తను చెప్పిన విషయాన్ని ఒప్పుకుంటూ తన నిర్ణయాన్నభినందించిన లావణ్య, అలాతిరకాసుగా మాట్లాడడంతో ఆమె మనసులో ఏం ఉందో ఎంత మాత్రమూ అర్థం కాలేదతడికి

అతడి మొహంలోని ప్రశ్నార్థకాన్ని గమనించి అందామె, 'మీరే కాదు, బహుశః ఎవరూ నా మనసులో ఏం ఉందో ఊహించలేరు కానీ అదేమిటో మీ కిప్పుడు చెప్పను ఈ సరికి మీకర్థమయ్యే ఉంటుంది- మీతో వివాహానికి నేను సుముఖంగా లేనని


కిషోర్‌కిది షాక్ తన ప్రపోజల్ నామె తిరస్కరిస్తుందని అతడనుకొని ఉంటే తన నిర్ణయాన్నామె ముందుంచడాని కంత త్వరపడి ఉండే వాడు కాదేమో?

వివర్ణమైన తన మొహంలో వ్యక్తమైన భావాలను దాచుకొనే ప్రయత్నం చేస్తూ, "ఇట్సాల్‌రైట్...... 'మీ కిష్టమైన పక్షంలో నే? – అని ముందే చెప్పానుగా? మీ మనసేమిటో తెలుసుకోకుండా చొరవ తీసుకున్నందుకు మన్నించండి " అని లేవ బోయాడతడు.

అతడి చేయి పట్టుకొని కూర్చొబెడుతూ అందామె- మీ మనసు తిన్న దెబ్బ మామూలుది కాదని నాకు తెలుసు తాత్కాలికంగానే అయినా మీకు కలిగిన మనస్తాపం పోగొట్టడం నా విధి

మీ భార్య మరణించారు కనుక ఓ భర్తృహీనను చేసుకోవడం సముచితం అని మీరనుకున్నారు అలా జరిగితే ఒకరి మీద మరొకరికి నిరసనభావం ఉండదు కనుక జీవితం హాయిగా గడిచిపోతుందని మీ భావం

మీ ఆదర్శం మంచిదే! కానీ నా విషయం



ఆలోచిస్తే – నా భర్త గతించినా, ఆర్థికపరంగా నాకు ఒడుదుడుకులూ లేవు. వాళ్ళిమీన్‌టు సేఫ్. డబ్బులేని కారణంచేత ఓ బీదకుటుంబంలో పుట్టిన పాపానికి- తనకసలు పెళ్ళవుతుందా? లేక వృద్ధ కన్యల్లో తానూ ఒకర్తగా మిగిలిపోవాలా? అని నిరంతరమూ సతమతమయ్యే కన్నెపిల్లలతో పోలిస్తే నా పరిస్థితి ఎంతో మెరుగు. కాదంటారా?

విధవ- అనే డిస్‌క్వాలిఫికేషన్ నాకున్నా, నా సంపాదన కోసమైనా నన్ను పెళ్ళాడేందుకెవరో ఒక మగాడు ముందుకు రాకపోడు కానీ ఎప్పటికీ పెళ్ళికాదేమోనని భయపడే అటువంటి బీదకన్యలకా అవకాశం కూడా లేదుకదా?

విధవలను వివాహమాడే చాలామంది మగ వాళ్ళు- ఎదుటి వారిలో వ్యక్తమయ్యే కృతజ్ఞతా భావనకోసమే అలా చేస్తారు మీరా టైప్ కాకపోవచ్చు

బట్ స్టిల్ . నలుగురూ చేయని పనిని లేదా

చేయడానికి వెరచే పనిని మనం చేసినపుడు తత్సమానమైన ఫలితం- కృతజ్ఞత రూపంలో కానివ్వండి అభిమానం రూపంలో కానివ్వండి- ఎదుటి వారి నుంచి ఆశించడం మానవ సహజం ఒకవేళ మీరందుకు ఎక్సెప్షన్ అయితే మీ వ్యక్తిత్వం ఎంతో గొప్పది

దయనీయ స్థితిలో ఉన్న బీదపిల్లల్లో మీరు వెదికే విధవలున్నారేమో చూడండి భర్తృహీన లెవరూ వాళ్ళలో దొరకనినాడు- ఓ కన్నెపిల్లనైనాసరే చేసుకునేందుకు వెనుకాడకండి

ఎందుకంటే విధవనే చేసుకొని తీరాలన్న మీ ఆదర్శం- నిజంగా ఎంతో అవసరమైన కన్నెపిల్లను చేసుకునేందుకు- కేవలం ఆమె కన్యకావడంవలన- అడ్డు రాకూడదు

అభినందనపూర్వకంగా ఆమె వైపు చూస్తూ అన్నాడు కిషోర్ మీరు చెప్పింది నిజం త్వరలో నేన పెళ్ళి శుభవార్త మీకు తెలియ జేస్తాను లావణ్య లేచినిలబడింది త్వరలో నే నా ఆశయం ఏవిటో మీకూ చెవుతాను అంటూ

* * * * * *

ఆరు నెలల తర్వాత కిషోర్ లావణ్యను కలిశాడు. ఆమె ఇంట్లో అప్పుడతడి వెంట పద్దెనిమిదేళ్ళ యువతి ఉంది వాళ్ళిద్దర్నీ సాదరంగా ఆహ్వానించింది లావణ్య

కిషోర్ వెంటవచ్చిన యువతి అంది లావణ్యతో నా జీవితం బాగు పడడానికి కారణం మీరే పెళ్ళికి ముందే నా శీలం దోచుకోబడిందనే విషయం తెలిసినా కూడా ఆయన నన్ను వివాహం చేసుకునేందుకు ముందుకొచ్చారంటే- విధవా వివాహం చేసుకోవాలనే ఆయన ఆదర్శానికి నిజమైన అర్థం చెప్పి ఆయన దృష్టి నాలాంటి వాళ్ళ మీద ప్రసరించేలా చేసిన మీరే కారణం

లావణ్య కళ్ళు ఆనందంతో మెరిశాయి

ఆరాధనగా కిషోర్ వైపు చూస్తూ అంది ఆమె- వా మాటల్ని కొట్టి పారవేయకుండా నేనాశించిన దానికంటే ఉన్నతంగా ఓ శీలం చెడిన స్త్రీని చేపట్టి నా దృష్టిలో ఎంతో ఎత్తుకు ఎదిగిపోయారు

నేనప్పట్లో మీతో పెళ్ళికి సుముఖత వ్యక్తం చేయకపోవడానికి కారణం ఇప్పుడు చెపుతాను

ఓ మగవాడికి భార్య పోయినా కన్నెపిల్లల్నిచ్చేందుకు ఎంతో మంది ముందుకొస్తారు. కానీ ఓ స్త్రీకి భర్త పోతే పెళ్ళికాని ఏ యువకుడూ ఆమెను చేపట్టేందుకు ముందుకు రాడేం?

నా ప్రశ్న పిచ్చిగా ఉందేమోకదూ? కానీ నా అన్వేషణ- అలా స్వచ్ఛందంగా ముందుకొచ్చే యువకుడి కోసమే!

నా ఆశయం ఈ జన్మకు సిద్ధించకపోయినా పర్వాలేదు సమాజంలో ఉన్న ఒక అసమానతకు వ్యతిరేకంగా నిలబడగలిగానన్న తృప్తి నాకు మిగులుతుంది

పూర్వం విధవా వివాహమనే మాట వినడం కూడా ఓ పాపంగా పరిగణించేవారు. ఇప్పుడు కూడా ఆ పరిస్థితి పెద్దగా మెరుగుపడకపోయినా కొంతమంది మీలాంటి వాళ్ళు ముందుకొస్తున్నారు

ఆమాత్రానికే తృప్తిపడి చంకలు కొట్టుకుంటే ఈ స్థితిలో మార్పువచ్చే దెప్పుడు? సమాజం ముందుకు పురోగమించాలిగానీ ఎప్పుడూ ఒకే స్థితిలో ఉండిపోకూడదు

భార్యలు చనిపోయిన వాళ్ళను పెళ్ళి చేసుకునేందుకు కన్నె పిల్లలిలా ముందుకొస్తున్నారో అలాగే భర్తృహీనులను చేసుకునేందుకు పెళ్ళికాని యువకులూ ముందుకు రావాలి ఆ సమయం వచ్చేటంత వరకూ నేను ఒంటరిగానే ఉండదలచుకున్నాను ప్రస్తుత పరిస్థితిలో నా ఆశ సఫలం అయ్యే అవకాశం దాదాపు శూన్యమే అయినా కూడా నేనా రోజు కోసం ఎదురు చూడదలచుకున్నాను

లావణ్యలో ముందుతరం స్త్రీ కనిపించింది వాళ్ళిద్దరికీ

ఆమె పట్టుదల ముందు- తన ఆదర్శం వెల వెలబోయినట్లనిపించిందతనికి □

మాట – బీట

అద్దం మీద అద్దంగా
తల వెంట్రుక పడినట్లుంటుంది
కాని అది అతి సన్నని బీట
అలాగే మనసుని కూడా
కత్తిలా కోసేది మరేమి కాదు.
వెంట్రుకవాసి తేడా మాట!

-కె. గోదావరిశర్మ

వెల వెల బోయిన ఆదర్శం

చికల్‌వాడీ 'క్రికెట్ యోధుడు సునీల్ గవాస్కర్

చిన్ననాటి ముచ్చట్లు!



రాజకీయ నాయకులు, సినిమా తారల వలె మన దేశంలో గవాస్కర్‌కు అసంఖ్యాక అభిమానులు కలరు. పుట్టినది సామాన్య కుటుంబములో అయినా తన ప్రతిభ వలన విశేష ఆదరణ పొందాడు. నేడు గవాస్కర్ ప్రపంచ అగ్రగామి క్రికెట్ క్రీడాకారునిగా పేరు పొందాడు. గవాస్కర్ సాధించిన విజయాలు, సృష్టించిన రికార్డులు మనకు మరువరానివి. అయినా అతను పుట్టి పెరిగిన బొంబాయిలోని 'చికల్ వాడి' వాసులకు చిన్న వయసులో గవాస్కర్‌తో కలసి ఆడిన రోజులు, ఆతని చేష్టలు ఎప్పటికీ గుర్తు వుంటాయి. అక్కడి వారు గవాస్కర్ సాధించిన విజయాలకు గర్వపడతారు. ఎంతో అభిమానిస్తారు.

గవాస్కర్ చిన్ననాటి స్నేహితులు విరించిసాగర్, మిలింద్ రేజ్, రామనాథ్ సర్కార్, సుధీర్ నాయక్, అజీత్‌నాయక్, అశోక్ అంబాయ్, అనిల్‌సామంత్ ఆనాటి మధుర, మరపురాని రోజుల గురించి గొప్పగా చెప్పారు. అశోక్ అంబాయ్, అనిల్ సామంత్ చికల్‌వాడి వాసులు. సునీల్ తండ్రి మనోహర్ గవాస్కర్ కూడా చిన్నప్పటి నుంచి సునీల్ క్రికెట్ యందు చూపిన ఆసక్తి గురించి చెప్పారు.

మారిపోకుండా కాపాడిన 'గీత'!

సునీల్ మనోహర్ గవాస్కర్ 1949 జూలై 10న బొంబాయి లోని పురందారు ఆసుపత్రిలో రాత్రి సరిగ్గా 8-42 కు పుట్టాడు. అంతవరకు బొంబాయిలో వర్షములు లేక నీటి ఎద్దడిగా యుండేది. గవాస్కర్ పుట్టిన సమయంలో ఏకాంతమైన వర్షము కురిసినది. వారం పైగా వర్షము కురిసి బొంబాయి నగర వాసుల నీటి కరువు తప్పినది. మరొక విశేషము సునీల్ తల్లియున్న మంచముకే వార్డులో ప్రక్క మంచముపై ఒక బెస్త మహిళ కూడా మగపిల్ల వాడిని కన్నది. సునీల్ పుట్టినప్పుడు కుడి చెవి వద్ద సన్నని గీతయున్నది. అది మేనమామ అయిన నారాయణ మజారేవర్ చూసాడు. మరుసటి రోజు సునీల్ తల్లి ప్రక్కన యున్న బాబుకి అటువంటి గుర్తు లేదు. ఇది మేనమామ గుర్తించి హడావుడి చేయుగా ఆసుపత్రి ఆయాలు పిల్లలకు స్నానము చేయించిన తర్వాత చేసిన పొరపాటు అని తెలిసింది. లేకపోతే మన అగ్రగామి ఆటగాడు దక్కి వాడేగా యుండెడివాడు.



సునీల్ గవాస్కర్ తల్లిదండ్రులు, కుమారుడు

మాతృదేవతే తొలి గురువు!

సునీల్ తండ్రి మనోహర్ గవాస్కర్ కూడా క్రికెట్ ఆటగాడు. 1940-45 లో బొంబాయి ఎల్ఫిన్ స్టోన్ కళాశాలలో ఆడేవాడు. కొంత కాలము ఆపగా సునీల్



చిన్నప్పుడు నివసించిన యిల్లు



చికల్‌వాడీలో ఒక వీధి- ఇక్కడ గవాస్కర్ క్రికెట్ ఆడారు



చికల్‌వాడీ ఇంటిలో డ్రాయింగ్ రూమ్. ఇందులోనే ఆయన తల్లి క్రికెట్ ఆట నేర్పారు.

పుట్టిన తర్వాత తిరిగి ఆడేవారు. సునీల్ తల్లి ఆట చూచుటకు 'క్రాస్ మైదానం'కు వచ్చేవాడు. అతి కొద్ది జీతం అంటే రెండు వందల రూపాయలలో మనోహర్ తన కుటుంబము, విధవ అక్కగారు. పిల్లలను పోషించ వలసి వచ్చేది. ఎంతో కష్టము పడి సునీల్‌ను పోషించారు. సునీల్‌కు కుస్తీ అంటే కూడా యిష్టము. కింగ్ కాంగ్ బ్లాక్ స్కార్పియన్ హీరోలను అభిమానించే వాడు. ఇంటిలో క్రికెట్ ఆడుట ప్రారంభించాడు. తల్లి సరదాగా బంతిని బౌలు చేసేది. తల్లి క్రికెట్ ఆటలో సునీల్ మొదటి గురువు. కాని తల్లి సునీల్‌ను 'అవుట్' చేయుటకు ఎంతో కష్టపడేది.

పట్టుదల – కృషి ఫలితం!

విద్యార్థిగా సునీల్ ఉన్నప్పుడు అతనితోటి విద్యార్థి రమేష్ నాగదేవ్ మంచి ఆటగాడు. 1969 లో ఆస్ట్రేలియాతో ఆడిన మన జట్టులో కలడు. ప్రస్తుతము కాలిఫోర్నియాలో కలడు. సునీల్ మంచి ఆటగాడుగా, ప్రపంచ మేటి ఆటగానిగా పేరు



కారు గ్యారేజి తలుపులు అప్పుడు 'స్టంప్స్'

పొందగా అందరు అతని మిత్రులుగా నటిస్తున్నారు. కాని విద్యార్థిగానే మంచి పేరు పొందిన నాగదేవ్ గురించి ఎవరు మాట్లాడరు అంటారు సునీల్ స్నేహితుడు మిల్లింద్ రేజ్. వీధిలో 'కారు గ్యారేజి' ద్వారము తలుపులు వికెట్లుగా ఆడే వారు వీరందరు. గవాస్కర్ 'దాదర్ యూనియన్'కు ఆడేటప్పుడు ఫీల్డింగులో విఫలమయేవాడు. పట్టుదలతో కృషి చేసి మంచి బ్యాట్స్‌మెన్‌యే గాక నేడు మంచి ఫీల్డరుగా పేరు పొందుటయేగాక 100వ 'క్యాచ్' మన దేశ రికార్డు నెలకొల్పారు. నేడు కూడా తన మాతృ సంస్థ దాదర్ యూనియన్ అంటే ఎంతో గౌరవము. బొంబాయిలో ఉన్నప్పుడు క్లబ్ గ్రౌండులకు వెళ్తారు. బొంబాయిలో 'సండే క్లబ్' ప్రారంభించుటకు కారకుడు. ఆటగాళ్ళు ఆడవారి వలె దుస్తులు ధరిస్తారు. లిప్‌స్టిక్ రాసుకుంటారు. పాటలు పాడాలి. నాట్యము చేయాలి. సునీల్ సరదాగా యీ కార్యములో పాల్గొంటారు.

నిమ్మకాయ సోడా అంటే ఇష్టం!

సునీల్‌కు 'నిమ్మకాయ సోడా' అంటే యిష్టం. చిన్నప్పుడు ఆట తర్వాత మిత్రులను 'ససానీ ఇరానీ కేఫ్'కు తీసుకొని వెళ్ళి నిమ్మకాయ సోడా యిప్పించే వాడు. పిల్లలను మంచి క్రికెట్ ఆటగాళ్ళుగా తీర్చి దిద్దాలన్నా, ఆటో గ్రాపులు ఇవ్వటమన్నా ఇష్ట పడతారు గవాస్కర్.


–ముకరమ్

అవీ – ఇవీ – అన్నీ

[illegible]

మరో జాతీయ బహుమతి

కొత్తగా అక్షరాస్యులైన వారిలో విజ్ఞాన వ్యాప్తికై కేంద్ర ప్రభుత్వం వయోజన విద్యాశాఖ డైరెక్టరేట్ పుస్తకాలను వ్రాయించి ప్రచురిస్తుంది. అలా ప్రతి సంవత్సరం పుస్తకాలు రచింపజేయడానికి జాతీయ బహుమతి పోటీని నిర్వహిస్తుంది. 1985లో 'కొత్త శక్తి జనతాలు' అనే గ్రంథం రచించి ఈ బహుమతి



గెలుచుకున్న శ్రీ స.వి. సర్వేశ్వరశర్మకు ఈ సంవత్సరం కూడ బహుమతి లభించింది. ఈ సంవత్సరం ఆయన గ్రంథం 'శాస్త్రీయ విజ్ఞానంతో వ్యవసాయం' ఈ బహుమతిని గెలుచుకుంది.

ఈ గ్రంథంలో కొబ్బరి చెట్ల పెంపకానికి సంబంధించిన అనేక శాస్త్రీయ విజ్ఞాన విషయాలతో పాటు, భౌతిక విజ్ఞాన శాస్త్ర పరిశోధనా ఫలితాలను వ్యవసాయంలో వినియోగించుకుని, అధిక దిగుబడిని ఎలా సాధించవచ్చునో శ్రీ సర్వేశ్వర శర్మ సుబోధకమైన రీతిలో వివరించారు

మినీ కవితల పోటీ

ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహితి సమాఖ్య రాష్ట్ర స్థాయిలో 1987 ప్రభవ ఉగాది మినీ కవితల పోటీని నిర్వహిస్తున్నది. బహుమతులు పొందిన కవితలు గాక మరికొన్ని ఉత్తమ కవితలను ఎంపికజేసి వాటిని కవితా సంకలనంగా ప్రచురించి, ఆయా రచయి(త్రి)తలకు ప్రశంసా పత్రములు పంపబడును. రచనలు ఏ అంశం మీదనైన ఎనిమిది లైన్లకు మించకుండా ఒకరు ఎన్ని కవితల నయినా పంపవచ్చును. రచయి(త్రి)తలు తమ కవితలతో బాటు 60 పైసల స్టాంపులంటించిన స్వంత చిరునామా గల కవరును జతపరచి 20–3–1987 లోగా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ తెలుగు సాహితి సమాఖ్య, ఇంద్రపాలెం, కాకినాడ – 533006 అనే చిరునామాకి పంపవచ్చు. ☐

ఉత్తరాలు

(4 వ పేజీ తరువాయి)

శీర్షికలు

'చిన్నారి బాలల దీనగాథలు' చాలా బాగుంది. అట్టడుగున పడి నలిగిపోయే బాలలు నేడు దేశంలో ఎందరో వున్నారు. అలాంటి దీన బాలల బాధలు పట్టించుకునే వారు లేరు. యీ వారంలో ప్రచురించిన గాథలలో యం. శాయి రమణగారి 'అందరూ బాధ్యత తీసుకోవాలి' బాగుంది.

– షేక్ మస్తాను, గాలిబీబి. ముమ్మలనేని వారిపాలెం, రేపల్లె

* * *

అభినేత్రి జయప్రద ముఖచిత్రంతో వెలువడిన సంచికలోని శీర్షికలన్నీ ఆకట్టుకున్నాయి. పాఠకుల శీర్షిక 'చిన్నారి బాలల దిన గాథలు' చదువుతుంటే గుండె తరుక్కుపోతుంది. 'గర్భస్థ శిశువు చెప్పిన కథలు' మూఢులకు కనువిప్పు కలిగించేలా ఉన్నాయి. పాఠకుల శీర్షికలు ప్రవేశపెట్టి, పాఠకుల మెదడులకు పదును పెడుతున్నందులకు హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనములు.

– టి. శశిధరకుమార్, నిడుగూరు

* * *

20–26 ఫిబ్రవరి '87 'బ్యూటీక్వీన్' జయప్రద ముఖచిత్రంతో వెలువడిన సంచిక చాలా ఆకర్షణీయంగా ఉంది. 'గర్భస్థ శిశువు చెప్పిన కథలు' చాలా బాగున్నాయి. మమ్మల్ని ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

– ఆచంటి శ్రీవల్లీదేవి, పొందూరు

హైదరాబాద్ నోట్‌బుక్

శ్రీ సర్వేశాయి తిరుమలరావు గారి గురించి శ్రీ తిరుమల రామచంద్ర రాసినది మాకు చాలా ఆనందాన్నిచ్చింది.

సంస్కృతాంధ్రాంగ్లాల్లో అందె వేసిన చేయి ఇంగ్లండులో వుంటే ఆయేవాడిపాటికి సర్ దేశాయి.

– దేశెట్టి కేశవరావు, హిందూపురం

సీరియల్స్

20–26 ఫిబ్రవరి '87 వెలువడిన 'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో జయప్రద ముఖచిత్రం ఆకర్షణీయంగా వుంది. 'ఆశయం' సీరియల్ వారం వారం మమ్మల్ని ఆకట్టుకుంటున్నది.

– ఎస్. మొహిద్దీన్, టి. రమేష్, డి. అబ్రహాము, చాపాడు ☐

Printed and Published for Nageswara Rao Estates Private Ltd by S Nageswara Rao at the Andhra Patrika Press Gandhinagar Vijayawada 520 003 Acting Editor M Madhava Rao Chief Editor S Radhakrishna
Phones Business 61247 61248 75569 Editorial 75667